ఈనాడు

విజయవాడ 23-1-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 163

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi


ఎలక్ట్రానిక్స్
10.or E (3GB)
₹6,999
₹500 additional on exchange
REDMI NOTE 4 (64GB)
₹10,999
Mi MAX 2 (32GB)
₹12,999
₹1,000 additional on exchange
No-cost EMI starting ₹2,167/month
MOTO G5s PLUS (64GB)
₹13,999
₹1,000 additional on exchange
IFB 7 KG FULLY-AUTOMATIC WASHING MACHINE
Save ₹4,500
No-cost EMI starting ₹1,120/month
i5 WINDOWS LAPTOPS
STARTING ₹37,990
No Cost EMI starting ₹3,166/month
TCL 123 CM (49) FULL HD LED TV
₹26,990
Exchange offers upto ₹13,000
No Cost EMI starting ₹4,499/month
SENNHEISER HD 4.40-BT BLUETOOTH HEADPHONES
₹7,490
WD 1TB HARD DRIVE
₹3,699
ఫ్యాషన్
ETHNIC WEAR
50-70% OFF
BIBA
aurelia
MYX
WESTERN WEAR
50-70% OFF
VERO MODA
JACK & JONES
MARKS & SPENCER LONDON
Wrangler
SHOES
40-70% OFF
REDTAPE
Bata
FILA
crocs
WATCHES & SUNGLASSES
30-80% OFF
TITAN
fastrack SUNGLASSES
GIORDANO timewear
maxima
TP-LINK WIRELESS ROUTER
₹899
SANDISK MICROSDXC MEMORY CARD (32GB)
₹679
SANDISK DUAL 32GB PEN DRIVE
₹799
boAt BASSHEADS 225 HEADPHONES
₹499
AMAZON FIRE TV STICK (STREAMING MEDIA PLAYER)
₹3,000
amazon prime
SOLIMO BEDDING RANGE
UPTO 65% OFF
GANESH VEGETABLE DICER
₹399
BOROSIL KLIP N STORE MICROWAVABLE CONTAINERS (320ML, 3 PCS)
₹899
HOME GYMS
MIN. 40% OFF
YONEX GR 303 BADMINTON RACQUET
₹375
బ్లాక్‌బస్టర్ డీల్స్
BOOKS
MIN. 50% OFF
BESTSELLING eBOOKS
FLAT ₹49
IRONS
STARTING AT ₹359
WINTER & SKIN CARE
MIN. 25% OFF
DIAPERS
Pampers pants
MamyPoko pants
HUGGIES
MIN. 30% OFF
TOYS
HOT WHEELS
Barbie
NERF
MIN. 20% OFF
GROCERY ESSENTIALS
MIN. 20% OFF
AYURVEDA PRODUCTS
MIN. 20% OFF
amazon pay
GET 10% BACK*
Amazon Pay balanceతో
HDFC BANK
We understand your world
10% CASHBACK*
HDFC బ్యాంక్ డెబిట్ & క్రెడిట్ కార్డ్స్ మరియు EMI పై
AMAZON APP ని ఇప్పుడే డౌన్‌లోడ్ చేసుకోండి
Golden Hour Deals | 8 PM-Midnight
amazon.in



ఈనాడు



విజయవాడ 23-1-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 163
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 18+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

పేదరిచేరని సంపద

అన్నపు రాశులు ఓ వైపు.. ఆకలి కేకలు మరోవైపు. ఆదాయమంతా ఓ వైపు.. పేదరికం మరోవైపు. ఇలా మన దేశంలో ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను ఆక్స్‌ఫాం తాజా నివేదిక కళ్లకుకట్టింది. గతేడాది సృష్టించిన సంపదలో 73 శాతం అత్యధిక ధనవంతులైన ఒక శాతం ప్రజానికం చెంతకే చేరినట్లు వెల్లడించింది. అంతేకాదు 67 కోట్ల పేదల జనాభా సంపద కేవలం ఒక శాతమే పెరిగిందని తెలిపింది. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) సదస్సు మొదలవుతున్న నేపథ్యంలో.. 'రివార్డ్ వర్క్, నాట్ వెల్త్' పేరిట ఆక్స్‌ఫాం సోమవారం తాజా నివేదిక విడుదలచేసింది. 2లో

2017లో బిలియనీర్ల సంఖ్య ఊహించని రీతిలో పెరిగింది. ప్రతి రెండు రోజులకు ఓ కొత్త బిలియనీర్ పుట్టుకొచ్చాడు. 2010 నుంచి వీరి సంపద ఏడాదికి సగటున 13 శాతం చొప్పున పెరిగింది. కార్మికుల జీతం పెంపు (సగటున ఏడాదికి రెండు శాతం) కంటే ఆరు రెట్లు వేగంగా ఎగబాకింది'

భారత్‌లో ఓ ప్రముఖ దుస్తుల సంస్థలో పనిచేసే ఉన్నతాధికారి అందుకునే వార్షిక జీతాన్ని ఓ గ్రామీణ కార్మికుడు పొందాలంటే కనీసం 941 ఏళ్లు పడుతుందట. అదే అమెరికాలో అయితే ఓ సాధారణ కార్మికుడి వార్షిక వేతనాన్ని ప్రముఖ సంస్థలో సీఈవో ఓ రోజులో సంపాదించగలడట.

భారత్‌లో

గతేడాది కొత్తగా పుట్టుకొచ్చిన బిలియనీర్ల సంఖ్య: **17**

మొత్తం బిలియనీర్ల సంఖ్య **101**

గతేడాదిలోనే పెరిగిన వీరి సంపద: రూ.**4.89** లక్షల కోట్లు


మన దేశంలో 67 కోట్ల మంది పేదల సంపద ఒక శాతమే పెరిగింది

రూ.121 కోట్లకు తుప్పు

- ఎండకు ఎండి, వానకు తడుస్తున్న జలఫిరంగులు, డీజిల్ ఇంజిన్లు
- నిర్వహణ మరచిన వ్యవసాయశాఖ
- కొన్నిచోట్ల పెట్టెల నుంచీ తీయని వైనం
- 30శాతం ఇప్పటికే మాయం!
- మరికొంత కాలం ఆగితే పాతసామానుకే..


అనంతపురంలో.. అవసరం లేకున్నా తెప్పించి నిరుపయోగంగా వదిలేసిన డీజిల్ ఇంజిన్లు, పరికరాలు

ఈనాడు, అమరావతి: వేసవిలో నీటి ఎద్దడి ఎదురైనప్పుడు వ్యవసాయరంగాన్ని ఆదుకునేందుకు సమకూర్చిన కోట్ల విలువైన జలఫిరంగులు, తుంపర పరికరాలు, డీజిల్ ఇంజిన్లు అధికారుల నిర్లక్ష్యంతో తుప్పుపట్టి నిరుపయోగంగా మారుతున్నాయి. రైతులకు స్వల్పమొత్తానికి రెయిన్‌గన్‌లు, ఇంజిన్లు అద్దెకు ఇవ్వగా వాటిని చాలామంది తిరిగి వెనక్కు ఇవ్వలేదు. చాలాచోట్ల ఏడాదిన్నర కాలంగా ఇంజిన్లను వాడకపోవడంతో అవన్నీ మొరాయిస్తున్నాయి. కొన్ని చోట్ల ప్రైవేటు గోదాముల్లో ఈ పరికరాలను భద్రపరచగా.. వాటికి అద్దె చెల్లించకపోవడంతో గోదాముల (మిగతా 2లో)

"జలఫిరంగులు(రెయిన్‌గన్స్) ఎక్కడో దాచిపెట్టి అవసరమైనప్పుడు వెదుక్కుంటున్నారు. అప్పటికి సగం పోతాయి. దేనికైనా సరైన నిర్వహణ విధానం అవసరం. ఇందుకోసం ఒక విభాగం ఏర్పాటు చేసి ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ)ను పెట్టమన్నాం. ఆ పని ఎందుకు చేయలేదు? వాటిని ఉపయోగించడానికి ఏంటి ఇబ్బంది"?

– కలెక్టర్ల సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన అధికారులను ప్రశ్నించిన ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి అంటున్నట్లు జలఫిరంగులు సగం కాదు.. ఇంకా ఎక్కువే వినియోగానికి నోచుకోని స్థితికి చేరుకున్నాయి. ఇంకా ఆలస్యం చేస్తే పాతసామానుకు అమ్ముకోవాల్సిందే. కార్యాలయాల్లో ఖాళీ లేక ఆరుబయటే పడేయడంతో ఎండా వానకు తడుస్తున్నాయి. గిడ్డంగుల్లో నిల్వ చేసినవీ వాడకం లేక తుప్పుపడుతున్నాయి.

బంతి పూల బాసట



డెంగీ, మలేరియా, గన్యా లాంటి వ్యాధులు వెంటాడుతున్నాయా? అయితే ఇంటి పరిసరాల్లో బంతిపూల మొక్కలు పెంచితే ఈ వ్యాధి కారక దోమలు దరి చేరవట! ఈ విషయంపై బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ) ప్రస్తుతం లోతుగా అధ్యయనం చేపడుతోంది. 2లో

ఔషధాల ఊరట




మలేరియాపై పోరాటంలో సరికొత్త ముందడుగు! ఈ వ్యాధిని సమర్థంగా నయం చేసే ఔషధ మిశ్రమాన్ని పరిశోధకులు కనుగొన్నారు. 'ఫాస్మిడోమైసిన్', 'పిపరక్వైన్' అనే రెండు ఔషధాల సంయుక్త వినియోగం బాధితులపై విజయవంతంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. 2లో

కెమెరాల భద్రత



దేశంలోని అన్ని రైళ్లు, రైల్వేస్టేషన్లు నిఘా నీడలోకి రానున్నాయి. 12 లక్షల సీసీటీవీలు నిత్యం ప్రయాణికుల భద్రతను పర్యవేక్షించనున్నాయి. 11 వేల రైళ్లు, 8500 స్టేషన్లలో కెమెరాలను రెండేళ్లలో అమరుస్తారు. ప్రతీ రైలుపెట్టెలో ఎనిమిది కెమెరాలు ఉంటాయి. 2లో


అరెస్టయిన ఖురేషి

'భారత లాడెన్' ఖురేషి అరెస్టు

- దిల్లీలో పోలీసులకు చిక్కిన ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది
- గుజరాత్ వరుస పేలుళ్ల కుట్రదారు అతడే 2లో


స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్‌లో జరిగిన కార్యక్రమంలో పయొనీరింగ్ వెంచర్స్ సంస్థ ఛైర్మన్ రాన్‌పాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు


దావోస్ సదస్సు జరిగే భవనంపై దట్టంగా పేరుకుపోయిన మంచు

మా రాష్ట్రానికి రండి

- ఆహారశుద్ధి రంగంలో పెట్టుబడులకు చంద్రబాబు ఆహ్వానం
- పయొనీరింగ్ వెంచర్స్ సంసిద్ధత
- సంస్థ ఛైర్మన్ రాన్‌పాల్‌తో జ్యూరిక్‌లో ముఖ్యమంత్రి భేటీ

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పయొనీరింగ్ వెంచర్స్ సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) ఆహ్వానం మేరకు నాలుగు రోజుల దావోస్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం మొదట జ్యూరిక్ చేరుకున్నారు. అక్కడ పయొనీరింగ్ వెంచర్స్ సంస్థ ఛైర్మన్ రాన్‌పాల్, చీఫ్ ఇన్వెస్టర్ ఆఫీసర్ సందీప్‌రాజ్‌తో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు సమగ్ర ప్రణాళికతో రావాలని, అన్ని విధాలా సహకరిస్తామని చంద్రబాబు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీఓ) తరహాలో పాల ఉత్పత్తులకు అదనపు విలువ జోడించేలా పెద్ద ఎత్తున సహకార సంస్థల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కుప్పంలో చిన్న విమానాశ్రయం ఏర్పాటుచేస్తున్నామని, దీని వల్ల సరకు రవాణా సులువవుతుందని వివరించారు. 'వివిధ ఉద్యాన పంటల సాగు ప్రోత్సహించేందుకు పంటలవారీగా క్లస్టర్లు ఏర్పాటుచేస్తున్నాం. ఇది వినూత్న ప్రయోగం. భారీ పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలిస్తున్నాం. ఆహారశుద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టండి' అని సీఎం కోరారు. పండ్ల తోటలు, పాడి పరిశ్రమలో ఇప్పటికే తమ సంస్థ భారీగా (మిగతా 2లో)

బలమున్న చోటే బరిలోకి.. 2లో

- రెండు రాష్ట్రాల్లోనూ పోటీ
- ఉభయ రాష్ట్రాల్లో సమస్యలపై అధ్యయనం
- పాతికేళ్ల ప్రస్థానమే లక్ష్యంగా ప్రయాణం
- ప్రస్తుతం పార్టీకే ప్రాధాన్యం
- సినిమాలు చేయను
- 27 నుంచి అనంతపురం జిల్లాలో పర్యటన
- పవన్ కల్యాణ్ వెల్లడి
- కొండగట్టు అంజన్న దర్శనం.. రూ.11 లక్షల విరాళం


కొండగట్టు అంజన్న దేవాలయం ముందు ప్రజలు, అభిమానులకు అభివాదం చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

ఇదీ సంగతి!



లారీ టమాటాలు పండించి తెచ్చాడు. ధర రాలా, ..రోడ్డుమీద పోశాడు. ఇంటికెళ్లటానికి బస్ ఛార్జీల కోసం...

బడ్జెట్‌లో వ్యవసాయం

- రుణసాయం 11 లక్షల కోట్లు!
- సకాలంలో చెల్లించే అన్నదాతలకు వడ్డీమాఫీ
- కనీస మద్దతు ధరకు భరోసా..
- కేంద్ర బడ్జెట్‌పై ఆశాభావం

దిల్లీ

రైతుల సాధికారిత, వారి ఆర్థికాభివృద్ధిపై కీలకంగా దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయనుంది. ఈమేరకు 2018-19లో రైతులకు రూ. 11 లక్షల కోట్ల మేర రుణాలందించేలా లక్ష్యం నిర్దేశించే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ లక్ష్యం రూ. 10 లక్షల కోట్లు కాగా. . మరో రూ. లక్ష కోట్లు పెంచేందుకు కేంద్రం యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వ్యవసాయం ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్య అంశం కావడంతో రైతుల అభ్యున్నతికి బడ్జెట్‌లో పలు అంశాలు ప్రకటించే అవకాశం ఉంది. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు సాధించడానికి రుణాలే కీలకం. రైతుల అవసరాలకు అనుగుణంగా వ్యవస్థాగత రుణాలను అందించడం ద్వారా.. వారు అధిక వడ్డీలకు ఇతరుల నుంచి అప్పులు తెచ్చుకోవాల్సిన అగత్యం లేకుండా చేయాలన్నది ప్రభుత్వ యోచన. అలాగే వ్యవసాయ రంగంలో సంస్కరణలకు కూడా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే నెల 1న పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న సంగతి తెలిసిందే. 2022 నాటికి దేశంలో రైతుల ఆదాయం రెట్టింపు కావాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా.. మార్కెటింగ్ సంస్కరణలు, రైతులకు కనీస మద్దతు ధరకు హామీ వంటివి ఈసారి కీలకం కానున్నాయి.

వడ్డీమాఫీకే మొగ్గు..!

రైతుల రుణమాఫీకి వివిధ రాష్ట్రాల నుంచి డిమాండ్లు పెరుగుతున్నప్పటికీ.. దీనికి బదులు సకాలంలో రుణాలు చెల్లించేవారికి వడ్డీమాఫీని ప్రకటించేందుకే మోదీ ప్రభుత్వం మొగ్గుచూపే అవకాశం ఉంది. సాధారణంగా (మిగతా 2లో)



కోడిపందేలపై మా ఉత్తర్వుల్ని హేళన చేశారు

- నివేదికల దాఖలులో నిర్లక్ష్యమా?
- 29న హాజరై వివరణ ఇవ్వండి
- ఏపీ సీఎస్, డీజీపీలకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతికి కోడిపందేలు జరగకుండా చూడాలంటూ ఇచ్చిన ఆదేశాల్ని అమలు చేయకుండా హేళన చేశారంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, డీజీపీ మాలకొండయ్యను ఉద్దేశించి హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. "ప్రజాప్రతినిధులు పందేలకు హాజరైన విషయాన్ని టీవీలో చూశాం. పందేలను నిలువరించడంలో నిస్సహాయులైతే కోర్టు దృష్టికి తీసుకురావాల్సింది. నిలువరించడానికి తీసుకున్న చర్యలపై (మిగతా 2లో)

సరికొత్త ఔషధ మిశ్రమంతో మలేరియా చిత్తు!

బ్రిటన్: మలేరియాపై పోరాటంలో సరికొత్త ముందడుగు! ఈ వ్యాధిని సమర్థవంతంగా నయం చేసే ఔషధ మిశ్రమాన్ని బర్మింగ్‌హామ్‌ 'యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెడిసిన్' పరిశోధకులు తాజాగా కనుగొన్నారు. 'ఫాస్మిడోమైసిన్', 'పిపరాక్వైన్' అనే రెండు ఔషధాల సంయుక్త వినియోగం మలేరియా బాధితులపై విజయవంతంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. తాజా పరిశోధనల్లో భాగంగా.. ప్లాస్మోడియం ఫాల్సిపారమ్ కారణంగా మలేరియా బారినపడ్డ 89 మందికి పరిశోధకులు 'ఫాస్మిడోమైసిన్', 'పిపరాక్వైన్'లను మూడు రోజులపాటు అందించారు. బాధితులంతా ఏడాది నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్నవారే. తాజా ఔషధ మిశ్రమ వినియోగంతో వారందరిలో మలేరియా పూర్తిగా నయమైనట్లు పరిశోధకులు వెల్లడించారు. ఇతర దుష్ప్రభావాలేవీ కనిపించలేదని స్పష్టం చేశారు. 'ఫాస్మిడోమైసిన్'ను కృత్రిమంగా ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. 'ఫాస్మిడోమైసిన్', 'పిపరాక్వైన్'ల సంయుక్త వినియోగం ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాలకు అనుగుణంగానే ఉందని చెప్పారు.

బంతి పూలతో దోమలు పరార్!

దిల్లీ: డెంగీ, మలేరియా, గన్యా లాంటి వ్యాధులు వెంటాడుతున్నాయా! అయితే ఇంటి పరిసరాల్లో బంతిపూల మొక్కలు పెంచితే ఆ వ్యాధి కారక దోమలు దరి చేరవట! ఈ విషయంపై బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ) ప్రస్తుతం లోతుగా అధ్యయనం చేస్తోంది. వీటి నియంత్రణకు కొత్త మార్గాలను అన్వేషించాలని డీబీటీకి శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ, పర్యావరణం, అటవీ సంబంధిత అంశాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించింది. ముఖ్యంగా ఆ దోమలను అరికట్టే కొత్త పరిజ్ఞానంపై దృష్టి సారించాలని పేర్కొంది. దీంతో పాటు, వైద్య గుణాలున్న మొక్కలపై తాము ఇప్పటికే అధ్యయనం చేస్తున్నట్లు డీబీటీ తెలిపింది.

రైళ్లు, స్టేషన్లలో సీసీటీవీ నిఘా

దిల్లీ: దేశంలోని అన్ని రైళ్లు, రైల్వేస్టేషన్లను నిఘా పరిధిలోకి తీసుకురావడానికి 12 లక్షల సీసీటీవీలను కొనుగోలు చేయాలని రైల్వేశాఖ ప్రతిపాదిస్తోంది. దీని నిమిత్తం 2018-19 సాధారణ బడ్జెట్‌లో రూ.3000 కోట్లు కేటాయించే అవకాశాలున్నాయి. 11 వేల రైళ్లు, 8500 స్టేషన్లలో వీటిని రెండేళ్లలో అమరుస్తారు. ప్రతీ రైలు పెట్టెలో ఎనిమిది చొప్పున కెమెరాలు ఉంటాయి. ప్రస్తుతం 50 రైళ్లు, 395 స్టేషన్లలో ఇవి పనిచేస్తున్నాయి.

- రైలు ప్రమాదాల నివారణకు తీసుకునే చర్యలను, ప్రయాణాన్ని ఆహ్లాదభరితం చేసే ఏర్పాట్లను ప్రకటించనున్నారు.
- కాపలాదారుల్లేని 4943 గేట్లను ఎత్తివేయడం, కాలం చెల్లిన పట్టాల మార్పిడి గురించి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్లో ప్రస్తావించనున్నారని తెలుస్తోంది.



చెప్పు కాదండోయ్.. చేప

విశాఖ తీరంలో జాలర్లకు చిక్కిన అరుదైన నవిలెలక మత్స్యం

విశాఖపట్నం నగర పరిధిలోని ఋషికొండ బీచ్‌లో సోమవారం మత్స్యకారుల వలకు నవిలెలక చేప చిక్కింది. ఇది పూర్తిగా చెప్పు తరహా ఆకారంలో ఉండి స్థానికులు, పర్యాటకులను అలరించింది. సముద్రంలో చాలాలోపల అడుగున ఇసుకలో ఈ నవిలెలక జాతి చేపలు మనుగడ సాగిస్తాయని కేంద్ర ప్రాంతీయ మత్స్యశాఖాధికారి పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సముద్రంలో పెద్దగాలులు వీచే సందర్భాల్లో అక్కడి నుంచి కొంతమేర ముందుకు వస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆహార అన్వేషణలో భాగంగా చిన్నచేపలను వేటాడే క్రమంలో మత్స్యకారుల వలకు అక్కడక్కడా చిక్కుతాయన్నారు. కొంతకాలంగా ఈ చేప జాతి అరుదుగా మాత్రమే కనిపిస్తోందన్నారు.

—న్యూస్‌టుడే, సాగర్‌నగర్ (విశాఖపట్నం)

బడ్జెట్‌లో వ్యవసాయం

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ రుణాలకు వడ్డీ 9 శాతంగా ఉంటుంది. కాగా స్వల్పకాలిక రుణాలకు (రూ. 3 లక్షల వరకు) ప్రభుత్వం 2 శాతం రాయితీ ఇస్తోంది. అందులో కూడా సకాలంలో చెల్లించేవారికి అదనంగా 3 శాతం రాయితీ ఇచ్చి కేవలం 4 శాతం వడ్డీనే వసూలు చేస్తున్నారు. రానున్న బడ్జెట్‌లో ఇలాంటి స్వల్పకాలిక వ్యవస్థాగత వ్యవసాయ రుణాలపై వడ్డీని (4 శాతం) మాఫీచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని అమలుచేస్తే ప్రభుత్వంపై ఏటా అదనంగా రూ. 16 వేల కోట్ల భారం పడుతుందని అంచనా. అయితే ఆర్థిక మంత్రి మరింత ఉదారంగా యోచిస్తే, సకాలంలో రుణాలు చెల్లించలేని వారికీ దీన్ని వర్తింపజేస్తూ.. మిగిలిన వడ్డీమాఫీని రాష్ట్రాలు భరించాలని కోరే అవకాశం ఉంది.

బడ్జెట్‌లో 'వ్యవసాయ' అంచనాలు... 23 పంట ఉత్పత్తులకు రైతులు కనీస మద్దతు ధర పొందేలా 'భావంతర్ యోజన' అమలు.

- వ్యవసాయోత్పత్తిదారుల సంస్థలకు (ఎఫ్‌పీవోలు) చిన్న రైతులతో కూడిన ప్రోత్సాహకాలు.
- గత ఏడాది ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కేటాయింపులను రెట్టింపు చేయగా.. ఈసారి దానిపై కనీసం 10 శాతం పెంపు.

బలమున్న చోటే బరిలోకి

- రెండు రాష్ట్రాల్లోనూ జనసేన పోటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెల్లడి

ఈనాడు, కరీంనగర్: ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందే ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలో నిర్ణయిస్తాం.. అప్పటి వరకు రెండు రాష్ట్రాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. అన్ని స్థానాల్లో పోటీ చేయడం కన్నా తమకు బలం ఉన్న మేరకే పోటీకి దిగుతామని స్పష్టం చేశారు. తెలంగాణలో పార్టీ శ్రేణులతో సమావేశాలకు ముందు సోమవారం ఆయన జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయాభివృద్ధికి రూ.11 లక్షల విరాళం ప్రకటించారు. తర్వాత కరీంనగర్‌లో విలేకర్లతో మాట్లాడారు. '2009 ఎన్నికల ప్రచారంలో విద్యుత్తు తీగలతో ప్రమాదం తప్పినప్పుడు కొండగట్టు ఆంజన్న దయతోనే బయటపడ్డానని భావించాను. అక్కడ దర్శనం చేసుకున్నాకే పూర్తిస్థాయి రాజకీయాలు ప్రారంభించాలనుకున్నా. అందుకే దర్శనం చేసుకున్నా. రెండు రాష్ట్రాల్లోని సమస్యలపై అవసరాన్ని బట్టి దూకుడుగా, రాజీ ధోరణిలోనూ సాగుతాం. నిర్మాణాత్మక రాజకీయాలు కొనసాగిస్తాం. మాది చిన్న పార్టీ. తెదేపా, తెరాసలు నిర్మాణాత్మకంగా బలంగా ఉన్నాయి. వాటిని అనుభవజ్ఞులు నడిపిస్తున్నారు. 2019లో అన్ని సీట్లు గెలవాలి.. అన్ని ఓట్లు సాధించాలనే దానికన్నా రాబోయే 25 ఏళ్ల ప్రస్థానాన్ని లక్ష్యంగా పెట్టుకొని ముందుకెళుతున్నాం. విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ పాత్రికేయులతో చర్చిస్తూ సమస్యలను అధ్యయనం చేస్తున్నాం. వాటి పరిష్కారానికి ప్రభుత్వాలతో చర్చిస్తున్నాం. భాజపా అధ్యక్షుడు అమిత్‌షా భాజపాలో చేరమని కోరినా సున్నితంగా తిరస్కరించాను. తెలంగాణలో ప్రాంతం, ఆంధ్రలో కులం ప్రభావం చూపిస్తున్నాయి. ఉద్యోగ కల్పన అన్నిచోట్లా సమస్యే. ప్రస్తుతానికి సినిమాల ఆలోచన లేదు. పూర్తి స్థాయిలో పార్టీ పనులే చూసుకుంటాను.



ప్రజాయాత్రకు బయల్దేరే ముందు పవన్‌కల్యాణ్‌కు హారతిచ్చి తిలకం దిద్దుతున్న సతీమణి అన్నా లెజినేవా

ఇక్కడి పర్యటన తర్వాత, 27 నుంచి అనంతపురంలో కరవు పరిశీలన యాత్ర చేపడతా. ఆంధ్రలో అనంతపురంలో కార్యాలయం ఏర్పాటు చేస్తాం. తర్వాత ఒంగోలులో ఫ్లోరోసిస్, మూత్రపిండాల సమస్యలపై, కొవ్వాడ అణువిద్యుత్తు ప్రాంత పరిశీలనకు వెళ్తాను. రాష్ట్ర ప్రభుత్వాలతో గొడవపెట్టుకునే ఆలోచన లేదు. ఆంధ్రప్రదేశ్‌లో పోరాడే సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నాం. తెలంగాణలోనూ అలాగే చేస్తాం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉపాధ్యాయులు వరంగల్‌లో ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేస్తామన్నా ఏపీలో జాప్యం.. ఇలా విభజనతో రెండు రాష్ట్రాల్లో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాం. ఓటుకు నోటు తప్పే. అన్ని పార్టీలూ ఆ పొరపాట్లు చేస్తున్నాయి. దాన్ని విమర్శించి ఇంకా రచ్చ చేయడం ఎందుకనే చూసీ చూడనట్లు పోయా. ఇతర పార్టీల నుంచి బలమైన నాయకులు వస్తామంటే ఆలోచించి నిర్ణయిస్తాం' అన్నారు.

తెలంగాణపై సున్నితంగా..

తెలంగాణలో వ్యవహారాలను సునిశితంగా పరిశీలించి, సున్నితంగా వ్యవహరించాలని పవన్ అన్నారు. ప్రజారాజ్యం సమయంలో సామాజిక తెలంగాణ నినాదం ఇచ్చారన్న ప్రశ్నకు స్పందించారు. సామాజిక తెలంగాణ, సామాజిక ఆంధ్రప్రదేశ్ వంటివి ఎక్కువ మందికి ప్రయోజనం కలిగించాలనే భావనే తప్ప మరోటి కాదన్నారు. తెలంగాణపై తనకు ప్రత్యేక ఇష్టం ఉందని, ఇక్కడి మేధావులు జనసేనతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉద్యమశక్తులను ఏకం చేసి తెలంగాణ సాధించిన నాయకునిగా కేసీఆర్‌ను ప్రజలు గుర్తించి ముఖ్యమంత్రిని చేశారన్నారు. ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడం తప్పెలా అవుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కష్టపడుతూ ముందుకెళుతున్నారన్నారు. జనసేనకు చిరంజీవి మద్దతుపై ప్రశ్నించగా తాను కుటుంబసభ్యుల మద్దతు అడగలేను.. అడగనన్నారు. కొండగట్టు ఆలయం వద్ద ఓ అభిమాని పవన్‌పైకి జాతీయ జెండా విసరగా ఆయన భద్రతా సిబ్బంది దాన్ని అందుకుని గుడ్డలా చుట్టడంతో జాతీయ జెండాను అవమానించారంటూ సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వ్యక్తమయ్యాయి.

హారతిచ్చిన సతీమణి అన్నా లెజినేవా

హైదరాబాద్, న్యూస్‌టుడే: పవన్‌కల్యాణ్ ప్రజాయాత్రకు సోమవారం హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి శ్రీకారం చుట్టారు. వివిధ మతాల మహిళలు నిర్వహించిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. జనసేన సోషల్ మీడియాకు సంబంధించి 'వీరమహిళ' విభాగాలను ప్రారంభించారు. ప్రజాయాత్రకు బయలుదేరిన పవన్‌కు ఆయన సతీమణి అన్నా లెజినేవా వీరతిలకం దిద్దారు. కొబ్బరికాయ కొట్టారు. తిలకం దిద్ది హారతి ఇచ్చారు.

'భారత లాడెన్' ఖురేషి అరెస్టు

దిల్లీ: కరుడుగట్టిన ఉగ్రవాది, 2008 నాటి గుజరాత్ వరుస పేలుళ్ల కుట్రదారు అబ్దుల్ సుభాన్ ఖురేషి(46) పోలీసులకు చిక్కాడు. తూర్పుదిల్లీలోని గాజీపూర్‌లో శనివారం సాయంత్రం అతణ్ని అరెస్టు చేసినట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. 'భారత బిన్ లాడెన్'గా పేరొందిన ఖురేషి 'ఇండియన్ ముజాహిదీన్(ఐఎం)' ఉగ్రసంస్థ సహవ్యవస్థాపకుడు. 'స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సిమి)'తోనూ అతడికి సంబంధాలున్నాయి. ఖురేషి గాజీపూర్‌కు వస్తున్నట్లు నిఘా సమాచారం అందడంతో అప్రమత్తమై అతణ్ని అదుపులోకి తీసుకున్నామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.ఎస్.కుష్వాహ సోమవారం వెల్లడించారు. అరెస్టుకు ముందు కాల్పులు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. 2008 జులై 26న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 20 వరుస పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఐఎం జరిపిన ఈ మారణహోమంలో 50 మందికిపైగా మృత్యువాతపడ్డారు.

ఉద్యోగాన్ని వదిలి ఉగ్రవాదం వైపు.. ఖురేషి అలియాస్ తౌకీర్ మహారాష్ట్రవాసి. చిన్నతనంలో అల్లరి చేయకుండా మౌనంగా ఉండేవాడు. 2001 వరకు ప్రముఖ కంప్యూటర్ సంస్థలో పనిచేశాడు. అనంతరం ఉద్యోగాన్ని వదిలి.. నిషేధిత ఉగ్రసంస్థ సిమి వెలువరించే 'ఇస్లామిక్ వాయిస్'కు సంపాదకుడిగా వెళ్లాడు. వాస్తవానికి 1998 నుంచే అతడు సిమి కార్యకర్తగా ఉన్నాడు. బాంబుల తయారీలో ఖురేషి దిట్ట. 2007-2008 మధ్య ఉత్తర్ ప్రదేశ్, జైపూర్, అహ్మదాబాద్, దిల్లీల్లో చోటుచేసుకున్న పేలుళ్ల కేసుల దర్యాప్తులో తొలిసారిగా అతడి పేరు ఉగ్రవాద జాబితాలో బయటకు వచ్చింది. అనంతరం అతడు నేపాల్‌కు పారిపోయాడు. నకిలీ గుర్తింపుపత్రాలతో అక్కడే జీవనం గడిపాడు. 2015లో ఇండియన్ ముజాహిదీన్(ఐఎం) వ్యవస్థాపక సభ్యుడు రియాజ్ భత్కల్‌ను ఖురేషి కలిశాడు. భత్కల్ సూచనమేరకు.. భారత్‌లో ఐఎంను పునరుద్ధరించేందుకు అవసరమైన నిధుల సమీకరణ చేపట్టేందుకుగాను సౌదీ అరేబియా వెళ్లాడు. 2017 జూన్‌లో సౌదీ నుంచి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి మనదేశాన్ని దొంగచాటుగా సందర్శిస్తూ.. యువతను ఐఎం వైపునకు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాడు.



జ్యాక్‌తో సోదరి రాష్ట్ర ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న జ్యాక్ ఆర్థిక వ్యవహారాల మంత్రి కార్నెస్ వాకర్, ఆర్థిక శాఖ మంత్రి యనమల. చిత్రంలో మంత్రి నారా లోకేష్ తదితరులు

మా రాష్ట్రానికి రండి

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు పెట్టిందని, ఐరోపాలో మరో రూ.ఐదు వేల కోట్ల పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నామని రాన్‌పాల్ తెలిపారు. గ్రామీణ భారతంలో ఎక్కువ పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఇప్పటికే తమ సంస్థ కార్యకలాపాలు ప్రారంభించిందని వివరించారు. రూ.వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగ అభివృద్ధిని పరిశీలించి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. ఆ సంస్థతో సంప్రదింపులు జరిపి పెట్టుబడులు తీసుకొచ్చే బాధ్యతను పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్‌కు ముఖ్యమంత్రి అప్పగించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జ్యాక్, ఆంధ్రప్రదేశ్ మధ్య సోదరి రాష్ట్ర (సిస్టర్ స్టేట్) ఒప్పందం కుదిరింది. దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందం (లెటర్ ఆఫ్ ఇంటెంట్)పై రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, జ్యాక్ తరఫున ఆర్థిక వ్యవహారాల మంత్రి కార్నెస్ వాకర్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సమాచార సాంకేతిక, పర్యావరణ సాంకేతికత, జీవశాస్త్రాలు, పర్యాటకం, ప్రాంతీయాభివృద్ధి రంగాల్లో ఆంధ్రప్రదేశ్, జ్యాక్ సహకరించుకుంటాయి.

కోడిపందేలపై మా ఉత్తర్వుల్ని హేళన చేశారు

(మొదటి పేజీ తరువాయి)

నివేదికలు దాఖలు చేయాలంటూ ఈ నెల 4న ఆదేశాలు ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనిపై ఈ నెల 29న సీఎస్, డీజీపీలు స్వయంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలి" అని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలు జారీచేసింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం వెంప, శ్రీరాంపురం గ్రామాల్లో కోడిపందేల సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ.. కె.రామచంద్రరాజు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఈ నెల 4న విచారణ జరిపిన ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం.. కోడిపందేలను నిలువరిస్తూ 2016 డిసెంబరు 26న తాము ఇచ్చిన ఉత్తర్వులను ఈ సంక్రాంతికి అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పందేలను నిలువరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ తదుపరి విచారణ నాటికి నివేదికలు సమర్పించాలని సీఎస్, డీజీపీలను ఆదేశించిన విషయం తెలిసిందే. సోమవారం ఈ వ్యాజ్యం హైకోర్టులో మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వెంకటరెడ్డి వాదనలు వినిపిస్తూ.. వెంప, శ్రీరాంపురం గ్రామాల్లోనే కోర్టు ఉత్తర్వులను అమలు చేశారని చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లో పోటీలు జరిగాయన్నారు. హోంశాఖ న్యాయవాది (జీపీ) విద్యాపతి, రెవెన్యూశాఖ న్యాయవాది జయంతి వాదనలు వినిపిస్తూ.. కోడిపందేలను అడ్డుకోవడానికి అధికారులు తగిన చర్యలు తీసుకున్నారన్నారు. ఈ వ్యవహారంపై నివేదికల సమర్పణకు స్వల్ప గడువు కావాలని కోరారు. పందేలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రతిని కోర్టు పరిశీలనకు ఇచ్చారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం.. "మేం విచారణకు వచ్చాక గడువు కోరడం ఏమిటి? దీన్ని సమర్థించలేం" అని పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాల్ని సైతం ఇప్పటి కేసులు కోర్టులో మాకు అందజేస్తారా? అని నిలదీసింది.

సంపన్నులవైపే సంపద

దావోస్: భారత్‌లో కుబేరులు అపర కుబేరులవుతుంటే పేదలు కడుపేదలుగా మిగిలిపోతున్నారు. కలిమి-లేముల మధ్య అంతరం రానురానూ మరింత పెరిగిపోతోంది. ఇది ఏటా ఆర్థిక సదస్సులో 'ఆక్స్‌ఫాం' నివేదికలో మరోసారి వెల్లడయింది. ఒక్క శాతమే ఉన్న అత్యధిక ధనవంతుల ఖజానాల్లోకే నాలుగింట మూడొంతుల సంపద చేరిపోయిందని బయటపెట్టింది. పేదల విషయంలో ఈ పెరుగుదల నామమాత్రమేనని తేల్చింది. కోట్లాది మంది కడు పేదరికంలో అష్టకష్టాలు పడుతుంటే అపర కుబేరులు మరింత సంపదను పోగేసుకునేందుకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎలా తోడ్పడిందో చూడండని గణాంకాలతో తెలిపింది. ప్రపంచ ఆర్థిక అసమానతలు దీనిలో మరింత ఆందోళనకరంగా కనిపించాయి. 82 శాతం ప్రపంచ సంపద కేవలం ఒక శాతం ధనిక వర్గం జేబుల్లోకే వెళ్లినట్లు నివేదిక తెలిపింది. 370 కోట్ల నిరుపేద జనాలు ఆదాయం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఏ మాత్రమూ పెరగలేదని వెల్లడించింది. దీనిలోని అంశాలపై దావోస్ సదస్సులో ప్రపంచ నేతలు చర్చించనున్నారు. ఆర్థిక అసమానతలతో పాటు స్త్రీ, పురుషుల సమానత్వం సహా చిన్న అంశాలపై వారు మంతనాలు జరపనున్నారు.


వారి సంపద... కేంద్ర బడ్జెట్‌తో సమానం!

బిలియనీర్ల సంఖ్య పెరుగుదలలో, ఏటా వారి సంపద పెరుగుతున్న తీరుపై ఆక్స్‌ఫాం గణాంకాలు కళ్లు చెదిరేలా ఉన్నాయి. ఏటా వీరి సంపద గణనీయంగా పెరిగిపోతోందని, కార్మికుల జీతాలు పెరుగుతున్న తీరుతో దీనిని పోల్చలేమని నివేదిక వెలువరించింది. ఏడాది వ్యవధిలో బిలియనీర్ల మూటగట్టిన సంపద విలువ... అన్ని రాష్ట్రాలు కలిసి విద్య, ఆరోగ్యంపై వెచ్చించిన మొత్తంలో 85 శాతానికి సమానం.. !! మొత్తంగా వీరి సంపద గతేడాదికి రూ.20.9 లక్షల కోట్లకుపైగా పెరిగింది. ఇది కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ 2017-18 మొత్తానికి సమానం' అని తెలిపింది. ప్రపంచ బిలియనీర్లలో ప్రతి పది మందిలో తొమ్మిది మంది పురుషులేనని పేర్కొంది. భారత్‌లో నలుగురే మహిళా బిలియనీర్లు ఉన్నారని, వీరిలో ముగ్గురి సంపద వారసత్వంగా సంక్రమించిందేనని వివరించింది. కొంతమంది వార్షిక వేతనాలను ప్రస్తావిస్తూ అవి ఓ సాధారణ కార్మికుడి 941 ఏళ్ల జీతంతో సమానమని తేల్చింది. పది దేశాల్లోని 70,000 మంది నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి సంస్థ ఈ నివేదికను సిద్ధంచేసింది.

సమ్మిళిత అభివృద్ధికి పెద్దపీట వేయాలి

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దావోస్ సదస్సుకు హాజరుకానున్న నేపథ్యంలో.. భారత ఆర్థిక వ్యవస్థ ఫలాలు అందరికీ దక్కేలా చూడాలని ఆక్స్‌ఫాం అభ్యర్థించింది. కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండే రంగాలను ప్రోత్సహిస్తూ.. సమ్మిళిత అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరింది. సామాజిక అభివృద్ధి పథకాలను మెరుగ్గా అమలుచేయడం, వ్యవసాయ రంగంలో మరిన్ని పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి లాంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరింది. అంతేకాదు పన్ను ఎగవేతదారులను తగ్గించడం దృష్టి పెట్టాలని, అత్యధిక ధనవంతులు (సూపర్ రిచ్)పై ఎక్కువ పన్నులు విధించాలని, కార్పొరేట్ పన్ను రాయితీలను ఎత్తివేయాలని సూచించింది.





వసంత పంచమిని పురస్కరించుకొని తెలంగాణలోని నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ క్షేత్రంలో 3వేల మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు.

రూ.121 కోట్లకు తుప్పు

(మొదటి పేజీ తరువాయి)

యజమానులు వాటిని పరిశీలించేందుకు కూడా అనుమతివ్వడం లేదు. అప్పుడప్పుడు ఉన్నతాధికారుల హడావిడి మినహా రూ.121 కోట్లు వ్యయం చేసిన పరికరాలను పట్టించుకునే వారే లేరు. మరికొంతకాలం వాటిని ఇలాగే వదిలేస్తే తుక్కుగా అమ్ముకోవాల్సిన దుస్థితి తప్పదు. కరవు పరిస్థితులు ఎదురైనప్పుడు 2016 ఖరీఫ్‌లో పంటలను కాపాడేందుకు ప్రభుత్వం జలసిరంగుల విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. తొలుత 50శాతం రాయితీపై అందించగా రాయలసీమతోపాటు పలు జిల్లాల రైతాంగం పెద్దఎత్తున ముందుకొచ్చింది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలనే ప్రతిపాదన తెచ్చారు. యుద్ధప్రాతిపదికన జలసిరంగులు, తుంపర పరికరాలతోపాటు టార్పాలిన్లు, గొట్టాలు, డీజిల్ ఇంజిన్లు కొనుగోలు చేశారు.

ఆరంభ శూరత్వమే

2016 ఖరీఫ్‌లో 8 జిల్లాల్లో 1.47లక్షల మంది రైతులకు చెందిన 6.37లక్షల ఎకరాలను కాపాడి.. రూ. 580 కోట్ల విలువైన ఉత్పత్తి అధికంగా సాధించినట్లు వ్యవసాయశాఖ నివేదించింది. 2017 జులై, ఆగస్టు నెలల్లో కరవు పరిస్థితులు నెలకొన్నా బయటకు తీయలేదు. అనంతపురంలో 810 ఎకరాల వేరుసెనగ కాపాడినట్లు పేర్కొన్నారు.

నీళ్లు తీయని పెట్టెలు

- అనంతపురం జిల్లాలో అవసరం లేని ప్రాంతాలకు కూడా జలసిరంగులను తెప్పించి కుప్పలుగా పోశారు. ఏడాదిన్నరగా ఇవన్నీ తుప్పుపట్టి పోతున్నాయి. జిల్లాకేంద్రంలోనే వందలకొద్దీ డీజిల్ ఇంజిన్లు పెట్టెల్లోనే మూలుగుతున్నాయి.
- జిల్లాకు 5,897 జలసిరంగులు, 5,496 తుంపర పరికరాలు, 4.18లక్షల గొట్టాలు, 4,441 డీజిల్ ఇంజిన్లు వచ్చాయి. వాస్తవంగా చూస్తే 30శాతం ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి.

రైతుల వద్దే ఎక్కువ భాగం..

అనంతపురం జిల్లాలోని ధర్మవరం మండలానికి 140 స్ప్రింక్లర్లు, 112 రెయిన్‌గన్లు, 86 ఆయిల్ ఇంజిన్లు, 10,170 పైపులు కేటాయించారు. వాటిలో ఎక్కువ భాగం రైతుల వద్దే ఉన్నాయి. నెలకు రూ. 150 చొప్పున అద్దె చెల్లిస్తున్నారని చెబుతున్నా అలి ఖీలు కూడా అధికారుల వద్ద లేవు. రాజకీయ అండతో కొన్ని గ్రామాల్లో ఒక్కరూ వెనక్కి ఇవ్వలేదు. చాలా మండలాల్లో ఇదే పరిస్థితి.

దాచిన వాటికీ అద్దెలు కట్టలేక

పరికరాలను నిల్వ చేసేందుకు వ్యవసాయశాఖ వద్ద చోటులేక మార్కెట్‌యార్డు గిడ్డంగుల్లో ఉంచారు. అవి లేనిచోట ప్రైవేటు గోదాములను తీసుకున్నారు. నెలకు రూ.8వేల చొప్పున అద్దె చెల్లించేలా అంగీకారం కుదిరింది. ఇప్పటికీ ఏడాదిన్నర అవుతున్నా పైసా కూడా చెల్లించలేదు. దీంతో ప్రైవేటు గిడ్డంగుల యజమానులు వాటిని బయటకు తీయనివ్వడం లేదు. దీంతో గిడ్డంగుల్లోనే తుప్పుపడుతున్న పరిస్థితి.

నిర్వహణ లేకుంటే ఇంతే..

- వ్యవసాయశాఖ పరికరాల నిర్వహణను విస్మరించింది.
- ఏడాదిన్నరగా వాడకం లేక ఇంధనం గడ్డకట్టడంతో డీజిల్ ఇంజిన్లు మొరాయిస్తున్నాయి. మరమ్మతులు చేయకుంటే పని చేయడం కష్టమే.
- మట్టూ తిరుగుతూ నీరు చిమ్మే జలసిరంగులు, తుంపర పరికరాలు వినియోగం లేక తుప్పుపట్టి కదలని స్థితికి చేరుతున్నాయి.
- ప్లాస్టిక్ గొట్టాలను ఎండావానకు వదిలేస్తున్నారు. దీంతో వాషర్లు, అనుసంధానించే పరికరాలు విరిగిపోతున్నాయి.

ఇలా చేస్తే..

- ఇప్పటికే అధికశాతం పరికరాలు దెబ్బతిన్నాయి. ఉన్నవాటిని వ్యవసాయశాఖ ఆధీనంలోకి తీసుకుని రాయితీపై రైతులకిచ్చే అంశాన్ని పరిశీలించాలి. లేదంటే పొదుపు సంఘాలకు రాయితీపై అప్పగించి రైతులంతా వినియోగించుకునేలా చేయాలి.
- ప్రభుత్వమే వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగాన్ని సత్వరం ఏర్పాటు చేసి మండలానికో అధికారిని నియమించి యంత్ర పరికరాల నిర్వహణ సక్రమంగా చేసేలా చర్యలు చేపట్టాలి.

రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఇదీ..

మొత్తం రెయిన్‌గన్లు	13,334
తుంపరపరికరాలు	14,100
ఆయిల్ ఇంజిన్లు	8,560
ప్లాస్టిక్ పైపులు	8,09,085

మొత్తం వ్యయం

2016-17 సంవత్సరంలో	రూ.116.40కోట్లు
2017-18లో	0.28కోట్లు
డీజిల్ రవాణా ఖర్చులు	4.43కోట్లు

గ్రహం అనుగ్రహం

23-1-2018 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం ఉత్తరాయణం
శిశిర ఋతువు: మాఘ మాసం; శుక్ల పక్షం
షష్ఠి: ఉ. 12-38 తదుపరి సప్తమి
రేవతి నక్షత్రం: తె. 4-52 తదుపరి అశ్విని
అమృతఘడియలు: రా. 1-28 నుంచి 4-04 వరకు
వర్జ్యం: సా. 4-52 నుంచి 6-28 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-50 నుంచి 9-34 వరకు
తిరిగి రా. 10-53 నుంచి 11-45 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6-38, సూర్యాస్తమయం: సా.5-45

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విశాఖపట్నం	14.0	28.7
హైదరాబాద్	14.0	29.5
శ్రీకాకుళం	14.0	31.0
గుంటూరు	14.5	31.5
తిరుపతి	15.5	30.7
అనంతపురం	16.4	30.3
రాజమహేంద్రవరం	16.5	29.0
విజయవాడ	17.0	29.7
కర్నూలు	17.0	31.2
నరసాపురం	18.5	29.0
తాడేపల్లిగూడెం	19.0	29.5
కడప	19.0	33.0
ఒంగోలు	19.3	30.8
నెల్లూరు	22.0	29.0

ఆ ట్యాబ్‌ల్లో మారదు పేజీ!

- మరమ్మతులతో ఎంబీబీఎస్ విద్యార్థులకు ఉపకరించని వైనం
- రూ.15 కోట్లు వ్యయం వృథా

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఎంబీబీఎస్ విద్యార్థులకు అందచేసిన ట్యాబ్‌లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. బాగున్నవి విద్యార్థుల అవసరాలకు తగ్గట్లు కూడా ఉపయోగపడడంలేదు. అంతర్జాల సౌకర్యంతో స్మార్ట్‌ఫోన్లను విద్యార్థులు విరివిగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో ట్యాబ్‌ల కొనుగోలు కోసం ప్రభుత్వం వ్యయం చేసిన సుమారు రూ. 15 కోట్ల వల్ల ఎటువంటి ఉపయోగం కనిపించడంలేదు.

2016-17 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ ప్రథమ నుంచి చివరి సంవత్సరం వరకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదివే సుమారు 7,500 మంది విద్యార్థులకు ఈ ట్యాబ్‌లను ఏపీ టెక్నాజీస్ సర్వీసెస్ ద్వారా ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం కొనుగోలు చేసింది. వీటిని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు కూడా. ఈ ట్యాబ్‌లో విద్యార్థులకు బోధించే పాఠాల సమాచారాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచారు. అయితే..ట్యాబ్‌లో ఈ సమాచారాన్ని చూసుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు. ట్యాబ్ వేగం తక్కువగా ఉన్నందున ఒక పేజి నుంచి మరోక పేజికి వెళ్లేందుకు ఎక్కువ సమయం పడుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ట్యాబ్‌లకు ఇతర మరమ్మతులు కూడా వస్తున్నాయి. కళాశాల నుంచి వీటిని మరమ్మతుకు తీసుకువెళ్లడం, కొద్దిరోజుల తర్వాత తీసుకురావడం పరిపాటిగా మారిందని ఓ సీనియర్ ప్రిన్సిపల్ వ్యాఖ్యానించారు. ట్యాబ్‌లు సక్రమంగా పనిచేయకపోతుండడంతో విద్యార్థులు వాటిని పక్కన పెట్టేస్తున్నారని ఓ సీనియర్ ప్రొఫెసర్ పేర్కొన్నారు. దీనిపై ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయానికి కూడా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. మరోవైపు..ఈ విశ్వవిద్యాలయం సుమారు ఐదు కోట్ల రూపాయల వ్యయంతో వైద్య విద్యార్థులకు అవసరమైన సమాచారాన్ని అంతర్జాలం ద్వారా లాగిన్ అయి చూసుకునే సదుపాయాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతో సంప్రదించి..ట్యాబ్‌ల పంపిణీ విధానానికి స్వస్తి పలకాలని విశ్వవిద్యాలయం యోచిస్తున్నట్లు తెలియవచ్చింది.

భారరహిత స్థితితో వ్యోమగాముల్లో దీర్ఘకాల జ్వరం

బెర్లిన్: రోదసిలో భార రహిత స్థితిలో తేలియాడుతూ ఉండే వ్యోమగాములకు దీర్ఘకాల జ్వరం తలెత్తుతుందని తాజా అధ్యయనంలో తేలింది. వారిలో ఒక డిగ్రీ సెల్సియస్ మేర ఉష్ణోగ్రత పెరుగుతుందని వెల్లడైంది. పరిశోధనలో భాగంగా.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో విధులు నిర్వర్తిస్తున్న వ్యోమగాములకు నుదురుపై సెన్సర్లు అమర్చి, శరీర ఉష్ణోగ్రతను కొలిచారు. వారి శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పెరగలేదని, రెండున్నర నెలల సమయంలో క్రమంగా పెరిగిందని గుర్తించారు. చివరకు అది 38 డిగ్రీల సెల్సియస్‌కు చేరిందన్నారు. వ్యాయామం చేసే సమయంలో అది కొన్నిసార్లు 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరుతోందని తెలిపారు. "భారరహిత స్థితిలో.. అధిక వేడిమిని తొలగించడం మన శరీరానికి చాలా కష్టమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో శరీరానికి, పరిసరాలకు మధ్య ఉష్ణ బదిలీ చాలా సవాళ్లతో కూడుకున్న వ్యవహారం" అని పరిశోధనలో పాలుపంచుకున్న హాన్స్ క్రిస్టియన్ గుంగా చెప్పారు. రోదసిలో సాధారణం కన్నా చాలా మెల్లగా చెమట ఆవిరవుతుందని తెలిపారు. అందువల్ల వ్యాయామ సమయంలో వ్యోమగాముల్లో ఉష్ణోగ్రత పెరుగుతోందన్నారు. శరీర ఉష్ణోగ్రతలో మితిమీరిన హెచ్చుతగ్గులు ప్రాణాంతకం కూడా కావొచ్చన్నారు. భవిష్యత్‌లో చేపట్టే రోదసి యాత్రల్లో వ్యోమగాముల ఆరోగ్య పరిరక్షణ మెరుగైన చర్యలు చేపట్టడానికి తమ పరిశోధన వీలు కల్పిస్తుందన్నారు.

టెండర్ల దశలోనే పనులు

- ఆయన రారు.. టెండర్లు తెరుచుకోవు
- సీఓటీ సమావేశాలు జరగట్లేదు

ఈనాడు అమరావతి: 'ఆయన అందుబాటులో ఉండట్లేదు. ఆయన లేకపోతే సమావేశాలు జరగవు. టెండర్ల సమస్యే కాదు.. గుత్తేదారు సంస్థల రిజిస్ట్రేషన్లు కూడా నిలిచాయి'.. ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖల్లో వినిపిస్తున్న మాటలివి. తాము సూచించిన పనులు ఎందుకు టెండర్ల దశను దాటడం లేదని ఉన్నతాధికారులను ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తుంటే సమాధానమీయలేని పరిస్థితి నెలకొంది. కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ (సీఓటీ) సమావేశాలు కొద్ది నెలలుగా నిర్వహించకపోవడంతో రహదారులు, భవనాలు; జలవనరుల శాఖల్లో పలు పనులకు ఇబ్బంది ఏర్పడింది. సీఓటీగా జలవనరులశాఖ ఈఎన్‌సీ బాధ్యతలు చూస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో ఉండే కమిటీయే రూ. రెండు కోట్ల విలువ, ఆపైన పనులకు సంబంధించిన టెండర్లను పరిశీలించి గుత్తేదారును ఎంపిక చేస్తుంది. ఇందులో రోడ్లు భవనాలు, ఆర్థిక, జలవనరుల శాఖల అధికారులు సభ్యులు. జలవనరుల శాఖ ఈఎన్‌సీ అందుబాటులో ఉండకపోవడంతో సమావేశాలను నిర్వహించడం లేదు. పోలవరంతోపాటు ఇతర జలవనరుల ప్రాజెక్టు పనుల్లో ఆయన ఉండటంతో సీఓటీ సమావేశాలను నిర్వహించడం లేదు. ఆర్అండ్‌బీలో పలు రహదారి ప్రాజెక్టు పనులు టెండర్ దశను దాటడం లేదు. ఇటీవల ఆ శాఖ ఈఎన్‌సీలతో పలువురు ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల రోడ్లు, వంతెన పనులను ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. తాము టెండర్లు పిలిచినా సీఓటీ సమావేశం నిర్వహించనందున ఏమీ చేయలేకపోతున్నామని వారు చెప్పారు. మరోవైపు గుత్తేదార్లు కూడా సంబంధిత శాఖలపై ఒత్తిడి తెస్తున్నారు. క్లాస్ 1, స్పెషల్ కాంట్రాక్టర్లుగా నమోదు చేయించుకోవాలన్నా, రెన్యువల్ చేయించుకోవాలన్నా సీఓటీ అనుమతి తప్పనిసరి. వందకుపైగా దరఖాస్తులు అక్కడే అపరిష్కృతంగా ఉన్నాయని సమాచారం.

సీఓటీ విధానం మార్చాలి

రూ. 2 కోట్లు, ఆపైబడిన పనులను సీఓటీ ద్వారానే ఆమోదింపజేయాలనే నిబంధన 15ఏళ్ల కిందట ఏర్పాటైంది. ఇప్పుడు ఆ మొత్తంతో చేపట్టేవి మధ్యస్థాయి పనులే కాబట్టి ఈఎన్‌సీ దశలోనే ఆమోదింపచేసుకునేలా మార్పు తీసుకురావాలనే సూచన ప్రభుత్వం ముందుంది. తెలంగాణలో ఈ నిబంధనను మార్పు చేసేందుకు రంగం సిద్ధమైంది. అత్యవసరంగా చేయాల్సిన పనులు రూ. రెండు కోట్లు దాటితే సీఓటీ నిబంధన ఉండటంతో వేగంగా ప్రక్రియను పూర్తి చేయలేకపోతున్నామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

గిన్నిస్ రికార్డుకు.. 'గీతం' విద్యార్థిని

పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బీటెక్ విద్యార్థిని శివాలి మూడోసారి గిన్నిస్ రికార్డు సాధించింది. కాగితం(హ్యాండ్ మేడ్ పేపర్)తో 2,111 విభిన్నమైన బొమ్మలు తయారు చేయడం ద్వారా తమ విద్యార్థిని ఈ ఘనత సాధించినట్టు అదనపు ఉపకులపతి శివ ప్రసాద్ తెలిపారు. 1,251 విభిన్న బొమ్మలు, 7,011 కాగితపు పువ్వులు తయారు చేసినందుకుగానూ శివాని గతంలోరెండుసార్లు గిన్నిస్ రికార్డులు సొంతం చేసుకుందని వివరించారు

.– న్యూస్‌టుడే, పటాన్‌చెరు


విద్యార్థిని రూపొందించిన బొమ్మలు. పక్కన శివాలి

తెలంగాణ వ్యాప్తంగా జంతు గణన సోమవారం ప్రారంభమైంది. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం, అటవీశాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ఈ క్రతువును ఆదిలాబాద్ ఉట్నూరు ఏజెన్సీలో అటవీశాఖ మంత్రి జోగురామన్న ప్రారంభించారు.

ఈనాడు

జనారోగ్య క్షయం

ఏ జాతికైనా వ్యవస్థకైనా జనారోగ్యమే మహాభాగ్యం. ఎటువంటి లోటుపాట్లతో సామాజిక స్వస్థతకు తూట్లుపడినా, దేశ ఆర్థిక రంగానికి ఒడుదొడుకులు తథ్యం. స్వస్థ సమాజమే భద్ర సమాజమన్న భావనకు ఓటేస్తూ వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రధాని మోదీ రాసిన లేఖాంశాలు చాటుతున్న యథార్థాలివి! ప్రపంచంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న అంటువ్యాధుల్లో, 'నిశ్శబ్ద హంతకి' క్షయ(టీబీ)దే పెద్ద పద్దు. భారత్‌లో ఏటా 29 లక్షల దాకా క్షయ కేసులు కొత్తగా నమోదవుతున్నాయంటున్న ప్రధానమంత్రి, ప్రతి సంవత్సరం ఆ మహమ్మారి దేశీయంగా సుమారు నాలుగు లక్షల ఇరవై వేల నిండు ప్రాణాల్ని కర్కశంగా కబళిస్తున్నదని స్పష్టీకరించారు. క్షయ మూలాన దేశానికి ఏటా రూ.20 వేలకోట్ల మేర ఆర్థిక నష్టం వాటిల్లుతోందంటూ ఆయన ఉటంకించిన గణాంకాలు, భీతావహ స్థితిగతుల్ని కళ్లకు కడుతున్నాయి. శరీరాన్ని శుష్కింపజేసి మృత్యుఒడిలోకి నెట్టుకుపోయే క్షయ వ్యాప్తికి అడ్డుకట్ట వేసి, 2030 సంవత్సరం నాటికి ఈ భూమండలమ్మీద దాని ఉనికిని తుడిచిపెట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్షిస్తోంది. అంతకన్నా అయిదేళ్ల ముందే దేశంలో క్షయ నిర్మూలనను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రులందరూ కలిసి రావాలని ప్రధాని మోదీ పిలుపిస్తున్నారు. జాతీయ క్షయ నియంత్రణ కార్యక్రమం పురోగతిని కనీసం ప్రతి మూడు మాసాలకు ఒకసారి సమీక్షించాలనీ ఆయన నిర్దేశిస్తున్నారు. లక్షలాది ప్రాణాల్ని తోడేయడమే కాదు- అసంఖ్యాక కుటుంబాల వెన్ను విరిచి, మనుగడను గుల్లబార్చి, ఎందరో బాలబాలికల్ని అనాథలుగా మారుస్తున్న క్షయవ్యాధి భయానక పర్యవసానాల్ని కేంద్రం ఒక్కటే నియంత్రించగల అవకాశం లేదు. ప్రజా వైద్యసేవా రంగాన టీబీ గుర్తింపు, చికిత్స కోసం సకల సదుపాయాలు ఉన్నాయంటున్నా ఎంతకీ ఆగని మానవ మహా విషాదం- దేశవ్యాప్తంగా క్షయ వ్యతిరేక పోరు సత్వరమే ఏకతాటిపైకి రావాల్సిన ఆవశ్యకతను ఉద్బోధిస్తోంది!

భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఇథియోపియా, నైజీరియా, జింబాబ్వే సహా ముప్ఫై దేశాల్లో క్షయవ్యాధి తీవ్రత అధికంగా ఉంది. విశ్వవ్యాప్త బాధితుల్లో ఏకాయెకి 27 శాతానికి ఇండియా నెలవై కునారిల్లుతోంది. దేశంలో జాతీయ టీబీ నియంత్రణ కార్యక్రమం ఏనాడో అయిదున్నర దశాబ్దాల క్రితం 1962లో ఆరంభమైంది. 'క్షయ ముక్తభారత్'ను ఆవిష్కరింపజేసే జాతీయ వ్యూహ ప్రణాళికలో భాగంగా అనంతర కాలంలో పలు మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. వ్యాధిపీడితుల్ని గుర్తించి, అవసరమైన చికిత్స సూచించి, క్రమం తప్పకుండా మందులు అందించేందుకంటూ తెరపైకి తెచ్చిన 'ప్రత్యక్ష పర్యవేక్షణ చికిత్సా విధానం' ఆశించిన ఫలితాలు అందించలేకపోతోంది. వ్యవస్థాగతమైన అవకతవకలు, నిధులకు కటకట, సిబ్బంది కొరత, మొక్కుబడి చేతన కార్యక్రమాల తంతు... దశాబ్దాల కృషి నీరోడటానికి శాయశక్తులా పుణ్యం కట్టుకుంటున్నాయి. దేశంలో క్షయ కారణంగా ప్రతి మూడు నిమిషాలకు ఇద్దరు ప్రాణాలు కోల్పోతున్నారంటున్న కేంద్రం, ప్రాథమిక దశలోనే రోగ నివారణ కోసం రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక తోడ్పాటు అందిస్తామని అయిదు నెలల క్రితం ప్రకటించింది. వారానికి మూడుసార్లు బదులు ప్రతి రోజూ రోగులకు ఉచిత ఔషధ పంపిణీ, దేశవ్యాప్తంగా క్షయవ్యాధిగ్రస్తులకు నెలవారీ రూ.500 సామాజిక భృతి ప్రదానాలకూ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అవే సరిపోవు. 195 దేశాల్లో వైద్య సేవల అందుబాటు, నాణ్యతలపై నిరుడు వెలుగుచూసిన సూచీ- శ్రీలంక, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌ల కంటే భారత్ తీసికట్టుగా ఉన్నట్లు తెలియజెప్పింది. ఆ అప్రతిష్ఠను రూపుమాపి ఇండియాలో ఆరోగ్య సూచీలను గౌరవప్రద స్థాయికి చేర్చడంలో రాష్ట్రాలన్నీ పోటీపడాలి. అటువంటి స్పర్ధే టీబీ వ్యాప్తినీ అరికట్టగలుగుతుంది!

ప్రపంచం నలుమూలలా ప్రతి రోజూ దాదాపు 29వేలమంది క్షయ వ్యాధి పాలబడుతున్నారు. వెంట్రుకలు, గోళ్లు మినహా ఏ శరీరభాగం పైన అయినా దాడి చేయగల క్షయ అనుదినం విశ్వవ్యాప్తంగా రమారమి అయిదు వేల ప్రాణాల్ని బలిగొంటోంది. మొండి క్షయ కేసుల్లో ఇంచుమించు సగం దాకా భారత్, చైనా, రష్యాల్లోనే నమోదవుతున్నాయి. మద్య ధూమ పానాలు, పొగాకు నమలడం, గుట్కా తినడం వంటి వ్యసనాలున్నవారికి; హెచ్ఐవీ, మధుమేహ బాధితులకు క్షయ సోకే ప్రమాదం అధికం. పోషకాహార లోపాలు, దుర్భర జీవన స్థితిగతులు, భోజన-నిద్రా సమయాల్లో అసాధారణ మార్పులు... వీటివల్లా రోగనిరోధక శక్తి సన్నగిల్లి క్షయలాంటివి రెచ్చిపోతాయని నిపుణులెందరో హెచ్చరిస్తున్నారు. భారత్ సహా ఎన్నో దేశాల్లో బాల్యాన్నీ క్షయ చిదిమేస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం లోగడే ధ్రువీకరించింది. హెచ్ఐవీ, గుండె, మూత్రపిండ బాధితుల్లో చికిత్సకు లొంగని క్షయ కోర సాచి విస్తరిస్తోంది. కేసుల ఉద్ధృతి ఎక్కువగా ఉన్న భారత్‌లో ఆ మధ్య అంతర్జాతీయ బృంద అధ్యయనం దిగ్భ్రాంతకర వాస్తవాల్ని వెలికితీసింది. దేశంలో క్షయ పీడితుల సంఖ్య అంచనాలకన్నా రెండు మూడింతలు అధికమని, ప్రైవేటు ఆస్పత్రుల్లో వ్యాధి గుర్తింపు మందకొడిగా సాగుతున్నందువల్ల తీరని నష్టం వాటిల్లుతోందన్న విశ్లేషణలు- తక్షణ దిద్దుబాటు చర్యల అవసరాన్ని చాటుతున్నాయి. హిమాచల్ ప్రదేశ్ వంటివి 2022 నాటికి క్షయరహితం కావాలని ప్రణాళికలు అల్లుతుండగా, తెలుగునేలపై మెదడు క్షయ వంటివి చాపకింద నీరులా వ్యాపిస్తుండటం తీవ్రంగా ఆందోళన పరచే పరిణామం. అరకొర వైద్యం, అర్ధాంతరంగా చికిత్స మానేయడంవల్ల రాష్ట్రాలవారీగా టీబీకి కోరలు మొలుచుకొస్తున్న ఉదంతాలు లెక్కకు మిక్కిలి. జనంలో మౌలిక అవగాహన పెంపొందింపజేసి- వ్యాధి నిరోధం, నివారణ అనే ద్విముఖ వ్యూహాన్ని అమలుపరచడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ముందడుగేస్తేనే... జనారోగ్య క్షయాన్ని అరికట్టగలిగేది!







ముంగిట్లో ముప్పు... మనిషిదే తప్పు


డాక్టర్ జీవీఎల్ విజయకుమార్

నేడు ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య- వాతావరణ మార్పుల్లో తీవ్ర వైరుధ్యం. భూగోళంపై ఏక కాలంలో వేర్వేరు ప్రాంతాల్లో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. అమెరికా, భారత్‌లోని అనేక ప్రాంతాల్లో హిమపాతం ప్రజలను బెంబేలెత్తిస్తోంది. మరోవైపు మండే ఎండల ధాటికి ఆస్ట్రేలియాలో రోడ్ల మీద తారు కరిగిపోతోంది. ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్‌ను మించిపోయాయి. ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో వేడిమి నమోదయ్యే సహారా ఎడారిలో హిమపాతం కురుస్తోంది. భారత్‌లో ఉత్తరాదిన చలి వణికిస్తుంటే, దక్షిణాదిన సంక్రాంతికి ముందు నుంచే ఎండలు ఉరుముతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. రుతువులు ఏనాడో గతి తప్పాయనడానికి చలికాలంలో మండే ఎండలు, గ్రీష్మంలో కుండపోత వానలు, నిరంతర వేసవి తాపం నిదర్శనాలు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న అనూహ్య వాతావరణ మార్పులకు ప్రధాన కారణం- భూతాపం పెరగడమే. భూతాపం ఇలాగే కొనసాగితే 2050 నాటికి సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పెరుగుతాయని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పుల కట్టడికి ఉద్యమించాల్సిన అవసరం ఉరుముతోంది.

తీవ్ర వైరుధ్యం

వాతావరణ మార్పులు భవిష్యత్తులో ఎలాంటి అనర్థాలకు దారితీస్తాయోనన్న ఆందోళన ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతోంది. అమెరికాలో మంచు తుపాను బీభత్సానికి జనజీవనం అతలాకుతలమైంది. విద్యుత్తు, నీటి సరఫరాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాకపోకలు నిలిచిపోయాయి. ప్రాణ నష్టమూ నమోదైంది. తూర్పు కెనడాలోని అంటారియో, క్యూబెక్ లాంటి నగరాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ 50 డిగ్రీలకు చేరుకున్నాయి. న్యూయార్క్, న్యూజెర్సీ, కనెక్టికట్, మసాచుసెట్స్ తదితర నగరాలను మంచు ముంచెత్తింది. మరోవైపు ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో 79 ఏళ్ల తరవాత తొలిసారి ఇటీవల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు హడలిపోతున్నారు. బయటకు రావడానికే జంకుతున్నారు. సముద్ర తీరాలు, జలాశయాల చెంత సేద తీరుతున్నారు. విక్టోరియా, దక్షిణ ఆస్ట్రేలియాలోని కొన్ని ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు ఆస్తినష్టాలకు కారణమయ్యాయి. ఇక ఆఫ్రికాలోని ఎడారుల్లో హిమపాతానికి రెండు అంగుళాల మేర మంచు పరచుకోవడం ప్రకృతి వైపరీత్యాలకు పరాకాష్ఠ. ఇక ఆసియా విషయానికొస్తే, చైనాలో మంచుతుపానులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. భారత్‌లోని కశ్మీరు లోయలోనూ ఉద్ధృతంగా మంచు గాలులు వీస్తున్నాయి. లడఖ్, కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రివేళల్లో ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. రుతువుల గతి తప్పిన వైనం దక్షిణాదిన ప్రస్ఫుటంగా కనబడుతోంది. హైదరాబాద్‌లో ఎండలు అప్పుడే చురుక్కుమనిపిస్తున్నాయి. సాధారణం కన్నా నాలుగు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు హైదరాబాద్‌లో నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణ మార్పుల వల్ల కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవించడం కొన్నేళ్లుగా చూస్తున్నాం. ఎల్‌నినో ప్రభావంతో నైరుతి, ఈశాన్య

వాతావరణ వైపరీత్యం

రుతుపవనాలు గతి తప్పుతున్నాయని, వానకాలంలో నాలుగు నెలలపాటు కురవాల్సిన వానలు నాలుగు రోజుల్లోనే కురిసే అవకాశముందని పర్యావరణ పరిరక్షణ శిక్షణ- పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) తాజా నివేదిక హెచ్చరిస్తోంది. ఆయా కాలాల్లో వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న ఈపీటీఆర్ఐ తెలంగాణలో సగటు ఉష్ణోగ్రతలు ఎలా పెరుగుతున్నాయో అంచనా వేసింది. ప్రస్తుతం తెలంగాణలో వాతావరణ పరిస్థితుల్లో పెద్దగా ప్రతికూల మార్పులు లేవని, పర్యావరణ పరిస్థితులు క్షీణించిన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పరిస్థితి మెరుగ్గా ఉందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి.

అధికశాతం వాతావరణ మార్పులు, పర్యావరణ క్షీణతకు మానవ తప్పిదాలే కారణమవుతున్నాయన్నది కఠోర వాస్తవం. హరితగృహ వాయువుల ఉద్గారం పెరుగుతున్నకొద్దీ వాతావరణంలో మార్పులు తీవ్రమవుతున్నాయి. 20వ శతాబ్దంలో భూగోళం ఉపరితల ఉష్ణోగ్రతలు సగటున 0.6 డిగ్రీల మేరకు పెరగ్గా, గడచిన శతాబ్దంలోనే భూతాపం 0.4 డిగ్రీల నుంచి 0.8 డిగ్రీల మేర అధికమైంది. అడ్డూ ఆపూ లేకుండా శిలాజ ఇంధనాలను మండించడం, అడ్డగోలుగా అడవుల నరికివేత, భూవినియోగ పద్ధతుల్లో మార్పులు అందుకు ప్రధాన కారణాలు. వాణిజ్య, గృహనిర్మాణం, పరిశ్రమలు తదితర ప్రయోజనాలకు సేద్య, అటవీ భూములను వినియోగించడం వల్ల గడచిన 50 ఏళ్లలో భూతాపం గణనీయంగా పెరిగింది. తొంభయ్యో దశకం నుంచే ప్రపంచవ్యాప్తంగా సుమారు 12.9 కోట్ల హెక్టార్ల విస్తీర్ణంలోని అటవీ భూములు కనుమరుగైనట్లు అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని దాదాపు 90 కోట్ల మంది ప్రజలు తమ దైనందిన జీవనావసరాల కోసం అడవులపైనే ఆధారపడుతున్నారు. 66.3 కోట్ల మంది మంచినీటి సౌకర్యం అందుబాటులో లేక అలమటిస్తున్నారు. 2003-13 మధ్య పదేళ్ల వ్యవధిలో ప్రకృతి విపత్తుల కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 వేలకోట్ల డాలర్ల మేర ఆస్తినష్టం సంభవించింది.

ఉద్యమస్ఫూర్తితో ముందడుగు

1990వ దశకం ముందునాటి పరిస్థితులతో పోలిస్తే, ప్రస్తుతం కర్బన ఉద్గారాలు 50 శాతం పెరిగాయి. పర్యావరణ క్షీణత వల్ల పెచ్చరిల్లుతున్న వాతావరణ దుష్ప్రభావాలు అంతిమంగా మానవ భద్రతనే ప్రమాదంలో పడేస్తున్నాయి. నేలల్లో తేమ శాతం తగ్గి, పంటల ఉత్పాదకతలో మార్పులు ఏర్పడుతున్నాయి. సముద్ర పవనాల దిశ, ఉద్ధృతిలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ధ్రువప్రాంతాల్లోని మంచు వేగంగా కరుగుతుండటంవల్ల సముద్రమట్టాలు పెరుగుతున్నాయి. దీనివల్ల తీరప్రాంత నగరాలు, పట్టణాలు కోతకు, ముంపునకు గురవుతున్నాయి. వాతావరణ మార్పులు ఆమ్ల వర్షాలను కురిపిస్తున్నాయి. అవి జలవనరులను హరిస్తున్నాయి. ఓజోన్ పొర క్షీణించి సూర్యరశ్మిలోని ప్రమాదకర అతినీలలోహిత కిరణాలు సరాసరి జీవులను తాకి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ వైపరీత్యాలు పర్యావరణ పరిరక్షణ ఉద్యమస్థాయిలో నడుం బిగించాల్సిన ఆవశ్యకతను చాటిచెబుతోంది. వాతావరణ మార్పుల ప్రభావాలను సానుకూలంగా మలచుకోవాలంటే మొదటగా సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రాధాన్యానికి విస్తృత ప్రాచుర్యం కల్పించాలి. ప్రపంచవ్యాప్తంగా పవనశక్తికి అపారమైన వనరులున్నాయి. సౌర వికిరణాన్ని ఒడిసిపట్టుకున్నట్లయితే బొగ్గు ఆధారిత విద్యుత్తుకు ప్రత్యామ్నాయ శక్తి వనరులను సృష్టించుకోవచ్చు. జీవ ఇంధనం, సహజవాయు ఆధార వాహనాలను వినియోగించడం ద్వారా భూతాపానికి అడ్డుకట్ట వేయవచ్చు. ఉభయ తెలుగు రాష్ట్రప్రభుత్వాలు చేపడుతున్న హరితహారం, చెట్టు-నీరు, మిషన్ కాకతీయ వంటి సహజసిద్ధమైన పర్యావరణ సంరక్షణ చర్యలను స్ఫూర్తిగా తీసుకుని దేశమంతటా అమలుచేయడం ద్వారా అడవులను, జలవనరులను పునరుద్ధరించుకోవచ్చు. తద్వారా పర్యావరణ పరిరక్షణ, కొంతమేరకైనా సాధ్యపడుతుంది. దీంతో పరస్పర విరుద్ధమైన వాతావరణ మార్పులను నిర్మూలించవచ్చు. అదుపుతప్పిన రుతుచక్రాన్ని సరైన మార్గంలో నడిపించవచ్చు!



నీటిబొట్టు కూడా దొరకని సహారా ఎడారి ఐన్‌సెఫ్రా ప్రాంతంలో ఇటీవల ఆకస్మికంగా హిమపాతం కురిసి రెండు అంగుళాల మేర మంచు గడ్డలు పేరుకుపోవడం ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. గత 40 ఏళ్లలో సహారా ఎడారిలో మంచు కురవడం కేవలం మూడోసారి. గతంలో ఎన్నడూ ఇంతగా మంచు పరచుకోలేదు. ఇవన్నీ తీవ్ర వాతావరణ మార్పులకు దృష్టాంతాలేనని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఐరోపా ఖండం నుంచి చల్లటి గాలులు ఉత్తర ఆఫ్రికా ప్రాంతానికి ప్రయాణించి అక్కడ హిమపాతానికి కారణమవుతున్నాయని, ఐరోపాతో ఆగిపోకుండా అధిక పీడనం వల్ల శీతల పవనాలు ఆఫ్రికా దాకా వచ్చాయని తెలుస్తోంది. ఆఫ్రికాలోని టాంజానియా, మొరాకోలోని అట్లాస్ పర్వత ప్రాంతం వంటిచోట్ల ఏటా కొన్ని రోజులపాటు మంచు కురవడం సర్వసాధారణం. అయినప్పటికీ మంచు ఊసే ఎరుగని అల్జీరియాలోని ఐన్‌సెఫ్రాలో మంచుకురవడం ఆలోచింపజేస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో సహారా ఎడారి మళ్ళీ పచ్చగా మారబోతోందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. 5,500 ఏళ్ల క్రితం సహారా ఎడారి పచ్చటి చెట్లతో కళకళలాడుతూ ఉండేది. వాతావరణ మార్పుల ఫలితంగానే అది ఎడారిగా మారిపోయింది. మరో 15 వేల సంవత్సరాల తరవాత సహారా హరితమయంగా మారుతుందన్న శాస్త్రవేత్తల అంచనాకు తాజా హిమపాతం బలాన్నిస్తోంది.

హృదయ నాదం... సమర నినాదం

'నేత' అనేది ప్రస్తుతం ఓ పడికట్టు పదంగా మారింది. చిన్నా పెద్దా తేడా లేకుండా, నాయకుడు అని పిలిపించుకొనేవారికి పర్యాయంగా తయారైంది. సరైన వ్యూహరచన, సమర్థ కార్యాచరణలే నాయకత్వ లక్షణాలని భావించినపుడు 'నేతాజీ' అనే పిలుపు సుభాష్ చంద్రబోస్‌కే అన్నివిధాలా వర్తిస్తుంది. భారత గణతంత్ర దినోత్సవం సమీపిస్తున్న తరుణమిది. అంతకుముందే నేడు ఆయన జయంతి వేళ- నూట ఇరవై ఏళ్లనాటి ఆ పుట్టుకను, 75 సంవత్సరాల క్రితం స్థాపితమైన 'భారత జాతీయ సేన'ను దేశమంతా గుర్తుచేసుకుంటోంది. ఒడిశాలో పుట్టి, పశ్చిమ్ బంగలో కళాశాల విద్య అభ్యసించి, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో నైతిక శాస్త్రవిజ్ఞాన రంగ పరిశోధన సాగించిన బోస్- ఆ తరవాత ఇండియాకు సంబంధించి సివిల్ సర్వీసు స్థాయి పరీక్షల్లో ఉన్నత ర్యాంకును సొంతం చేసుకున్నారు. అంతటి అధికార హోదానూ తృణప్రాయంగా వీడి, స్వదేశానికి స్వాతంత్ర్య సాధన కోసం పోరుబాటను ఎంచుకున్నప్పుడు ఆయన వయసు పాతికేళ్లు! నాటి పరపాలకుల వెన్నులో అణువణువునా వణుకు పుట్టించిన ఆ పోరాట యోధుడు ఇరవై ఏళ్ల వ్యవధిలో పన్నెండుమార్లు దేశవిదేశాల్లో జైళ్లపాలయ్యారు. ఆ సమయంలోనే మదిలో మెదిలిన 'ఆజాద్ హింద్ ఫౌజ్' నిర్మాణ యోచనకు సాకారమిచ్చిన తీరు, సమగ్ర దృక్పథానికి అద్దం పడుతుంది.

విలక్షణ నిర్వహణ

అది రెండో ప్రపంచ యుద్ధకాలం. భారత్ సర్వస్వతంత్రమయ్యేలా ఆంగ్ల పాలకులపై విశ్వవ్యాప్త ఒత్తిడి పెంచాలన్నదే నేతాజీ ప్రణాళిక. దాని ఆచరణలో భాగంగానే, పలు దేశాల్లో రహస్య పర్యటనలూ సాగించారు. రష్యా, జపాన్, జర్మనీ, ఇటలీలతో పాటు అఫ్గానిస్థాన్, సింగపూర్, మయన్మార్, మలేసియా వంటి చిన్నదేశాల్లోనూ వివిధ వర్గాలవారిని కలిసి మంతనాలు జరిపారు. తనదైన లక్ష్యాన్ని నిర్ణీత కాలంలో సాధించేందుకు ఆయన విశ్వసించిన, ప్రచారం చేసిన రాజకీయ భావాలు తొలి నుంచీ విభిన్నంగానే ఉండేవి. కొన్ని దేశాల పట్ల నేతాజీ అనుసరించిన మిత్రవైఖరి సైతం ఇంటాబయటా విస్తృత చర్చలకు దారితీసింది. ఎవరు ఏమనుకున్నా, ఎందరు ఎన్ని రకాలుగా వ్యవహరించినా- ఆయనది ముక్కుసూటి స్వభావం. భారత్‌కు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కావాలి. అలా అని, అవి ఎవరో దయతలచి ఇస్తే తీసుకొనేవి కావు. పరాధీనత భరించలేని తత్వాన్ని, విముక్తి పొంది తీరాలన్న తపన నరనరానా నిండిన జాతిని ఎన్ని శృంఖలాలైనా ఏమీ చేయలేవు. కారణాలేవైనా పెత్తందార్లు రెచ్చిపోతే, సమయ సందర్భాలు అనుసరించి పీడితులు ఆయుధాలు చేపట్టకా తప్పదు. ఆ ఉమ్మడి పోరును ఎప్పుడు ఎలా ప్రారంభించాలో, ఎంత కాలం కొనసాగించాలో ఐఎన్ఏ నేతగా నిర్ణయించడం ఆయనకే చెల్లింది. సేనావాహినిని ఆయన నడిపించిన విధానమే అన్నింటికన్నా విలక్షణం.



'ముల్లును ముల్లుతోనే తీయాలి' అని నమ్మిన ఆయన కోల్‌కతాలో 'దేశబంధు' చిత్తరంజన్ దాస్ అండదండలు పొందగలిగారు. అరాచకం తాండవిస్తున్న చోట- విదేశీ రాజులు, యువరాజుల వినోద విహార పర్యటనలేమిటని ఉభయులూ నిరసన గళమెత్తారు. అందుకు నేతాజీకి లభించిన ప్రతిఫలం- నెలల తరబడి కారాగార వాసం! ఉగ్రవాదిగా ముద్రపడి అలీపూర్ జైలు పాలైనప్పుడు, అనంతర పరిణామాల్లో మాండలే (అప్పటి బర్మా) కారాగారానికి తరలినప్పుడు ఆయన పట్టుదల విశ్వరూపం ధరించింది. నానారకాల నిర్బంధాలు ఆయనలో స్వేచ్ఛా పిపాసను అగ్గిలా భగ్గుమనిపించాయి. అనేక అనుభవాల పర్యవసానంగానే, బెర్లిన్ (జర్మనీ) కేంద్రంగా 'స్వేచ్ఛా భారత కేంద్రం' స్థాపించారు. అదే సందర్భంలో ఆప్తమిత్రులుగా మారిన కొందరు వ్యూహచతురుల్ని, తదుపరి కొన్ని నెలలకే భారతీయ కమాండో దళ శిక్షకులుగా నియమించారు. ఆయన సహచరులు, అనుచరులకు రేడియో ప్రసారాల ద్వారా సూచనలు, ఆదేశాలు అందేవి. వాటిని వివిధ భాషల్లోకి అనువదించి చెప్పడంలోనూ, విభిన్న వర్గాల మిత్రుల సేవల్ని పూర్తిగా వినియోగించుకున్నారు. ఐఎన్ఏ కేవలం రాజకీయ పోరాట దళం కాదు. సాయుధ కార్యకలాపాలకే పరిమితమైన సంస్థ అంతకన్నా కాదు. అది వికాస సాధక వ్యవస్థ. దేశమంతటా స్వాతంత్ర్య అనురక్తిని పెంచి పోషించి విస్తృతపరచే క్రియాశీలతే దానికి ప్రాణాధారం. వ్యక్తిగతంగా, సామూహికంగా సంపూర్ణ అవగాహన కలిగించడం ద్వారా సేనలో స్ఫూర్తి వెలుగులీనింది. సింగపూర్ స్థావరంగా అది సమగ్రత సంతరించుకుంది. ఐఎన్ఏలో దేశభక్తి ప్రేరిత యువతతో పాటు- ఒకప్పటి యుద్ధ ఖైదీలు, తోటల్లో శ్రమించిన కష్టజీవులు, ఇతరులూ ఉండేవారు. ఆ కాలంలో, సైనిక వీరుల నోటి నుంచి వెలువడిన మాట 'జైహింద్'. నాడే కాదు- నేడు కూడా అదొక మహా నినాదం. భారత స్వాతంత్ర్య, దేశభక్తి సాహిత్య ఉద్యమ చరిత్రల్లోనూ జాతీయ సేనది ఓ సువర్ణ అధ్యాయం. అప్పటి ఆ రణన్నినాదమే ఇప్పటికీ జనహృదయ నాదంగా వినిపిస్తోంది.

భారత జాతీయ సేన లక్ష్యాలు



- ఇండియాను ఆంగ్ల పాలకుల కబంధ హస్తాల నుంచి విముక్తం చేయడమే- జాతీయవాద యువజనులతో రూపొందిన 'ఆజాద్ హింద్ ఫౌజ్' ప్రధాన ధ్యేయం.
- లక్ష్యసాధనకు అనువుగా జపాన్ వంటి ఇతర దేశాల సహాయ సహకారాలు స్వీకరించడం.
- 'రక్తమివ్వండి, స్వేచ్ఛనిస్తాం' అంటూ భారత యువతలో సరికొత్త శక్తి నింపి, రణ స్ఫూర్తి రగిలించడం.
- ఝాన్సీ రెజిమెంట్ పేరిట స్వచ్ఛందంగా మహిళా విభాగాల్ని నెలకొల్పడంతో పాటు, సేనకు అవసరమైన వైద్య సేవలు అందించడం.

ప్రతి వ్యక్తీ సైనిక శక్తి

'దేశంలోని ప్రతి పౌరుడూ సైనికుడే! అతడిలో ఉప్పొంగే రక్తం ఉండాలి. సమస్యల్ని అధిగమించాలన్న గట్టి పట్టుదలతో, తోటివారినీ ముందుకు నడిపించాలి' అనేవారు నేతాజీ. విధి నిర్వహణపై శ్రద్ధ, విశ్వసనీయతను కలకాలం నిలబెట్టుకొనే ప్రవృత్తి, ఎంతటి త్యాగానికైనా వెనుదీయని సహజ స్వభావమే వ్యక్తిని శక్తిగా మారుస్తాయన్నది ఆయన ఆదర్శం. దాన్ని ఐఎన్ఏ రూపంలో ఆవిష్కరించిన తీరు- సుభాష్ చంద్రబోస్ నేతృత్వానికి, సమున్నత వ్యక్తిత్వానికి నిలువుటద్దం. ఎప్పుడైనా ఓటమి ఎదురైతే, అది తాత్కాలికమనే భావించాలి తప్ప కుంగిపోవడం మరెన్నో అనర్థాలకు దారితీస్తుందని తన సైన్యానికి ఉద్బోధించేవారు. బానిస భావాలు, ఆధిపత్యానికి బాజాలు మోగించడాలు వ్యవస్థకు హాని చేస్తాయన్న నేతాజీ నాటి పలుకు నేడు కొందరికి ముల్లుకైనా- అది అక్షర సత్యం, జాతికి అదే శిరోధార్యం!

— శరత్

గురుత్రయం

భారతీయ సంస్కృతిలో గురువుకు విశేష ప్రాధాన్యముంది. 'గురు' శబ్దానికి ఆధ్యాత్మిక అర్థాలతో కూడిన అనేక వివరణలు కనిపిస్తాయి. ఎవరెవరు గురువులో 'గురుచరిత్ర' చక్కగా తెలియజెబుతుంది. తొలిగురువు తల్లి అయితే మలిగురువు తండ్రి అవుతాడు. తల్లిభాషకు గురువు తల్లే! ప్రాథమిక, ద్వితీయ కక్ష్యలు దాటాక మనిషికి మూడో గురువు దర్శనమవుతుంది. ఎవరు జ్ఞాన ప్రదాతలో వారే సద్గురువులు.


జ్ఞానం వికసిస్తున్నప్పుడు, అనేక ఆధ్యాత్మిక సత్యాలు అవగతమవుతుంటాయి. వాటిలో ముఖ్యమైనది సకల జగజ్జనని అయిన పరాశక్తిని మాతృరూపిణిగా గుర్తించడం. అమ్మను అర్థం చేసుకుంటే, పరాశక్తి అర్థమవుతుంది. కంటికి కనిపించే కన్నతల్లిలో పరాశక్తి కొలువుంటుంది. తల్లికి చేసే సేవలన్నింటినీ ప్రేమతో, ప్రియభావనతో ఆ పరాశక్తే స్వీకరిస్తుంది. ఈ సత్యం తెలియనివారు పరాశక్తిని ఏ ఇతర రూపాల్లో ఆరాధించినా, అనుగ్రహం లభించదు. సొంత తల్లిని వేధించి, బాధించి, నిర్లక్ష్యం చేసేవారి పట్ల పరాశక్తి ఆగ్రహం నిండిన రక్త నేత్రాలతో చూస్తుందంటారు జ్ఞానులు.

తొలి గురువైన తల్లిలోనే, ఆ మాతృమూర్తి సేవలోనే జ్ఞానం భిక్షగా లభిస్తుంది. తల్లి ప్రేమామృతాన్ని పంచి ఇచ్చినట్లే, పరాశక్తి సకల ప్రాణులకూ ప్రేమామృతాన్ని వారివారి మాతృమూర్తుల రూపంలో పంచుతుంది. ఇదే భిక్షగా లభించే జ్ఞానం!

తల్లిని మించిన దైవం లేదు. గాయత్రిని మించిన మంత్రం లభించదు. గురువును మించిన మహాత్ముడు కానరాడు. గురువు పాత్ర అమోఘమైనది. శిలలోని ఒక్కొక్క భాగాన్ని తొలగిస్తూ, శిల్పి చివరకు దేవతాశిల్పాన్ని రూపొందిస్తాడు. గురువు సైతం తన శిష్యుడి దోషాల్ని ఒక్కొక్కటిగా తొలగిస్తూ, ఆత్మ సంస్కారాన్ని పెంపొందిస్తూ, చివరకు 'సోహం' అనే అద్వైత భావనకు బాట వేస్తాడు.

మాతృభిక్షగా జన్మ సంస్కారం లభిస్తుంది. పితృభిక్షగా నడవడి, గురుభిక్షగా ఆత్మ సంస్కారాలు లభిస్తాయి. ఈ క్రమంలో సాధకుడు ఎక్కడా తప్పటడుగులు వేయకూడదు. ప్రతి అడుగులోనూ విశ్వాసం, క్రమశిక్షణ, కృషి, వినయ విధేయతలు, నిజాయతీ, జిజ్ఞాస, సహనం వంటివి తోడుగా నిలుస్తాయి. అంకిత భావంతో, లక్ష్యం మీద చెదరని దృష్టితో చేసే కృషికి సత్ఫలితాలు తప్పక లభిస్తాయి.

గురుసేవ అంటే భౌతిక సేవ కాదు. ఆయన అనుగ్రహం అంటే, అన్న పానాదులు ఇవ్వడం కాదు.



అంతర్యామి

అవి రెండూ జ్ఞాన సంబంధంగా ఉండాలి. ఈ ప్రపంచంలోకి 'నేను' అనే ఈ దేహం వచ్చిన కారణం ఏమిటో తెలుసుకోవాలి. జన్మకు ఒక కారణం తప్పక ఉంటుంది. మానవజన్మకు జ్ఞాన సముపార్జన, మోక్ష సాధన కారణాలు. దీన్ని అర్థం చేసుకోవడానికి త్రయీమూర్తి అయిన సద్గురువు అనుగ్రహం అవసరం. అది లభించాలీ అంటే, సమయాన్ని ఎంతమాత్రమూ వృథా చేయకుండా సాధనలో నిమగ్నం కావాలి. బాల్యం నుంచే సాధన ఉండాలంటే, తల్లిదండ్రుల శిక్షణ లభించాలి.

పిల్లల్ని చదువులో ఘనులుగా చేయడానికి పెద్దలు ప్రయత్నిస్తారు. అన్నంలో నెయ్యి వడ్డించి రుచిని, బలాన్ని పెంచుతారు. అదే విధంగా వారు తమ సంతానానికి సద్బోధలు చేసి, సద్గురు ఆశ్రయానికి అర్హులుగా చేయాలి. సుందరీతాపనీ ఉపనిషత్తు 'గు' అంటే చీకటి (అజ్ఞానం) 'రు' అంటే తొలగించేవాడు- అని బోధించింది. అజ్ఞాన తిమిరం తొలగించి, సుజ్ఞాన వెలుగులు పంచేవాడే సద్గురువు.

సాధన 'గురుత్రయం'తో ప్రారంభమై 'మహాగురు పాదుకాంతం'తో పూర్తవుతుంది. సాధకుడు తన గురువు పాదాలలోనే సమస్తాన్నీ దర్శించడం 'మహాగురు పాదుకాంతం'. గురువును మార్గం, ఆధారం, లక్ష్యంగా స్వీకరించాలి. అతడే సద్గురువు అనుగ్రహానికి పాత్రుడవుతాడు. 'జగద్గురువు అంటే జగత్తుకు నేను గురువు అని కాదు. నాకు ఈ జగత్తు అంతా గురువు' అనేవారు పరమాచార్య చంద్రశేఖర సరస్వతి. అందుకే ఆయనను సద్గురువు, నడిచే దేవుడుగా భక్తులు భావిస్తారు.

— పిల్లలమర్రి చిన వేంకట సత్యనారాయణ



పోలమాంబ అమ్మవారు

శంబర పోలమాంబ ఉత్సవం ప్రారంభం

బొబ్బిలి/మక్కువ, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా మక్కువ మండలంలోని శంబర పోలమాంబ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిపూజలు ఆయన తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. సిరిమానోత్సవం నేడు అంగరంగ వైభవంగా జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల తరువాత సిరిమాను పురవీధుల్లో ఊరేగనుంది. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఒడిశా ముఖద్వారంలో శంబర గ్రామం ఉండటంతో పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. 24వ తేదీతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ఆన్‌లైన్‌లో 'ప్రవేశ పరీక్షల ధ్రువీకరణ పత్రాల' పరిశీలన!

ఈనాడు, అమరావతి: ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్) ధ్రువీకరణ పత్రాల పరిశీలనను ఆన్‌లైన్‌లో నిర్వహించే విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు ఉన్నత విద్యా మండలి కసరత్తు చేస్తోంది. ఎంసెట్‌తోపాటు ఎనిమిది ఉమ్మడి ప్రవేశ పరీక్షలను ఈ ఏడాది నిర్వహించనుంది. గతంలో హెల్ప్‌లైన్ కేంద్రాల ద్వారా విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించేవారు. విద్యార్థులంతా ఈ కేంద్రాల వద్దకు పత్రాల పరిశీలనకు హాజరుకావాల్సి వచ్చేది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అందుకోసమే కేంద్రాల నిర్వహణ, స్లైడింగ్ కోట్లలో వేయం చేయాల్సి వస్తోంది. ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చే అంశంపై సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దీనికి సాంకేతిక సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి రావత్, మీ-సేవ, జ్ఞానభూమి పోర్టల్, పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల విభాగం అధికారులు హాజరయ్యారు. విద్యార్థి స్థానికత, ఆదాయం, కుల, చదువు ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం దరఖాస్తు సమయంలోనే మొత్తం సమాచారాన్ని సేకరించాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ విధానంతో ఎలాంటి ఇబ్బంది ఉండదని అభిప్రాయానికి అధికారులు వచ్చారు.

డిగ్రీ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల నవీకరణ ఉత్తర్వులు

ఈనాడు అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 722 మంది అర్హులైన ఒప్పంద అధ్యాపకులను రెన్యువల్ చేస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ ఉత్తర్వులిచ్చారని రిజిస్ట్రర్డు ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఒబిలిరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీమేరకు ఒప్పంద అధ్యాపకులందరినీ రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు.

'కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణను విడుదల చేయాలి'

ఈనాడు, హైదరాబాద్: పోలీసులు సోమవారం తెనాలి, గుంటూరుల్లో అదుపులోకి తీసుకున్న..కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, సీపీఎం నాయకుడు పాశం రామారావు, కేవీపీఎస్ కార్యదర్శి మాల్యాద్రిలను భేషరతుగా విడుదల చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 24వ తేదీన తలపెట్టిన 'చలో పెదగొట్టిపాడు' కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు.

గ్రూపు-I (2011) మౌఖిక పరీక్షలు ప్రారంభం

ఈనాడు, అమరావతి: గ్రూపు-1 (2011) మౌఖిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అభ్యర్థులకు ఒకే బోర్డు ద్వారా మౌఖిక పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల్లో ప్రధానంగా అభ్యర్థుల వ్యక్తిత్వం, విపత్కర పరిస్థితుల్లో నిర్ణయాన్ని తీసుకునే సామర్థ్యం ఉందా? నాయకత్వ లక్షణాలు ఎలా ఉన్నాయి? సమయస్ఫూర్తితో ఆదర్శంగా ఉండగలరా? లేదా? తదితర అంశాలపై అభ్యర్థుల సామర్థ్యాన్ని ప్రశ్నల ద్వారా బోర్డు పరిశీలించినట్లు సమాచారం.

డాక్టర్‌కు తక్కువ.. ఫార్మసిస్ట్‌కు ఎక్కువ!

- దేనికీ చెందని 'ఫార్మా-డి' కోర్సు
- ప్రభుత్వ పరంగానూ గుర్తింపు శూన్యం
- అవకాశాలు లేక తల్లడిల్లుతున్న విద్యార్థులు

ఈనాడు – అమరావతి

నూతన కోర్సును ప్రారంభించే సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం తప్పనిసరి. డిగ్రీ పట్టాల్ని ప్రదానంచేసే విశ్వవిద్యాలయాలూ బాధ్యత తీసుకోవాలి. ఎవరికీ వారు మిన్నకుంటే పట్టాలను చేతపట్టిన విద్యార్థులు రోడ్డున పడటం ఖాయం. సరిగ్గా 'ఫార్మా డీ' విషయంలో ప్రస్తుతం ఇదే జరుగుతోంది. విద్యార్థులు తమ పట్టాలకు గుర్తింపునిచ్చి ఉద్యోగాలు కల్పించాలని అర్థిస్తున్నారు. గత నెలలో వీరు తిరుపతిలో ఆందోళన చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ గతంలో ఇచ్చిన హామీలో భాగంగా మంగళవారం ఆయనతో సమావేశం కానున్నారు.

బీఫార్మసీ చేసిన వారికే నయం

వాస్తవానికి.. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతినిచ్చిన మేరకు ఆరేళ్ల ఫార్మా-డి కోర్సును పూర్తిచేసిన వారి చదువుకు తగినట్లు ప్రభుత్వంలో ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ పరంగానూ ఇంకా గుర్తింపు లేదు. నాలుగేళ్ల బీఫార్మసీ చేసిన వారికి ఉన్న గుర్తింపు ఫార్మా-డి చేసిన వారికి లేకపోవడం గమనార్హం.

ఈ కోర్సుతో ఎవరికి లాభం..

కొన్ని కళాశాలల యాజమాన్యాలు కొత్త కోర్సులు అమల్లోకి వస్తే బాగా లాభాలను దండుకోవచ్చునన్న ఉద్దేశంతో 'ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా'లో పలుకుబడిని ఈ కోర్సును ప్రారంభించేలా 'ప్రభావితం' చేశారని ఆరోపణలున్నాయి. దీనికి అనుగుణంగా ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లోనే అంతర్గతంగా ఈ కోర్సు నిర్వహణలోకి వచ్చింది. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి విదేశాల్లో మంచి ఉన్నత అవకాశాలు ఉన్నాయని కళాశాలల యాజమాన్యాలు ఊదరగొట్టాయి. ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ జరగడం, విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాల్లో తరగతులు, పరీక్షలు జరగడంతో విద్యార్థులు తల్లిదండ్రులు లక్షలుపోసి చేర్పించారు.

ఎవరికీ వెండక..

'ఫార్మా డి' కోర్సు గురించి వైద్య విద్య సంచాలక కార్యాలయాన్ని సంప్రదిస్తే బోధనాసుపత్రుల్లో వీరి సేవలు అవసరం లేదని పేర్కొన్నాయి. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వారిని సంప్రదిస్తే.. ఎంసెట్ ద్వారా జరిగే ప్రవేశాలకు మాకు సంబంధం ఉండదు కదా! అని వ్యాఖ్యానించాయి. అదే ఫార్మా డీ విద్యార్థి ఫార్మసిస్టు ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే 'మీది ఉన్నత స్థాయి చదువు. ఈ ఉద్యోగానికి అనర్హులు. దీనిపై మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదని' చెబుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వీరి పేర్లు మాత్రం రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌లో నమోదు చేసుకుంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సీనియర్ అధికారి ఒకరు దీనిపై స్పందిస్తూ "అమెరికాలో ఉన్నట్లు క్లినికల్ ఫార్మసిస్టులకు ఉద్యోగావకాశాలు ఇక్కడ లేవు. ఈ కోర్సు పూర్తిగా విదేశాలకు చెందినదని" పేర్కొనడం గమనార్హం.

డీజిల్ వాతలతో చక్రం తిరగట్లేదు

- భారమైన రవాణా శాఖ జరిమానాలు
- నెరవేరని ప్రభుత్వ హామీలు
- ఆందోళన దిశగా లారీ యజమానులు

ఈనాడు, అమరావతి: ఓ వైపు డీజిల్ ధరలు... జీఎస్టీ వాతలు... మరోవైపు ప్రభుత్వ రుసుములు, జరిమానాలతో రవాణా రంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వీటికి తోడు తెలుగు రాష్ట్రాల మధ్య పర్మిట్ల అంశం కొలిక్కి తెచ్చేందుకు సర్కార్ చొరవ చూపకపోవడం ఇబ్బందికరంగా మారింది. గతేడాది ఏప్రిల్ సమ్మె చేసిన సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలేవీ అమలు కాకపోవడంతో లారీ యజమానులు మరోసారి ఆందోళన చేపట్టే యోచనలో ఉన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ సర్కార్‌కు ఆదాయ వనరుగా ఉన్న రవాణా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి దృష్టి కేంద్రీకరించడం లేదని లారీ యజమానులు ఆరోపిస్తున్నారు. డీజిల్ ధరలపై ఉన్న వ్యాట్‌ను తగ్గించాలని ఎప్పటి నుంచో ట్రాన్స్‌పోర్టర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో రెండేళ్ల కిందటే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించగా రూ.2 తగ్గించాలని సూచన చేసినా అమలుకు నోచుకోలేదు. డీజిల్ ధర లీటర్ ఒక్కింటికి పొరుగు రాష్ట్రాలతో పోల్చుకొంటే రాష్ట్రంలో రూ.5 నుంచి రూ.8 ఎక్కువగా ఉంది. ఇక్కడ ఉన్న పన్నుల మూలంగా వాహన యజమానులు నష్టపోతున్నారని ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు వాపోతున్నారు. వాహన సామర్థ్య పరీక్షల నుంచి పర్మిట్ల జారీ, లైసెన్స్ రుసుముల వరకూ అన్నింటా రవాణా శాఖ నుంచి ఎలాంటి ప్రోత్సాహకర వాతావరణం లేదని ఆరోపించారు. రుసుములు కూడా భారంగా మారాయని తెలిపారు. ఏపీ, తెలంగాణల మధ్య కౌంటర్ పర్మిట్ జారీ చేయకపోవడం మూలంగా ఏడాదికి రూ.60 వేలు చెల్లించాల్సి వస్తోందనీ, ఈ రుసుము తగ్గించాలని డిమాండ్ చేశామనీ, వీటిని తగ్గిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి 8 నెలలైనా అమలు కాలేదని తెలిపారు. రవాణా శాఖ మంత్రి, సంబంధిత అధికారులకు ఈ డిమాండ్ల గురించి తెలియజేసినా సానుకూల స్పందన రాకపోవడంతో మరోసారి ఆందోళనబాట పట్టాలని భావిస్తున్నారు. ఏపీ లారీ యజమానుల సంఘం త్వరలోనే దీనిపై ఓ ప్రకటన విడుదల చేయనుంది.

బియ్యం రీసైక్లింగ్‌పై కఠిన చర్యలు: సీఎస్

ఈనాడు–అమరావతి: ధాన్యం సేకరణ కేంద్రాలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ ఆదేశించారు. అవి రైస్‌మిల్లర్లు, దళారుల నిలయంగా మారకుండా చూడాలని పేర్కొన్నారు. రేషన్ బియ్యాన్ని రైస్‌మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైస్‌మిల్లుల్లో రెండు నెలల విద్యుత్తు వినియోగం లెక్కలు తీయాలని ఆదేశించారు. వ్యవసాయాభివృద్ధి, నీరు-ప్రగతిపై సోమవారం కలెక్టర్లు, శాఖాధిపతులు, కార్యదర్శులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి దావోస్ పర్యటనకు వెళ్లే సమయంలో కూడా ధాన్యం సేకరణపై సమీక్షించి మార్గదర్శకాలు ఇచ్చారని గుర్తు చేశారు. సహజ వనరుల నిర్వహణ (ఎన్ఆర్ఎం) అమలుపై దినేశ్‌కుమార్ అసంతృప్తి వెలిబుచ్చారు. గుంటూరు, కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో 50శాతంలోపు మాత్రమే జరగడాన్ని గుర్తు చేశారు. తమకు ఎక్కువ లక్ష్యం విధించారని కొందరు వివరించగా జిల్లాకు తగ్గట్టుగానే ఉంటుందని అన్నారు. రబీ పంటరుణాల పంపిణీ సక్రమంగా లేదని పేర్కొన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కౌలు రైతులకు ఎక్కువ సంఖ్యలో రుణాలిప్పించాలని ఆదేశించారు. ఉద్యానరంగంలో సూక్ష్మసేద్యం పథకాన్ని వేగంగా అమలుచేయాలని ఆదేశించారు.



విరాళం డీడీని జేఈవో శ్రీనివాసరాజుకు అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, కుటుంబసభ్యులు

శ్రీవారి ఆలయంలో ముడుచుకునే పైకప్పునకు రూ.కోటి విరాళం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులు ఎండకు, వర్షానికి ఇబ్బంది పడకుండా ముడుచుకునే పైకప్పు ఏర్పాటుచేసేందుకు.. నెల్లూరుకు చెందిన పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.1.09 కోట్ల విరాళం ప్రకటించారు. తొలిదశ పనుల నిమిత్తం రూ.55లక్షల డీడీని సోమవారం తిరుపతిలో జేఈవో శ్రీనివాసరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ శ్రీవారి ఆలయంలో ఏర్పాటు చేస్తున్న ముడుచుకునే పైకప్పునకు అయ్యే వ్యయాన్ని పీపీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత ప్రభాకర్‌రెడ్డి విరాళంగా అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చర్యలు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష, నియామక పరీక్ష-2014 ప్రశ్నపత్రాలు, తుది జవాబుల 'కీ' విడుదలలో చోటుచేసుకున్న అవకతవకలకు సంబంధించి వచ్చిన అభియోగాలపై అప్పటి ఎస్‌సీఈఆర్టీ ఇన్‌ఛార్జి సంచాలకురాలు లక్ష్మి; ఇన్‌ఛార్జి, సమన్వయ అధికారి వనజాక్షిపై చర్యలను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

ముగ్గురు రైతుల ఆత్మహత్యాయత్నం

- గుంటూరు జిల్లాపరిషత్, చిత్తూరు, శ్రీకాకుళం కలెక్టరేట్లలో ఘటనలు
- చిత్తూరులో కుటుంబంతో కలిసి..



గుంటూరు జిల్లాపరిషత్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న శివప్రసన్నబాబు



శ్రీకాకుళం కలెక్టర్ ధనంజయరెడ్డికి సమస్యను వివరిస్తున్న రైతు మోహనరంగా

న్యూస్‌టుడే– చిత్తూరు, గుంటూరు, శ్రీకాకుళం: చిత్తూరు, శ్రీకాకుళం కలెక్టరేట్ కార్యాలయాలు, గుంటూరు జిల్లాపరిషత్‌లో సోమవారం 'మీకోసం' కార్యక్రమంలో ముగ్గురు రైతులు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. చిత్తూరులో ఓ యువరైతు కుటుంబంతో సహ ఆత్మహత్యకు ప్రయత్నించారు. తమఅనుభవంలోని భూమికి పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు మరొకరికి మంజూరు చేశారంటూ జిల్లాలోని వి.కోట మండలం భూడిగుట్టపల్లికి చెందిన ఉదయ్‌కుమార్.. భార్య, ముగ్గురు పిల్లలతో సహ తొలుత జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్నకు వినతినిచ్చారు. అదే సమయంలో వెంట తెచ్చుకున్న కిరోసిన్, పెట్రోల్ కలిపిన డబ్బాను తీసి పిల్లవాడిపై, తన ఒంటిపై చల్లుకున్నారు. అప్రమత్తమైన సిబ్బంది ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. కలెక్టర్ బాధితుడితో మాట్లాడారు. వి.కోట తహసీల్దారుతోనూ మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆదేశించారు.

గుంటూరులో..

గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన శివప్రసన్నబాబు తనకున్న భూమితో పాటు ఐదెకరాలు కౌలు చేస్తున్నారు. వ్యవసాయంలో నష్టాలు రావటంతో అప్పుల పాలయ్యారు. అప్పులు తీరే దారి లేక డెయిరీఫాం పెట్టుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి వేడుకోగా రూ.25 వేల ఆర్థికసాయం అందిస్తామని, అధికారులను కలవాలని సూచించారు. నాలుగు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవటంతో జిల్లాపరిషత్‌లో అతడు ఒక్కసారిగా ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. సిబ్బంది గమనించి ఆయన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. సాయం చేస్తామని కలెక్టర్ కోన శశిధర్ భరోసానివ్వడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

శ్రీకాకుళంలో కిరోసిన్ పోసుకుని..

శ్రీకాకుళం కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ కె.ధనంజయరెడ్డి వాహనాన్ని అడ్డగించి రైతు టంకాల మోహనరంగా ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించారు. కలెక్టర్ 'మీకోసం' విభాగానికి వస్తున్నప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. కలెక్టర్ వాహనాన్ని దిగి రైతు సమస్యను విన్నారు. జి.సిగడాం మండలం బాతువ గ్రామానికి చెందిన మోహనరంగా తన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. గ్రామడీలర్‌తో పాటు తహసీల్దార్, విద్యుత్ అధికారులు కనెక్షన్ రాకుండా చేస్తున్నారని రైతు ఆరోపిస్తున్నారు. సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని కలెక్టర్ హామీనిచ్చారు.



విద్యుత్తు శాఖ బీసీ ఉద్యోగుల వార్షిక సమావేశంలో ప్రసంగిస్తున్న విద్యుత్తు శాఖ మంత్రి కిమిడి కళావెంకట్రావు

విద్యుత్తు ఉద్యోగుల వేతనాలపై పీఆర్‌సీ

- మంత్రి కిమిడి కళావెంకట్రావు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్ శాఖలోని రెగ్యులర్ ఉద్యోగుల వేతనాలకు సంబంధించి వేతన సవరణ కమిటీ (పీఆర్‌సీ)ని నియమించినట్లు రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి కిమిడి కళావెంకట్రావు తెలిపారు. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఇతర సమస్యల పరిష్కారం, సూచనలకు మరో అధ్యయన కమిటీని వేసినట్లు చెప్పారు. సోమవారం విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో ఏపీ విద్యుత్ శాఖ బీసీ ఉద్యోగుల సంఘం 12వ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభల్లో మంత్రి కళా వెంక్రటావు ముఖ్య అతిథిగా పాల్గొని, ఉద్యోగుల సంఘం దైనందినిని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్తు కొరతను అధిగమించి నేడు మిగులు సాధిస్తున్నామన్నారు. సదస్సులో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ హెచ్‌వై దొర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై హైకోర్టుకు లేఖ

- ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లోని పలు కార్పొరేట్ కాలేజీల్లో తరచు విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడంపై అందిన లేఖను ఉమ్మడి హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించింది. పలు ప్రైవేటు కాలేజీలు, ఐఐటీల్లో తరచు ఆత్మహత్యలు జరుగుతున్నాయంటూ ప్రకాశం జిల్లా లోక్‌సత్తా ఏజిటేషన్ సొసైటీ అనే సంస్థకు చెందిన దాసరి ఇమ్మాన్యుయేల్ ఈ లేఖ రాశారు. ఏపీ మంత్రికి చెందిన కాలేజీల్లోనూ, మరికొందరు మంత్రులకు సంబంధించిన బంధువుల విద్యాసంస్థల్లోనూ ఆత్మహత్యలు జరుగుతున్నా చర్యలు తీసుకోవడంలేదన్నారు. దీనిపై ప్రభుత్వాన్ని ఆదేశించాలని హైకోర్టును కోరారు. ఆత్మహత్యలకు కారణాలపై నిమ్స్, స్విమ్స్‌తో అధ్యయనం చేయించాలన్నారు. ఏపీ మంత్రికి చెందిన కొన్ని కాలేజీల్లో ఆత్మహత్యలు జరిగాయని, ఆయా విద్యాసంస్థలకు ప్రభుత్వం నుంచి అనుమతి కూడా లేదంటూ విద్యాశాఖ మంత్రి వెల్లడించినట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. ఇంటర్ బోర్డు సమర్పించిన నివేదిక ప్రకారం చైతన్య, నారాయణ సహా అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న కాలేజీల మూసివేతకు చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. ఈ లేఖను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్యాశాఖ, హోంశాఖ ముఖ్యకార్యదర్శులు, ఇంటర్మీడియట్ బోర్డులు నిమ్స్, స్విమ్స్ డైరెక్టర్లతోపాటు నారాయణ, చైతన్య కాలేజీల కరస్పాండెంట్ లేదా డైరెక్టర్లను ప్రతివాదులుగా చేర్చింది.

పెదగొట్టిపాడు నిందితులను అరెస్టు చేయాలి

- సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు డిమాండ్

విజయవాడ, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి.. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలో వారు మాట్లాడుతూ.. దళితులపై దాడులు, సాంఘిక బహిష్కరణ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 24వ తేదీన చలో పెదగొట్టిపాడు కార్యక్రమాన్ని వామపక్ష, దళిత సంఘాలతో కలిసి నిర్వహించనున్నట్లు తెలిపారు. తెదేపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. గరగపర్రు ఘటనలో ఆ ప్రాంతానికి చెందిన ఒక తెదేపా నాయకుడి పాత్ర ఉందని ప్రభుత్వానికి తెలిసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తదితరులున్నారు.

సిరివెన్నెలకు డాక్టర్ నాగభైరవ పురస్కారం

- ఫిబ్రవరి 11న నెల్లూరులో ప్రదానం



నెల్లూరు, న్యూస్‌టుడే: ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు స్మారక పురస్కారానికి ప్రముఖ సినీ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రిని ఎంపిక చేశామని నాగభైరవ అవార్డు కమిటీ అధ్యక్షులు వెన్నెలకంటి, కార్యదర్శి చిన్ని నారాయణరావు సోమవారం తెలిపారు. 2017 సంవత్సరానికి ప్రదానం చేయనున్న ఈ పురస్కారాన్ని ఫిబ్రవరి 11న నెల్లూరు పురమందిరంలో జరిగే కార్యక్రమంలో అందజేస్తామన్నారు. అవార్డుతో పాటు రూ.25 వేల నగదు పారితోషకాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. నాగభైరవ అధ్యాపక పురస్కారాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత అధ్యాపకులు కాళిదాసు పురుషోత్తంకు ప్రకటించారు.

మార్చిలో 'రాష్ట్రీయ రక్షా మహాయజ్ఞం'!

దిల్లీ: ఎర్రకోట వెలుపల ఉన్న సువిశాల పచ్చిక మైదానంలో మార్చిలో భారీ 'వేదిక్ యజ్ఞాన్ని' నిర్వహించనున్నట్లు భాజపా పార్లమెంటు సభ్యుడు మహేష్ గిర్రీ తెలిపారు. భారతదేశ శత్రువుల కుట్రలను చిత్తు చేసేందుకు ఈ యజ్ఞాన్ని నిర్వహించబోతున్నట్లు ఆయన సోమవారం నాడిక్కడ వివరించారు. దీనిని 'రాష్ట్రీయ రక్షా మహాయజ్ఞం'గా ఆయన పేర్కొన్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదీ తదితర ప్రముఖులను ఆహ్వానించినట్లు చెప్పారు. మార్చి 18-25 తేదీల్లో పదకొండువందల మంది రిత్విక్‌లు ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తారన్నారు. మహాయజ్ఞం బ్లూ ప్రింట్‌ను గిర్రీ సోమవారం నాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆవిష్కరించారు.

బాహుబలి.. ఉత్సవ లోగిలి!

- శరవేగంగా మహామస్తకాభిషేక ఏర్పాట్లు
- దేశ, విదేశీ భక్తులకు ప్రత్యేక సదుపాయాలు

శ్రవణ బెళగొళ నుంచి ఈనాడు ప్రతినిధి



బాహుబలి విగ్రహం వద్ద జైన మహిళల పూజలు



జైన మునుల కోసం సిద్ధమైన మునినగరం

కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లాలోని 8వేల జనాభా గల చిరు గ్రామమైన శ్రవణ బెళగొళ మరోమారు అంతర్జాతీయ స్థాయిలో అందరి దృష్టినీ ఆకర్షించేందుకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలో ఇక్కడ జరగనున్న శాంతి ప్రబోధకర్త, త్యాగమూర్తి బాహుబలి.. గోమతేశ్వరుడి 88వ మహామస్తకాభిషేకం జరగనుండడమే ఇందుకు కారణం. ఈ వేడుక కోసం ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తోంది. నెలాఖరుకల్లా ఏర్పాట్లు పూర్తి కానున్నాయి.

650 మెట్లు ఎక్కి వింధ్యగిరిపై ఉన్న బాహుబలిని దర్శించుకోవడం ఓ అద్భుతమైన అనుభవం. మహామస్తకాభిషేకం సందర్భంగా హెలికాప్టర్‌పైనుంచి పుష్ప వర్షం కురిపించడం అనేక సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ దఫా దీనికితోడు భక్తులు, పర్యాటకులు హెలికాప్టర్ ద్వారానూ బాహుబలి మూర్తిని వీక్షించే అవకాశాన్ని కల్పించనున్నారు. "భక్తులు, పర్యాటకులు ఇప్పటి వరకూ వింధ్యగిరి, చంద్రగిరి నుంచి బాహుబలిని వీక్షించారు. హెలికాప్టర్ నుంచి గోమతేశ్వరుడి దర్శనం కొత్త అనుభవాన్ని ఇస్తుంది. ఇందుకు రూ.2,100 చెల్లించాల్సి ఉంటుంది" అని హాసన్ జిల్లాకే చెందిన రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి మంజు సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.175 కోట్లు విడుదల చేసిందని, బెంగళూరు, హాసన్, మైసూరు నుంచి ప్రత్యేకంగా వందల సంఖ్యలో బస్సులు నడపుతామని చెప్పారు. ఈ సారి 23 రైళ్లను అదనంగా నడిపేందుకు రైల్వే శాఖ ఉన్నతాధికారులు అంగీకరించినట్లు వివరించారు. ప్రస్తుతానికి పవన్ హన్స్ సంస్థ హెలికాప్టర్ సేవలకు సిద్ధమైంది.

★ ఫిబ్రవరి 17న మహామస్తకాభిషేకాన్ని ప్రారంభిస్తారు. అదే నెల 28 వరకూ కొనసాగుతుంది. అంతకు ముందు ఏడు నుంచి పదహారు వరకు వింధ్యగిరి దిగువన సాంస్కృతిక కార్యక్రమాలు, పంచకల్యాణ మహోత్సవాలు జరుగుతాయని గోమతేశ్వర మఠాధిపతి చారుకీర్తి భట్టారకస్వామి తెలిపారు. ఉత్సవాల ప్రారంభానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. 40 లక్షల మంది ఉత్సవాలకు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారిగా సిసోడియా బాధ్యతల స్వీకరణ


ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన అధికారిగా ఆర్పీ సిసోడియా సోమవారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వహించిన భన్వర్‌లాల్ పదవీ విరమణ చేయటంతో రెండు నెలలుగా రెండు రాష్ట్రాల్లో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా సిసోడియాను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఇన్‌ఛార్జి ప్రధాన ఎన్నికల అధికారి అనూప్‌సింగ్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

చంద్రన్న సంచార చికిత్స పథకంలో.. 6 నెలల పాటు సమ్మె నిషేధం

ఈనాడు, అమరావతి: చంద్రన్న సంచార చికిత్స పథకంలో పనిచేసే ఉద్యోగులు ఆరునెలలపాటు సమ్మె చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. అత్యవసర సేవల చట్టం కింద తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య సోమవారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతులకు మంత్రి హామీ: ఎంటీఎఫ్

పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను ఈ నెల చివరి నాటికి పూర్తి చేస్తామని మంత్రి నారాయణ, సంబంధిత అధికారులు తెలిపారని పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య (ఎంటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ సోమవారం తెలిపారు.



నల్గొండ జిల్లా కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన 'హైవే నెస్ట్(మినీ) సెంటర్'

జాతీయ రహదారుల వెంట అల్పాహారశాలలు

దేశంలోనే మొదటిసారిగా కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు

ఈనాడు డిజిటల్, సూర్యాపేట: జాతీయ రహదారులపై టోల్‌ప్లాజాల వద్ద 'హైవే నెస్ట్(మినీ)సెంటర్' పేరిట అల్పాహారశాలలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా రెండు కేంద్రాలను ప్రారంభించగా.. అందులో ఒకదాన్ని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి-65పై నల్గొండ జిల్లా కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేశారు. వీటిలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే టీ, కాఫీ, అల్పాహారం, తాగునీరు, బిస్కెట్లు లభిస్తాయి. త్వరలోనే టెండర్లు పిలిచి ఈ కేంద్రాల్లో విక్రయాలు జరిపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీటిచెంత పక్షిగూడు తరహాలో గదిని నిర్మించి మూత్రశాలల్ని ఏర్పాటు చేస్తారు. వాహనాలు నిలిపేందుకు సౌకర్యం కల్పిస్తారు. వీటితోపాటు రెస్టారెంట్లు కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపై ఆయా జాతీయ రహదారుల నిర్వహణను పర్యవేక్షిస్తున్న సంస్థలకు కేంద్రం నుంచి ఆదేశాలందాయి.

సూర్యుడికి వయసు మీద పడుతోంది

బయటపెట్టిన బుధుడు

వాషింగ్టన్: సూర్యుడికి వయసు మీదపడే కొద్దీ మన సౌర కుటుంబంలోని గ్రహాల కక్ష్యలు తమ గురుత్వాకర్షణ పట్టును కోల్పోతున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. బుధ గ్రహం గమనంలో వచ్చిన మార్పులను గమనించి, ఈ మేరకు తేల్చారు. దీనిద్వారా సూర్యుడి ద్రవ్యరాశిలో వచ్చే క్షీణతను వారు కొలిచారు. తాజా గణాంకాలతో మునుపటి అంచనాలను మెరుగుపరచడానికి వీలు కలిగింది. సౌర ద్రవ్యరాశి క్షీణత, గురుత్వాకర్షణ స్థిరాంకం (జి)కు మధ్య సంబంధం ఉంది. ఈ 'జి'ని స్థిరాంకంగా చెబుతున్నప్పటికీ అది నిజంగా స్థిరంగానే ఉంటుందా అన్నది భౌతిక శాస్త్రంలో అంతుచిక్కని ప్రశ్నగా ఉండిపోయింది. ఈ నేపథ్యంలో దీన్ని పరీక్షించడానికి బుధ గ్రహాన్ని శాస్త్రవేత్తలు ఎంచుకున్నారు. లోగడ అంచనా కన్నా ఈ విలువ కొద్దిమేర తక్కువగా ఉంటుందని నిర్ధరించారు.

కాస్మిక్ కిరణాల శోధనకు స్మార్ట్‌ఫోన్లు

★ రష్యా శాస్త్రవేత్తల వినూత్న పరిశోధన



మాస్కో: విశ్వంలో అంతుచిక్కని, అత్యంత శక్తిమంతమైన కాస్మిక్ కిరణాలను స్మార్ట్‌ఫోన్లు విశ్లేషించేలా శాస్త్రవేత్తలు ఒక ఆల్గోరిథమ్‌ను అభివృద్ధి చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే ఈ కిరణాల తీరుతెన్నులపై కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయి. నక్షత్రాల్లో ఇంధనం ఖాళీ అయ్యాక అవి భారీ విస్ఫోటంతో పేలిపోతాయి. ఈ పరిణామాన్ని సూపర్‌నోవాగా పేర్కొంటారు. వీటి నుంచి, కృష్ణబిలాల నుంచి కాస్మిక్ కిరణాలు వెలువడుతుంటాయి. ఇవి భూవాతావరణంలోకి ప్రవేశిస్తుంటాయి. వీటిలో 'అల్ట్రా హై ఎనర్జీ కాస్మిక్ కిరణాలు' (యూహెచ్‌ఈసీఆర్) కూడా ఉన్నాయి. వీటి లక్షణాలు అంతుపట్టకుండా ఉన్నాయి. ఇవి.. భూవాతావరణంలో వాయు రేణువులను తాకగానే అనేక రకాల ద్వితీయ శ్రేణి రేణువులను, తక్కువ స్థాయి శక్తిని వెలువరిస్తాయి. వీటిని 'విస్తృత వాతావరణ జల్లులు'గా (ఈఏఎస్) పేర్కొంటారు.

వీటిని గుర్తించేందుకు ఒక చదరపు కిలోమీటరు మేర విస్తీర్ణం కలిగిన ఒక డిటెక్టర్‌ను ఏర్పాటు చేస్తే వందేళ్లలో ఒక పరిణామాన్ని మాత్రమే కనుగొనడం సాధ్యమని శాస్త్రవేత్తలు గుర్తించారు. పూరిస్థాయిలో అధ్యయనం కోసం ఏకంగా ఒక చిన్న దేశమంత డిటెక్టర్ అవసరమని తేల్చారు. ఈ నేపథ్యంలో రష్యా శాస్త్రవేత్తలు ఒక వినూత్న ప్రతిపాదన చేశారు. విస్తృత మొబైల్ ఫోన్ నెట్‌వర్క్ సాయంతో యూహెచ్‌ఈసీఆర్‌ను గుర్తించొచ్చని వారు పేర్కొన్నారు. ఈ వాతావరణ జల్లుల్లో ఉండే మ్యువాన్లను మొబైల్ ఫోన్లు రికార్డు చేసేలా ఒక న్యూరల్ నెట్‌వర్క్స్‌ను నిర్మించేలా ఆల్గోరిథమ్‌ను అభివృద్ధి చేశారు. ఫలితంగా పార్టికల్ డిటెక్టర్లలో ఉండే పరిజ్ఞానమే ఈ మొబైల్ కెమెరాల్లోకి వచ్చినట్లవుతుంది. అందువల్ల అవి ఈఏఎస్‌ను గుర్తించడానికి వీలవుతుంది.


కృత్రిమ వైరస్‌తో మశూచి సంబంధ వ్యాధులకు శక్తిమంతమైన టీకా!!


★ సింథటిక్ హార్స్‌పాక్స్ వైరస్‌ను రూపొందించిన శాస్త్రవేత్తలు

టొరంటో: కెనడాకు చెందిన శాస్త్రవేత్తలు ఇటీవల ఆవిష్కరించిన ఓ కృత్రిమ వైరస్(సింథటిక్ హార్స్‌పాక్స్ వైరస్) తట్టు, పొంగు, దద్దు వంటి మశూచి సంబంధ వ్యాధులకు మరింత శక్తిమంతమైన టీకాను కనుగొనేందుకు ఉపకరించే అవకాశం ఉంది. ఓ కృత్రిమ డీఎన్ఏను ప్రజారోగ్య సాధన దిశగా ఎలా ఉపయోగించుకోవచ్చనే దానికి ఈ కృత్రిమ వైరస్ ఓ ఉదాహరణ కావచ్చు. ఇప్పటికే వెలుగులోకి తెచ్చి ఉన్న జన్యుక్రమాన్నీ.. ...సంపూర్ణంగా రసాయనిక ప్రక్రియల ద్వారా తయారుచేసిన డీఎన్ఏ భాగాలను ఉపయోగించి పూర్తిగా కృత్రిమంగా ఈ వైరస్‌ను తయారు చేశారు. మశూచి సంబంధ ఇన్‌ఫెక్షన్ ఉన్న ఎలుకలపై ఈ కృత్రిమ వైరస్‌ను ప్రయోగించి పరీక్షించారు. ఫలితం అత్యంత ఆశాజనకంగా ఉన్నట్లు అల్‌బెర్టా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డేవిడ్ ఇవాన్స్ తెలిపారు.

వలస పక్షులకు కృత్రిమ వెలుగుల ఉచ్చు!

వాషింగ్టన్: పట్టణాల్లోని కృత్రిమ వెలుగులు వలస పక్షుల పాలిట యమపాశాలుగా మారుతున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. అమెరికాలో చాలా వరకూ పక్షులు వేరే ప్రాంతాలకు వలస వెళ్తుంటాయి. వీటి ప్రయాణాలను 16 ప్రత్యేక రాడార్లతో ఏడేళ్లపాటు అమెరికాలోని డెలావేర్ వర్సిటీ నిపుణులు పరిశీలించారు. ఎందుకు కొన్ని ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా గుమిగూడి ఉంటున్నాయనే అంశంపై దృష్టిసారించారు. 'చాలావరకు పక్షులు సూర్యాస్తమయం తర్వాతే వలస ప్రయాణం మొదలుపెడతాయి. దీంతో పట్టణాల్లోని కృత్రిమ కాంతుల ఆకర్షణకు గురవుతున్నాయి. బోస్టన్, న్యూయార్క్, వాషింగ్టన్ డీసీ లాంటి వెలుగులు విరజిమ్మే నగరాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక్కడ వీటిని సంరక్షించడం కష్టంగా మారుతోంది. వనరులు తక్కువగా, ప్రాణహాని ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇవి నివసిస్తున్నాయి. భవనాలు, వాహనాలను గుద్దేయడం, ఇతర జంతువులకు ఆహారంగా మారడం లాంటి ముప్పులూ వీటిని వెంటాడుతున్నాయి'అని పరిశోధకులు జెఫ్ బ్లర్ తెలిపారు.





నూనెపైనే మక్కువ.. పోషకాలు ఎక్కవా!

- రోజూ పది గ్రాములు అదనంగా వాడుతున్న పట్టణవాసులు
- పరిమితికి మించి వినియోగంతో పెరుగుతున్న మధుమేహం, రక్తపోటు
- తగ్గుతున్న పోషకాహారం..
- ఎన్ఐఎన్ విశ్లేషణలో వెల్లడైన నిజాలు
- 16 రాష్ట్రాల్లో లక్షకుపైగా ప్రజలపై పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: పట్టణవాసులకు నూనెపై ఉన్న మక్కువ.. పోషకాలపై ఉండటం లేదు. వంట నూనెల్ని పరిమితికి మించి వాడటం ద్వారా చేజేతులా ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. మరోవైపు అవసరమైన పోషకాహారాన్నీ తినకపోవడంతో శరీరంలో కొవ్వు పేరుకుపోయి మధుమేహం, అధిక రక్తపోటు తదితర వ్యాధుల బారిన పడుతున్నట్లు జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) సర్వేలో తేలింది. ప్రతి మనిషి రోజుకు సగటున 20 గ్రాముల వంటనూనె వాడాల్సి ఉండగా.. పట్టణ, నగర ప్రాంతాల్లో చాలా మంది సగటున 30 గ్రాములు వాడుతున్నట్లు వెల్లడైంది. అదేమేరకు రోగాల బారిన పడుతున్న వారి సంఖ్య కూడా పెరిగిపోతున్నట్లు తెలుస్తోంది. 'ఎన్ఐఎన్' సర్వే నివేదిక వివరాలివీ..

దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో 1.71 లక్షల మంది ఆరోగ్యంపై ఎన్ఐఎన్ ప్రతినిధులు రెండేళ్లపాటు రకరకాల పరీక్షలు చేపట్టారు. ఆహార అలవాట్లు, వంటనూనె వాడకం వంటి అనేక అంశాల్ని పరిశీలించారు. ఈ వైద్య పరిశోధనలో ఆందోళన కలిగించే అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా వంటనూనెల్ని అధికంగా వాడుతుండటంతో శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోతోందని గుర్తించారు. అందుకు తగిన శారీరక శ్రమ లేకపోవడంతోపాటు అవసరమైన స్థాయిలో పోషకాహారాన్ని తీసుకోకపోవడం వల్ల అనేక మంది వ్యాధుల బారిన పడుతున్నట్లు గుర్తించారు. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ముప్పు తప్పదని ఎన్ఐఎన్ అధ్యయనం హెచ్చరించింది.

- అనేకమందిలో రక్తపోటు ఆందోళనకర స్థాయిలో ఉన్నట్లు తేలింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పురుషుల్లో సగటున 36.2 శాతం, మహిళల్లో 28.2 శాతం అధిక రక్తపోటు ఉన్నట్లు తేలింది. కేరళలో పురుషుల్లో 38.6 శాతం, మహిళల్లో 31.4 శాతం అధిక రక్తపోటు ఉన్నట్లు తేల్చారు. అదే బిహార్‌లో పురుషుల్లో 22.2 శాతం, మహిళల్లో 15.7 శాతం మాత్రమే ఉన్నట్లు గుర్తించారు.
- పుదుచ్చేరిలో పురుషుల్లో 34 శాతం, మహిళల్లో 29.8 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నట్లు తేలింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పురుషుల్లో 22.7 శాతం, మహిళల్లో 18.6 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు.
- కేరళలో 38.6 శాతం మంది మహిళలు, 33.5 శాతం మంది పురుషులు అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడుతున్నట్లు తేల్చారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మహిళల్లో 20.6 శాతం పురుషుల్లో 22.8 శాతం మంది ఈ సమస్య బాధితులుగా తేలింది.
- పుదుచ్చేరిలో 59.8 శాతం మంది మహిళలు, 42.5 శాతం మంది పురుషులు అధిక బరువున్నట్లు తేలింది. గుజరాత్, దిల్లీ, కేరళ, రాజస్థాన్‌లో అధిక బరువున్న మహిళలు సగంకంటే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. తెలుగు రాష్ట్రాల్లో 43 శాతం మహిళలు, 35.2 శాతం మంది పురుషులు ఈ సమస్యతో ఉన్నట్లు గుర్తించారు.

నూనె తాగేస్తూ.. పోషకాహారానికి దూరంగా..

ఎక్కువ మంది వంటనూనెల్ని 159.5 శాతందాకా వినియోగిస్తున్నట్లు తేలింది. ఈ లెక్కన 59.5 శాతం అధికంగా వాడుతున్నారు. పోషకాల్ని సమకూర్చే తృణ ధాన్యాల్ని మాత్రం 69.6 శాతం మాత్రమే వినియోగిస్తున్నారు. పప్పుధాన్యాల్ని 104.5 శాతందాకా వాడుతున్నా..ఆకుకూరల జోలికి వెళ్లకపోవడమే సమస్యగా మారిందని నిపుణులు చెబుతున్నారు. వీటిని 59.5 శాతమే ఆహారంగా వినియోగిస్తున్నారు. పాల ఉత్పత్తులను 81.3 శాతం, బెల్లం, పంచదారను 52.3 శాతం, దుంపలను 188.8 శాతం మేర వినియోగిస్తున్నట్లు గుర్తించారు. సగటున ఒక్కో కుటుంబం మాంసకృత్తుల్ని 89.8 శాతం, క్యాల్షియం 67 శాతం, ఇనుము 77.6 శాతం, విటమిన్-ఏ 22.8 శాతం, విటమిన్-సి 128.3 శాతం వినియోగిస్తున్నట్లు తేలింది.

శారీరక శ్రమా ఉండటం లేదు..

వంటనూనె, కొవ్వు పదార్థాల్ని ఎక్కువెక్కువగా తీసుకోవడం వల్ల అనేకమందిలో కొవ్వు శాతం పెరిగి పలు రకాల వ్యాధులు పెరుగుతున్నట్లు అధ్యయనంలో తేలింది. కొవ్వు పదార్థాలు తీసుకునేవారు ఆ స్థాయిలో శారీరక శ్రమ కూడా చేయడం లేదు. దేశవ్యాప్తంగా 66 శాతం మంది సుకుమారమైన పనిలోనే ఉన్నారు. శారీరక కష్టం లేకపోవడం వల్ల ఆహారం ద్వారా కొవ్వు శాతం ఎక్కువవుతోంది. నూనెలు, కొవ్వు పదార్థాలు తగ్గిస్తేనే ఫలితం ఉంటుంది.

–డా.ఆవుల లక్ష్మయ్య, ఎన్ఐఎన్ సీనియర్ శాస్త్రవేత్త, పరిశోధన ప్రధాన పర్యవేక్షకుడు.

దస్తూరీ దొరికితేనే దర్యాప్తు

- నయీం కేసులో పీటముడి

ఈనాడు, హైదరాబాద్: కరుడుగట్టిన నేరగాడు నయీం కేసుల దర్యాప్తులో పీటముడి పడింది. అతని దస్తూరీ అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు ఇంచుమించు నిలిచిపోయింది. దాంతో ఈకేసు దర్యాప్తులో పాలుపంచుకుంటున్న ప్రత్యేక దర్యాప్తు బృందంలోని సిబ్బంది ఇప్పుడు నయీం దస్తూరీ వెతికే పనిలో నిమగ్నమయ్యారు. నయీం చదువుకున్న విద్యాసంస్థల నుంచి అతని మిత్రులు, బంధువులతో పాటు శిక్ష అనుభవించిన జైళ్లలోనూ ఆరా తీస్తున్నారు. మిగతా దర్యాప్తును పక్కనపెట్టి నయీం స్వహస్తాలతో రాసిన ఏదోఒక పత్రం సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వెరసి ఇప్పుడు నయీం కేసు దర్యాప్తు అంతా అతని చేతిరాత చుట్టూనే తిరుగుతోంది.

కనిపిస్తే కబ్జా.. అడ్డొస్తే హత్య.. ఇదేపనిగా గత కొన్నేళ్లుగా తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించిన నయీం వందల ఎకరాల ఆస్తులు కూడబెట్టిన సంగతి తెలిసిందే. ఆ భూములను తిరిగి బాధితులకు అప్పగించాలనే డిమాండు వ్యక్తం కాగా ప్రభుత్వం ఇందుకు సానుకూలంగా స్పందించింది. కేసు దర్యాప్తు త్వరగా పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించింది.

చేతిరాతను శాస్త్రీయంగా నిరూపిస్తేనే!: నయీం హతమైన తర్వాత సిట్ అధికారులు అతనికి సంబంధించిన కేసులు తేల్చేపనిలో పడ్డారు. జిల్లాల వారీగా ఏర్పడ్డ ప్రత్యేక బృందాలు తమ పరిధిలోని రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి అవసరమైన దస్త్రాలు సేకరించారు. అతని ఇళ్ల నుంచి కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. తాను చేసిన ప్రతి పనినీ రాసుకోవడం అతనికి అలవాటు. అందుకే పెద్ద సంఖ్యలో పుస్తకాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో తనకు ఎవరెవరు సహకరించారనేది మొదలు ఎవరెవరికి ఎంత మొత్తం ముట్టజెప్పింది, ఎవరెవరి స్థలాలు ఆక్రమించాడో వంటి వివరాలన్నీ ఉన్నాయి. వాస్తవానికి దర్యాప్తులో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. ఉదాహరణకు ఫలానా వ్యక్తికి సంబంధించిన స్థలం ఆక్రమించుకునేందుకు ఫలానా అధికారి సహకరించాడనే అర్థం వచ్చేలా ఒకచోట రాసుకున్నాడు. దీనిప్రకారం సదరు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. ఇదే సమయంలో ఆ స్థలం ఆక్రమించుకున్నట్లు రాసుకున్నాడు కాబట్టి దాని ఆధారంగా బాధితుడికి స్థలం తిరిగి ఇచ్చేలా న్యాయస్థానాన్ని కోరవచ్చు. ఇందుకోసం ముందుగా నయీం వద్ద దొరికిన పుస్తకాల్లో ఉన్న చేతిరాత అతనిదే అని శాస్త్రీయంగా నిరూపించాలి. లేకపోతే న్యాయవిచారణ సమయంలో నయీం కుటుంబీకులు ఎదురుతిరిగే అవకాశముంది. అక్కడ దొరికిన పుస్తకాల్లో చేతిరాత అతనిది కాదని, కేసు తారుమారు చేసేందుకు పోలీసులే పుస్తకాలు అక్కడ పెట్టి, స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారని వారు న్యాయస్థానంలో వాంగ్మూలం ఇస్తే కేసు నిలబడదు. ఇలా కాకుండా ఉండాలంటే ముందు నయీం చేతిరాత సేకరించాలి. అతను గతంలో రాసిన లేఖలు, చదువుకునేటపుడు రాసిన పరీక్ష పత్రాలు, జైల్లో ఉన్నపుడు ఎవరికైనా రాసిన లేఖల వంటివి ఉంటే వాటి ఆధారంగా దస్తూరీని నిర్ధరించవచ్చు. పరీక్ష పత్రాలు ఉపాధ్యాయులు ధ్రువీకరించి ఉంటారు కాబట్టి వాటిని ప్రామాణికంగా తీసుకోవచ్చు. జైల్లో ఉన్నప్పుడు లేఖలు రాసి ఉంటే జైలు అధికారులు వాటిని చదివి నిర్ధరించిన తర్వాత బయటకు పంపుతారు. అందువల్ల వాటికీ చట్టబద్ధత ఉంటుంది. ఇలాంటి వాటికోసం ఇప్పుడు సిట్ అధికారులు తీవ్రంగా వెతుకుతున్నారు.

దిల్లీ హైకోర్టులో అభ్యర్థనల్ని ఉపసంహరించుకున్న ఆప్ ఎమ్మెల్యేలు

మళ్లీ దాఖలు చేయాలని నిర్ణయం

దిల్లీ: తమపై అనర్హత వేటు వేయాలంటూ ఎన్నికల సంఘం చేసిన సిఫార్సులను దిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన 20 మంది ఆప్ శాసనసభ్యులు సోమవారం వాటిని ఉపసంహరించుకున్నారు. ఈ సిఫార్సులు ఆధారంగా రాష్ట్రపతి నిర్ణయం తీసుకుని, వారిని అనర్హులుగా ప్రకటించిన నేపథ్యంలో కొత్తగా పిటిషన్లు దాఖలు చేయాలని శాసనసభ్యులు నిర్ణయించుకున్నారు. రాష్ట్రపతి ఆమోదముద్ర వేసిన తర్వాత తమ అభ్యర్థనలు వ్యర్థమనీ, అందువల్ల వాటిని ఉపసంహరించుకునేందుకు అనుమతించాలనీ వారు న్యాయస్థానాన్ని కోరారు. దీనిని న్యాయమూర్తి జస్టిస్ రేఖాపల్లి ఆమోదించారు.

రాజ్‌పథ్‌పై ఎగురనున్న ఆసియాన్ పతాకం

- గణతంత్ర దినోత్సవాల్లో అతిథి దేశాలకు అరుదైన గౌరవం

దిల్లీ: ఈ దఫా గణతంత్ర దినోత్సవాల్లో అరుదైన దృశ్యం ఒకటి దిల్లీలోని రాజ్‌పథ్ వినువీధుల్లో కనువిందు చేయనుంది. భారత జాతీయ పతాకంతో పాటు ఆసియాన్ పతాకం కూడా సవ్వడి చేయనుంది. ఆసియాన్‌లో సభ్యత్వం కలిగిన పది దేశాల నేతల బృందం గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరవుతున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. భారత వాయుసేనకు చెందిన ఎంఐ-17వి5 రకం హెలికాప్టర్లు అయిదు రాజ్‌పథ్ గగనతలంలో కవాతు నిర్వహించనున్నాయి. వీటిలో మొదటిది భారత జాతీయ పతాకను, వరుసలో రెండోది ఆసియాన్ పతాకాన్ని, మిగిలిన మూడు హెలికాప్టర్లు ఆర్మీ, నేవీ, వైమానిక దళ పతాకాలను తీసుకొస్తాయి. వీటన్నిటి కన్నా ముందుండే విమానం పుష్పాలను వెదజల్లుతూ వెళ్తుందని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక అధికారిక మెమోరాండంలో వెల్లడించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలకు చెందిన 23 శకటాలు గణతంత్ర పరేడ్‌లో పాల్గొంటాయి. తొలిసారిగా ఆదాయపు పన్ను శాఖ కూడా తన శకటాన్ని ప్రదర్శించనుంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 61 మంది గిరిజనులను కేంద్ర ప్రభుత్వం అతిథులుగా ఆహ్వానించింది.

'యాక్ట్ ఈస్ట్' విధానం సరైన రూపం దాల్చుతోంది: నిర్మలా సీతారామన్

తూర్పు దేశాలకు ప్రాధాన్యమిచ్చేందుకుగాను మన దేశం ప్రతిపాదించిన 'యాక్ట్ ఈస్ట్' విధానం సరైన రూపం దాల్చుతోందని రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రానున్న గణతంత్రదిన వేడుకలకు 10 ఆగ్నేయాసియా దేశాల నేతలు హాజరుకానుండటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. దిల్లీ కంటోన్మెంట్‌లో ఎన్‌సీసీ గణతంత్ర దినోత్సవ శిబిరాన్ని సోమవారం సందర్శించిన సీతారామన్ విలేకర్లతో మాట్లాడారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్లు దేశానికి కీలక సేవలు అందించారంటూ సీతారామన్ కొనియాడారు.

తెలుగునాట పాల కొరత

- ఇతర రాష్ట్రాల నుంచి కొంటున్న ఇక్కడి డెయిరీలు
- దేశమంతటా పెరిగిన క్షీర ఉత్పత్తి
- పాడి రైతులకు ప్రోత్సాహకాలు లేకనే రాష్ట్రంలో అవస్థలు

ఈనాడు - హైదరాబాద్



ఆవు పాలు పితుకుతున్న రైతు

తెలుగు రాష్ట్రాల్లో పాల కొరత ఇతర రాష్ట్రాలకు కాసులు కురిపిస్తోంది. గత 3 నెలలుగా దేశమంతా పాల ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో తెలంగాణ, ఏపీలకు తెచ్చిపోస్తున్నారు. రైతులకు ఎక్కువ ధర ఇవ్వడం ఎందుకుని ఇక్కడి డెయిరీలు ఇతర రాష్ట్రాల నుంచి కొని తెస్తున్నాయి. గత వానాకాలంతో పోలిస్తే ప్రైవేటు డెయిరీలు తెలంగాణ, ఏపీల్లో కొంతమేర ధర తగ్గించి ఇస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. శీతాకాలంలో పశువులు పాలు అధికంగా ఇస్తాయి. ఈ ప్రకారం దేశవ్యాప్తంగా 10శాతం పాల ఉత్పత్తి పెరిగిందని జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య(ఎన్‌డీడీఎఫ్) అంచనా. 2015-17తో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరం(2016-17)లో 19 శాతం పాల ఉత్పత్తి పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే ఆనవాయితీ కొనసాగుతోంది. గతేడాదితో పోలిస్తే, గత 9 నెలల్లో (ఏప్రిల్-డిసెంబరు)అత్యధికంగా గుజరాత్‌లో 23.9 లక్షల టన్నులు అధికంగా పాలు ఉత్పత్తి కాగా తెలుగు రాష్ట్రాల్లో 20 వేల టన్నుల పెరుగుదల నమోదైంది. దేశంలో తెలుగు రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్‌లో మాత్రమే పాలఉత్పత్తి పెద్దగా పెరగలేదు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హరియాణా, పంజాబ్‌ల నుంచి ప్రైవేటు డెయిరీల కొనుగోలు ఏకంగా 26శాతం పెరిగింది. మరోవైపు సహకార డెయిరీలు సైతం తమ అమ్మకాల కన్నా 36శాతం అధికంగా కొంటున్నాయి. ఇలా అధికంగా కొన్నవాటిని అమ్ముకోలేక ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాయి. దేశవ్యాప్తంగా పాల ధరలు తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. సహకార డెయిరీలు తెలుగు రాష్ట్రాల్లో సగటున లీటరు ఆవుపాలకు రూ.24.15 ఇస్తుండగా అత్యధికంగా కేరళలో రూ.31.93 చొప్పున చెల్లిస్తున్నారు. గుజరాత్‌లో గతేడాది లీటరుకు రూ.28.30 చెల్లించగా ఈ ఏడాది అధిక ఉత్పత్తి కారణంగా రూ.25.60కి తగ్గించడంతో దేశవ్యాప్తంగా పాలసేకరణ ధరలపై ప్రభావం పడింది.

కృష్ణా డెయిరీకి కర్ణాటక పాలు

విజయవాడలో ఉన్న ప్రధాన సహకార కృష్ణా డెయిరీకి శీతాకాలంలోనూ పాల కొరత తప్పడం లేదు. గతేడాదితో పోలిస్తే 20 వేల లీటర్ల వరకూ రోజూ తక్కువగా వస్తున్నాయి. ఈ డెయిరీ అమ్మకాలు రోజుకు 2.60 లక్షల లీటర్లుంటే రైతుల నుంచి 2.14 లక్షల లీటర్లే వస్తున్నాయి. పాల ఉత్పత్తులకు అదనంగా మరో 40 వేల లీటర్లు కావాలి. ఇందుకోసం కర్ణాటకలో దూరంగా ఉన్న బెల్గాం నుంచి 20 వేలు, హొస్‌కోట నుంచి 20 వేలు, నెల్లూరు నుంచి 15 వేలు, తెలంగాణ ప్రైవేటు డెయిరీల నుంచి మరో 10 వేల లీటర్లు కొంటోంది. పక్కనున్న గుంటూరు జిల్లా సంగం డెయిరీకి సైతం అమ్మకాలకు తగ్గస్థాయిలో పాలు రావడం లేదు.

గేదె పాల ఉత్పత్తి తగ్గింది

ఆంధ్రప్రాంతంలో గేదె పాల ఉత్పత్తి తగ్గింది. ఆవు పాలు కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి అధికంగా వస్తున్నాయి. మా అవసరాలకు గతేడాదితో పోలిస్తే ఏకంగా 8% వరకూ పాల రాకతగ్గింది. దీనివల్ల ఇతర రాష్ట్రాలపై ఆధారపడక తప్పడం లేదు. వేసవిలో కొరత ఇంకాపెరిగే అవకాశాలున్నాయని పాలపొడి, వెన్న నిల్వలు పెంచుతున్నాం. మేం రైతులకు అధిక ధర చెల్లిస్తున్నాం. **– బాబూరావు, ఎండీ, కృష్ణా డెయిరీ**

'పద్మావత్'పై నిరసనల పరంపర

దిల్లీ: బాలీవుడ్ చిత్రం పద్మావత్‌కు వ్యతిరేకంగా రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సోమవారం నిరసనలు కొనసాగాయి. భన్సాలీ రూపొందించిన ఈ చిత్రం ఈనెల 25న విడుదలకు సన్నాహాలు చేస్తుండగా.. అంతకుముందే చిత్రాన్ని చూసేందుకు రాజ్‌పుత్ కర్ణి సేన సంసిద్ధత వ్యక్తం చేసింది. రాజస్థాన్‌లోని రాజ్‌సమంద్, బార్మెర్‌లలో జాతీయ రహదారుల దిగ్బంధనం చేపట్టగా.. భిల్వారాలో ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. మరోవైపు ఈ చిత్రం విడుదలకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పునఃసమీక్షించాలని కోరుతూ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు వ్యాజ్యాలను దాఖలు చేశాయి. వీటిని మంగళవారం విచారణ జరగనుంది.


అగ్నిప్రమాదంలో ఏడుగురు తోబుట్టువుల మృతి

దుబయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని పుజైరాలో ఓ ఇంట్లో సంభవించిన అగ్నిప్రమాదం కారణంగా ఏడుగురు తోబుట్టువులు మృతి చెందారు. మంటల వల్ల వచ్చిన పొగను పీల్చడంతో నిద్రలో ఉన్న వారంతా ప్రాణాలు కోల్పోయారు. వారంతా 5-13 ఏళ్లలోపు పిల్లలే. సోమవారం తెల్లవారుజామున ఇంట్లో అగ్ని ప్రమాదం వాసనరావడంతో తల్లి లేచి చూసేసరికి పిల్లలు విగతజీవులుగా కనిపించారు. ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలను కోల్పోవడంతో ఆమె కుప్పకూలింది.

అనైతికతకు చెప్పుదెబ్బలు..!

- అర్ధరాత్రి అనిశా ఏఎస్పీ ఇంట్లో కల్వకుర్తి సీఐ
- మాటు వేసి పట్టుకున్న భర్త

ఈనాడు, హైదరాబాద్, ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే: పోలీస్ శాఖలో మరోసారి అనైతిక వ్యవహారం రచ్చకెక్కింది. గతంలో అబిడ్స్‌లోని ఓ హోటల్‌లో ఇన్‌స్పెక్టర్, మహిళా ఎస్సై ఒకే గదిలో ఉండగా ఆమె భర్త పట్టుకున్న ఉదంతాన్ని తలపిస్తూ హైదరాబాద్‌లో మరో సీఐ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఈ సారి ఇన్‌స్పెక్టర్.. అర్ధరాత్రి ఓ మహిళా ఏఎస్పీ ఇంట్లో నుంచి వస్తుండగా ఆమె భర్త మాటువేసి పట్టుకోవడం సంచలనం కలిగించింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్‌లో జరిగిన ఘటనతో పోలీసు శాఖ పరువు బజారున పడింది. ప్రస్తుతం అనిశాలో అదనపు ఎస్పీ హోదాలో పనిచేస్తున్న మహిళా అధికారి 2007లో గ్రూప్-1 అధికారిగా పోలీస్‌శాఖలో చేశారు. 2010లో ఆమెకు సురేందర్‌రెడ్డితో వివాహమైంది. ప్రస్తుతం భార్యాభర్తలు హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్ గార్డెనియా గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటున్నారు.



సీఐ మల్లికార్జునరెడ్డిపై చెప్పుతో దాడి చేస్తున్న సురేందర్‌రెడ్డి తల్లి, అత్త

ఇటీవల భార్య చరవాణిలో అనుమానాస్పద సంక్షిప్త సందేశాలు గమనించిన సురేందర్‌రెడ్డి ఆమెను అనుమానించాడు. గతంలో మల్లికార్జునరెడ్డి (ప్రస్తుతం నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి సీఐగా పనిచేస్తున్నాడు) విషయంలోనే భార్యాభర్తల మధ్య కలహాలు తలెత్తి ఉన్న నేపథ్యంలో..వారి మధ్య పాత సంబంధాలు కొనసాగుతున్నాయన్న నిర్ధారణకు వచ్చాడు. వారి కదలికలపై నిఘా ఉంచాడు. సాఫ్ట్‌వేర్ ఎగుమతుల వ్యాపారం చేస్తున్న సురేందర్‌రెడ్డి వ్యాపార రీత్యా లండన్ వెళ్లి రెండు రోజుల క్రితం తిరిగి వచ్చినా ఆ విషయాన్ని భార్యకు తెలియనివ్వలేదు. సోమవారం రాత్రి కల్వకుర్తి నుంచి నగరానికి వచ్చిన సీఐ ఉప్పల్‌లోని ఆయన ఇంటికి కాకుండా ఇందూ ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్స్‌కు ప్రైవేటు వాహనంలో వచ్చినట్టు గుర్తించాడు. తన అమ్మ, అత్త (ఏఎస్పీ తల్లి)తో కలిసి అపార్ట్‌మెంట్ వద్ద మాటువేశాడు. రాత్రి రెండు గంటల సమయంలో సీఐ తన ఫ్లాట్‌లో నుంచి బయటికి వస్తుండగా పట్టుకున్నాడు. అతన్ని నెట్టివేస్తూ సీఐ అక్కడి నుంచి పరుగెత్తే ప్రయత్నం చేయగా..మహిళలిద్దరూ అతనిపై దాడికి దిగారు. వెంటపడి మరీ చెప్పులతో కొట్టారు. స్థానికులిచ్చిన సమాచారం మేరకు కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ కుషాల్కర్ సిబ్బంది అక్కడికి చేరుకోగా 'ఇది కుటుంబ సమస్య అని చెబుతూ' ఏఎస్పీ వారిని అక్కడి నుంచి పంపించివేశారు. సోమవారం పొద్దుపోయాక ఏఎస్పీ భర్త మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్‌ను కలిసి సీఐపై ఫిర్యాదు చేశారు. సీఐ అర్ధరాత్రి సమయంలో తన ఇంట్లోకి వచ్చి..కొంతసేపటి తర్వాత తిరిగి వెళ్లినట్లుగా చూపించే సీసీ ఫుటేజీలను సమర్పించారు. సీఐతో తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని విన్నవించారు. డీసీపీ ఆదేశాల మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు మల్లికార్జున్‌రెడ్డిపై ఐపీసీ 448, 497, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై నాగర్‌కర్నూల్ ఎస్పీకి నివేదిక అందిస్తామని డీసీపీ తెలిపారు. ఈ వ్యవహారంపై అనిశా ఉన్నతాధికారులూ ఆరా తీసినట్లు సమాచారం.



ఆమె ఇంకా అలసిపోలేదు

- 42 కిలోమీటర్ల మారథాన్‌లో బంగారు పతకం సాధించిన విశ్రాంత ఐఏఎస్ రేచల్ చటర్జీ

ఈనాడు డిజిటల్, అమరావతి: ముంబయిలో నిర్వహించిన 42 కిలోమీటర్ల మారథాన్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారిణి రేచల్‌చటర్జీ బంగారు పతకం సాధించారు. టాటా ముంబయి మారథాన్ ఆధ్వర్యంలో ఏటా జనవరి మూడో ఆదివారం నిర్వహించే ఈ మారథాన్‌లో ఆమె నాలుగోసారి పతకం సాధించారు.

చంద్రన్న బీమాలో అగ్రస్థానం

- 2.48 కోట్ల మందికి లబ్ధి కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే
- ఉత్తమ పథకంగా జన్మభూమిలో బహుమతి

ఈనాడు-అమరావతి: ప్రధానమంత్రి చంద్రన్న బీమా యోజనలో అత్యధిక అసంఘటిత కార్మికులకు బీమా సౌకర్యం కల్పిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలుస్తోంది. రాష్ట్రంలోనే ఉత్తమంగా అమలవుతున్న పథకంగా 'జన్మభూమి'లో ప్రభుత్వం సయితం అవార్డు ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర పథకాలను కలిపి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ మంది లబ్ధిదారులకు ఎక్కువ మొత్తంలో ప్రయోజనం కల్పించేలా సీఎం చంద్రన్న బీమాను రూపొందించారు. 2015కు ముందు అసంఘటిత కార్మికులకు ఆ స్థాయిలో బీమా సౌకర్యం లేదని కార్మిక అధికారులు తెలిపారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ఆమ్‌ఆద్మీ బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన, రాష్ట్ర బీమా పథకాలను కలిపి చంద్రన్న బీమాను రూపొందించారు. ఇందులో పరిహారం మొత్తాలను పెంచారు. సాధారణ మరణానికి రూ.2 లక్షలు (18-50 ఏళ్లలోపు, ఆ వయసు దాటితే రూ.30వేలు), ప్రమాదంలో మరణిస్తే ఏ వయసువారికైనా రూ.ఐదు లక్షలు, ప్రమాదంలో పూర్తిగా వైకల్యం పొందితే రూ.ఐదు లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.రెండున్నర లక్షలు ఇస్తున్నారు. తొమ్మిదో తరగతి, ఆపైన చదివే కార్మికుల పిల్లలకు ఉపకారవేతనాలుగా ఏడాదికి రూ.1200 చొప్పున ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 2.48 కోట్ల మందికి ఈ బీమా కల్పిస్తున్నారు. ఏటా అక్టోబరు2 గాంధీ జయంతినుంచి అక్టోబరు ఒకటి వరకు ఈ బీమాను లోగడ అమలుచేసేవారు. ఇప్పుడు కేంద్రం దేశమంతటా ఒకే విధానాన్ని నిర్దేశిస్తూ జూన్ ఒకటి నుంచి మే 31 వరకు పథకం అమలు చేయాలని ఆదేశించింది.

24 గంటల్లోనే రూ.ఐదువేల సాయం

'ఈనాడు'తో కార్మికశాఖ కమిషనర్ వరప్రసాద్



చంద్రన్న బీమాలో పాలసీదారులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది లేకుండా బీమా సొమ్మును పది రోజుల్లో వారి ఖాతాకు చేరేలా ఆన్‌లైన్ ఏర్పాట్లు చేశామని కార్మికశాఖ కమిషనర్ డి.వరప్రసాద్ చెప్పారు. చంద్రన్న బీమా ఉత్తమ పథకంగా ఎంపికైన నేపథ్యంలో ఆయన సోమవారం 'ఈనాడు'తో మాట్లాడారు.

- ఈ బీమా పాలసీదారుడు మరణించినా, ప్రమాదం జరిగినా వారి కుటుంబసభ్యులు 155214 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే చాలు.. పది రోజుల్లో బీమా సొమ్మును వారి ఖాతాలకు జమ చేయిస్తున్నాం. అంతా ఆన్‌లైన్ వ్యవస్థ ఏర్పాటుచేశాం.
- తొలుత 24 గంటల్లో కుటుంబానికి రూ.ఐదువేలను బీమా మిత్రలు అందిస్తారు. ఆ తర్వాత అవసరమైన కాగితాలన్నీ ఆయా శాఖలు వారం లోపు తట వారే ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఈ ప్రక్రియకు లోగడ 30 రోజులు పట్టేది. ఇప్పుడు పది రోజుల్లోపే పూర్తి చేసి బీమా సొమ్మును జమ చేస్తున్నాం. ఏ ప్రభుత్వశాఖ ఏ పత్రాన్ని ఎన్ని రోజుల్లో ఇవ్వాలో నిర్దేశించాం.
- క్లెయిమ్ దరఖాస్తు అప్‌లోడ్ చేయడానికి ముందే కార్మికశాఖ అన్నీ తనిఖీ చేసి సవ్యంగా ఉన్నాయో లేదో చూస్తుంది. దీని వల్ల ఆలస్యాన్ని నివారిస్తున్నాం.

31న శ్రీశైలం ఆలయం మూసివేత

శ్రీశైలం, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 31వ తేదీన శ్రీశైలంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఉభయదేవాలయాలను మూసివేయనున్నట్లు ఈవో భరత్‌గుప్తా తెలిపారు. గ్రహణం రోజు తెల్లవారుజామున 3.30 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి మంగళవాయిద్యాలు, సుప్రభాతసేవ, మహామంగళహారతులు జరపనున్నట్లు తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు సర్వదర్శనం ఉంటుందన్నారు. 8 గంటల నుంచి ఆలయ ద్వారాలు మూసివేయనున్నట్లు తెలిపారు. మరుసటి రోజు ఫిబ్రవరి ఒకటో తేదీన ఉదయం 3.30 గంటలకు తెరచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, శ్రీస్వామిఅమ్మవార్లకు ప్రాతఃకాలపూజలు జరిపి ఉదయం 6.30 గంటల నుంచి దర్శనాలు, ఆర్జిత సేవలు ప్రారంభిస్తారన్నారు.

తితిదే ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం

ఈనాడు డిజిటల్, అమరావతి: తిరుమల శ్రీనివాసుని బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న తితిదే ఉద్యోగులందరికీ బహుమానాన్ని అందించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. బ్రహ్మోత్సవ బహుమానంగా తితిదే ఉద్యోగులకు రూ.13,125, కాంట్రాక్టు, పొరుగుసేవల సిబ్బందికి రూ.6,562 అందించేందుకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రన్న సంక్రాంతి కానుకపై కమీషన్ పెంచడం హర్షణీయం

ఈనాడు డిజిటల్, అమరావతి: చంద్రన్న సంక్రాంతి కానుకపై కమీషన్‌ను రూ.5 నుంచి రూ.10కి పెంచినందుకు సీఎం చంద్రబాబుకు రాష్ట్ర రేషన్ డీలర్ల అధ్యక్షుడు దివిలీలా మాధవరావు కృతజ్ఞతలు తెలిపారు. పంచదార, కందిపప్పు, పామ్ ఆయిల్‌పై కూడా 10 శాతం కమీషన్ పెంచాలని ఓ ప్రకటనలో కోరారు.

పోలవరానికి మరో రూ.285 కోట్లు

- నాబార్డుకు చేరిన దస్త్రం

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖర్చుపెట్టిన మొత్తంలో మరో రూ.284.97 కోట్ల చెల్లింపునకు కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ ఆమోదముద్ర వేసినట్లు తెలిసింది. ఈ నిధుల విడుదలకు నాబార్డుకు సిఫార్సు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. దీన్ని మరో వారం పది రోజుల్లో నాబార్డ్ పాలకమండలిలో పెట్టి ఆమోదముద్ర వేసిన తర్వాత ఈ మొత్తం విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీంతోపాటు గతంలో కేంద్ర జలవనరుల శాఖ ఆమోదముద్ర వేసి పంపిన రూ.318 కోట్ల మొత్తాన్ని కూడా ఒకేసారి విడుదల చేయాలని నాబార్డ్ నిర్ణయించినట్లు సమాచారం. అలా అయితే ఒకేసారి రూ.602.97 కోట్లు పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అందే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు అభిప్రాయపడ్డాయి. మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన రూ.58వేల కోట్ల సవరించిన అంచనాలపై సీడబ్ల్యూసీ మదింపు చేపట్టినట్లు తెలిసింది. దీనిపైనా వారం పదిరోజుల్లో సీడబ్ల్యూసీ ఆమోదముద్ర వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ముందుకు కదలని రూ.497 కోట్ల దస్త్రం

పోలవరం ముంపు బాధితుల పునరావాసం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖర్చుచేసిన రూ.497 కోట్ల దస్త్రం మాత్రం దిల్లీలో ముందుకు కదలలేదని తెలిసింది. దీనిపై జలవనరులశాఖ ఇంతవరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని సమాచారం. సవరించిన అంచనాలపై నిర్ణయం తీసుకున్న తర్వాత ఈ అంశాన్ని పరిశీలిద్దామనుకుంటున్నారా? లేదంటే ఇంకేదైనా కారణముందా? అన్నది తెలియడంలేదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

వచ్చే నెలలో స్పిల్‌వే కాంక్రీట్ పనులు

- మంత్రి దేవినేని ఉమా

పోలవరం, న్యూస్‌టుడే: స్పిల్‌వే నిర్మాణంలో కాంక్రీట్, విద్యుత్కేంద్రం పునాది తవ్వకం పనులు ట్రాన్స్‌ట్రాయ్, నవయుగ కంపెనీలు వచ్చే నెల మొదటి వారం నుంచి వేగవంతం చేస్తాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. మే నెలాఖరుకు డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. దిగువ కాఫర్‌డ్యామ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని మండలాల నుంచి మండలానికో ఒక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసి రైతులకు పోలవరం పనులు చూపించడానికి తీసుకొస్తామన్నారు. దేశంలో జాతీయ ప్రాజెక్టులుగా 16 ప్రకటించగా అందులో పోలవరం పనులు ఒక్కటే వేగంగా సాగుతున్నాయన్నారు. ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని, 2009 నుంచి 2013 వరకు పోలవరం పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. అనంతరం ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో జల వనరుల శాఖాధికారులతో కలిసి పనులపై సమీక్షించారు. ఆయన వెంట ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్ఈ వీఎస్ రమేష్‌బాబు, నిడదవోలు ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఈఈలు ఉన్నారు.



యాఫ్రమ్‌వాల్ నిర్మాణ ప్రాంతంలో పనులు పరిశీలిస్తున్న జల వనరుల శాఖ మంత్రి దేవినేని

ఏపీ వక్ఫ్‌బోర్డు పాలక మండలి ఏర్పాటుకు హైకోర్టు అనుమతి

ఈనాడు, హైదరాబాద్: వక్ఫ్‌బోర్డు పాలక మండలి ఏర్పాటు చేసేందుకు ఏపీ సర్కారుకు హైకోర్టు అనుమతిచ్చింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరిస్తూ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పాలకమండలి ఏర్పాటు విషయంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే విభాగాలను మాత్రం పరిగణనలోకి తీసుకోవద్దని ప్రభుత్వానికి స్పష్టంచేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. వక్ఫ్‌బోర్డు ఏర్పాటులో భాగంగా ముస్లిం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ముతవల్లి, బార్ కౌన్సిల్ సభ్యుడు ఇలా నాలుగు విభాగాల్లో ఎన్నికలు జరిగేవని, అందుకు భిన్నంగా ఎమ్మెల్యే, ముతవల్లి విభాగాల్లో మాత్రమే ఎన్నికలు నిర్వహించేలా గతేడాది ఆగస్టు 10న ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేసిందని పేర్కొంటూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్‌ముస్తఫాషేక్ హైకోర్టును ఆశ్రయించారు. గతంలో ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి 'షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 31న ఎన్నికలు నిర్వహించుకోవచ్చని..పాలకమండలిని మాత్రం ఏర్పాటు చేయవద్దంటూ' మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులను ఎత్తివేయాలంటూ ఏపీ ప్రభుత్వం తాజాగా అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) రమేష్, వక్ఫ్‌బోర్డు తరఫున అరీఫుల్లా వాదనలు వినిపించారు. వక్ఫ్‌బోర్డుకు ఎన్నికలు పూర్తయ్యాయని..పాలకమండలి ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

మంత్రుల మాటలు విశ్వసించం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

వినుకొండ, న్యూస్‌టుడే: కాపు రిజర్వేషన్‌తో బీసీలకు అన్యాయం జరగదని మంత్రులు చెప్పే మాటలను తాము విశ్వసించడం లేదని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. వినుకొండ పట్టణంలోని కారంపూడి రోడ్డులో సంఘం కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ పాలనలో ముస్లింలకు ఇచ్చిన రిజర్వేషన్ విద్య, ఉద్యోగాలకు తప్ప రాజకీయాలకు వర్తించదని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ చెప్పినప్పటికీ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌పై పోటీ చేశారని చెప్పారు. ఇదే తరహాలో కాపులకు ఇచ్చిన రిజర్వేషన్ ద్వారా ఎన్నికల్లో పోటీ చేయరన్న నమ్మకం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీ సంఘాల నాయకులతో చర్చించి దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత వర్గాలను బీసీలుగా గుర్తించడాన్ని తాము సమర్థించలేమని.. కాపు రిజర్వేషన్ ఉపసంహరించుకునేంత వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సంఘ నేతలు బి.శ్రీను, అనుమల ప్రసాదరావు, సాంబశివరావు గౌడ్, వేముల శ్రీనివాసరావు, చల్లా వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

150 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలు

ఉక్కునగరం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం జరిగిన ప్రమాదంలో సుమారు 150 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలైంది. స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్)1లోని లాడిల్ 38లో ద్రవ ఉక్కును నింపి పైకి ఎత్తగానే లాడిల్‌కు అడుగు భాగంలో రంధ్రం పడి ద్రవ ఉక్కు నేలపాలైంది. కింద ఉన్న ట్రాన్స్‌ఫర్ కార్ కూడా ద్రవ ఉక్కులో చిక్కుకుపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. నేల పాలైన ద్రవ ఉక్కును తొలగించేందుకు సిబ్బంది శ్రమిస్తున్నారు. సుమారు మూడు షిఫ్టుల ఉత్పత్తికి నష్టం వాటిల్లవచ్చని ఉద్యోగులు తెలిపారు. ప్రైవేటు గుత్తేదారు నిర్వహణ సరిగా చేయకపోవడంతోనే సమస్య తలెత్తిందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

నాటక అకాడమీ కార్యాలయం ప్రారంభం

విజయవాడ, న్యూస్‌టుడే: నాటక రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవిరళ కృషి చేస్తున్నారని ఏపీ ప్రభుత్వ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. విజయవాడ మారుతీనగర్‌లోని మసీదు వీధిలో ఏపీ ప్రభుత్వ నాటక అకాడమీ కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి కళారంగ అభివృద్ధి కోసం 8 అకాడమీలను ఏర్పాటు చేయటమే కాకుండా ఒక్కో అకాడమీకి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు.

అన్నదాతల వెన్నంటి ఉంటాం

- మద్దతు ధరకు మినుముల కొనుగోలు
- వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి

ఈనాడు, అమరావతి – చిలకలూరిపేట, న్యూస్‌టుడే: 'రైతులు బలవన్మరణాలకు పాల్పడటం బాధాకరం. అన్నదాతల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెన్నంటి ఉంటుంది. ధైర్యంతో ముందుకెళ్లి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చండి..' అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో జరుగుతున్న జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను తిలకించారు. గుంటూరు సమీపంలోని లాం ఫాంలో నిర్వహించిన కిసాన్ మేళాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాల బారి నుంచి రైతులను కాపాడేందుకు మెగా సీడ్ పార్క్‌లో ప్రత్యేకంగా ప్రయోగశాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. 600 ఎకరాల్లో రూ.650 కోట్లతో సీడ్ పార్క్‌ని నిర్మిస్తున్నామన్నారు. 10 వేల మెట్రిక్ టన్నుల మినుములను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. టన్ను సుబాబుల్ రూ.4,200, జామాయిల్ రూ.4,400 మద్దతుకు కొనుగోలు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం పేపరు మిల్లులను ఆదేశించిందని.. ఆయా ధరలను అమలు చేయకపోతే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిర్పూర్ కాగజ్ నగర్ పేపరు మిల్లుకు సంబంధించి రైతులకు బకాయిపడ్డ రూ.16 కోట్లలో ప్రభుత్వం రూ.12 కోట్లు ఇచ్చేందుకు ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. మూడో విడత రుణ మాఫీలో రూ.3600 కోట్లకు రూ.3,300 కోట్లను విడుదల చేశామని వెల్లడించారు. ఎన్ని ఇబ్బందులున్నా నాలుగు, అయిదు విడతల రుణమాఫీ మొత్తాలను చెప్పిన ప్రకారం ఖాతాల్లో వేస్తామని భరోసా ఇచ్చారు. గత ఏడాదిలో మిర్చి పంట ధరలు పతనమవటంతో రైతులకు రూ.175 కోట్లను పరిహారం చెల్లించామన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంటే ప్రతిపక్ష నాయకులు మాత్రం రైతుల ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.



చిలకలూరిపేటలో నిర్వహించిన ఎడ్ల ప్రదర్శనలో పాల్గొన్న మంత్రులు సోమిరెడ్డి, ప్రత్తిపాటి

వైకాపా ఎమ్మెల్యే రోజా ఇంట్లో చోరీ



రోజా ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాంబాబు

రాయదుర్గం, న్యూస్‌టుడే: వైకాపా ఎమ్మెల్యే, సినీనటి రోజా ఇంట్లో చోరీ జరిగింది. హైదరాబాద్ మణికొండలోని ఆమె ఇంట్లో పడక గదిలోని బీరువా తాళాలు పగులగొట్టి బంగారు, వజ్రాభరణాలు, వెండి వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. రోజా తన భర్త ఆర్కే సెల్వమణి, అత్త శంబగంతో కలిసి మణికొండ పంచవటి కాలనీలో నివసిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 11న వారు చెన్నై వెళ్లారు. పని మనిషి రామలక్ష్మిని ఇంటివద్దే ఉంచి వెళ్లారు. ఆమె కూడా ఈ నెల 12న ఇంటికి తాళం వేసి పక్కింటివారికి ఇచ్చి పశ్చిమగోదావరి జిల్లాలోని స్వగ్రామానికి వెళ్లింది. ఈ నెల 18న తిరిగొచ్చిన రామలక్ష్మి ఆదివారం ఇంటిని శుభ్రపరుస్తుండగా.. పడక గదిలోని బీరువా తాళాలు పగులగొట్టి ఉన్న విషయాన్ని గుర్తించి యజమానులకు తెలిపింది. చోరీపై సోమవారం రాయదుర్గం పోలీసులకు సెల్వమణి ఫిర్యాదుచేశారు. పోలీసులు ఘటనాస్థలంలో వేలిముద్రలు, ఆధారాలను సేకరించారు. బంగారు గొలుసు, నెక్లెస్, జత బంగారు గాజులు (మొత్తం 14 తులాలు), జత డైమండ్ చెవిరింగులు, డైమండ్ బిల్ల, రెండు కిలోల వెండి వస్తువులు, మూడు చేతి గడియారాలు, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు సెల్వమణి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటికి వేసిన తాళాలు వేసినట్లే ఉన్నాయని, పైఅంతస్తులోని బీరువా తాళాలు మాత్రమే పగిలిఉన్నాయని పోలీసులు తెలిపారు. ఇంటి గురించి బాగా తెలిసినవారే చోరీకి పాల్పడి ఉంటారని..ఆ కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు.

'గాలి'కి మరో షాక్

- బ్రహ్మణి స్టీల్స్ యంత్రాలు స్వాధీనం

ఈనాడు, హైదరాబాద్: ఇనుప ఖనిజం అక్రమ తవ్వకాల్లో అరెస్టయిన గాలి జనార్దన్‌రెడ్డికి మరో షాక్ తగిలింది. వై.ఎస్.ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆర్భాటంగా శంకుస్థాపన చేసిన బ్రహ్మణి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లోని రూ.189 కోట్ల విలువైన యంత్ర సామగ్రిని డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్రహ్మణి ఇండస్ట్రీస్ పేరుతో కడప జిల్లా జమ్మలమడుగులో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఓబులాపురం మైనింగ్ కంపెనీకి సోదర సంస్థ అయిన ఈ ఉక్కు పరిశ్రమకు అవసరమైన యంత్ర సామగ్రిని 2009లో విదేశాల నుంచి చెన్నై ఓడరేవు మీదుగా ఎక్స్‌పోర్ట్సు ప్రమోషన్ కాపిటల్ గూడ్స్ స్కీం(ఈపీసీజీ) కింద దిగుమతి చేసుకున్నారు. దిగుమతి చేసుకున్న ఆరు నెలల్లో యంత్రాలను అమర్చడంతోపాటు ఈపీసీజీ షరతులన్నీ అమలు చేసేందుకు బ్రహ్మణి స్టీల్స్ అంగీకరించింది. దీనికోసం ప్రభుత్వం దిగుమతి సుంకం నుంచి మినహాయింపునిచ్చింది. అంగీకరించిన షరతులేవీ సంస్థ అమలు చేయలేదు. దీంతో డీఆర్ఐ అధికారులు కేసు నమోదు చేశారు. ఈపీసీజీ పథకంలోని నిబంధనలన్నీ యాజమాన్యం ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. దీంతోపాటు ఉక్కు పరిశ్రమ ప్రాంగణంలో డీఆర్ఐ అధికారులు తనిఖీలు చేశారు. 2009లో దిగుమతి చేసుకున్న యంత్రసామగ్రిని ఎనిమిదేళ్ల తర్వాత కూడా కనీసం బిగించలేదని, దిగుమతి సుంకం రూ.44 కోట్లు చెల్లించలేదని పరిశీలనలో తేలింది. ఈపీసీజీ నిబంధనలు ఉల్లంఘించినట్లు బ్రహ్మణి స్టీల్స్ ఛైర్మన్ కూడా అంగీకరించారని, ఇందుకుగాను కస్టమ్స్ చట్టం-1962 ప్రకారం బ్రహ్మణి స్టీల్స్‌లోని రూ.189 కోట్ల విలువైన యంత్రసామగ్రిని స్వాధీనం చేసుకున్నామని డీఆర్ఐ అధికారులు వెల్లడించారు.

గాలి జనార్దన్‌రెడ్డి విజ్ఞప్తికి సుప్రీం నిరాకరణ

బెంగళూరు, న్యూస్‌టుడే: బళ్లారితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి సమర్పించిన అర్జీని సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. అక్రమ గనుల తవ్వకం, ఖనిజాన్ని ఎగుమతి చేశారనే ఆరోపణలపై 2011 సెప్టెంబరు5న సీబీఐ అధికారులు గాలిని అరెస్టు చేయగా సుప్రీంకోర్టు జామీను మంజూరు చేసింది. బళ్లారి, కడప జిల్లాలకు వెళ్లకూడదని కూడా షరతు విధించింది.



తల్లికి పాదాభివందనం చేస్తున్న మంత్రి పరిటాల సునీత

అమ్మకు మంత్రి సునీత వందనం

రామగిరి, న్యూస్‌టుడే: సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని, ప్రతి ఒక్కరూ మాతృమూర్తిని గౌరవించాలని మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. సోమవారం అనంతపురం జిల్లా రామగిరి మండలంలో నిర్వహించిన 'అమ్మకు వందనం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత వెంకటాపురంలోని తన తల్లి నివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకొన్న అనంతరం కార్యక్రమానికి హాజరైనట్టు చెప్పి మంత్రి సునీత ఉద్వేగానికి లోనయ్యారు.

సెన్సెక్స్ ▲286 35798 | **నిఫ్టీ ▲71 10966** | **రూపాయి 63.87 ▼** (ఒక అమెరికా డాలరుకు) 03 పైసలు | **బంగారం 30,190 ▲** (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 15 | **వెండి 38,885** ముంబయిలో కిలో రూ.లలో 00 | **ముడి చమురు 68.64 ▲** (బ్రెంట్ ధర డాలర్లలో)




ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	26,141	+69
నాస్‌డాక్	7,386	+50
నిక్కీ 225 (జపాన్)	23,816	+08
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	32,393	+139
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,569	+19
షాంఘై(చైనా)	3,501	+13
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,715	–15
డాక్స్ (జర్మనీ)	13,470	+29

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.15	67.43
పౌండ్ స్టెర్లింగ్	80.65	93.53
యూరో	71.10	82.47
జపనీస్ యెన్/100	52.48	60.87
ఆస్ట్రేలియా డాలరు	46.47	53.77
సింగపూర్ డాలరు	43.99	52.13
థాయ్ బాత్/100	182.36	218.03
బహ్రెయిన్ దీనార్	157.51	180.50
కువైట్ దీనార్	175.87	218.94
ఒమన్ రియాల్	154.24	176.46
సౌదీ రియాల్	15.46	18.33
యూఏఈ దిర్హమ్	15.83	18.50
మలేషియా రింగిట్	14.44	17.76

సోమవారం నిఫ్టీ కదలికలు



పైలట్ శిక్షణకు సిమ్యులేషన్ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు గుడ్‌గావ్‌కు చెందిన ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్ఎస్‌టీసీ) సిమ్యులేషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. భవన నిర్మాణానికి కంపెనీ శంకుస్థాపన చేసింది. గుడ్‌గావ్‌లో కంపెనీకి ఒక సిమ్యులేషన్ కేంద్రం ఉండగా.. రెండో కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి హైదరాబాద్‌ను ఎంచుకున్నట్లు ఎఫ్ఎస్‌టీసీ డైరెక్టర్ సంజయ్ మందావియా తెలిపారు. 2018, మూడో త్రైమాసికానికి భవనం సిద్ధం కాగలదన్నారు. గుడ్‌గావ్‌లోని కేంద్రంలో అయిదు సిమ్యులేటర్లు ఉన్నాయని.. హైదరాబాద్‌లో దశల వారీగా ఎనిమిది సిమ్యులేటర్లను ఏర్పాటు చేస్తామని మరో డైరెక్టర్ బాస్రాన్ తెలిపారు. మొదటి దశలో ఒక్కొక్కటిగా అయిదు సిమ్యులేటర్లను ఏర్పాటు చేస్తామని, ఈ సిమ్యులేటర్ల కేంద్రం ఏర్పాటుకు దాదాపు రూ.250 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. వచ్చే 5-8 ఏళ్లలో దేశీయ విమానయాన రంగంలోకి దాదాపు 1,000 విమానాలు రాగలవని అంచనా. ఒక్కో విమానానికి 12 మంది పైలట్లు అవసరమవుతారు. 55 రోజుల పాటు ఇచ్చే సమగ్ర శిక్షణకు రూ.15 లక్షల రుసుము ఉంటుందని, ఒక్కో సిమ్యులేటర్ వ్యయం 8-15 మిలియన్ డాలర్లు ఉంటుందని వివరించారు.

యాక్సిస్ బ్యాంక్ ఆకర్షణీయం

- అక్టోబరు- డిసెంబరు లాభంలో 25% వృద్ధి
- గణనీయంగా తగ్గిన కేటాయింపులు



ముంబయి: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి యాక్సిస్ బ్యాంక్ ఆకర్షణీయ ఫలితాలు ప్రకటించింది. నికర లాభం 25.34 శాతం పెరిగి రూ.726.44 కోట్లకు చేరింది. మొండి బకాయిలకు కేటాయింపులను గణనీయంగా తగ్గించుకోవడం ఇందుకు కారణమైంది. గతేడాది ఆస్తుల నాణ్యతపై ఆర్‌బీఐ సమీక్ష నిర్వహించినప్పటి నుంచి మొండి బకాయిల నియంత్రణకు యాక్సిస్ బ్యాంక్ తీవ్రంగా యత్నిస్తోన్న సంగతి తెలిసిందే. 'ఆస్తుల నాణ్యత విషయంలో ఆర్‌బీఐ సూచనలకు ముందున్న స్థితికి చేరాం. ఇప్పటికే మొండి బకాయిలను గుర్తించడం పూర్తయినందున, వాటి వసూలుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించనున్నామ'ని యాక్సిస్ బ్యాంక్ ముఖ్య ఆర్థిక అధికారి జైరామ్ శ్రీధరన్ తెలిపారు. దృష్టి సారించాల్సిన సందేహాత్మక మొండి బకాయి ఖాతాల సంఖ్య కూడా 15కు పరిమితమైందని తెలిపారు. ఏడు త్రైమాసికాల క్రితం ఈ తరహా ఖాతాల నుంచి రావాల్సిన బకాయి విలువ రూ.22,600 కోట్లు కాగా. . ప్రస్తుతం రూ.5,300 కోట్లకు తగ్గిందని పేర్కొన్నారు. వసూళ్ల విషయంలోనూ బ్యాంకు రాణించింది. మొత్తం రూ.4,008 కోట్లను వసూలు చేయగా.. రూ.2,822 కోట్లను రైటాఫ్ (రద్దు) చేసింది. వీటన్నింటి కారణంగా కేటాయింపులు 25 శాతం తగ్గి రూ.2,811 కోట్లకు తగ్గాయి. అలాగే కేటాయింపుల కవరేజి నిష్పత్తి 65 శాతానికి పెరిగింది. ఈ నిష్పత్తిని 60- 65 శాతం మధ్య ఉంచేలా లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సమీక్ష త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 5.28 శాతానికి పెరిగింది. రుణాల మంజూరులో 21 శాతం వృద్ధి ఉన్నప్పటికీ, నికర వడ్డీ ఆదాయం కేవలం 9 శాతం పెరిగి రూ.4,732 కోట్లకు చేరింది. మరోవైపు ట్రెజరీ లాభాల్లో క్షీణత కారణంగా ఇతర ఆదాయం రూ.3,400 కోట్ల నుంచి తగ్గి రూ.2,593 కోట్లకు పరిమితమైంది. రుసుముల ఆదాయం 24 శాతం వృద్ధితో రూ.2,246 కోట్లుగా నమోదైంది. రానున్న రోజుల్లో రుణ గిరాకీకి మెరుగైన పరిస్థితులు కనిపిస్తున్నాయని శ్రీధరన్ చెప్పారు. అయితే రుణాలిచ్చే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. అత్యుత్తమ రేటింగ్ ఉన్న కార్పొరేట్లకే ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. వాట్సప్ లీక్‌లపై సెబీ నిర్వహిస్తోన్న దర్యాప్తుపై స్పందిస్తూ ఇలాంటివి జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టామని తెలిపారు. నియంత్రణ సంస్థకు ఇచ్చిన హామీకి యాజమాన్యం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

బీఎస్ఈలో షేరు 3.52% పెరిగి రూ.611.05 వద్ద ముగిసింది.

రాణించిన ఏషియన్ పెయింట్స్

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఏషియన్ పెయింట్స్ ఏకీకృత ప్రాతిపదికన రూ.567.21 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.489.31 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 15.92 శాతం అధికం. ఇక మొత్తం ఆదాయం రూ.4,315.31 కోట్ల నుంచి రూ.4,317.15 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.3,610.56 కోట్ల నుంచి రూ.3,475.12 కోట్లకు చేరాయి. సమీక్షిస్తున్న త్రైమాసికంలో భారత్‌లో డెకొరేటివ్ పెయింట్ వ్యాపారం ఒక అంకె వృద్ధికి పరిమితం అయిందని ఏషియన్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కేబీఎస్ ఆనంద్ వెల్లడించారు.

బీఎస్ఈలో షేరు 1.40 శాతం నష్టంతో రూ.1,176.70 వద్ద ముగిసింది.

వి-గార్డ్ లాభం రూ.36 కోట్లు

దిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో వి-గార్డ్ ఇండస్ట్రీస్ స్టాండలోన్ ప్రాతిపదికన రూ.35.76 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.25.29 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 41.39 శాతం ఎక్కువ. ఇక మొత్తం ఆదాయం రూ.450.58 కోట్ల నుంచి 16.75 శాతం వృద్ధితో రూ.526.08 కోట్లకు చేరింది. 'అన్ని ఉత్పత్తుల విభాగాల్లోనూ మెరుగ్గా రాణించాం. ప్రస్తుత త్రైమాసికంపై సానుకూలంగా ఉన్నాం. ఈ సీజన్ సైతం ఇందుకు దోహదపడనుంది' అని వి-గార్డ్ ఇండస్ట్రీస్ ఎండీ మిధున్ కె చిట్టిలపల్లి పేర్కొన్నారు.

బీఎస్ఈలో షేరు 3.34 శాతం పెరిగి రూ.247.35 వద్ద ముగిసింది.

పరుగో పరుగు..

- తాజా గరిష్ఠాలకు సూచీలు
- 11000కు చేరువలో నిఫ్టీ

సమీక్ష

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ, టీసీఎస్ వంటి దిగ్గజ షేర్లు దూసుకెళ్లడంతో.. వరుసగా నాలుగో రోజూ సూచీలు రికార్డు గరిష్ఠాలను అధిరోహించాయి. టీసీఎస్ 5.36 శాతం పెరిగి రూ.3,113.15 వద్ద, రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.50 శాతం లాభంతో రూ.971.20 దగ్గర ముగిశాయి. దేశీయ, విదేశీ మదుపర్లు స్థిరంగా కొనుగోళ్లు కొనసాగించడం కలిసొచ్చింది. అంచనాలు మించిన కంపెనీల త్రైమాసిక ఫలితాలు, జీఎస్‌టీ మండలి పన్ను రేట్లు తగ్గించడం సైతం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపాయి. ఆసియా షేర్లు సానుకూలంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,613.97 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం కొనుగోళ్ల మద్దతుతో అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 35,827.70 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 286.43 పాయింట్లు పెరిగి 35,798.01 వద్ద ముగిసింది. సెన్సెక్స్ గత అత్యధిక ముగింపు 35,511.58 పాయింట్లను అధిగమించింది. గత మూడు సెషన్లలో సూచీ ఏకంగా 740.53 పాయింట్లు లాభపడటం విశేషం. ఇక నిఫ్టీ సైతం 10,975.10 పాయింట్ల దగ్గర జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 71.50 పాయింట్ల లాభంతో 10,966.20 దగ్గర స్థిరపడింది. నిఫ్టీకి సైతం ఇది రికార్డు ముగింపు కావడం విశేషం.

వెలుగులోకి ఓఎన్‌జీసీ: హెచ్‌పీసీఎల్‌లో ప్రభుత్వానికి ఉన్న 51.11 శాతం వాటాను రూ.36,915 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఓఎన్‌జీసీ షేర్లు రాణించాయి. ఇంట్రాడేలో 6.40 శాతం పరుగులు తీసిన షేరు.. చివరకు 3.28 శాతం పెరిగి రూ.199.95 వద్ద ముగిసింది. ఇదే సమయంలో హెచ్‌పీసీఎల్ షేరు 3.55 శాతం నష్టంతో రూ.401.75 దగ్గర స్థిరపడింది.

- నిరుత్సాహకరమైన త్రైమాసిక ఫలితాలను ప్రకటించడంతో ఐటీ దిగ్గజం విప్రో షేరు 2.33 శాతం తగ్గి రూ.320.80 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 16 లాభాలతో ముగిశాయి. టీసీఎస్ 5.36%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.50%, యాక్సిస్ బ్యాంక్ 3.52%, ఓఎన్‌జీసీ 3.28%, యెస్ బ్యాంక్ 2%, బజాజ్ 2%, ఎల్ అండ్ టీ 1.97%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.07%, అదానీ పోర్ట్స్ 0.91%, సన్‌ఫార్మా 0.75% చొప్పున లాభపడ్డాయి. విప్రో (2.33%), భారతీ ఎయిర్‌టెల్ (1.62%), ఏషియన్ పెయింట్స్ (1.40%), హెచ్‌డీఎఫ్‌సీ (1.38%), ఎస్‌బీఐ (0.91%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ 2.01% లాభపడింది. స్థిరాస్తి 1.95%, యంత్ర పరికరాలు 1.79%, టెక్ 1.38%, మన్నికైన వినిమయ వస్తువులు 0.76%, ఆరోగ్య సంరక్షణ 0.66% చొప్పున రాణించాయి.

పైపుల విపణిలోకి హెచ్ఎస్ఐఎల్

- మెదక్‌లో రూ.160 కోట్ల యూనిట్
- వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 30,000 టన్నులు

ఈనాడు, హైదరాబాద్: శానిటరీవేర్‌ను విక్రయిస్తున్న హెచ్ఎస్ఐఎల్ (హిందుస్థాన్ శానిటరీవేర్ అండ్ ఇండస్ట్రీస్) గృహ నిర్మాణంలో వినియోగించే (ప్లంబింగ్) పైపుల విభాగంలోకి అడుగు పెట్టింది. 'ట్రూఫ్లో' బ్రాండ్‌తో సీపీవీసీ, యూపీవీసీ పైపులు, ఫిట్టింగ్‌లను ప్రవేశపెట్టినట్లు హెచ్ఎస్ఐఎల్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ సోమానీ తెలిపారు. ఈ పైపుల తయారీకి తెలంగాణలోని మెదక్ జిల్లా ఇస్నాపూర్‌లో 83 ఎకరాల్లో 30,000 టన్నుల వార్షిక సామర్థ్యంతో తయారీ యూనిట్‌ను కంపెనీ ఏర్పాటు చేసింది. మొదటి దశలో రూ.160 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు వివరించారు. రెండేళ్లలో ఉత్పత్తి సామర్థ్యాన్ని 60,000 టన్నులకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సందీప్ వివరించారు. 'దేశీయ శానిటరీవేర్ ఉత్పత్తుల మార్కెట్‌లో హెచ్ఎస్ఐఎల్ 40 శాతం వాటాతో అగ్ర స్థానంలో ఉంది. పీవీసీ పైపులు, ఫిట్టింగుల విపణిలో వచ్చే మూడేళ్లలో మొదటి అయిదు కంపెనీల్లో ఒకటిగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అయిదేళ్లలో ఈ వ్యాపారం ద్వారా రూ.800 కోట్ల అమ్మకాలు నమోదు చేయగలమని భావిస్తున్నా'మన్నారు. స్టాక్ మార్కెట్‌లో నమోదైన హెచ్ఎస్ఐఎల్ ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో 8-10 శాతం వృద్ధిరేటును నమోదు కాగలదని అంచనా వేస్తోంది. అయిదేళ్ల వ్యూహంలో భాగంగా ఏడాదికి 14-15 శాతం వృద్ధిరేటును నమోదు చేయాలని కంపెనీ లక్ష్యమని, అయితే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు అందుకు అనుగుణంగా ఉండకపోవచ్చని సోమానీ తెలిపారు.



సీపీవీసీ, యూపీవీసీ పైపులను విడుదల చేస్తున్న హెచ్ఎస్ఐఎల్ వీసీఎండీ సందీప్ సోమానీ, పైపుల విభాగం ప్రెసిడెంట్ రాజేశ్ పజ్‌నూ

మార్కెట్ కబుర్లు

- దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్(డీఎమ్ఆర్‌సీ) నుంచి రెండు కాంట్రాక్టుల నిమిత్తం అనుమతి పత్రాలను పొందినట్లు **జే కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్** పేర్కొంది.
- డాటా సైన్స్, కృత్రిమ మేధ రంగాల్లో సేవలను అందించడానికి **ఇన్ఫోసిస్**ను సాంకేతిక భాగస్వామిగా ఎ.ఎస్. వాట్సన్ గ్రూప్ నియమించుకుంది.
- గుజరాత్‌లోని భారుజ్ వద్ద వీఎస్ఎఫ్(విస్కోస్ స్టాపుల్ ఫైబర్) ఉత్పత్తిని విస్తరించడం కోసం **గ్రాసిమ్ ఇండస్ట్రీస్**కు పర్యావరణ అనుమతులు దక్కాయి. కంపెనీకి భారత్‌లో నాలుగు వీఎస్ఎఫ్ ప్లాంటున్నాయి.
- ప్రస్తుత వాటాదార్లకు రైట్స్ పద్ధతిలో ఈక్విటీ షేర్లను జారీ చేయడం ద్వారా రూ.2000 కోట్లను సమీకరించడానికి సెబీ నుంచి అనుమతులు దక్కినట్లు **ఇండియా బుల్స్ వెంచర్స్** వెల్లడించింది.
- **సీమెన్స్ గమేసా**కు దేశవ్యాప్తంగా మొత్తం 326 మెగా వాట్ల పవన విద్యుత్ సామర్థ్య ఏర్పాటుకు వివిధ ఆర్డర్లు దక్కాయి.
- **కల్పతరు పవర్ ట్రాన్స్‌మిషన్**కు రూ.871 కోట్ల పనులు దక్కాయి. అందులో ఏపీట్రాన్స్‌కో నుంచి రూ.282 కోట్ల కాంట్రాక్టు ఉంది.
- రూ.600 కోట్ల నిధులను సమీకరించడం కోసం **రూట్ మొబైల్** పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఇందు కోసం సెబీకి ముసాయిదా పత్రాలను దరఖాస్తు చేసింది.
- వచ్చే మూడేళ్లలో తేలికపాటి వాణిజ్య వాహనాల(ఎల్‌సీవీ) ఎగుమతిని ప్రస్తుతమున్న 5 శాతం నుంచి 25 శాతానికి పెంచాలని **అశోక్ లేలాండ్** భావిస్తోంది.
- కోల్‌కతాకు చెందిన ఆయుర్వేద సంస్థ **బైద్యనాథ్** సహజ పళ్లరసాలను మార్కెట్లోకి విడుదల చేయడం ద్వారా ఎఫ్ఎమ్‌సీజీ రంగంలోకి అడుగుపెట్టింది.

ఔషధ షాపులకు తార్నియా డిజిటల్ సేవలు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని రిటైల్ ఔషధ షాపులకు క్లౌడ్ ఆధారిత డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చే ఉద్దేశంతో తార్నియా టెక్నాలజీస్ సొల్యూషన్స్ 'గో డిజిటల్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. కంపెనీకి చెందిన క్లౌడ్ ఆధారిత ప్లాట్‌ఫామ్ 'స్మార్ట్‌మైల్' ద్వారా పూర్తి స్థాయి డిజిటల్ ఔషధ షాపుగా మారిపోవచ్చని తార్నియా వ్యవస్థాపకుడు, సీఈఓ సురేశ్ సత్యమూర్తి తెలిపారు. ఔషధాల గురించి రోగులకు గుర్తు చేయడం, అమ్మకాల ఖాతాలు, నిల్వల నిర్వహణ తదితర కార్యకలాపాలన్నింటినీ ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా చేసుకోవచ్చు. నెలవారీ చందా ప్రతిపదికన ఈ ప్లాట్‌ఫామ్‌ను వినియోగించుకోవచ్చని తార్నియా తెలిపింది.

నేటి బోర్డు సమావేశాలు: ★ ఇండియాబుల్స్ హౌసింగ్ ★ యునైటెడ్ స్పిరిట్స్ ★ కెన్‌ఫిన్ హోమ్స్ ★ పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ★ ఐబీ రియల్ ఎస్టేట్ ★ ఎల్ అండ్ టీ టెక్నాలజీ ★ క్రాంప్టన్ గ్రీవ్స్ ★ ఫోర్స్ మోటార్స్ ★ ఎన్ఐఐటీ ★ న్యూక్లియస్ సాఫ్ట్‌వేర్ ★ ఓరియంట్ హోటల్స్ ★ ఆర్‌బీఎల్ బ్యాంక్ ★ స్వరాజ్ ఇంజిన్స్ ★ సింఫనీ ★ సింజెన్ ఇంటర్నేషనల్ ★ వాబ్కో

టీసీఎస్



రూ.2961 వద్ద ప్రారంభమై రూ.2922- 3134.70 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.2959.30తో పోలిస్తే రూ.157.10 (5.31%) లాభంతో రూ.3116.40 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 21,83,555.

హెచ్‌పీసీఎల్



రూ.405 వద్ద మొదలై రూ.398.35- 414.65 మధ్య చలించి క్రితం ముగింపు రూ.416.20తో పోలిస్తే రూ.14.40 (3.46%) నష్టంతో రూ.401.80 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 96,92,575 షేర్లు చేతులు మారాయి.


52 వారాల గరిష్ఠం (రూ.లలో)	
ఎల్ అండ్ టీ	1403.65
టాటా ఎలెక్సీ	1085.00
ఎంఫసిస్	812.90
మైండ్‌ట్రీ	764.30
సైయెంట్	683.80
యాక్సిస్ బ్యాంక్	621.75
బయోకాన్	614.40
వక్రంజీ	479.90
అదానీ పోర్ట్స్	443.35

52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
సీఎల్ ఎడ్యుకేట్	276.10
బలరామ్‌పూర్ చీనీ	116.50

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
22/01	7,002	5,435	1,568	3,583	4,054	–462
18/01	9,015	7,120	1,895	4,396	5,053	–657
17/01	7,883	7,258	625	4,688	4,520	169
16/01	8,203	7,510	693	4,003	4,249	–246
12/01	5,857	6,015	–158	3,264	2,568	696

22వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా (ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	412
బెంగళూరు	408	చెన్నై	405
23న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	412	నమక్కల్	390

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 438.05 (433.45) 7092514
AMBUJA CEMEN 268.45 (268.60) 1955296
ASIAN PAINTS 1176.00 (1189.90) 942542
AUROBIND PHA 640.80 (643.20) 1236464
AXIS BANK LT 611.55 (590.25) 21790443
BAJAJ AUTO L 3274.50 (3210.40) 223845
BAJAJ FINANC 1706.35 (1701.90) 924498
BHARTI AIRTE 490.70 (497.90) 4084647
BHARTI INFRA 343.50 (346.05) 6688121
BOSCH LTD 19981.50 (19976.15) 6083
BPCL 469.15 (477.30) 2168115
CIPLA 601.15 (602.75) 933769
COAL INDIA L 285.05 (284.00) 3025790
DR. REDDYS 2496.55 (2490.35) 692415
EICHER MOTOR 27649.80 (28009.45) 34466
GAIL 457.40 (468.75) 4637380
HCL TECH 966.35 (958.30) 2215659
HDFC 1872.00 (1901.25) 3649174
HDFC BANK 1963.35 (1952.20) 2212442
HERO MOTOCOR 3602.95 (3589.75) 320126
HINDALCO IND 255.10 (258.00) 6230212
HINDUSTAN UN 1355.10 (1362.45) 1014403
HPCL 401.80 (416.20) 9692575
ICICI BANK 351.50 (353.60) 15269782
INDIABULLS H 1355.15 (1301.80) 2123773
INDIAN OIL 382.50 (385.95) 1696363
INDUSINDBANK 1683.20 (1684.00) 820236
INFOSYS LTD 1150.00 (1143.45) 4825107
ITC 273.65 (274.55) 8339156
KOTAK MAHIND 1074.10 (1060.55) 3189930
LARSEN & TOU 1398.85 (1371.45) 3067658
LUPIN 930.05 (924.10) 1132432
M&M 759.60 (765.40) 934811
MARUTI SUZIK 9310.10 (9323.95) 454188
NTPC LTD 172.40 (172.75) 4518855
ONGC 200.70 (193.70) 23165754
POWER GRID C 195.30 (196.10) 5531239
RELIANCE IND 971.50 (931.30) 20892838
SBI 306.50 (309.25) 12622645
SUN PHARMA 576.15 (572.10) 3072409
TATA CONSULT 3116.40 (2959.30) 2183555
TATA MOTORS 421.90 (418.05) 4643782
TATA STEEL L 752.20 (753.00) 3605727
TECH MAHINDR 569.50 (552.90) 4127554
ULTRATECH 4330.00 (4300.00) 179728
UPL LIMITED 813.60 (802.35) 2396370
VEDANTA LIMI 326.95 (331.65) 7508442
WIPRO 321.55 (328.95) 4572569
YES BANK LTD 355.35 (349.35) 13456538
ZEE ENTERTAI 608.85 (600.35) 2713393

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1602.30 (1585.85) 79849
ACC 1827.20 (1829.50) 236750
ASHOK LEYLAN 121.05 (121.05) 7431883
AVENUE SUPER 1176.30 (1144.35) 487998
BAJAJ FINSER 5051.45 (4973.05) 104891
BANK OFBAROD 164.80 (165.40) 8918325
BEL 175.40 (172.75) 2628379
BHEL 104.55 (97.55) 19820608
BRITANNIA 4707.35 (4684.45) 80901
CADILA HEALT 438.75 (441.55) 491150
COLGATE PALM 1172.55 (1150.95) 167067
CONTAINER 1483.25 (1473.65) 562403
CUMMINS INDI 913.70 (903.30) 364007
DABUR INDIA 363.10 (363.80) 939881
DLF LIMITED 250.95 (249.30) 5026796
EMAMI LIMITE 1245.85 (1262.25) 162908
GLAXOSMI CON 6648.40 (6641.40) 4484
GLAXOSMI PHA 2463.05 (2473.60) 12715
GLENMARK PHA 620.20 (624.30) 497055
GODREJ CONSU 1092.70 (1050.95) 700187
HAVELLS INDI 552.65 (547.60) 2573233
HINDUSTAN ZI 292.45 (299.35) 2433313
ICICI PRU LI 438.75 (429.70) 7017568
IDEA CELLULR 99.50 (102.30) 7526353
INTERGLOBE A 1198.15 (1210.60) 281928
JSW STEEL LT 278.65 (282.10) 2143377
LIC HOUS.FIN 575.05 (562.00) 1974033
MARICO LIMIT 316.35 (314.10) 468259
MCDOWELL 3787.15 (3713.95) 901007
MOTHERSON 384.40 (382.30) 1168798
MRF 69677.30 (69156.00) 3327
NHPC LTD 30.05 (29.85) 5105065
NMDC LTD 144.15 (146.40) 2690707
OIL INDIA 371.80 (374.65) 686019
ORACLE FIN S 4208.00 (4094.05) 34273
P&G HYG&HEAL 9276.40 (9415.90) 5979
PETRONET LNG 237.80 (237.05) 1630985
PIDILITE IND 895.00 (890.35) 428801
PIRAMAL ENTE 2830.20 (2793.95) 166916
PNB 176.00 (176.40) 11370450
POWER FIN CO 120.00 (120.20) 2963447
RURAL ELEC C 155.65 (156.45) 2400565
SAIL 92.45 (93.30) 4967870
SHREE CEMENT 18479.35 (18354.60) 35976
SHRIRAM TRAN 1476.25 (1428.00) 496793
SIEMENS 1319.20 (1299.35) 228818
SUN TV LTD 1033.65 (1050.20) 482950
TATA POWER 92.10 (92.20) 3904900
TITAN IND 909.75 (891.45) 1495629
TORRENT PHAR 1451.35 (1430.50) 170417

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 231.25 (230.05) 1840596
ADANI ENTERP 198.90 (199.70) 5740115
ADANI POWER 37.60 (38.05) 21712302
ALL BANK 70.50 (70.80) 1715445
AMARA RAJA 824.45 (825.00) 351922
ANANT RAJIND 71.70 (71.30) 1311865
ANDHRA BANK 56.15 (56.50) 1235153
APOLLO HOSPI 1168.80 (1139.40) 246204
APOLLO TYRES 259.60 (264.80) 1411127
APTECH 357.50 (346.15) 391839
BAJAJ ELECT. 521.70 (530.75) 136344
BAJAJ HIND 14.50 (14.75) 2094260
BAJAJ HOLDIN 2800.85 (2800.50) 6872
BALAJI TELE 155.35 (155.25) 88079
BALLARPUR IN 16.15 (16.30) 1800564
BALRAMPUR CH 124.15 (122.70) 5300482
BANK OF MAHA 21.00 (21.00) 954291
BANK OFINDIA 164.30 (164.95) 2797130
BATA INDIA 730.35 (716.25) 358099
BGR ENERGY S 139.75 (135.65) 141221
BHARAT FORGE 739.70 (735.75) 708591
BHUSHAN STEE 65.45 (64.95) 2041256
BIOCON LTD 603.85 (569.35) 8470009
BOMBAY DYE 257.85 (254.50) 3262980
CANARA BANK 362.95 (362.70) 1798119
CEAT LIMITED 1837.85 (1866.85) 239404
CENTRAL BANK 73.20 (73.80) 770144
CHAMBAL FERT 155.65 (154.40) 629935
CHENNAI PETR 427.70 (446.50) 1472935
CITY UNIBANK 174.55 (175.90) 383914
CORPO BANK 39.00 (39.35) 252105
COX & KINGS 260.70 (262.25) 252369
D B REALTY L 70.20 (71.70) 590211
DELTA CORP L 350.15 (337.30) 6099582
DENA BANK 25.95 (26.10) 1468030
DHANALAKBANK 28.50 (28.75) 360550
DIVIS LAB 1077.85 (1098.30) 690857
EDELWEISS CA 289.55 (280.05) 3424840
EID PARRY 349.50 (358.75) 102328
EIH 203.55 (198.75) 305747
ESSAR SHIPPI 29.05 (28.70) 71771
ESTER INDUST 59.00 (59.60) 115049
EXIDE INDUST 223.60 (221.20) 1354953
FEDERAL BANK 101.60 (103.15) 10433194
FINOLEX CABL 743.70 (741.75) 37287
G E SHIP LTD 457.35 (450.95) 83683
GAMMON INFRA 3.80 (3.95) 6440948
GATI LIMITED 139.30 (137.65) 1597674
GAYATRI PROJ 218.55 (218.70) 260890
GITANJALIGEM 67.70 (68.40) 2662626
GMR INFRASTR 22.95 (22.65) 44668065
GODREJ IND 640.00 (621.85) 1071900
GRASIM IND 1239.30 (1223.55) 424445
GUJ ALK&CHEM 890.60 (876.00) 172080
GUJ NRE COKE 1.25 (1.30) 2134593
HCL INFOSYS 59.20 (58.50) 2372679
HDFC BANK 2040.00 (1973.00) 28765
HEXA TECH 352.20 (350.40) 950416
HIMACHAL FUT 32.10 (32.50) 5909885
HOUSING DEV 61.60 (60.90) 11823289
IDBI 61.10 (60.55) 2249718
IDFC 58.55 (58.00) 13107329
IFCI 31.00 (30.30) 17628181
IL&FS TRANS 83.10 (81.35) 566348
INDBULLS REL 243.30 (241.40) 3233293
INDIA CEM 184.75 (184.70) 3816769
INDIAN BANK 382.05 (381.25) 512874
INDO RAMA SY 49.40 (48.00) 179415
INDRAPRASTHA 309.70 (311.50) 1250293
INGERSOLL-R 820.45 (819.75) 8155
IOB 23.00 (23.15) 579960
IPCA LAB 588.35 (579.80) 192878
IRB INFRA DE 239.45 (236.85) 774813
J&K BANK 76.85 (76.15) 289872
JAI CORP 191.25 (187.65) 2381929
JAIN IRRIGAT 139.80 (136.00) 7703472
JAYPEE INFRA 15.00 (15.75) 13629476
JET AIRWAYS 783.40 (793.20) 1349937
JINDAL SAW 165.30 (157.75) 4487418
JINDAL STEEL 263.75 (264.15) 6732312
JK LAKSHMI C 430.70 (433.65) 27503
JK PAPER LIM 148.00 (142.95) 2319927
JM FINANCIAL 163.85 (166.95) 3431605
JP ASSOCIATS 21.95 (21.70) 230608204
JSW ENERGY L 88.70 (91.70) 6466273
JUBILANT FOO 2273.30 (2093.30) 6219270
JUBILANT ORG 887.45 (879.95) 943957
JYOTHY LABS 371.15 (375.45) 701101
JYOTI STRUC 12.60 (12.00) 1069887
KARNATA BANK 158.35 (158.85) 2586359
KEC INTL LTD 357.50 (359.80) 205069
KOLTE PATIL 378.25 (372.75) 245944
KPIT CUMMINS 199.95 (196.65) 1776217
L&TFIN.HOLD 178.30 (172.25) 6348380
LAK VIL BANK 140.30 (141.65) 406579
M & M FINANC 488.60 (468.60) 1619790
M & M FINANC 488.60 (468.60) 1619790
MANAPPURAM G 120.90 (119.65) 6054682
MMTC LIMITED 64.80 (64.20) 2612083
MPHASIS LTD 802.00 (789.55) 166055
MRPL 129.85 (125.95) 1899683
MTNL 26.05 (25.95) 1947058
NAGARJUNA OI 4.15 (4.25) 702207
NCC LIMITED 126.90 (126.70) 4155141
NETWORK18 FI 55.40 (54.60) 1193580
NEULAND LAB 885.40 (880.80) 6267
NIIT LTD 109.60 (106.55) 1170257
NIIT TECHNOL 765.75 (728.05) 2368114
OMAXE LTD 225.45 (228.35) 361484
ONMOBILE GLO 57.85 (57.70) 266058
ORIENTALBANK 122.45 (122.80) 1506301
PARSVNATH DE 25.25 (25.10) 58638
PATEL ENGG 81.10 (80.60) 388503
PFIZER 2145.55 (2123.00) 24908
POLARIS SOFT 416.20 (411.75) 199850
POWERTRADING 114.80 (115.90) 1027473
PRAJ IND 114.20 (112.90) 898746
PRISM CEMENT 142.60 (141.90) 890601
PUNJ LLOYD 23.60 (23.55) 1730485
PUNJAB & SIN 47.25 (47.35) 41380
PURAVANKARA 148.75 (147.65) 237953
PVP VENTURES 8.90 (8.50) 942654
PVR LIMITED 1474.10 (1469.05) 83847
RADICO KHAIT 389.60 (365.55) 6977855
RAJESH EXPOR 821.25 (821.95) 600859
RALLIS INDIA 270.95 (266.80) 510309
RAMCO IND 305.10 (304.70) 75416
RAMCO SYS 510.35 (511.05) 27069
RAMKY INFRA 222.50 (223.40) 72730
RAYMOND 1102.45 (1081.90) 261534
RELIANCE CAP 522.55 (529.25) 4040700
RELIANCE COM 28.65 (29.45) 55758132
RELIANCE INF 509.60 (517.85) 1637010
RELIANCE POW 48.00 (48.90) 7822291
ROLTA INDIA 70.65 (68.50) 1725401
SAGAR CEMENT 1050.65 (1048.65) 7152
SAREGAMA 802.60 (786.35) 158344
SHANTHI GEAR 158.80 (156.30) 67185
SHIPPNG CORP 90.10 (88.90) 711377
SHREE RENUKA 15.60 (15.95) 1395275
SINTEX IND 23.95 (24.20) 2508765
SOBHA DEVELO 599.25 (535.85) 1638202
SOUTHINDBANK 32.20 (32.25) 8732068
SRS LIMITED 1.80 (1.85) 254045
STERLITE TEC 368.60 (376.05) 818582
SUN PHARMA 501.70 (496.85) 165272
SUND FASTNER 551.80 (556.15) 86494
SUZLON ENERG 15.00 (15.10) 20158971
SYND. BANK 77.15 (78.95) 3656107
TATA CHEM 735.80 (724.65) 837925
TATA COFFEE 160.75 (159.90) 698033
TATA COMMUN 644.50 (633.85) 696045
TATA GLOBAL 308.85 (308.35) 3278437
TATA METALIK 887.60 (883.95) 175483
TATA MOT DVR 239.05 (243.70) 4752143
THE INDIAN H 150.65 (142.45) 4229498
TORRENT POWE 305.60 (302.80) 1204860
TRIVENI ENGG 66.00 (70.25) 1313044
TTK PRESTIGE 8668.85 (8644.00) 4908
TV TODAY NET 451.65 (452.70) 82296
TV18 BROADCA 61.20 (59.45) 6202429
TVS MOTOR 715.00 (715.20) 434972
UCO BANK 30.90 (31.20) 481363
UNION BANK 140.35 (141.35) 2546933
UNITECH 8.95 (9.05) 24736991
UNITED BANK 17.70 (17.75) 262891
UNITED BREWE 1155.55 (1096.05) 664035
USHA MARTIN 27.95 (28.40) 1161789
VADILAL INDU 919.70 (921.45) 6242
VENKYS 2552.50 (2455.45) 156592
V-GUARD IND 247.60 (239.65) 2930726
VIJAYA BANK 67.10 (66.70) 1268963
VIP 367.00 (362.50) 207408
VOLTAS 624.95 (618.20) 1377160
ZEE LEARN LI 45.45 (45.85) 424420
ZUARI GLOBAL 221.65 (212.20) 163103
ZYDUS WELLNE 1092.85 (1103.40) 3385

ఘనం (+) / గ్రహణం (-)

నిఫ్టీ	22న	మార్పు%
TCS	3116.40	5.31
RIL	971.50	4.32
INDIABULLS HSG	1355.15	4.10
AXIS BANK	611.55	3.61
ONGC	200.70	3.61
TECH MAHINDRA	569.50	3.00
BAJAJ AUTO	3274.50	2.00

నిఫ్టీ	22న	మార్పు%
HPCL	401.80	-3.46
GAIL	457.40	-2.42
WIPRO	321.55	-2.25
BHARAT PETRO	469.15	-1.71
HDFC	1872.00	-1.54
BHARTI AIRTEL	490.70	-1.45
VEDANTA	326.95	-1.42

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 954.90 (895.90) 78264
AMAR RAJA BA 825.15 (824.50) 15110
ANDHRA BANK 56.05 (56.40) 155731
ANDHRA CEMEN 13.37 (13.16) 28896
ANDHRA PAPER 383.35 (364.55) 24807
ANDHRA PETRO 67.90 (64.70) 242924
ANDHRA SUGAR 701.45 (671.90) 26682
ASTRA MICROW 117.50 (116.20) 94725
AUROBINDO PH 641 (643.35) 62047
AVANTI FEEDS 2512.15 (2459.60) 11330
BALAJI AMIN 701.15 (694.05) 4009
BARTRONICS 14.68 (14.57) 10338
BRILLIANT SE 15.34 (16.14) 64985
CAMBRIDGE TE 95.05 (96.95) 11907
CONT COFFEE 295.05 (294.15) 4368
COROMAN FERT 572.10 (572.80) 6648
CYIENT LIMIT 630.50 (653.10) 83716
DECCAN CEMEN 607.60 (611) 223
DIVI'S LAB 1078.75 (1095.50) 184148
DR REDDY 2491.50 (2487.50) 59902
GATI CORPN 139.50 (137.40) 229325
GAYATRI PROJ 218.45 (218.30) 27543
GMR INFRASTR 22.90 (22.65) 4570162
GOLDST INFRA 227.35 (215.55) 95040
GRANULES (I) 138.90 (135.90) 142144
GSS AMERICA 38.50 (39.15) 253102
GVK POWER 23.15 (22.05) 1051341
HBL NIFE POW 66.45 (63.90) 180946
HERITAGE FOO 790.35 (802.65) 3437
HIND FLUROCA 14.85 (15.62) 15030
HYD INDUS 1663.10 (1654.80) 4750
ILFS ENGINEE 48.35 (47.85) 11177
IVRCL INFRAS 5.69 (5.84) 176646
JEEVAN SCIEN 50 (51.20) 2597
KAKATIYA CEM 385.70 (384.30) 4837
KAVERI SEED 522.50 (510.30) 69882
KCP LTD 147.70 (149.40) 34226
KERNEX MICRO 55.95 (57.05) 69493
KNR CONSTRUC 309.65 (302.55) 12586
LANCO INDUS 398.20 (397.35) 14389
LANCO INFRAT 1.95 (2.05) 498608
LAURUS LABS 549.70 (542.70) 7183
MADHUCON PRO 34.40 (33.50) 45411
MEGA SOFT 14.81 (15.40) 22968
MOLD-TEK.TEC 71 (71.80) 9191
MOLDTK PLA 361.75 (354.80) 7973
NAGARJAGRICH 55.90 (56.85) 40825
NATCO PHARMA 1008.05 (1014.85) 23082
NAVA BH VENT 165.45 (165.10) 208070
NCC 126.75 (126.30) 395062
NCL IND 289.80 (282.20) 39191
NEULAND LAB 896.40 (878.25) 1720
NIHAR INFO 14.99 (14.50) 1501
OIL COUNTRY 54.05 (54.40) 26767
PANYAM CEMEN 60.20 (61.60) 16183
PENNER IND 63.90 (63.65) 87086
PITTI LAMIN 97.35 (95.90) 11802
POKARNA 229.25 (229.40) 4221
PRAJAY ENGS 17.70 (17.10) 23626
PRISM CEMENT 143.15 (142.10) 155859
RAIN INDUSTR 430.80 (432.45) 498998
SAGAR CEM 1047.55 (1050.90) 2744
SAMKRG PIST 338.20 (336.80) 2936
SMS PHARMA 105.15 (101.60) 211631
SPHERE GLOBA 43.05 (43.75) 19749
SREE RAYAL A 73.35 (71.35) 262383
SRINIVASA SH 83.65 (87.40) 17889
STEEL EXCHAN 34.40 (34.30) 61229
SUJANA METAL 1.57 (1.59) 16500
SURANA TELE 6.09 (6.18) 26478
SURYALAKSH.C 96.20 (98.35) 2585
SURYALATA SP 175.70 (173.55) 2373
SUVEN PHARMA 199.80 (198.60) 61383
TAJ GVK HOTE 188.50 (185.65) 22859
TANLA 39.60 (39.20) 102374
TERA SOFTWAR 65.60 (65.15) 1726
VBC FERRO 52.65 (53.55) 7771
VICEROY HOTE 19.40 (18.95) 92927
VIJAY TEXTIL 55.60 (53) 15116
VIMTA LABS 180.85 (174.45) 12078
VISAKA IND 779.10 (769.85) 11934
VISTA PHARMA 46 (47) 41929
VIVIMED LABS 93.30 (94.95) 121710
VST INDUS 3102.05 (3100) 700
YBRANT DIGIT 6.99 (7.02) 259011
ZENOTECH LAB 49.10 (48.50) 12541
ZENTECH 129.80 (127) 29014

ఫిక్కీ డైరెక్టర్ జనరల్‌గా దిలీప్ షెనాయ్

దిల్లీ: పరిశ్రమ సంఘం ఫిక్కీ డైరెక్టర్ జనరల్‌గా దిలీప్ షెనాయ్ నియమితులయ్యారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎస్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా, సియామ్ డైరెక్టర్ జనరల్‌గా, సీఐఐ డిప్యూటీ డీజీగా పనిచేసిన అనుభవం షెనాయ్‌కు ఉందని ఫిక్కీ తెలిపింది. ఎన్‌ఎస్‌డీసీ పనితీరుపై ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేయడంతో 2015 చివర్లో ఆయన పదవికి రాజీనామా చేశారు. యూపీఏ హయాంలో షెనాయ్ నియామకం జరిగింది. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మానవ వనరులకు శిక్షణ ఇవ్వడంతో ఎన్‌ఎస్‌డీసీ విఫలమైందని నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల విభాగం మాజీ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూడీ విమర్శించారు.



ఆధార్‌తో పేదలకు సాధికారత: పాయ్

బెంగళూరు: పేదలతో పాటు దేశ ప్రజలకు ఆధార్‌తో సాధికారత చేకూరుతుందని సీనియర్ ఐటీ దిగ్గజం మోహన్‌దాస్ పాయ్ అభిప్రాయపడ్డారు. ఆధార్‌పై వివాదాలు చెలరేగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆధార్ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు గోప్యతా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆధార్‌లో నిక్షిప్తమైన ఐరిస్ (కనుపాపలు), ఫింగర్‌ప్రింట్ (వేలి ముద్ర) వివరాలకు సంబంధించి ఎటువంటి ఉల్లంఘనలు చోటుచేసుకున్న ఘటనలు లేవని వెల్లడించారు. కొన్ని రాష్ట్రాలు, ప్రైవేట్ రాష్ట్రాలు ఆధార్ వివరాలను దుర్వినియోగం చేస్తున్నాయన్న అంశంపై మాట్లాడుతూ 'ఆధార్ దుర్వినియోగంలో యూఐడీఏఐ తప్పేమీ లేదు' అని పాయ్ అన్నారు.

విలాసవంత కార్లపై పన్ను తగ్గించాలి

● జేఎల్ఆర్ ఇండియా అధిపతి విజ్ఞప్తి

దిల్లీ: పెద్దగా ఉండే స్పోర్ట్స్ వినియోగ వాహనాలు (ఎస్‌యూవీ), విలాసవంత కార్లపై సహేతుక పన్నులు అమలైతే, ఈ విపణి మరింత పెరిగి, ఉపాధి అవకాశాలు అధికమవుతాయని జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) ఇండియా అధిపతి, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సూరి ప్రభుత్వానికి సూచించారు. విలాసవంత కార్లపై విధిస్తున్న పన్నులు ప్రపంచంలోనే ఇక్కడ అధికంగా ఉన్నాయని, అందువల్లే మరిన్ని సంస్థలు ఇక్కడ కార్ల బిగింపును (అసెంబ్లింగ్) చేపట్టడం లేదని పేర్కొన్నారు. సెస్‌ను పెంచాక, ఎస్‌యూవీలపై పన్ను 43% నుంచి 50 శాతానికి పెరిగిందని తెలిపారు. విలాసవంత కార్ల అమ్మకాలు పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తుందని, మరింతమందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ఒక డీలర్‌షిప్ వల్ల 50 మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. అందువల్ల వినియోగ వాహనం స్థాయిలోనే వీటిపై పన్ను విధించాలని అభ్యర్థించారు.

రూ.3 లక్షల వరకు పన్ను మినహాయించాలి



- ● 75 లక్షల మందికి ప్రయోజనం
- ● గృహరుణ వడ్డీపై రూ.2.50 లక్షలకు విస్తరించండి
- ● మరో 75 లక్షల మందికి ప్రయోజనం
- ● ఖజానాపై భారం రూ.7,500 కోట్లే : ఎస్‌బీఐ

దిల్లీ: ఏడో వేతన సంఘం నివేదిక అమలు అనంతరం, వ్యక్తిగతంగా ఖర్చు పెట్టుకునే ఆదాయం పెరిగినందున, ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.50,000 పెంచి, రూ.3 లక్షలు చేయాలని ఎస్‌బీఐ నివేదిక ప్రభుత్వానికి సూచించింది. ఇందువల్ల 75 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపింది. అదేవిధంగా గృహ రుణాలపై నెలవారీ వడ్డీకి ప్రస్తుతం రూ.2 లక్షల వరకు పన్ను మినహాయింపు లభిస్తోందని, దీన్ని రూ.2.50 లక్షలకు విస్తరిస్తే, మరో 75 లక్షల మందికి ప్రయోజనం లభిస్తుందని వివరించింది. ఇందువల్ల ఖజానాపై పడే భారం రూ.7,500 కోట్లు మాత్రమేనని పేర్కొంది. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని ప్రభుత్వం క్రమంగా పెంచుతూ వస్తోంది. 1990-91లో రూ.22,000గా ఉన్న ఈ పరిమితిని, 2014-15లో రూ.2.5 లక్షలకు విస్తరించింది.

పొదుపును ప్రోత్సహించాలి

బ్యాంకు డిపాజిట్ల ద్వారా ప్రజలు పొదుపు చేసుకునేలా ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలని కూడా నివేదిక కోరింది. పొదుపు ఖాతాల్లోని నగదు నిల్వలపై లభించే వడ్డీకి పన్ను మినహాయింపు ఇవ్వాలని సూచించింది. కాలావధి డిపాజిట్లపై లభించే వడ్డీకి ప్రస్తుతం రూ.10,000 వరకే ముందస్తు పన్ను వసూలు చేయడం లేదని, ఈ పరిమితిని పెంచవచ్చని పేర్కొంది. ప్రస్తుతం అయిదేళ్ల కాలావధి డిపాజిట్లపై పన్ను మినహాయింపులున్నాయని, ఈ కాల వ్యవధిని మూడేళ్లకు తగ్గించాలని సూచించింది.


- ✦ వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ)సంస్థలు, మౌలిక సదుపాయాల కల్పన, అందుబాటు ధర గృహాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యమివ్వాలి.
- ✦ కూరగాయలు సహా ప్రధాన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఇవ్వడంలో మధ్యప్రదేశ్, హరియాణా రాష్ట్రాల విధానాలను అనుసరించాలి. ఎంఎస్‌పీ కంటే టోకు ధర తక్కువగా ఉన్నపుడు, రైతుకు సాయం అందుతుంది. ఇందువల్ల రుణమాఫీలకు పెడుతున్న మొత్తాల్లో 10 శాతంతోనే రైతులకు ప్రయోజనం లభిస్తుంది.
- ✦ బడి పిల్లలకు మధ్యాహ్న భోజనంలో పాలు ఇస్తే కనుక, ఏటా 1.60 కోట్ల మంది రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది.
- ✦ సమ్మిళిత వృద్ధితో పాటు మధ్య, దీర్ఘ కాలానికి ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా, రాబోయే బడ్జెట్‌కు ఈ ప్రతిపాదనలు చేసినట్లు ఎస్‌బీఐ వివరించింది.

హెచ్‌పీసీఎల్ చేతికి ఎంఆర్‌పీఎల్!

● నగదు, షేర్ల మార్పిడి ద్వారా ఒప్పందం

● మూడో అతిపెద్ద ఇంధన శుద్ధి సంస్థగా ఆవిర్భావం

దిల్లీ: దేశంలో మూడో అతిపెద్ద ఇంధన శుద్ధి సంస్థగా అవతరించేందుకు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం చమురుశుద్ధి సంస్థ మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ (ఎంఆర్‌పీఎల్)ని స్వాధీనం చేసుకోవాలని యోచిస్తోంది.



మొత్తం లావాదేవీని నగదు, షేర్ల మార్పిడి పద్ధతుల్లో పూర్తి చేయాలని భావిస్తోంది. ఇదిలా ఉంటే రూ.36,915 కోట్లకు హెచ్‌పీసీఎల్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్లు ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) గతవారం ప్రకటించిన విషయం విదితమే. ఎంఆర్‌పీఎల్ ఇప్పటికే ఓఎన్‌జీసీకి అనుబంధ సంస్థగా ఉంది. హెచ్‌పీసీఎల్‌లో వాటా కొనుగోలు పూర్తయితే ఎంఆర్‌పీఎల్‌తో పాటు హెచ్‌పీసీఎల్ కూడా ఓఎన్‌జీసీకి అనుబంధ సంస్థగా మారుతుంది. రెండూ చమురుశుద్ధి సంస్థలే కావడంతో.. ఎంఆర్‌పీఎల్‌ను తమ అధీనంలోకి తెస్తే రెండింటి మీదా విడివిడిగా పెట్టే ఖర్చులు కలిసొస్తాయని హెచ్‌పీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ముకేశ్ కుమార్ సురానా తెలిపారు. ఎంఆర్‌పీఎల్ తమకు కొత్త కంపెనీ కాదని, 2003లో సంయుక్త సంస్థ భాగస్వామి అయిన ఏవీ బిర్లా గ్రూప్‌ను ఓఎన్‌జీసీ స్వాధీనం చేసుకునే వరకు తమతో ఉన్న సంస్థే అని వివరించారు. ఆ సంస్థలో తమకు 17% వాటా ఉందన్నారు.

- ✦ హెచ్‌పీసీఎల్‌కు 2.38 కోట్ల టన్నుల వార్షిక సామర్థ్యం కలిగిన రిఫైనరీ ఉంది. ఎంఆర్‌పీఎల్‌కు 1.5 కోట్ల టన్నుల వార్షిక సామర్థ్యం కలిగిన రిఫైనరీ ఉంది. సంయుక్త సంస్థ రిఫైనరీ సామర్థ్యం ప్రభుత్వ రంగంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) తరవాత రెండో అతిపెద్దది, ప్రైవేటుతో కూడా కలిపితే మూడో అతిపెద్దది అవుతుంది. స్వాధీనత తరవాతా హెచ్‌పీసీఎల్‌ను స్వతంత్ర నమోదిత సంస్థగానే కొనసాగించాలన్నది ఓఎన్‌జీసీ ప్రణాళిక.
- ✦ ఎంఆర్‌పీఎల్‌లో ఓఎన్‌జీసీకి 71.63%, హెచ్‌పీసీఎల్‌కు 16.96%వాటా లున్నాయి. ఎంఆర్‌పీఎల్‌లో ఓఎన్‌జీసీకి ఉన్న షేర్లను కొనుగోలు చేయడం ద్వారా, ఆ సంస్థను హెచ్‌పీసీఎల్ స్వాధీనం చేసుకోవచ్చు. ప్రస్తుత విలువ ప్రకారం, ఇందుకు రూ.16,000 కోట్లు అవుతుంది.
- ✦ షేర్ల మార్పిడి ద్వారా అయితే ఎంఆర్‌పీఎల్ నియంత్రణ హక్కులు ఇచ్చినందుకు, ఓఎన్‌జీసీకి అధిక షేర్లు దక్కుతాయి.
- ✦ మూడో పద్ధతిలో నగదు, షేర్ల మార్పిడి.. రెండింటినీ ఇందుకు వినియోగించవచ్చు.

భారత్ వైపే దావోస్ చూపు

- ● మోదీ దార్శనికత కోసం ప్రపంచం ఎదురుచూస్తోంది
- ● కార్పొరేట్ దిగ్గజాల అభిప్రాయం



దావోస్: ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత కోసం ప్రపంచం ఎదురుచూస్తోందని ప్రపంచ వాణిజ్య దిగ్గజాలు అభిప్రాయపడుతున్నారు. అమెరికా వంటి దేశాల నుంచి వెలువడుతున్న రక్షణాత్మక ధోరణులకు వ్యతిరేకంగా గళం వినిపించే అనుభవజ్ఞుడైన రాజకీయవేత్త అవసరం ఉందని భారత సీఈఓలు బలంగా కోరుకుంటున్నారు.

దావోస్ దిగ్గజం (గత కొన్నేళ్లుగా ఈయన ప్రపంచ ఆర్థిక సదస్సు వార్షిక సమావేశాలకు హాజరవుతున్నారు) ఉదయ్ కొటక్ మాట్లాడుతూ 'విక్రయానికి, మార్కెటింగ్‌కు మధ్య ఉన్న చిన్నని గీతను భారత్ అర్థం చేసుకోవాల్సి ఉంది. ఆ మేరకు భారత గళాన్ని వినిపించగల సత్తా ఉన్న నాయకుడు ఇక్కడ ఉండాల'ని ఆయన అన్నారు. 'భారత్ ఒక బహిరంగ ఆర్థిక వ్యవస్థ అని డబ్ల్యూఈఎఫ్‌కు అర్థమయ్యేలా సంకేతాలు పంపాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఒక సరికొత్త భారత్‌ను నిర్మిస్తున్నామని చెప్పడానికి మన దేశానికి ఇది ఒక గొప్ప అవకాశమ'ని అభిప్రాయపడ్డారు.

స్పైస్‌జెట్ సీఈఓ అజయ్ సింగ్ మాట్లాడుతూ 'దావోస్‌లో చెప్పడానికి భారత్ వద్ద అద్భుతమైన వృద్ధి కథనం ఉంది. దాన్ని వివరించడానికి మోదీని మించిన నేత లేరు' అని అభిప్రాయపడ్డారు. 'భారత్‌లో తీసుకున్న పలు ముఖ్యమైన సంస్కరణల గురించి 140 కోట్ల భారతీయుల గురించి, యువ జనాభా గురించి, మనకున్న మార్కెట్ గురించి చెప్పడానికి మోదీయే సరైన వ్యక్తి. గతేడాది చైనా ప్రధాని జి జిన్‌పింగ్ వచ్చినపుడు చైనాపై చాలా ఎక్కువ దృష్టి పడింది. సహజంగానే ఈ సారి దృష్టి భారత్‌పై ఉంటుంది' అని చెప్పుకొచ్చారు.

రక్షణాత్మక ధోరణులకు వ్యతిరేకంగా గళం: ఇక దావోస్ సదస్సులకు తరచుగా హాజరయ్యే ఐసీఐసీఐ బ్యాంక్ సీఈఓ చందాకొచ్చార్ మాట్లాడుతూ 'భారత్ వృద్ధి విస్తృతమవుతోంది. అన్ని రంగాలకూ అది వ్యాపిస్తోంది. ఇక్కడి అంతర్జాతీయ వర్గాలన్నీ ప్రధాని మోదీ కోసం, ఆయన చేసే ప్రసంగం కోసం అత్యంత ఆసక్తికరంగా ఉన్నారు. ఎందుకంటే ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' అంశంతో తన గళం వినిపించనున్నార'ని అన్నారు. నేడు జరగబోయే ప్లీనరీ సదస్సులో మోదీ కీలకోపన్యాసం చేయనున్న సంగతి తెలిసిందే. ప్రపంచ ఆర్థిక సదస్సులో తన తొలి ప్రసంగం కోసం ఎదురుచూస్తున్నానని మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే. 'భారత ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాల్లో రాణిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో 7 శాతం వృద్ధిని నమోదు చేయగలదు. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా కొనసాగడానికి సరైన మార్గంలోనే పయనిస్తోందన్నారు.

170 మంది భారత సీఈఓలు

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు 48 ఏళ్ల చరిత్ర ఉంది. మొత్తం 2000 మంది వ్యాపారవేత్తలు, 70 మంది దేశాధిపతులు ఈసారి హాజరుకానున్నారు. ఇందులో 130 మందికి పైగా భారత సీఈఓలు ఉన్నారు. ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ, బజాజ్ ఆటో ఛైర్మన్ రాహుల్ బజాజ్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ మిత్తల్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్, మహీంద్రా అండ్ మహీంద్రా అధిపతి ఆనంద్ మహీంద్రా, టాటా సన్స్ సీఈఓ చంద్రశేఖరన్‌లున్నారు. సోమవారం సాయంత్రం మొదలైన ఈ సమావేశాలు శుక్రవారంతో ముగియనున్నాయి. అయితే భారత ప్రధాని మోదీ నేడు చేయనున్న ప్రసంగంతో అధికారికంగా కార్యక్రమాలు మొదలు కానున్నాయి. ఇక అంతర్జాతీయ నేతల జాబితాలో జర్మనీ ఛాన్సలర్ యాంజెలా మెర్కెల్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రోన్, బ్రిటన్ ప్రధాని థెరిసా మే తదితరులున్నారు.

9.5 లక్షల కోట్లు

● మార్చి చివరి నాటికి మొండి బకాయిలు

● అసోచామ్-క్రిసిల్ నివేదిక అంచనా

దిల్లీ: భారత బ్యాంకింగ్ రంగంలో మార్చి చివరి నాటికి రూ.9.5 లక్షల కోట్ల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) నమోదుకానున్నట్లు అంచనా. అంతక్రితం ఏడాది ఇదే సమయానికి ఇవి రూ.8 లక్షల కోట్లుగా ఉన్నాయని అసోచామ్ - క్రిసిల్ నివేదిక పేర్కొంది. బ్యాంకింగ్ వ్యవస్థలోని అధిక స్థాయి మొండి బకాయిల వల్ల ఆస్తుల పునర్నిర్మాణ కంపెనీ(ఏఆర్‌సీ)లకు గొప్ప అవకాశం కలుగుతోందని ఆ నివేదిక అంటోంది. ఎన్‌పీఏల పరిష్కార ప్రక్రియలో కీలక భూమిక వహించేది ఏఆర్‌సీలేనన్న సంగతి తెలిసిందే. ఇంకా ఆ నివేదిక ఏమంటోందంటే..

- ✦ జూన్ 2019 నాటికి ఏఆర్‌సీల వృద్ధి 12 శాతానికి దిగజారొచ్చు. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎమ్) రూ.లక్ష కోట్లకు చేరొచ్చని అంచనా.
- ✦ మార్చి 31, 2018 నాటికి స్థూల నిరర్థక ఆస్తులు(జీఎన్‌పీఏలు) రూ.9.5 లక్షల కోట్లకు పెరగవచ్చు. ఇక ఒత్తిడిలో ఉన్న ఆస్తులు ఇదే సమయానికి రూ.11.5 లక్షల కోట్లకు చేరొచ్చు.
- ✦ ఒత్తిడిలో ఉన్న ఆస్తుల కోసం ప్రస్తుత కేటాయింపుల కంటే ఎక్కువ కేటాయింపులను బ్యాంకులు చేయవచ్చు. ఇందుకోసం తమ ఆస్తులను తక్కువ రేట్లకు విక్రయించే అవకాశమూ ఉంది. తద్వారా మూలధనాన్ని పెంచుకోనున్నాయి.
- ✦ ప్రస్తుతం ఏఆర్‌సీల వద్ద ఉన్న మూలధనంతో ఒత్తిడిలో ఉన్న ఆస్తులను కొనుగోలు చేయడానికి సరిపోదు కాబట్టి.. అవి పెద్ద ఫండ్‌లు, ఇతర పెట్టుబడుదార్లతో కలిసే అవకాశం ఉంది.
- ✦ మొత్తం ఒత్తిడిలో ఉన్న ఆస్తుల్లో 40 శాతం వాటా 50 ఆస్తులదే కావడం విశేషం. ఇందులోనూ 30 శాతం వాటా లోహ; 25% నిర్మాణ, 15% విద్యుత్ రంగాలకు చెందినవది. మిగతా రంగాలన్నీ కలిపి 30 శాతం కలిగి ఉన్నాయి.
- ✦ కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఈ మొండి బకాయిల సమస్యకు దివాలా స్మృతిని సమర్థంగా అమలు చేయడమే పరిష్కారం. పరిశ్రమలోని ఒత్తిడిలో ఉన్న ఆస్తుల రికవరీ రేటును పెంచుతుంది.

వర్ధమాన దేశాల్లో భారత్‌దే అధిక వృద్ధి రేటు!

2018లో 7.4%: ఐఎంఎఫ్

వాషింగ్టన్/దావోస్: భారత్ వృద్ధిరేటు 2018లో 7.4% ఉంటుందని, ఇదే సమయంలో చైనా 6.8 శాతం వృద్ధినే సాధిస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) తెలిపింది. వర్ధమాన దేశాల్లో భారత్ వృద్ధిరేటే అధికంగా ఉంటుందని పేర్కొంది. పెద్దనోట్ల రద్దుకు తోడు వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు వల్ల గతేడాది భారత వృద్ధిరేటు నెమ్మదించిందని తెలిపింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా ప్రపంచ ఆర్థిక భవిష్యత్తుపై నివేదికను సంస్థ విడుదల చేసింది. 2019లో భారత్ 7.8 శాతం% వృద్ధిరేటును సాధిస్తుందని అంచనా వేసింది. చైనా వృద్ధి 6.4 శాతానికి పరిమితమవుతుందని పేర్కొంది. వర్ధమాన దేశాల వృద్ధిరేటుకు సంబంధించి 2017 అక్టోబరులో వేసిన అంచనాల్లో ఎటువంటి మార్పులు చేయలేదు.

7 పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భేష్

డీహెచ్ఎల్, అసెంచర్ నివేదిక

ముంబయి: ప్రపంచంలోని 7 పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో, అధిక వృద్ధిరేటు సాధించే అవకాశాలు భారత్‌కే ఉన్నాయని అంతర్జాతీయ లాజిస్టిక్స్ దిగ్గజం డీహెచ్ఎల్, కన్సల్టింగ్ సంస్థ అసెంచర్ రూపొందించిన 'అంతర్జాతీయ వాణిజ్య కొలమానిని' నివేదిక పేర్కొంది. దేశీయంగా, అంతర్జాతీయంగా ఎగుమతులకు గణనీయ అవకాశాలు ఉండటం ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. అంతర్జాతీయ వాణిజ్యంలో 75 శాతం వాటా కలిగిన అమెరికా, బ్రిటన్, చైనా, దక్షిణకొరియా, జర్మనీ, జపాన్, భారత్‌లలో పరిస్థితులను నివేదిక విశ్లేషించింది. కృత్రిమ మేధ, బిగ్ డేటా, ఊహాత్మక విశ్లేషణలు ఈ నివేదిక రూపకల్పనకు వినియోగించారు.

9 షరతులు పాటిస్తే 0.1%



వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంలో దేశీయంగా జరిగే వివిధ వ్యాపార లావాదేవీలకు నాలుగు (5%, 12%, 18%, 28%) రకాల పన్ను శ్లాబులను ప్రభుత్వం నిర్ణయించిన సంగతి మనకు తెలుసు. ఇవి కాకుండా కొన్ని లావాదేవీలకు పన్ను మినహాయింపులు ఇవ్వగా.. చాలా వాటికైతే చెల్లించిన పన్ను మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తిరిగి పొందే సౌలభ్యాన్ని కల్పించింది. దేశీయ వ్యాపారాలకు సరే.. మరి ఎగుమతుల పరిస్థితి ఏంటి? ఎగుమతిదారు చేసే సరఫరాకు జీఎస్‌టీ వర్తిస్తుందా? లేదా? ఒకవేళ వర్తిస్తే చెల్లించిన పన్నులను ఐటీసీ కింద తిరిగి పొందే వీలుందా? ఎగుమతిదారుకు ఈ వస్తువులను విక్రయించే వర్తకులు చెల్లించాల్సిన పన్ను ఎంత? జీఎస్‌టీ నిబంధనలు ఏమి చెబుతున్నాయో కింది వ్యాసంలో తెలుసుకుందాం.



సతీష్ సరాఫ్

చార్టర్డ్ అకౌంటెంట్

సాధారణంగా ఎగుమతిదార్లు వర్తకుల దగ్గర వస్తువులను కొనుగోలు చేసి విదేశాలకు సరఫరా చేస్తుంటారు. ఎగుమతిదారుకు వస్తువులను సరఫరా చేసే వర్తకుడిని 'వర్తక ఎగుమతిదారు'గా చట్టాలు నిర్వచించాయి. అంటే వస్తువులను ఎగుమతి చేయకపోయినప్పటికీ వీళ్లు కూడా ఓ విధంగా ఎగుమతిదార్లే అన్నమాట. ఎగుమతిదారుకు ఏవైతే పన్ను ప్రయోజనాలున్నాయో వాటిని ఈ వర్తక ఎగుమతిదార్లకు కూడా గత, ప్రస్తుత పన్ను చట్టాలు వర్తింపజేశాయి.

ఉదాహరణకు రాజేశ్ ఓ ఎగుమతిదారు అని అనుకుందాం. ఇతను సురేశ్ దగ్గర వస్తువులను కొనుగోలు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తుంటాడు (పై నిర్వచనం ప్రకారం ఇక్కడ సురేశ్ వర్తక ఎగుమతిదారు అవుతాడు). ఒక రోజు మలేసియాలోని ఓ వర్తకుని దగ్గర నుంచి రాజేశ్‌కు వస్తువుల ఎగుమతి ఆర్డరు లభించింది. ఆ వస్తువులను సురేశ్ దగ్గర కొనుగోలు చేసి విదేశీ వర్తకునికి రాజేశ్ సరఫరా చేశాడు. ఇలాంటి సందర్భంలో జీఎస్‌టీకి ముందు, ఆ తర్వాత పన్ను చెల్లింపుల్లో వచ్చిన వ్యత్యాసాన్ని చూద్దాం.

జీఎస్‌టీకి ముందు

విదేశీ వర్తకునికి రాజేశ్ చేసిన సరఫరాకు విలువ ఆధారిత పన్ను (వ్యాట్), కేంద్ర విక్రయ పన్ను (సీఎస్‌టీ) నుంచి మినహాయింపు ఉంది. ఇక వస్తువుల ఎగుమతులకు సేవా పన్ను వర్తించదు.

వర్తక ఎగుమతిదారుగా సురేశ్‌కు కూడా వ్యాట్, సీఎస్‌టీ వర్తించదు. కేంద్ర విక్రయ పన్ను చట్టం- 1956, సెక్షన్ 5లో ఉన్న నిబంధనలు ఈ విషయాన్ని చెబుతున్నాయి.

జీఎస్‌టీ విధానంలో..



జీఎస్‌టీ చట్టం ప్రకారం ఎగుమతులకు శూన్య పన్ను రేటు వర్తిస్తుంది. అలాగే కొనుగోలు సమయంలో సురేశ్‌కు రాజేశ్ ఏదైతే జీఎస్‌టీ చెల్లించాడో.. ఆ మొత్తాన్ని ఐటీసీ రూపేణా రాజేశ్ తిరిగి పొందొచ్చు, అలా వచ్చిన ఐటీసీని రిఫండ్‌గా పొందవచ్చు.

మరో ప్రత్యామ్నాయ మార్గం కూడా ఉంది. ఎగుమతులపై రాజేశ్ ఐజీఎస్‌టీని ఎగుమతి రశీదులో చూపించి, సురేశ్‌కు చెల్లించిన పన్ను మొత్తానికి దీనిని సర్దుబాటు చేయొచ్చు. ఆ తర్వాత ఎంతైతే ఐజీఎస్‌టీ చెల్లించాడో దానిని పన్ను రిఫండ్ కింద తిరిగి పొందొచ్చు.

వర్తక ఎగుమతిదారుకు (సురేశ్) పన్ను వర్తింపునకు సంబంధించి 22-10-2017 వరకు జీఎస్‌టీ చట్టంలో ప్రత్యేక నిబంధనలేమీ లేవు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన జులై 1వ తేదీ నుంచి అక్టోబరు 22వ తేదీ వరకు రాజేశ్‌కు సురేశ్ విక్రయించిన వస్తువులకు పూర్తి పన్ను రేటు వర్తించేది. అయితే అక్టోబరు 23న సెంట్రల్ ట్యాక్స్ రేట్ కింద ఒక నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం.. ఎగుమతిదారుకు ఎగుమతుల నిమిత్తం వర్తకులు చేసే వస్తువుల సరఫరాకు 0.10% (సీజీఎస్‌టీ+ ఎస్‌జీఎస్‌టీ) పన్ను చెల్లిస్తే సరిపోతుంది. అయితే ఈ రాయితీ పన్ను రేటును పొందాలంటే తొమ్మిది షరతులను సంతృప్తిపరచాలి. (ఆ షరతులు పక్క పట్టికలో)

ఎగుమతిదారు, వర్తక ఎగుమతిదారు పక్కన పేర్కొన్న షరతుల్లో ఏ ఒక్కటిని సంతృప్తిపరచకపోయినా 0.1% పన్ను రేటు పొందే వీలుండదు. అప్పుడు ఎగుమతిదారుకు చేసిన సరఫరాపై పూర్తి పన్ను రేటును (ఉదాహరణకు 28 శాతమైతే) వర్తక ఎగుమతిదారు వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే నికరంగా చెల్లించే పన్ను 27.9% పెరుగుతుందన్నమాట. చెల్లించిన పన్ను మొత్తాన్ని ఎగుమతిదారు తిరిగి పొందే వీలున్నప్పటికీ.. ముందుగా పన్ను చెల్లించాల్సి ఉంటుండటంతో వ్యాపార నిర్వహణకు అధిక మూలధనం అవసరం అవుతుంది. అందుకే పై షరతులను సంతృప్తి పరిస్తే ఎగుమతిదారుకు పెద్దగా పన్ను చెల్లించాల్సిన పని ఉండదు. మూలధనంపైనా ప్రభావం పడదు.

వర్తక ఎగుమతిదారు విషయానికొస్తే.. 28% లేదా 0.1 శాతంలో పన్ను రేటు ఏదైనప్పటికీ అతని వ్యాపారంపై ఎలాంటి ప్రభావం ఉండదు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లేదా ఎగుమతిదారు నుంచి వసూలు చేసిన పన్ను మొత్తాన్ని ఈ రెండు పన్ను రేట్లతో చెల్లించే పన్నులకు వినియోగించే వీలుండటమే ఇందుకు కారణం.

గమనిక: పై వ్యాసంలో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా ఎవరైనా వ్యాపారపరమైన నిర్ణయాలు తీసుకోదలిస్తే ముందుగా జీఎస్‌టీ చట్టంలోని సంబంధిత నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయడం మంచిది.

షరతులు ఇవే

1) వర్తక ఎగుమతిదారు (సురేశ్) చేసిన వస్తువుల సరఫరాకు పన్ను రశీదు ఉండాలి.

2) పన్ను రశీదు తేదీ నుంచి 90 రోజుల్లోగా ఎగుమతిదారు (రాజేశ్) వస్తువుల ఎగుమతిని పూర్తి చేయాలి.

3) ఎగుమతి బిల్లు కాపీలో వర్తక ఎగుమతిదారు జీఎస్‌టీ గుర్తింపు సంఖ్య, పన్ను రశీదు సంఖ్యను ఎగుమతిదారు పొందుపరచాలి.

4) ఎగుమతులు ప్రోత్సాహక మండలి లేదా వాణిజ్య విభాగం గుర్తించిన కమొడిటీ బోర్డు గుర్తింపును ఎగుమతిదారు కలిగి ఉండాలి.

5) వర్తక ఎగుమతిదారుకు చెందిన జీఎస్‌టీ అధికారికి కొనుగోలు ఆర్డరును ఎగుమతిదారు సమర్పించాల్సి ఉంటుంది.

6) ఎగుమతిదార్లు వర్తక ఎగుమతిదారు వ్యాపార ప్రాంతం నుంచే వస్తువులను ఎగుమతి చేయాలి. అంతేకాని తన వ్యాపార ప్రాంతానికి వస్తువులను తీసుకెళ్లి ఎగుమతి చేయకూడదు.

7) ఒక్కరి దగ్గర నుంచి కాకుండా ఎక్కువ మంది వర్తక ఎగుమతిదార్ల నుంచి వస్తువులను కొనుగోలు చేసి ఉంటే, వాటిని జీఎస్‌టీ గుర్తింపు సంఖ్య ఉన్న గిడ్డంగి (వేర్ హౌస్)కి తీసుకెళ్లి అక్కడ నుంచి ఎగుమతిదారు ఎగుమతి చేయాలి.

8) వివిధ వర్తక ఎగుమతిదార్ల నుంచి వస్తువులను కొనుగోలు చేసిన సమయంలో ప్రతి ఒక్క వర్తకుడి దగ్గర నుంచి పొందిన పన్ను రశీదు కాపీని గిడ్డంగి ఆపరేటర్ ధ్రువీకరించిన తర్వాత, ప్రతి ఒక్క వర్తక ఎగుమతిదారుకు చెందిన జీఎస్‌టీ అధికారికి సమర్పించాలి.

9) వస్తువులను ఎగుమతి చేశాక ఎగుమతి బిల్లు కాపీతో పాటు వర్తక ఎగుమతిదారుకు చెందిన జీఎస్‌టీ అధికారికి ఎగుమతి నివేదిక (మ్యానిఫెస్ట్) రుజువు కాపీని ఎగుమతిదారు సమర్పించాలి.

చాంపియన్స్



ఐపీఎల్ వీక్షణం ఇకపై కొత్తగా ఉండబోతోంది. లీగ్‌లో కీలక మార్పు చోటు చేసుకోబోతోంది. ఐపీఎల్ ఆరంభం నుంచి పదేళ్ల పాటు ఒకేలా ఉన్న మ్యాచ్‌ల వేళలు 11వ సీజన్ నుంచి మారబోతున్నాయి. ఇకపై సాయంత్రం మ్యాచ్ గంటన్నర ఆలస్యంగా 5.30కు ఆరంభం కానుండగా.. రాత్రి పోరు గంట ముందుగా 7కే మొదలవనుంది.

ఒకటి వెనక్కి.. ఇంకోటి ముందుకు!

- ఐపీఎల్ మ్యాచ్‌ల ఆరంభ వేళల్లో మార్పులు
- సాయంత్రం మ్యాచ్ 5.30కి, రాత్రి పోరు 7కే

11వ సీజన్ ఏప్రిల్ 7న మొదలు

దిల్లీ


శుక్లా

ఐపీఎల్ వీక్షకులు ఇకపై తమ షెడ్యూళ్లను మార్చుకోవాలి. వచ్చే సీజన్ నుంచి మ్యాచ్‌ల ఆరంభ వేళలు మారబోతున్నాయి. పదేళ్లుగా లీగ్‌లో సాయంత్రం మ్యాచ్ 4 గంటలకు, రాత్రి పోరు 8 గంటలకు ఆరంభమవుతున్న సంగతి తెలిసిందే. ఐతే వచ్చే సీజన్ నుంచి సాయంత్రం 5.30కి, రాత్రి పోరు 7 గంటలకు మొదలవుతాయి. 11వ సీజన్ నుంచి ఐదేళ్ల కాలానికి ఐపీఎల్ ప్రసార హక్కుల్ని సొంతం చేసుకున్న స్టార్ స్పోర్ట్స్ సంస్థ కోరిక మేరకే మ్యాచ్ వేళల్ని మారుస్తున్నట్లు లీగ్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా వెల్లడించాడు. "ప్రసారదారు కోరినట్లు మ్యాచ్ వేళల్ని మార్చడానికి పాలకమండలి అంగీకరించింది. రోజుకు రెండు మ్యాచ్‌లు జరిగేది వారాంతాల్లో మాత్రమే. ఆ రెండు రోజులు ఒక మ్యాచ్‌కు ఇంకో మ్యాచ్ అడ్డం పడినప్పటికీ, వేర్వేరు ఛానెళ్లలో ఒకేసారి మ్యాచ్‌లు చూపించే సౌలభ్యం తమకుందని ప్రసారదారు చెప్పింది" అని శుక్లా తెలిపాడు. ఐపీఎల్ 11వ సీజన్ ఏప్రిల్ 7న ముంబయిలో ఆరంభం కానుంది. మే 27న జరిగే ఫైనల్‌కు కూడా ముంబయే వేదిక. పూర్తి షెడ్యూల్ త్వరలో వస్తుంది. ఈ సీజన్ కోసం బెంగళూరులో ఈ నెల 27, 28 తేదీల్లో ఆటగాళ్ల వేలం జరగనుంది.

ఎందుకిలా..?

పదేళ్ల పాటు ఒక తీరుగా సాగిపోతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల వేళల్ని మార్చేయబోతుండటం ఆశ్చర్యం కలిగించే విషయమే. సాయంత్రం మ్యాచ్ అంటే 4 గంటలకు. . రాత్రి మ్యాచ్ అంటే 8కి అని అభిమానుల మనసుల్లో ముద్రించుకుపోయింది. రాత్రి మ్యాచ్‌ను ముందుకు జరిపి 7 గంటలకే మొదలుపెట్టాలన్న ప్రతిపాదన పాతదే. 8 గంటలకు మొదలయ్యే రాత్రి మ్యాచ్ ముగియడానికి దాదాపు 11.30 అవుతుంది. ఆ సమయంలో స్టేడియాల నుంచి ప్రేక్షకులు ఇంటికి వెళ్లడం సమస్యే. టీవీల్లో అర్ధరాత్రి దాకా మ్యాచ్‌లు చూడటమూ ఇబ్బందే. కొన్ని మ్యాచ్‌లు ఆలస్యమై 12 తర్వాత ముగుస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే 7 గంటలకు మ్యాచ్ ఆరంభిస్తే ప్రైమ్ టైంలో ప్రసారం ద్వారా లబ్ధి చేకూరి, రెండో మ్యాచ్‌కు వీక్షకుల సంఖ్య కూడా పెరుగుతుందన్న అభిప్రాయాలున్నాయి. వారాంతాలు వదిలేస్తే.. ఒక్క మ్యాచే ఉండే మిగతా ఐదు రోజులు రాత్రి 7కే మ్యాచ్ ఆరంభించడం ఆటగాళ్లు, ప్రేక్షకులు, వీక్షకులకు అనుకూలంగా ఉంటుంది. వాణిజ్య పరంగానూ ఇది మేలని అంచనా. ఐతే రెండో మ్యాచ్‌ను ముందుకు తెస్తే.. సాయంత్రం మ్యాచ్‌కు అడ్డం పడుతుందని.. దాని వల్ల ప్రసారంలో సమస్యలు తలెత్తుతాయని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. గత సీజన్ వరకు ఐపీఎల్‌ను ప్రసారం చేసిన సోనీ మ్యాక్స్ అందుకు సుముఖంగా కనిపించలేదు. స్టార్ స్పోర్ట్స్ మాత్రం అలా ఆలోచించలేదు. తమకు వేర్వేరు ఛానెళ్లున్న నేపథ్యంలో ప్రసారం విషయంలో సమస్య ఉండదని భావించింది. రోజుకు రెండు మ్యాచ్‌లు జరిగేది వారాంతాల్లో మాత్రమే. ఆ రెండు రోజులు సాయంత్రం మ్యాచ్‌లో ఒక ఇన్నింగ్స్ వరకు సమస్య లేదు. దీని రెండో ఇన్నింగ్స్, రాత్రి మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ మాత్రం ఒకదానికి ఒకటి అడ్డం పడతాయి. ఐతే సాయంత్రం మ్యాచ్‌లు 4 గంటలకే ఆరంభం కావడం వల్ల వాటికి ఆశించిన స్థాయిలో ఆదరణ ఉండట్లేదని.. ఒకదానికి ఒకటి అడ్డం పడ్డప్పటికీ.. కొత్త వేళల్లో మ్యాచ్‌లు నిర్వహించడమే నయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరి ఈ కొత్త ప్రయోగం ఎలాంటి ఫలితాన్నిస్తుందో చూడాలి.

రహానెను తప్పించడం సరైన నిర్ణయమే!



జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో తొలి రెండు టెస్టులకు అజింక్య రహానెను తప్పించడాన్ని భారత కోచ్ రవిశాస్త్రి సమర్థించుకున్నాడు. ఫామ్ ప్రకారం ఆ మ్యాచ్‌లకు రోహిత్ శర్మనే సరైనోడని అన్నాడు. కేప్‌టౌన్, సెంచూరియన్ టెస్టుల్లో.. విదేశాల్లో మంచి రికార్డున్న రహానెను కాదని రోహిత్‌ను ఆడించడంపై విమర్శలు రేగిన నేపథ్యంలో శాస్త్రి ఈ వ్యాఖ్యలు చేశాడు. "తొలి టెస్టులో రహానె ఆడి, విఫలమై ఉంటే, రోహిత్‌ను ఎందుకు ఆడించలేదని అడిగేవాళ్లు. రోహిత్ ఆడాడు కాబట్టి, మీరిప్పుడు రహానెను ఎందుకు ఆడించలేదని అంటున్నారు" అని సోమవారం రవిశాస్త్రి విలేకర్లతో అన్నాడు. "ఫాస్ట్ బౌలర్ల విషయంలోనూ ఇలాగే జరిగి ఉండేది. మీకు చాలా ప్రత్యామ్నాయాలున్నాయి. టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచించే అత్యుత్తమ నిర్ణయం తీసుకుంది. దానికే కట్టుబడి ఉంది. విదేశాల్లో మేం ప్రస్తుత ఫామ్ ఆధారంగా జట్టును ఎంచుకుంటాం. మీరు పరిస్థితుల గురించి ఆలోచిస్తారు" అని చెప్పాడు.

ఆ తప్పులున్నాయే..: రెండో టెస్టులో భారత్ ఓటమిలో మూడు రనౌట్లు కూడా కీలకయ్యాయి. భారత ఆటగాళ్లు చిన్నపిల్లలా తప్పులు చేశారని, ఈ తప్పులను జట్టు సరిదిద్దుకోవాలని రవిశాస్త్రి అన్నాడు. "ఆ రనౌట్లు దెబ్బతీశాయి. అసలే పరిస్థితులు కఠినంగా ఉన్నాయి. దానికి రనౌట్లు తోడు కావడం విచారం కలిగించాయి. ఆ తప్పులు మళ్లీ జరగవని ఆశిస్తున్నాం. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో, రెండు జట్ల మధ్య వ్యత్యాసం పెద్దగా లేనపుడు ఇలా వికెట్లు పారేసుకోవడం ఎంత మాత్రం సరికాదు. ఈ విషయం కుర్రాళ్లకు చెప్పాం" అని రవిశాస్త్రి చెప్పాడు.

ఓ పది రోజుల ముందు వచ్చుంటే..: టీమ్‌ఇండియా మరో పది రోజుల ముందే దక్షిణాఫ్రికాకు వచ్చుంటే బాగుండేదని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. "దక్షిణాఫ్రికాల్లో పరిస్థితులు భిన్నం. ఇక్కడ మరో పది రోజులు సాధన చేసుంటే బాగుండేదని అనిపిస్తోంది. కానీ మా పరాజయానికి అది సాకు కారాదు. పిచ్ రెండు జట్లకూ ఒక్కటే" అన్నాడు. జట్టు రెండు వారాల ముందే వెళ్లేలా ఇకపై విదేశీ పర్యటనల షెడ్యూలు తయారు చేస్తారని ఆశిస్తున్నట్లు రవిశాస్త్రి చెప్పాడు.

నేనా.. టాంపరింగా?



సిడ్నీ: ఇంగ్లాండ్‌తో ఆదివారం జరిగిన మూడో వన్డేలో బాల్ టాంపరింగ్‌కు పాల్పడ్డాడంటూ ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్‌పై ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అతడి పెదవులకున్న లిప్‌బామ్‌ను బంతికి రుద్దుతున్నట్లు ఉన్న వీడియో ఒక్కటి చక్కర్లు కొడుతోంది. దీనిపై స్మిత్ స్పందించాడు. "అది కేవలం ఉమ్ము మాత్రమే. లిప్ బామ్ అనుకుంటున్నారు. అప్పుడు నా పెదవులను గమనించినట్లయితే అవి ఎండిపోయి ఉన్నాయి. అప్పుడు నా పెదాలపై ఏమీ లేదు. నా నోటిలోని ఉమ్మును కొంచెం తీసి బంతికి రుద్దాను అంతే" అని స్మిత్ అన్నాడు.



టైటిల్‌పై సింధు గురి

- తప్పుకున్న శ్రీకాంత్, ప్రణయ్
- ఇండోనేసియా మాస్టర్స్ నేటినుంచే

జకార్తా: అద్భుత విజయాలతో 2017ను చిరస్మరణీయం చేసుకున్న భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి పి.వి. సింధు.. 2018లో శుభారంభం చేయాలని ఉవ్విళ్లూరుతుంది. ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నీతో సింధు కొత్త ఏడాదికి శ్రీకారం చుట్టనుంది. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో సింధు ఫేవరెట్‌గా బరిలో దిగుతుంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో హన్నా రమదిని (ఇండోనేసియా)తో సింధు, చెన్ యుఫెయ్ (చైనా)తో సైనా నెహ్వాల్ తలపడతారు. స్టార్ ఆటగాళ్ళు కిదాంబి శ్రీకాంత్, ప్రణయ్ ఈ టోర్నీ నుంచి తప్పుకున్నారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఫెంగ్ చాంగ్ (మలేసియా)తో పారుపల్లి కశ్యప్, కజుమస సకాయ్ (జపాన్)తో సమీర్‌వర్మ పోటీపడతారు. శుభంకర్ దేవ్, అభిషేక్ క్వాలిఫయర్స్‌లో అదృష్టం పరీక్షించుకోనున్నారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో తకుతొ- కనెకొ (జపాన్)తో సాత్విక్ సాయిరాజు- చిరాగ్, చింగ్- యాంగ్ హాన్ (చైనీస్ తైపీ)తో సుమీత్ రెడ్డి- మను అత్రి తలపడతారు.

ఆస్ట్రేలియన్ ఓపెన్లో మరో సంచలనం! పురుషుల సింగిల్స్ టైటిల్ ఫేవరెట్లలో ఒకడు, ఆరుసార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ ప్రిక్వార్టర్స్‌లోనే ఓడిపోయాడు. గాయం వల్ల ఆటకు ఆర్నెల్లు దూరమై ఈ టోర్నీతోనే పునరాగమనం చేసిన జకోవిచ్‌కు 21 ఏళ్ల కొరియా కుర్రాడు హియాన్ చంగ్ షాకిచ్చాడు. మరోవైపు స్విస్ మాస్టర్ రోజర్ ఫెదరర్ టైటిల్ దిశగా మరో అడుగు ముందుకేశాడు. అతను అలవోకగా క్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. ఆరో సీడ్ డొమినిక్ థీమ్ ఇంటిముఖం పట్టగా.. బెర్డిచ్, సాండ్‌గ్రెన్, ప్లిస్కోవా, హలెప్ క్వార్టర్స్ చేరారు.

జకో.. ఇంటికి


జకోవిచ్


చంగ్

- చంగ్ చేతిలో అనూహ్య ఓటమి
- ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్స్‌లో ఫెదరర్, బెర్డిచ్


హలెప్

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కనీసం సెమీఫైనల్ చేరతాడని అనుకున్న మాజీ నంబర్‌వన్ జకోవిచ్ ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టాడు. జకోవిచ్ అభిమాని అయిన కొరియా కుర్రాడు చంగ్ విజృంభించి.. తన ఆరాధ్య ఆటగాడి పోరాటానికి తెరదించాడు. గాయం కూడా జకోవిచ్ అవకాశాలను దెబ్బతీసింది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ 14వ ర్యాంకర్ జకోవిచ్ 6-7 (4-7), 5-7, 6-7 (3-7)తో 58వ ర్యాంకు ఆటగాడు చంగ్ చేతిలో వరుస సెట్లలో ఓడిపోయాడు. మూడో రౌండ్లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను కంగుతినిపించిన చంగ్.. జకోతో మ్యాచ్‌లోనూ విజృంభించి ఆడాడు. టైబ్రేకర్‌కు దారి తీసిన తొలి సెట్లో.. బలమైన సర్వీస్‌లతో చెలరేగిన చంగ్ 7-6 (7-4)తో సెట్ గెలుచుకున్నాడు. రెండో సెట్లో జకోవిచ్ పోరాడాడు. అయితే పదకొండో గేమ్‌లో నొవాక్ సర్వీసును బ్రేక్ చేసిన చంగ్.. ఆపై 7-5తో సెట్ గెలుచుకున్నాడు. మూడో సెట్లో జకోవిచ్ కాస్త మెరుగ్గా ఆడాడు. కానీ బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో చెలరేగిన చంగ్.. జకోవిచ్‌కు గట్టిపోటీ ఇచ్చాడు. టైబ్రేకర్‌లో నొవాక్ మళ్లీ తడబడడంతో చంగ్ 7-6 (7-3)తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. ఈ మ్యాచ్‌లో తొమ్మిది డబుల్‌ఫాల్ట్స్ చేసిన జకో.. ఓటమి కొనితెచ్చుకున్నాడు. ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్ చేరిన తొలి కొరియా ఆటగాడిగా చంగ్ చరిత్ర సృష్టించాడు.

రోజర్ అలవోకగా..: 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ మరో అడుగు ముందుకేశాడు. అతను పెద్దగా కష్టపడకుండానే క్వార్టర్స్ చేరాడు. ప్రిక్వార్టర్స్‌లో రెండోసీడ్ ఫెదరర్ 6-4, 7-6 (7-3), 6-2తో ఫుస్కోవిక్స్ (హంగేరి)పై విజయం సాధించాడు. ఈ టోర్నీలో క్వార్టర్స్ చేరడం రోజర్‌కిది పద్నాలుగోసారి. మరో ప్రిక్వార్టర్స్‌లో థామస్ బెర్డిచ్ 6-1, 6-4, 6-4తో ఫాగ్‌నిని (ఇటలీ)పై విజయం సాధించాడు. ఐదో సీడ్ డొమినిక్ థీమ్ కథ ముగిసింది. హోరాహోరీగా సాగిన పోరులో అమెరికా ఆటగాడు టెన్నిస్ సాండ్‌గ్రెన్ 6-2, 4-6, 7-6 (7-4), 6-7 (7-9), 6-3తో థీమ్‌కు షాకిచ్చాడు.

హలెప్, కెర్బర్ ముందంజ: మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్ సిమోనా హలెప్ (రుమేనియా), ఏంజెలిక్ కెర్బర్ (జర్మనీ) క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్స్‌లో హలెప్ 6-3, 6-2తో ఒసాకా (జపాన్)ను చిత్తు చేయగా.. కెర్బర్ 4-6, 7-5, 6-2తో సు వీయ్ (తైపీ)పై నెగ్గింది. మాడిసన్ కీస్ (అమెరికా) కూడా ముందంజ వేసింది. ఆమె 6-3, 6-2తో గర్సియా (ఫ్రాన్స్)పై నెగ్గింది. హోరాహోరీ సాగిన మరో మ్యాచ్‌లో ఆరో సీడ్ ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 6-7 (5-7), 6-3, 6-3తో తన దేశానికే చెందిన స్ట్రికోవాను ఓడించింది.

క్వార్టర్స్‌లో ఎవరితో ఎవరు?

పురుషులు

నాదల్ (స్పెయిన్)	×	సిలిచ్ (క్రొయేషియా)
దిమిత్రోవ్ (బల్గేరియా)	×	ఎడ్మండ్ (బ్రిటన్)
సాండ్‌గ్రెన్ (అమెరికా)	×	చంగ్ (దక్షిణ కొరియా)
ఫెదరర్ (స్విట్జర్లాండ్)	×	బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్)

మహిళలు

హలెప్ (రుమేనియా)	×	ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)
కెర్బర్ (జర్మనీ)	×	మాడిసన్ కీస్ (అమెరికా)
స్వితోలినా (ఉక్రెయిన్)	×	మెర్టిన్స్ (బెల్జియం)
వోజ్నియాకి (డెన్మార్క్)	×	సురేజ్ నవారో (స్పెయిన్)

బోపన్న, దివిజ్ ఔట్


బోపన్న

పురుషుల డబుల్స్‌లో భారత పోరాటం ముగిసింది. మూడో రౌండ్లో బోపన్న-వెస్లిన్ (ఫ్రాన్స్) 4-6, 7-6 (7-5), 3-6తో మరాచ్ (ఆస్ట్రియా)-పవిచ్ (క్రొయేషియా) చేతిలో పరాజయం చవిచూశారు. మరో మ్యాచ్‌లో దివిజ్ శరణ్-ఆండీ రామ్ (అమెరికా) 6-3, 6-7 (4-7), 4-6తో కుబొట్ (పోలెండ్)-మెలో (బ్రెజిల్) చేతిలో ఓడిపోయారు.


మిథాలీ సేనతో సచిన్ సెల్ఫీ

మహిళా క్రికెటర్ల కోసం మాస్టర్

ముంబయి: దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లబోతున్న భారత మహిళా క్రికెట్ జట్టును దిగ్గజ ఆటగాడు సచిన్ తెందుల్కర్ కలిశాడు. సోమవారం ముంబయిలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో మాస్టర్ వారితో ముచ్చటించాడు. సానుకూల దృక్పథంతో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లాలని.. అక్కడి పరిస్థితుల గురించి మరీ ఎక్కువగా ఆలోచించొద్దని తెందుల్కర్ వారికి సలహా ఇచ్చాడు. చిన్న చిన్న తప్పులు నివారించుకోవాలని.. తద్వారా తమపై ఒత్తిడి తగ్గించుకోవాలని సూచించాడు. కెప్టెన్ మిథాలీరాజ్‌తో పాటు ఇతర సభ్యులు సచిన్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఫిబ్రవరి 5న ప్రారంభమయ్యే సఫారీ పర్యటనలో భారత్.. మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది.

ఆంధ్ర హ్యాట్రిక్

వరుసగా మూడోసారి సౌత్‌జోన్ అండర్-14 ట్రోఫీ కైవసం

ఈనాడు, హైదరాబాద్: బీసీసీఐ సౌత్‌జోన్ అండర్-14 రెండ్రోజుల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర సత్తాచాటింది. వరుసగా మూడో సారి సౌత్‌జోన్‌లో ఛాంపియన్‌గా నిలిచింది. 2015-16, 2016-17 సీజన్‌లలో విజేతగా నిలిచిన ఆంధ్ర.. ఈ సీజన్‌లోనూ అగ్రస్థానం కైవసం చేసుకుని హ్యాట్రిక్ సాధించింది. కేరళలో ముగిసిన ఈ టోర్నీలో చివరి మ్యాచ్‌లో గోవాపై ఆంధ్ర గెలుపొందింది. బ్యాటింగ్‌లో కెప్టెన్ రషీద్ (369 పరుగులు), జయంత్ (168), మహేంద్ర దేవ్ (247).. బౌలింగ్‌లో సుమిత్ (21 వికెట్లు), కిరణ్ (13), మల్లికార్జున్ (12), చిన్నా (9) ఆంధ్ర తరపున సత్తాచాటారు. రషీద్‌ను 'మ్యాన్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు వరించింది. గత పదేళ్ళలో ఏడు సార్లు సౌత్‌జోన్‌లో విజేతగా నిలిచిన ఆంధ్ర.. రెండు మార్లు రన్నరప్‌గా ముగించింది. ఒకసారి మూడో స్థానంలో నిలిచింది. సౌత్‌జోన్ టోర్నీలో సత్తాచాటిన జట్టును ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) అధ్యక్షుడు జీవీకే రంగరాజు, కార్యదర్శి అరుణ్‌కుమార్ అభినందించారు. క్రికెటర్లు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు నగదు ప్రోత్సాహకం ప్రకటించారు.

నేటి నుంచి నాకౌట్ సమరం

క్వీన్స్‌టౌన్: అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో నాకౌట్ పరీక్షకు వేళైంది. మంగళవారం నుంచే సూపర్‌లీగ్ నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో ఇంగ్లాండ్ తలపడనుంది. లీగ్ దశ ఆరంభ మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిన ఆసీస్.. ఆ తర్వాత పుంజుకుని మిగతా రెండు మ్యాచ్‌లు గెలిచి నాకౌట్ చేరింది. భారత్ 26న బంగ్లాదేశ్‌తో క్వార్టర్స్ ఆడనుంది. ఈ పోటీలతో పాటు ప్లేట్ క్వార్టర్‌ఫైనల్స్ కూడా జరుగుతాయి.

విజృంభించిన సౌథీ, రాన్స్

తొలి టీ20లో పాక్‌పై కివీస్ ఘనవిజయం

వెల్లింగ్టన్: పాకిస్థాన్‌తో ఐదు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన న్యూజిలాండ్.. మూడు టీ20ల సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తొలి టీ20లో కివీస్ 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. సౌథీ (3/13), రాన్స్ (3/26), శాంట్నర్ (2/15) విజృంభించడంతో మొదట పాక్ 19.4 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. బాబర్ అజామ్ (41) టాప్ స్కోరర్. లక్ష్యాన్ని న్యూజిలాండ్ 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మన్రో 49 పరుగులతో అజేయంగా నిలిచాడు.

చెలరేగిన రైనా



- 59 బంతుల్లో 126
- ముస్తాక్ అలీ టీ20 టోర్నీ

కోల్‌కతా: టీమ్‌ఇండియాకు దూరమైన బ్యాట్స్‌మన్ సురేశ్ రైనా.. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో చెలరేగిపోయాడు. ఫోర్లు, సిక్స్‌లతో పరుగుల వరద పారించాడు. కెప్టెన్ రైనా విధ్వంసక శతకం (126 నాటౌట్; 59 బంతుల్లో 13×4, 7×6) బాదడంతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ 75 పరుగుల తేడాతో బెంగాల్‌ను చిత్తు చేసింది. రైనాతో పాటు ఆకాశ్‌దీప్ నాథ్ (80; 43 బంతుల్లో 7×4, 4×6) మెరవడంతో మొదట ఉత్తర్‌ప్రదేశ్ 3 వికెట్లకు 235 పరుగులు సాధించింది. లక్ష్యఛేదనలో బెంగాల్ తడబడింది. కుల్‌దీప్ యాదవ్ (4/26), మొహ్‌సిన్ ఖాన్ (3/35) విజృంభించడంతో 16.1 ఓవర్లలో 160 పరుగులకే ఆలౌటైంది. శ్రీవత్స్ గోస్వామి (57) టాప్ స్కోరర్. మరో మ్యాచ్‌లో రాజస్థాన్ 4 వికెట్ల తేడాతో ఝార్ఖండ్‌ను మట్టికరిపించింది. మొదట ఝార్ఖండ్ 5 వికెట్లకు 157 పరుగులు చేసింది. విరాట్ సింగ్ 43 పరుగులు చేశాడు. చాహర్, గర్వాల్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. గర్వాల్ (43), సల్మాన్ ఖాన్ (34) రాణించడంతో లక్ష్యాన్ని రాజస్థాన్ 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇంకో మ్యాచ్‌లో పంజాబ్ 3 వికెట్ల తేడాతో ముంబయిపై విజయం సాధించింది. యువరాజ్ సింగ్ (40), గుర్‌కీరత్ (43), వోహ్రా (42) మెరవడంతో 199 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ 19.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. శ్రేయస్ అయ్యర్ (79 నాటౌట్; 44 బంతుల్లో 8×4, 4×6) చెలరేగడంతో మొదట ముంబయి 4 వికెట్లకు 198 పరుగులు చేసింది.

విశ్వసనీయతలో 3.. సమ్మిళిత అభివృద్ధిలో 62వ స్థానం

దావోస్: ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ దేశంగా భారత్ మూడో స్థానం లభించింది. ప్రభుత్వం, వ్యాపారరంగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా పనితీరుపై ఎడల్‌మేన్ ట్రస్ట్ బారోమీటర్ అనే సంస్థ అధ్యయనం చేసి ర్యాంకులు ఇచ్చింది. ఈ నివేదికను సోమవారం ఇక్కడ ప్రారంభమైన ప్రపంచ ఆర్థిక వేదిక సందర్భంగా విడుదల చేసింది. ర్యాంకు బాగున్నా గత ఏడాదితో పోల్చితే 13 పాయింట్లు తగ్గిపోవడం గమనార్హం. విశ్వసనీయతలో చైనా ప్రథమ, ఇండోనేషియా రెండోస్థానాలు పొందాయి. 28 దేశాల్లో సర్వే చేయగా, 20 దేశాలు 'అవిశ్వసనీయ ప్రాంతాలు' అన్న విభాగంలో చేరాయి. 22 దేశాల్లో తొలిసారిగా మీడియా విశ్వసనీయత బాగా పడిపోయింది. భారత్‌లో 'తక్కువ నమ్మకం ఉన్న కంపెనీ'ల సంఖ్య 32 శాతంగా ఉంది. అమెరికా 37 పాయింట్ల మేర విశ్వసనీయత కోల్పోయింది. ప్రభుత్వంపై అధికంగా నమ్మకం పోయింది. తక్కువ నమ్మకం ఉన్న అమెరికా కంపెనీల సంఖ్య 50శాతంగా ఉంది.

సమ్మిళిత అభివృద్ధి సూచీలో భారత్‌కు 62వ స్థానం లభించింది. మొత్తం 72 'వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల' స్థితిగతులను అధ్యయనం చేసిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) ర్యాంకులు ప్రకటించింది. 'జీవన ప్రమాణాలు; పర్యావరణ పరిరక్షణ; భావి తరాలపై రుణభారం పడకుండా కాపాడడం, అభివృద్ధి-సుస్థిర ప్రగతి; సమ్మిళిత వృద్ధి; తరాల మధ్య సమానత్వం అనే అంశాలను పరిగణనలోకి తీసుకొని మదింపు వేసింది. భారత్‌కు ర్యాంకు తక్కువగా వచ్చినా సమ్మిళిత అభివృద్ధి మాత్రం 'వేగంగా పెరుగుతున్న' వర్గంలో ఉండడం విశేషం. అభివృద్ధి-సుస్థిర ప్రగతిలో 66వ స్థానం, తరాల మధ్య సమానత్వంలో 44వ ర్యాంకు వచ్చింది. పాకిస్థాన్ (52వ ర్యాంకు) నేపాల్ సహా అన్ని పొరుగుదేశాలు భారత్ కన్నా మంచి ర్యాంకులు పొందాయి. గత ఏడాది భారత్‌కు 60వ స్థానం లభించింది.

ఆర్థిక అసమానతలే కారణాలు

భారత్‌లోని ఆర్థిక అసమానతలే ర్యాంకులు తగ్గడానికి కారణం. కొన్ని దశాబ్దాలుగా సామాజిక సమానత్వం కన్నా ఆర్థిక అభివృద్ధికే ప్రాధాన్యం ఇవ్వడంతో ఆదాయాలు, సంపదలో అసమానతలు పెరిగాయి. పర్యావరణానికి నష్టం కలిగించేలా, భావితరాలపై భారం మోపేలా ఉన్న అభివృద్ధి విధానాలు కూడా ఇందుకు దోహదం చేశాయి. ఆర్థికశాస్త్రవేత్తలు స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) లెక్కలపై అధికంగా ఆధారపడుతున్నందువల్ల ఉద్యోగాల కల్పన, ఆర్థిక భద్రత వంటి అంశాలపై అంతగా దృష్టి సారించడం లేదు. జీడీపీపై ఆధారపడడాన్ని తగ్గించాలని సూచించింది.

అగ్రగామిగా మళ్లీ నార్వే

అభివృద్ధి చెందిన 29 దేశాల్లో అగ్రగామిగా మళ్లీ నార్వే నిలిచింది. అమెరికాకు 23వ ర్యాంకు వచ్చింది.

భారత్ నుంచి మేధో వలసలు అధికమే

దావోస్: భారత్ నుంచి మేధో వలసలు అధికంగా ఉన్నాయి. గతంతో పోల్చితే కాస్త తగ్గినా, అరికట్టడానికి తీసుకున్న చర్యలు తగినంతగా లేవు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులు సందర్భంగా అడెక్కొ, ఇన్‌సీడ్, టాటా కమ్యూనికేషన్స్ సంస్థలు కలిసి రూపొందించిన 'ప్రపంచ ప్రతిభా పోటీతత్వం సూచీ' నివేదికలో భారత్‌కు 81వ ర్యాంకు లభించింది. మేధావులను ఆకర్షించడంలో 98వ స్థానం, మేధావులను నిలుపుకోవడంలో 99వ స్థానం లభించాయి. క్రమబద్ధ విద్యారంగంలో 67వ స్థానం, జీవితాంతం విద్యాభ్యాసంలో 37వ ర్యాంకు, ప్రపంచ విజ్ఞాన నైపుణ్యాల్లో 63వ స్థానం వచ్చింది. గత ఏడాది 92వ స్థానం, 2016లో 89వ ర్యాంకు రావడం గమనార్హం. ఈ సూచీలో స్విట్జర్లాండ్‌కు ప్రథమ స్థానం వచ్చింది.



అవార్డు స్వీకరిస్తున్న షారుఖ్ ఖాన్

షారుఖ్‌కు పురస్కారం: భారత్‌లో మహిళలు, బాలల హక్కులకు కృషి చేస్తున్నందుకు ప్రముఖ నటుడు షారుఖ్ ఖాన్‌కు 24వ క్రిస్టల్ అవార్డ్ బహూకరించారు. ఎల్టన్ జాన్, హాలీవుడ్ నటి కేట్ బ్లాంచెట్‌లతో కలిసి దీన్ని అందుకున్నారు.

అందరికీ అవకాశాలు కల్పించాలి

- పోప్ ఫ్రాన్సిస్ అభిభాషణ
- ఆయన సందేశంతో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు ప్రారంభం

దావోస్: ప్రముఖులు పాల్గొనే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలు సోమవారం పోప్ ఫ్రాన్సిస్ పంపిన ప్రత్యేక సందేశంతో లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలను ప్రారంభిస్తున్నట్లు డబ్ల్యూఈఎఫ్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ క్లవుస్ షవాబ్ ప్రకటించారు. 'మనమంతా సమాజంలో భాగం. వచ్చిన వారంతా బహుళ భాగస్వాములు ఉన్న సమాజానికి ప్రతినిధులు. సంక్లిష్టమైన ప్రపంచ సమస్యలను ఏ ఒక్కరో పరిష్కరించలేర'ని చెప్పారు. పోప్ సందేశాన్ని కార్డినల్ పీటర్ అపయా టర్క్సన్ చదవి వినిపించారు. 'అందరికీ నిజమైన అవకాశాలు కల్పించడం ద్వారా మానవుల గౌరవాన్ని కాపాడడం చాలా ముఖ్యం' అని తన సందేశంలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రిలయన్స్ ఛైర్మన్ ముఖేశ్ అంబానీ తదితరులు పాల్గొన్నారు.

స్విస్ అధ్యక్షునితో మోదీ భేటీ: ఈ సదస్సులో పాల్గొనేందుకు సోమవారం దావోస్ వచ్చిన భారత ప్రధాని మోదీ స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలెయిన్ బెర్‌సెట్‌తో భేటీ అయ్యారు. ఆయనతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అంతకుముందు ఆయన జ్యూరిచ్‌లో కొద్దిసేపు ఆగారు. భారత్ ప్రధాని జ్యూరిచ్ రావడం 20ఏళ్ల అనంతరంఇదే ప్రథమం.






జ్యూరిచ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీకి సాదర స్వాగతం పలుకుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు ప్రతినిధులు ★ స్విట్జర్లాండ్ అధ్యక్షుడితో చర్చలు జరుపుతున్న మోదీ

32 చెఫ్‌ల బృందం రాక: ఈ సందర్భంగా ప్రధాని ఇచ్చే విందు, ప్రముఖుల భోజన ఏర్పాట్లను చూసేందుకు తాజ్ హోటళ్ల గ్రూపునకు చెందిన 32 మంది చెఫ్‌లు, మేనేజర్లు వచ్చారు. ఇండియా అడ్డా, ఏపీ లాంజ్, ఇండియా రిసెప్షన్‌ల వద్ద 12,000 మందికి ఇచ్చే విందుకు వీరు ఏర్పాట్లు చేశారు. వంటల కోసం దాదాపు వేయి కిలోల సుగంధ ద్రవ్యాలను తీసుకొని వెళ్లారు. రఘు దేవరా, నితిన్ మాథుర్ (హైదరాబాద్ తాజ్ కృష్ణ ఎగ్జిక్యూటివ్ చెఫ్, నెవెల్లీ పిమెంటో (ముంబయి తాజ్ లాండ్స్ ఎండ్ రెసిడెంట్ మేనేజర్) వంటి ప్రముఖ పాకశాస్త్ర ప్రవీణులు వచ్చారు.

హిమపాతంపై హెచ్చరిక: అల్ప్స్ పర్వత ప్రాంతాల నుంచి వస్తున్న హిమపాతంపై స్విస్ ప్రభుత్వం అయిదో స్థాయి హెచ్చరిక జారీ చేసింది. దావోస్‌కు ప్రపంచ ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. పర్వత ప్రాంతాల్లో మంచు ఎక్కువగా కురుస్తోందని అధికారులు తెలిపారు.

సర్వస్వతంత్ర న్యాయవ్యవస్థ ప్రధానం

దిల్లీ: స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే నిష్పక్షపాతమైన సర్వస్వతంత్రమైన న్యాయవ్యవస్థ ప్రధానమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్.జాస్తి చలమేశ్వర్ సోమవారం నాడిక్కడ పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం కోసం న్యాయవ్యవస్థను మరింతగా మెరుగుపరచుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. 'సుప్రీంకోర్ట్ ఆఫ్ ఇండియా: ది బిగినింగ్స్' పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు. దివంగత ప్రొఫెసర్. జార్జి. హెచ్. గాడ్‌బోయిస్(జూనియర్) రచించిన ఈ పుస్తకాన్ని విక్రం రాఘవన్, వసుజిత్ రామ్‌లు పరిచయం చేశారు. దేశ జనాభాలో ఎనిమిదింట ఒక వంతుకు మాత్రమే న్యాయవ్యవస్థతో ప్రత్యక్ష సంబంధాలున్నాయని జస్టిస్ చలమేశ్వర్ పేర్కొన్నారు. వాస్తవానికి సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయాలు ఏదో ఒకరకంగా ప్రజా జీవితాలను ప్రభావితం చేస్తాయని ఉద్ఘాటించారు. అందుకే, సుప్రీంకోర్టుపై అధ్యయనం మరింత అవసరమని పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి వ్యవహారశైలిపై నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసిన అంశంపై జస్టిస్ చలమేశ్వర్ వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.



'సుప్రీంకోర్ట్ ఆఫ్ ఇండియా: ది బిగినింగ్స్' పుస్తకాన్ని ఆవిష్కరించిన జస్టిస్ చలమేశ్వర్

క్యాన్సర్ పరీక్షను తప్పనిసరి చేయాలి

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన

ముంబయి: దేశంలో ప్రతి ఒక్కరికీ నిర్దేశిత వయస్సు తర్వాత క్యాన్సర్ పరీక్షను తప్పనిసరి చేయాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. క్యాన్సర్‌ను నిరోధించటంలో, చికిత్సల్లో వినూత్న ఆవిష్కరణలకు కృషి చేయాలని పరిశోధకులను కోరారు. సోమవారం ముంబయిలోని టాటా మెమోరియల్ కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ క్యాన్సర్‌పై యుద్ధానికి సరికొత్త వ్యూహాలు రూపొందించాలని సూచించారు. తొలిదశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే పూర్తి స్వస్థత చేకూర్చటం సాధ్యమే కనుక...ఒక నిర్ణీత వయస్సులో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవటాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేయాలని అన్నారు. ఆ దిశగా ప్రజల్ని చైతన్యవంతులను చేయాల్సి ఉందనీ తెలిపారు. దేశంలో 2020 నాటికి క్యాన్సర్ బాధితుల సంఖ్య 17.3 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని, అదే సమయానికి ఈ వ్యాధి వల్ల మరణాల సంఖ్య 8.8 లక్షలకు చేరుకోవచ్చున్న భారత వైద్య పరిశోధనా మండలి హెచ్చరికను ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు.

గొప్పవాళ్లను మాత్రమే అక్కున చేర్చుకుంటారా?

- ప్రధానిపై రాహుల్‌గాంధీ వ్యంగ్యం

దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ కేవలం గొప్పవాళ్లు...ప్రముఖులను మాత్రమే ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సోమవారం వ్యంగ్యోక్తి విసిరారు. మోదీ తనను తాను సామాన్యుడిగా చెప్పుకొంటారు....అయితే, ఆప్యాయంగా అక్కున చేర్చుకునేది మాత్రం గొప్పవారినే. రైతన్నలు...కార్మికులు...జవాన్లను కూడా అక్కున చేర్చుకోవడం ప్రధానం అంటూ రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు. ప్రపంచ నేతలను మోదీ దగ్గరకు తీసుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీ పలుసందర్భాల్లో తీవ్రంగా ఖండించింది. అలాంటి సందర్భాలను పరిహాసంగా చూపే ఓ వీడియోను కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమంలో ఇదివరకు ఉంచింది.

అమెరికా ప్రతిష్టంభనపై కుదిరిన సయోధ్య

వాషింగ్టన్: అమెరికాలో బడ్జెట్ సంబంధిత ప్రతిష్టంభన తొలగించడానికి ఇరువర్గాల మధ్య ఎట్టకేలకు సయోధ్య కుదిరింది. మూడురోజులుగా స్తంభించిపోయిన పరిపాలన వ్యవస్థను గాడిలో పెట్టడానికి అధికార పక్షంతో ప్రతిపక్ష డెమోక్రటిక్ శాసనకర్తలు ఒక ఒడంబడికకు వచ్చారు. అక్రమ వలసలపై చర్చ చేపట్టడానికి ప్రభుత్వం అంగీకరించింది. మంగళవారం నుంచి సేవలు పునః ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఫిబ్రవరి 8వ తేదీ వరకు జరగాల్సిన ఖర్చులకు అనుమతించే బిల్లుల్ని ఉభయ సభల్లో ప్రవేశపెట్టేందుకు శాసనకర్తలు సమాయత్తమవుతున్నారు. దీనిని అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ స్వాగతించారు. సోమవారం సాయంత్రం శాసనకర్తల నిర్ణయం వెలువడడానికి ముందు కూడా ప్రభుత్వ సేవలకు అంతరాయం తప్పలేదు. శ్వేతసౌధంలో ఫోన్లు సయితం పనిచేయలేదు. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు ట్రంప్ హాజరు కావడంపైనా ఒక దశలో అనుమానాలు వ్యక్తమయ్యాయి.

కాబూల్ మృతుల్లో కామ్ ఎయిర్ సిబ్బందే అధికం

కాబూల్: అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లో ప్రభుత్వ ఆధీనంలోని ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌పై తాలిబన్లు చేసిన దాడిలో 'కామ్ ఎయిర్' సిబ్బందే అధికంగా ప్రాణాలు కోల్పోయారు. దేశంలో మూడు విమానయాన సంస్థలు ఉండగా, అందులో ప్రయివేటు సంస్థ అయిన కామ్ ఎయిర్ ఒకటి. ఈ సంస్థలో విదేశీయులే అధికంగా పనిచేస్తున్నారు. ఈ ఘటనలో కనీసం 22 మంది మృతి చెందారని సోమవారం అధికారవర్గాలు తెలిపాయి.

కేంద్ర ప్రభుత్వానికి కొత్త న్యాయమూర్తుల జాబితా

- జస్టిస్ కేఎం జోసెఫ్, ఇందు మల్హోత్రా పేర్లను పంపించిన సుప్రీంకోర్టు కొలీజియం

దిల్లీ: సర్వోన్నత న్యాయస్థానంలో కొత్త న్యాయమూర్తులుగా ఉత్తరాఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ కేఎం జోసెఫ్, సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా నియామకానికి సంబంధించి వీరి ఇద్దరి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం కేంద్ర ప్రభుత్వానికి పంపించినట్లు తెలిసింది. ఈ కొలీజియంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రతో పాటు అత్యంత సీనియర్లు అయిన జస్టిస్ జె.చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ కురియన్ సభ్యులు. వీరు ఈనెల 10, 11 తేదీల్లో రెండు దఫాలుగా సమావేశమై కొత్త న్యాయమూర్తుల ఎంపికపై నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర పనితీరుపై మిగిలిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ఈనెల 12న తమ అసంతృప్తిని వెల్లడించిన విషయం తెలిసిందే.

ఎన్‌జేఏసీపై తీర్పు పరిశీలన మార్చిలో..: జాతీయ న్యాయనియామకాల కమిషన్(ఎన్‌జేఏసీ) చట్టాన్ని రద్దు చేస్తూ 2015లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును పునః పరిశీలించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ మార్చిలో జరగనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస దీపక్ మిశ్ర నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం దీని విచారణను చేపట్టనుంది. సర్వోన్నత న్యాయస్థానంలో వ్యాజ్యాల విచారణను వీడియోలో చిత్రీకరించటానికి అనుమతించాలన్న పిటిషన్‌తో పాటు ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల ఖాళీలపై ప్రకటనను వెలువరించటానికి సంబంధించిన అభ్యర్థననూ ఇదే సమయంలో పరిశీలనకు తీసుకుంటామని జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లు సభ్యులుగా ఉన్న ధర్మాసనం వెల్లడించింది.



హెచ్-6జీ యుద్ధవిమానం

చైనా నౌకాదళానికి సరికొత్త ఆయుధం

- ఎలక్ట్రానిక్ యుద్ధవిమానం సిద్ధం

బీజింగ్: ఎలక్ట్రానిక్ యుద్ధరీతికి సంబంధించిన ఒక సరికొత్త పోరాట విమానాన్ని చైనా రూపొందించింది. దక్షిణ, తూర్పు చైనా సముద్రాల్లో విస్తృత స్థాయిలో సైనిక కార్యకలాపాలకు ఇది ఉపయోగపడుతుంది. ఆధునిక యుద్ధ పద్ధతుల్లో తమ నౌకా దళ సామర్థ్యాన్ని ఇది మరింత ఇనుమడింపచేస్తుందని చైనా అధికారిక మీడియా పేర్కొంది. హెచ్-6జీ బాంబర్ అనే యుద్ధవిమానాన్ని.. చైనా నౌకాదళానికి చెందిన దక్షిణ చైనా సముద్ర విభాగం ఇటీవల తన యుద్ధవిన్యాసాల్లో మోహరించింది. దాదాపు 10 ఏళ్ల నుంచి ఈ లోహ విహంగాన్ని అభివృద్ధి చేస్తోంది. ఈ విమానం రెక్కల కింది భాగంలో ఎలక్ట్రానిక్ ప్రతి చర్యల (ఈసీఎం) సాధనాలు ఉంటాయి. ఇవి శత్రు రాడార్ వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను జామ్ చేయడం, నిర్వీర్యం చేయడం వంటివి చేస్తాయి. శత్రువులకు సంబంధించిన ఇతర నిఘా సాధనాలనూ స్తంభింపచేసి, తమ యుద్ధవిమానాల గమనాన్ని గోప్యంగా ఉంచడానికి సాయపడతాయని చైనా రక్షణ విశ్లేషకుడు సాంగ్ ఝూంగ్‌పింగ్ తెలిపారు. ఈ విమానంలో ఎలక్ట్రానిక్ జామింగ్ శక్తి అత్యంత ఎక్కువగా ఉంటుందని, అందువల్ల దక్షిణ, తూర్పు చైనా సముద్రాల్లో సుదీర్ఘ ప్రాంతాలపై తన సత్తాను చూపుతుందన్నారు.

సరిహద్దు వెంట మోర్టార్ షెల్‌ల వర్షం

- పాక్ చమురు నిల్వలను ధ్వంసం చేసిన బీఎస్ఎఫ్

దిల్లీ: జమ్ములోని అంతర్జాతీయ సరిహద్దు(ఐబీ) వెంట ఎలాంటి కవ్వింపు చర్యల్లేకుండానే కాల్పులకు తెగబడుతున్న పాకిస్థాన్ బలగాలకు సరిహద్దు భద్రతాదళం(బీఎస్ఎఫ్) తగిన బుద్ధి చెబుతున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. గత నాలుగు రోజుల్లో ఐబీ వెంట వేర్వేరు ప్రాంతాల్లో బీఎస్ఎఫ్ 9 వేలకుపైగా మోర్టార్ షెల్‌లను ప్రయోగించి.. పాక్ రేంజర్ల చమురు నిల్వలను ధ్వంసం చేసినట్లు తెలిపాయి. మోర్టార్ షెల్‌ల దాడి.. ఇతర ఆయుధాలు, మందుగుండు సామగ్రితో దాడికి అదనమని అధికారులు చెప్పారు. ఆదివారం సాయంత్రం నుంచి పాక్ బలగాలు కాల్పులను ముమ్మరం చేశాయని.. దీంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయని పేర్కొన్నారు. ప్రత్యర్థి దాడులను బీఎస్ఎఫ్ ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నట్లు వెల్లడించారు. పాక్ చమురు నిల్వల ధ్వంసానికి సంబంధించి రెండు వీడియోలను బీఎస్ఎఫ్ విడుదల చేసింది. గత గురువారం నుంచి పాక్ బలగాలు జమ్ములో సరిహద్దు వెంట జరిపిన కాల్పుల్లో ఐదుగురు భద్రతా సిబ్బందితోపాటు ఏడుగురు స్థానికులు మృత్యువాతపడ్డ సంగతి గమనార్హం.

పెంచు.. పంచు.. సంపాదించు

- వ్యవసాయ భూముల్లో అటవీ ఉత్పత్తుల పెంపకంతో రైతులకు ఆదాయం
- కలప ఉత్పత్తిలో స్వావలంబన సాధిస్తే రూ.42వేల కోట్ల ఆదా
- నీతి ఆయోగ్ ప్రతిపాదన

ఈనాడు, దిల్లీ: రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యం చేరుకోవడంలో వ్యవసాయ అటవీ పెంపకం కీలకపాత్ర పోషిస్తుందని నీతి ఆయోగ్ పేర్కొంది. అటవీ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తే ఏటా 1.19 కోట్ల పనిదినాల కల్పన సాధ్యమవుతుందని లెక్కకట్టింది. దీనివల్ల 300 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గిపోతాయని అంచనా. 'మేకిన్ ఇండియా' తరహాలో 'గ్రో, సప్లై, ఎర్న్ ఇన్ ఇండియా' (పెంచు...పంచు...భారత్‌లో సంపాదించు) పేరుతో దేశంలో అటవీయేతర భూముల్లో అటవీ ఉత్పత్తుల పెంపకం ద్వారా కలప ఉత్పత్తిలో స్వావలంబన సాధించవచ్చు. వీటి దిగుమతులపై ఏటా చేస్తున్న వ్యయాన్ని మిగుల్చుకొనే అవకాశం ఉంది. 2015-16లో ఈ రూపంలో రూ. 42,454 కోట్లు ఖర్చయ్యాయి.

అనుకూలంగా 11 కోట్ల హెక్టార్ల భూమి

ఒక అంచనా ప్రకారం దేశంలో 11 కోట్ల హెక్టార్ల భూమి... చెట్ల పెంపకానికి అనుకూలంగా ఉంది. తొలుత 50 లక్షల హెక్టార్లలో పెంపకం చేపట్టినా అద్భుతమైన ఫలితాలు వస్తాయని నీతి ఆయోగ్ భావిస్తోంది. దేశంలో రెండింట మూడొంతులమంది చిన్న, సన్నకారు రైతులే. తొలుత వారి పొలాల గట్లమీద, అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని దొడ్లు, పాఠశాల మైదానాల చుట్టూ, వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, బహిరంగ ప్రదేశాలు, బంజరు భూములు, రహదారి పక్కన, కాలువల పొడవునా చెట్ల పెంపకాన్ని పెద్దఎత్తున చేపట్టవచ్చున్నది నీతి ఆయోగ్ అభిప్రాయం. అటవీయేతర భూముల్లో పెంచిన చెట్లను కొట్టి రవాణా చేయడం ప్రస్తుత విధానాల ప్రకారం చాలా కష్టమైన పని. ఇప్పుడున్న పర్మిట్‌రాజ్‌ను పూర్తిగా సంస్కరించి, సులభతర అనుమతులు వచ్చేలా మార్పులు తేవాలని సిఫార్సు చేస్తోంది. స్థానికంగా ఏయే చెట్లకు మినహాయింపును వర్తింపజేస్తున్నదీ ప్రకటించాలని పేర్కొంది. విచక్షణారహితంగా చెట్లను కొట్టి తరలించకుండా ఇప్పుడున్న సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలనీ, ఒక ఆన్‌లైన్ వేదిక ఏర్పాటుచేస్తే రైతు తన పొలంలో ఏ చెట్లు పెంచుతున్నదీ చెప్పి, వాటి ఫొటోలను అప్‌లోడ్ చేసి అనుమతి పొందడానికి వీలవుతుందని పేర్కొంది. ప్రతి చెట్టుకూ జియో ట్యాగింగ్ చేయడంవల్ల వాటిని ఎక్కడి నుంచి తరలించారో తెలుసుకోవడం సులభమవుతుందని సూచించింది. ఒకవేళ 30 రోజుల్లోపు అనుమతి ఇవ్వకపోయినా, అభ్యంతరం వ్యక్తం చేయకపోయినా వాటిని కొట్టి తరలించడానికి అనుమతించినట్లుగానే భావించవచ్చని నిబంధన విధిస్తే రైతులకూ వెసులుబాటుగా ఉంటుందని పేర్కొంది.

మాతృమూర్తులకు నీరాజనం





చంద్రంపాలెం పాఠశాలలో 'అమ్మకు వందనం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చాగంటి కోటేశ్వరరావు, మంత్రి గంటా శ్రీనివాసరావు, చిత్రంలో ఎంపీ కంభంపాటి హరిబాబు, ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ★ మాతృమూర్తులకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

- రాష్ట్రవ్యాప్తంగా 'అమ్మకు వందనం' కార్యక్రమం
- విశాఖలో ప్రారంభించిన మంత్రి గంటా

కొమ్మాది (విశాఖపట్నం), న్యూస్‌టుడే: వసంత పంచమిని పురస్కరించుకుని విద్యాశాఖ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 'అమ్మకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమాన్ని మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా 2 వేల మంది విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేసి 'అమ్మా.. నాకు జన్మనిచ్చినందుకు కృతజ్ఞతలు' అంటూ ఆశీర్వాదం తీసుకున్నారు. చిన్నారుల్లో తల్లి పట్ల గౌరవభావం పెంపొందించడానికి ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చాగంటి కొనియాడారు. మాతృదేవోభవ శ్లోకంతో మాతృమూర్తి గొప్పతనాన్ని వివరించారు. 'అమ్మకు వందనం' ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, జిల్లా కలెక్టరు ప్రవీణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు వరాలు

విజయవాడ, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులు పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతుల వరాలను ప్రసాదించారు. రాష్ట్రంలోని మూడు, నాలుగు (గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు, రాయలసీమ ప్రాంతం) జోన్లలోని 31 మంది పంచాయతీ కార్యదర్శులను మూడో శ్రేణి నుంచి రెండో శ్రేణికి పదోన్నతులు కల్పిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని మరో 121 మంది కార్యదర్శులకు ఈవోపీఆర్డీలుగా పదోన్నతులు కల్పించేలా ఈనెల 24వ తేదీకల్లా నివేదికలు సమర్పించాలని డీపీవోలకు ఆదేశాలు జారీ చేశారు. సంఘ నాయకులు అడిగిన పలు సమస్యలను పరిష్కరించడానికి సుముఖత వ్యక్తం చేయడంతో వారు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్సైజ్ ఉద్యోగుల్లో అభద్రతభావం

ఈనాడు, అమరావతి: "ఎక్సైజ్ శాఖలో ఉద్యోగులు అభద్రతభావంతో పనిచేసే పరిస్థితి నెలకొంది. ఇది మారాల్సిన అవసరముందని" ఏపీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి తీర్మానించింది. క్షేత్రస్థాయి విచారణ జరపకుండా ఉద్యోగులపై చర్యలు తీసుకోరాదని డిమాండు చేసింది. ఏటా పదోన్నతులు కల్పించాలని కోరింది. విజయవాడలో సోమవారం ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల నూతన ఐకాస కార్యవర్గం ఎన్నిక జరిగింది. గెజిటెడ్, ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం, కానిస్టేబుళ్ల, హెడ్ కానిస్టేబుళ్ల సంఘం, మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కలిసి ఐకాసగా ఏర్పడ్డాయి. ఈ సమితి గౌరవ అధ్యక్షుడిగా పి.అశోక్‌బాబు, అధ్యక్షుడిగా వై.బి.భాస్కరరావు, సహాధ్యక్షుడిగా బి.నరసింహులు తదితర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'ఆధార్'పై నిప్పులు చెరిగిన స్నోడెన్

దిల్లీ: 'సేవలకు అనుచిత మార్గం'గా ఆధార్‌ను ఎడ్వర్డ్ స్నోడెన్ అభివర్ణించారు. వికీలీక్స్‌తో సంచలనం సృష్టించిన ఆయన 'ఆధార్' వివరాలను ప్రయివేటు సంస్థలు డిమాండ్ చేయడాన్ని ఖండించారు. 'ఆధార్' సమాచారాన్ని తీసుకోవడంలో ప్రభుత్వేతర సంస్థల పాత్రను నేరంగా పరిగణించాలన్నారు. ఈ బయోమెట్రిక్ వ్యవస్థలో బలహీనతలపై ఆయన స్పందనల నేపథ్యంలో మళ్లీ 'ఆధార్' ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా ఆయన 'రా' మాజీ సారథి కేసీ.వర్మ రాసిన ఓ వ్యాసం గురించి కూడా ప్రస్తావించారు. బ్యాంకులు, రవాణా, టెలికాం సంస్థలు 'ఆధార్'ను ఎలా దుర్వినియోగం చేస్తున్నాయనే అంశంపై కేసీ వర్మ ఆ వ్యాసంలో సవివరంగా పేర్కొన్నారు.

సీఈసీగా అచల్‌కుమార్ జోతి పదవీ విరమణ

దిల్లీ: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా అచల్ కుమార్ జోతి సోమవారం పదవీ విరమణ చేశారు. ఆరు నెలలపాటు ఆయన సీఈసీగా సేవలందించారు. తన హయాంలో జోతి తీసుకున్న కనీసం రెండు నిర్ణయాలు ప్రతిపక్షాల విమర్శలకు తావిచ్చాయి. వరదల తర్వాత సహాయ కార్యక్రమాలు పూర్తయ్యేలా అధికార భాజపాకి సాయపడడానికే గుజరాత్ ఎన్నికలను ఆయన ఆలస్యం చేశారని విపక్షాలు గతంలో తప్పుపట్టాయి. ఇరవై మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాల్సిందిగా రెండ్రోజుల క్రితం ఈసీ చేసిన సిఫార్సు కూడా ప్రకంపనలకు దారి తీసింది.

మరో మూడు రాష్ట్రాల్లో అనర్హత ప్రకంపనలు

- ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరిల్లో డిమాండ్లు

దిల్లీ, పుదుచ్చేరి, భోపాల్: లాభదాయక పదవుల్ని చేపట్టినందుకు దిల్లీలో 20 మంది ఆప్ శాసనసభ్యులపై అనర్హత వేటు వేస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తీసుకున్న నిర్ణయం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలకు దారితీసింది. ఇదే ప్రాతిపదికన తమ రాష్ట్రాల్లోనూ శాసనసభ్యులపై వేటు వేయాలని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరిల నుంచి డిమాండ్లు వినిపించాయి. విషయాన్ని రాష్ట్రపతికి, ఎన్నికల సంఘానికి నివేదించి, దిల్లీ మాదిరి చర్యలే తమ రాష్ట్రంలోనూ చేపట్టాల్సిందిగా కోరేందుకు ఆయా వర్గాలు సమాయత్తమవుతున్నాయి.

★ మధ్యప్రదేశ్‌లో 116 మంది భాజపా శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాల్సిందిగా ఆప్ సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు వినతి పత్రం సమర్పించింది. వీరిపై వేటు వేస్తే ప్రభుత్వం పడిపోతుందని ఆప్ రాష్ట్ర కన్వీనర్ అలోక్ అగర్వాల్ చెప్పారు. అందుకే ఏడాదిన్నర క్రితమే ఫిర్యాదిచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు.

★ ఛత్తీస్‌గఢ్‌లో పార్లమెంటరీ కార్యదర్శులుగా వ్యవహరించిన 11 మంది భాజపా ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాలను కొట్టివేయాల్సిందిగా 2016లోనే ఛత్తీస్‌గఢ్ హైకోర్టును, ఈసీని కోరినట్లు పార్టీ నేత మహ్మద్ అక్బర్ విలేకరులకు తెలిపారు. విషయాన్ని గవర్నర్ తమకు నివేదిస్తేనే చర్యలు తీసుకుంటామని ఈసీ తెలిపిందనీ, ఏడాది గడిచినా గవర్నర్ మాత్రం స్పందించలేదనీ చెప్పారు. ప్రభుత్వం పడిపోతుందనే భయంతో 11 మందిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనీ, గవర్నర్ స్పందించకపోతే రాష్ట్రపతిని కలిసి విన్నవిస్తామనీ చెప్పారు.

★ పుదుచ్చేరిలో ఆరుగురు కాంగ్రెస్, ఇద్దరు డీఎంకే ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాల్సిందిగా ఈసీని కోరనున్నట్లు భాజపా తెలిపింది.

కేంద్ర మంత్రి హెగ్డేపై చర్య తీసుకోండి: అథావలే

ముంబయి: కేంద్రమంత్రి, దళిత నేత రామదాస్ అథావలే సోమవారం మరో మంత్రి అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. 'హెగ్డేకు ఏం మాట్లాడుతున్నారనే విషయంపై ఏమాత్రం నియంత్రణ ఉండదు. ఒకప్పుడు భారత రాజ్యాంగాన్నే మార్చాలన్నారు. ఇప్పుడేమో తనను విమర్శిస్తున్న వారిని అరిచే కుక్కలుగా అభివర్ణిస్తున్నారు' అంటూ అథావలే ఆరోపించారు. కోరేగావ్ భీమా ఘటనపై తన(హెగ్డే)పై విమర్శలు గుప్పించిన వారిని ఆయన అరిచేకుక్కలుగా అభివర్ణించారన్నారు. అదేపనిగా కేంద్ర విధానానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న హెగ్డేపై చర్య చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే, అథావలే వ్యాఖ్యలను హెగ్డే ఖండించారు. తాను అలాంటి వ్యాఖ్యానాలేవీ చేయలేదన్నారు.

లేవనెత్తిన అంశాలన్నీ తీవ్రమైనవే

- కానీ లోయా మరణంపై అనుమానాలు రేకెత్తించవద్దు
- అన్ని పత్రాలనూ పరిశీలిస్తాం: సుప్రీం

దిల్లీ: సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.హెచ్.లోయా మరణంపై దాఖలైన పిటిషన్లలో లేవనెత్తిన అంశాలు 'తీవ్రమైనవ'ని సుప్రీం కోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. అయితే ఈ అంశంలో సందేహాలు లేవనెత్తవద్దని సూచించింది. కీలకమైన సోహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసును లోయా విచారించారు. లోయా 2014 డిసెంబర్ 1న తన సహచరుడి కుమార్తె వివాహానికి నాగ్‌పుర్ వెళ్లినప్పుడు గుండెపోటుతో మరణించినట్లు చెబుతున్నారు. అనంతరం సీబీఐ ప్రత్యేక జడ్జీగా వచ్చిన ఎం.బి.గోసావీ....అప్పట్లో ఈ ఎన్‌కౌంటర్ కేసులో నిందితులుగా ఉన్న భాజపా అధ్యక్షుడు అమిత్ షా తదితరులకు ఇప్పటికే అభియోగాల నుంచి విముక్తి ప్రసాదించారు. లోయా మరణానికి దారితీసిన పరిస్థితులకు సోహ్రాబుద్దీన్ కేసుతో సంబంధం ఉండొచ్చని.. దివంగత న్యాయమూర్తి సోదరి అనుమానాలు వ్యక్తంచేయడంతో ఇది వివాదమైంది. అయితే తన తండ్రి మృతిపై ఎలాంటి అనుమానాలూ లేవని, దానిపై ఎలాంటి విచారణ అవసరంలేదని లోయా కుమారుడు ప్రకటించిన విషయం గమనార్హం.

లోయా మరణంతో ముడిపడిన అన్ని పత్రాలనూ అత్యంత తీవ్రంగా పరిశీలించాలని సుప్రీం కోర్టు ధర్మాసనం తాజా విచారణలో నిర్ణయించింది. లోయా అంశంపై మీడియాలో వచ్చిన అనేక వార్తలను తాము పరిశీలించినట్లు న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఇది తీవ్రమైన అంశమని, అందువల్ల మీడియా వార్తలపై కోర్టు ఆధారపడజాలదని తెలిపారు. అందువల్ల సదరు దస్త్రాలన్నీ తమ ముందుంచాలని స్పష్టంచేశారు. అవసరమైతే సదరు ఘటనపై తాము విచారణకు ఆదేశించే అవకాశం ఉందని చెప్పారు.

లోయా గుండెపోటుతోనే మరణించారని, ఆ రోజున తామే ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లామని నలుగురు జిల్లా జడ్జీలు ఇచ్చిన వాంగ్మూలాలను మహారాష్ట్ర తరఫు న్యాయవాది హరీశ్ సాల్వే పేర్కొన్నారు. అయితే లోయాకు 2014 నవంబర్ 24 నుంచి భద్రతను ఉపసంహరించారని ఒక పిటిషనర్ తరఫున వాదిస్తున్న దుష్యంత్ దవే పేర్కొన్నారు. "లోయా మరణంపై అనేక అనుమానాలున్నాయి. ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఆయన కుటుంబాన్ని ఎందుకు పిలవలేదు? సోహ్రాబుద్దీన్ హత్యకేసు విచారించిన ఒక న్యాయమూర్తి బదిలీ అయ్యారు. ఇంకొకరు హత్యకు గురయ్యారు. మూడో జడ్జీ.. అమిత్ షాను నిర్దోషిగా ప్రకటించారు. ఇందులో తీవ్ర వైరుధ్యాలు ఉన్నాయి. ప్రజలకు నిజాలు తెలియాలి" అని పేర్కొన్నారు. వ్యవస్థ మొత్తం అమిత్ షాను రక్షించడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. "ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం లోయాది సహజ మరణమే. దానిపై సందేహాలు రేకెత్తించవద్దు" అని వ్యాఖ్యానించింది. కేసు విచారణను ధర్మాసనం వచ్చే నెల 2కు వాయిదా వేసింది.

'వైద్యకళాశాల కేసు దర్యాప్తులో జస్టిస్. కుద్దుసీ అనవసర జోక్యం'

దిల్లీ: ఓ వైద్య కళాశాలకు సంబంధించిన అవినీతి వ్యవహారంలో తాము జరుపుతున్న దర్యాప్తులో ఒడిశా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్. కుద్దుసీ అనవసర జోక్యం చేసుకుంటున్నారంటూ సీబీఐ సోమవారం ప్రత్యేక న్యాయస్థానానికి తెలియచేసింది. ఈ వైద్యకళాశాలకు సంబంధించిన అవినీతి వ్యవహారంలో అరెస్టయిన జస్టిస్. కుద్దుసీ ప్రస్తుతం బెయిలుపై వెలుపలికి వచ్చారు. ఈ కేసులో న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలంటూ జస్టిస్.కుద్దుసీ అభ్యర్థన దాఖలు చేసుకున్నారు. ప్రత్యేక కోర్టు దీంతో సీబీఐకి నోటీసు జారీ చేసింది. ఈ నోటీసుకు సీబీఐ సోమవారం సమాధానం ఇచ్చింది.

'కొల్లేరు' సమస్య పరిష్కరించండి

కేంద్రమంత్రి హర్షవర్ధన్‌కు మంత్రి కామినేని విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: కొల్లేరు సరస్సుపై ఆధారపడి జీవిస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి హర్షవర్ధన్‌కు మంత్రి కామినేని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారమిక్కడ కేంద్రమంత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మంత్రి కామినేని మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి కొల్లేరు సరస్సుపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలు జీవనోపాధి కోల్పోకుండా తగిన సహాయం చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశానన్నారు. తగిన చర్యలు తీసుకుంటానని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వైద్య, ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రోత్సాహకాలపై కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఉన్నతాధికారులతో చర్చించినట్లు మంత్రి తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవలు మరింత పటిష్ఠంగా అమలు చేయడానికి వైద్యసేవల బీమా పథకంలోకి తీసుకురావాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

ఏపీ పట్టణ స్థానిక సంస్థలకు రూ.254 కోట్లు విడుదల

ఈనాడు, దిల్లీ: ఏపీలోని పట్టణ స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్రం రూ.254 కోట్లు విడుదల చేసింది. 14వ ఆర్థిక సంఘం సూచనల మేరకు 2017-18లో రెండో విడతగా ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది.

రూ.15,730 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులు

ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో రూ.15,730 కోట్లతో చేపట్టే తాగునీటి ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సోమవారం ఉత్తర్వులిచ్చింది. ఇందుకోసం యాన్యుటీ విధానంలో రూ.9,400 కోట్లు, బ్యాంకు రుణం రూ.6,330 కోట్లు సమీకరించనున్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇచ్చి రోజూ తలసరి 70 లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు ఆంధ్రప్రదేశ్ తాగునీటి సరఫరా సంస్థను ప్రభుత్వం ఏర్పాటుచేసింది.



అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతున్న కమల్

ఫిబ్రవరి 21 నుంచి ప్రజల మధ్యకు...

కమల్‌హాసన్ ప్రకటన

చెన్నై, న్యూస్‌టుడే: రాజకీయ ప్రవేశానికి రంగం సిద్ధం చేసుకుంటున్న నటుడు కమల్‌హాసన్ ఫిబ్రవరి 21 నుంచి ప్రజల మధ్యకు వెళ్లనున్నారు. రామేశ్వరం నుంచి తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించనున్నట్లు ఇటీవల ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చెన్నై ఆళ్వార్‌పేటలోని తన నివాసంలో మదురై, రామనాథపురం, శివగంగై, దిండుకల్ జిల్లాల్లోని తన అభిమాన సంఘాల నిర్వాహకులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ... ప్రజల వైపు ప్రయాణించాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఫిబ్రవరి 21, 22, 23వ తేదీల్లో మదురై జిల్లాలో పర్యటించి ప్రజలను నేరుగా కలవాలని నిర్ణయించినట్టు చెప్పారు. పర్యటించనున్న ప్రాంతాల పేర్లను తర్వాత వెల్లడిస్తానని పేర్కొన్నారు. మదురైలో నిర్వహించనున్న మహానాడు గురించి వచ్చే నెల 21వ తేదీకి ముందుగా ప్రకటించనున్నట్టు తెలిపారు.

అత్యాచార బాధిత బాలిక ఆత్మహత్య

- ఒడిశాలోని ముసాగుడలో ఘటన
- ఆందోళనకు దిగిన బంధువులు

సిమిలిగుడ(ఒడిశా), న్యూస్‌టుడే: ఒడిశాలోని కొరాపుట్ జిల్లా కుందిలిలో మూడు నెలల క్రితం అత్యాచారానికి గురైన బాలిక సోమవారం ఆత్మహత్య చేసుకుంది. దీంతో ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులు ఆందోళనలకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గతేడాది అక్టోబరు 10న కుందిలి గ్రామం నుంచి ముసాగుడలోని తన ఇంటికి వెళ్తున్న తొమ్మిదో తరగతి బాలికపై దుండగులు అత్యాచారం చేశారు. భద్రతా సిబ్బందే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు దర్యాప్తులో భాగంగా సుమారు 50 రోజులపాటు ఆ బాలికను పరీక్షల పేరిట ఆసుపత్రుల చుట్టూ తిప్పి చివరికి నవంబర్ 30న కుటుంబ సభ్యులకు



బాలిక మృతదేహం

అప్పగించారు. బాధిత బాలిక సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కుందిలి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఉన్నతాధికారులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. శవపరీక్షలు నిర్వహించకుండా బాధిత కుటుంబీకులు సిబ్బందిని అడ్డుకున్నారు. న్యాయం జరగనందుకే తీవ్ర మనస్తాపానికి గురైన తమబిడ్డ బలవన్మరణానికి పాల్పడిందని ఆరోపించారు.

26 నుంచి 'దళిత తేజం-తెలుగుదేశం'

మంత్రి జవహర్ వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: 'దళిత తేజం-తెలుగుదేశం' కార్యక్రమాన్ని ఈ నెల 26న ప్రారంభించనున్నట్లు మంత్రి జవహర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దళితవాడల్లోని ఇంటింటికీ వెళ్లి ఎస్సీల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరిస్తామన్నారు. ఏప్రిల్ 20న విజయవాడలోని పవిత్ర సంగమం వద్ద రాష్ట్రస్థాయి మహాసభతో ఈ కార్యక్రమం ముగుస్తుందని వివరించారు. సీఎం చంద్రబాబును దళితులంతా బరోడా మహారాజ్‌గా ఆరాధించుకుంటున్నారని పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెదేపా ఆవిర్భావంతోనే దళితులకు రాజకీయ ప్రాధాన్యం లభించిందని అన్నారు. ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డి దళితులను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. పార్టీ కీలక పదవుల్లో వైకాపా, కాంగ్రెస్‌లు ఏనాడూ దళితులకు ప్రాధాన్యం ఇవ్వలేదని, వివక్ష విడనాడాలని సూచించారు.

ఆర్థికేతర అర్జీలను తక్షణమే పరిష్కరించండి

కలెక్టర్లు, శాఖాధిపతులను ఆదేశించిన సీఎస్ దినేశ్‌కుమార్

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అర్జీల్లో ఆర్థికేతరమైన వాటిని నెలఖరులోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేశ్‌కుమార్ జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతులను ఆదేశించారు. జన్మభూమిలో, అంతకు ముందు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం సచివాలయంలో ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత, సామాజికపరమైన అంశాలకు సంబంధించి ఆర్థికపరమైన విజ్ఞాపనలను జిల్లా, శాఖల వారీగా విభజించాలని పేర్కొన్నారు. పరిష్కారానికి ఎంత మొత్తం నిధులు అవసరంఅవుతాయో నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. వ్యక్తిగత అవసరాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల్ని ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



ప్రత్యేక హోదా ఇస్తే భాజపాకు మద్దతు

- దానిపై ప్రధానిదే నిర్ణయాధికారం
- నాలుగేళ్లలో చంద్రబాబు చేసిందేమీ లేదు
- జాతీయ ఛానెల్ ఇంటర్వ్యూలో వైఎస్ జగన్

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమేనని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ ప్రకటించారు. ప్రధానమంత్రి ఒక్క సంతకంతో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వగలరు... అది ఆయన నిర్ణయాధికారం అని అన్నారు. హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందనీ, ఆ హోదా ప్రకటిస్తే రాబోయే ఎన్నికల్లో భాజపాతో కలిసి వెళ్లేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. సోమవారం ఓ జాతీయ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు.



దళిత ఆత్మీయసభలో మాట్లాడుతున్న జగన్

ఆయన చెప్పేవన్నీ అబద్ధాలనీ... అమరావతి గురించి ప్రచారం చేసుకొంటున్నారే తప్ప అక్కడ ఒక ఇటుక కూడా వేయలేదన్నారు. అక్కడికి వెళ్లి చూస్తే వాస్తవం ఏమిటో వెల్లడవుతుందన్నారు. ఇక్కడ చదువుకున్న యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లకు వెళ్లిపోతున్నారని.. వారికి ప్రభుత్వం కల్పించిన అవకాశాలేమీ లేవన్నారు. ఏపీ రాజకీయాల్లో జాతీయ పార్టీల పాత్ర అప్రస్తుతమని.. తమ ప్రధాన లక్ష్యం తెదేపా అని స్పష్టం చేశారు. తనపై నమోదైన అవినీతి కేసులన్నీ రాజకీయ కుట్రలో భాగమేనన్నారు. ఆడియో, వీడియో టేపుల్లో నల్లధనం ఇస్తూ చంద్రబాబు దొరికిపోయారని ఆరోపించారు.

పేదల జీవితాల్లో వెలుగు నింపుతా

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: దేవుడి దయవల్ల మేము అధికారంలోకి వస్తే పేదల జీవితాల్లో వెలుగు నింపుతానని, నిజమైన ప్రగతి అంటే ఏమిటో ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిసేలా చేతల్లో చూపిస్తానని వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా బీఎన్ కండ్రిగ మండలం పల్లమాలలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి దళిత ఆత్మీయసభలో జగన్ మాట్లాడారు. తాను అధికారంలోకి వస్తే విద్యుత్తు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తామని జగన్ తెలిపారు. దళిత, గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను ప్రగతి పేరిట మళ్లీ వెనక్కితీసుకోకుండా, వారికే చెందేలా చట్టాన్ని తీసుకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైకాపా ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రిటర్నుల దాఖలు సరళీకృతంపై సమీక్ష

- విజయవాడలో వాణిజ్యవర్గాలతో సమావేశం

ఈనాడు, అమరావతి: జీఎస్టీ కింద అమ్మకం బిల్లులు అప్‌లోడ్ చేయటం, రిటర్నుల ఆన్‌లైన్ దాఖలును సరళీకృతం చేయడంపై వాణిజ్య వర్గాలతో సోమవారం రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ విజయవాడలో చర్చించింది. ముఖ్యంగా రిటర్నుల దాఖలు, ఇతర వ్యవహారాల్లో అవసరమైన మార్పుచేర్పుల కోసం నందన్‌నిలేకని నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ ప్రతిపాదించిన అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ జె.శ్యామలరావు పలు అనుమానాలను నివృత్తి చేశారు. నందన్‌నిలేకని కమిటీ ప్రతిపాదనల్లో ముఖ్యంగా విక్రేత.. అమ్మకం బిల్లును జీఎస్టీ పోర్టల్‌లో తన వీలునుబట్టి అదే రోజు లేదా నెల వ్యవధిలో అప్‌లోడ్ చేస్తారు. ఈ బిల్లును కొనుగోలుదారుడు ఒప్పుకుంటే అది స్థిరమవుతుంది. ఏదైనా కారణంతో అమ్మకందారుడు తన అమ్మకం బిల్లును జీఎస్టీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనట్లయితే కొనుగోలుదారు ఐటీసీ క్లెయిం చేయలేరు. ఇది తమకు సమ్మతం కాదని వాణిజ్య సంఘాలు వెల్లడించాయి. ప్రత్యామ్నాయ విధానంలో పన్ను చెల్లింపుదారులందరూ కొనుగోలు, అమ్మకం బిల్లులన్నింటినీ అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దీనివల్ల కొనుగోలుదారునికి ఐటీసీ క్లెయిమ్ చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుంది.

ఇలాగైతే ప్రజలు క్షమించరు

చంద్రబాబుకు కేవీపీ బహిరంగ లేఖ

ఈనాడు, దిల్లీ: విభజన చట్టం హామీల అమలులో జాప్యం నేపథ్యంలో ఏపీ ప్రజలు క్షమించబోరని ముఖ్యమంత్రి చంద్రబాబుకు కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు హితవు పలికారు. ఈ మేరకు సోమవారమిక్కడ ఆయన ఏపీ సీఎం చంద్రబాబుకు రాసిన బహిరంగ లేఖను మీడియాకు అందజేశారు. అనంతరం కేవీపీ మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు వైఖరి ఏపీకి శాపమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ప్రయోజనాల కోసం అప్పటి యూపీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు విభజన హామీల అమలుపై ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయలేకపోతున్నారని ప్రశ్నించారు.

గవర్నర్ ఆహ్వానాన్ని తిరస్కరించా..

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విజయవాడ, నందిగామ, న్యూస్‌టుడే: గణతంత్ర దినం సందర్భంగా ఈ నెల 26న గవర్నర్ నరసింహన్ నిర్వహించే ఎట్ హోం కార్యక్రమానికి హాజరుకావట్లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. సోమవారం ఆయన నందిగామ, విజయవాడలలో విలేకరులతో మాట్లాడుతూ.. గవర్నర్ తీరుకు నిరసనగా తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య గవర్నర్లు దళారీ పాత్ర పోషిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించి 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారని ఆరోపించారు. రెండురోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఎ.కె.జోతి ప్రధాని మోదీ పాలేరుగా వ్యవహరిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అన్ని వ్యవస్థల్లోనూ ప్రధాని జోక్యం పెరిగిందన్నారు.

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు

ఈనాడు అమరావతి: రాష్ట్రంలోను, డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసుల్లోను పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన పలువురు ఐఏఎస్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర సర్వీసులో ఉన్న 1993 బ్యాచ్‌కి చెందిన కె.దమయంతి, బి.కిషోర్, ఎం.టి.కృష్ణబాబుతో పాటు, అదే బ్యాచ్‌కి చెందిన రాష్ట్ర సర్వీసులో ఉన్న అనిల్‌కుమార్ సింఘాల్, గోపాలకృష్ణ ద్వివేది, వై.వి.అనురాధ, బి.ఉదయలక్ష్మిలకు 'ఏబౌ సూపర్‌టైమ్ స్కేల్' వర్తింపజేస్తూ ఉత్వర్వులిచ్చింది. వీరికి ముఖ్య కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. 2005 బ్యాచ్‌కి చెందిన ఎం.జానకి, ఎన్.యువరాజ్ (వీరిద్దరూ కేంద్ర సర్వీసులో ఉన్నారు), ఎం.ఎం.నాయక్, పి.భాస్కర్‌లకు అదనపు కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. 2002 బ్యాచ్‌కి చెందిన జి.రవిబాబుకి కార్యదర్శిగా పదోన్నతి కల్పించారు.

అయిదుగురు ఐపీఎస్‌లకు పదోన్నతి: ఆంధ్రప్రదేశ్‌లో అయిదుగురు ఐపీఎస్ అధికారులకు పదోన్నతి లభించింది. 2000 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు అధికారులు డీఐజీ హోదా నుంచి ఐజీలుగా పదోన్నతి పొందగా, 2004 బ్యాచ్‌కు చెందిన ఇద్దరు అధికారులకు ఎస్పీల నుంచి డీఐజీలుగా పదోన్నతి లభించింది. ఆయా అధికారులు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లోనే పదోన్నతి పొందిన హోదాల్లో రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

డీఐజీల నుంచి ఐజీలుగా..


- ★ కె.వి.వి.గోపాలరావు, గుంటూరు జోనల్ డీఐజీ
- ★ బి.వి.రమణకుమార్, సంయుక్త కమిషనర్, విజయవాడ
- ★ పి.హరికుమార్, అదనపు డైరెక్టర్, ఏసీబీ

ఎస్పీల నుంచి డీఐజీలుగా

- ★ డా.నవీన్ గులాఠీ, ఎస్పీ, మెరైన్ పోలీసు విభాగం
- ★ కాంతి రాణా టాటా, డీసీపీ, విజయవాడ



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00



ఇంటి సింహద్వారం..

ఎంత బాగా చూసుకుంటాం?

దుమ్ము చేరకుండా రోజూ దులుపుతుంటాం. మరకలు పడకుండా తుడుస్తుంటాం. అందంగా తోరణాలు కడతాం. అపురూపంగా రంగులు వేస్తాం. ముఖ్యంగా బయటి మురికీ, మట్టీ గడప దాటి ఇంట్లోకి రాకుండా అక్కడే కాళ్లు తుడుచుకునే పట్టాలూ వేస్తాం. అనుమానమేం లేదు.. మన ఇంటి తీరుకు ఆ ద్వారమే అద్దం!!

ఒకవేళ సింహద్వారం దగ్గరే బోలెడంత చెత్తాచెదారం పేరుకుపోయిందనుకోండి.. ఏమవుతుంది? వాకిలి వికారంగా తయారవటమే కాదు.. మొత్తం ఇల్లంతా ఖరాబవుతుంది. అక్కడ్నించి చెత్త ఇల్లంతా వ్యాపించి మొత్తం గదులన్నీ పాడైపోతాయి.

ఇంటికే కాదు.. మన ఒంటికీ ఇదే సూత్రం!

నోరు మన శరీరానికి మహాద్వారం!

సకల తినుబండారాలూ, సర్వ సంభారాలూ లోనికి వెళ్లేది ఈ ముఖద్వారం గుండానే! దీన్ని మనం శుభ్రంగా ఉంచుకోకపోతే.. ముందు ద్వారం దెబ్బతింటుంది. పళ్ల మీద పాచి చేరి, గారపట్టి.. సూక్ష్మక్రిములు విజృంభించి.. దుర్వాసనతో చిగుళ్ల వ్యాధులూ, దంత సమస్యలూ చుట్టుముడతాయి. అంతేకాదు.. అక్కడి నుంచి ఇవి ఒళ్లంతా వ్యాపించి.. గుండె, మెదడు, క్లోమం వంటి ఒంట్లోని కీలక అవయవాలను కూడా దెబ్బతీస్తున్నాయని ఆధునిక దంత వైద్య పరిశోధనా రంగం స్పష్టంగా గుర్తించింది. గుండెపోటు, పక్షవాతం, ఊపిరితిత్తుల వ్యాధుల వంటి పలు రకాల సమస్యలకు మూలాలు నోటి శుభ్రతలో ఉంటున్నాయి. నోటి శుభ్రత కొరవడితే క్లోమ గ్రంథి కూడా ప్రభావితమై, క్యాన్సర్లు వస్తున్నట్టు తాజాగా గుర్తించారు. ఇలా నోటి శుభ్రతపై అవగాహన పెరుగుతున్నకొద్దీ రోజురోజుకూ దీని ప్రాధాన్యం మరింతగా తెలిసివస్తోంది. కేవలం నోటి శుభ్రత పాటించటం ద్వారానే చాలా వ్యాధులను నివారించుకోవచ్చు. అందుకే దీనికి సంబంధించిన సమగ్ర వివరాలను మీ ముందుకు తెస్తోంది ఈ వారం సుఖీభవ.

మహా ద్వారం మంచిగుండాలి!



డా॥ కడియాల రాజేంద్ర
ఛైర్మన్, ఏపీ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్స్
జూబిలీ హిల్స్, హైదరాబాద్

**నోరు.. ఓ అద్భుత ద్వారం!
బయటి వాతావరణానికీ, మన శరీరానికీ మధ్య మన నోరే మహాద్వారం!**

పైగా ఇది 24 గంటలూ పనిచేస్తూనే ఉంటుంది. మనం నిద్ర పోతున్నా కూడా నోటిలో లాలాజలం ఊరటం, అది తగ్గిపోతే నోటిలో బ్యాక్టీరియా పెరగటం వంటివన్నీ జరుగుతూనే ఉంటాయి. మనం ఇంట్లోకి సూక్ష్మక్రిముల వంటివేమీ తీసుకువెళ్లకుండా గడపలోనే కాళ్లు కడుక్కుని వెళుతుంటాం కదా... నోటిలో ఉండే లాలాజలం కూడా అలాంటి సహజమైన ఏర్పాటే! లాలాజలం లేకపోతే మనం ఏదీ సరిగా తినలేం, మాట్లాడను కూడా లేం. నోటిలోని అవయవాలన్నీ అతుక్కుపోతుంటాయి. తిన్న పదార్థాలన్నీ పళ్లకు అతుక్కుపోయి, నోరు చుట్టుకుపోతుంటుంది. నీరులాంటి లాలాజలం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంటే నోరు, దంతాలు నిరంతరం శుభ్రమవుతుంటాయి. దీనికి తోడు లాలాజలంలో ఉండే ఎంజైములు హానికారక క్రిములను అడ్డుకుంటూ.. నోటిలోని బ్యాక్టీరియా సంఖ్య పెరగకుండా చూస్తుంటాయి. మనకు నోటిలో ఇన్ఫెక్షన్లు, దుర్వాసన రాకుండా, పిప్పిపళ్ల వంటివి తలెత్తకుండా ఈ లాలాజలమన్నది ఓ అద్భుతమైన ఏర్పాటు. కానీ... నోటిలో ఎంత చక్కటి ఏర్పాట్లున్నా.. మనం సరైన శుభ్రత చర్యలు తీసుకోకపోతే.. దంతాల మీద పాచి, గార పేరుకుని, బ్యాక్టీరియా పెరిగి చిగుళ్లు వాచిపోవటం, తిన్న ఆహార పదార్థాలు దంతాల మధ్య ఇరుక్కుని, అవి కుళ్లి నోటి దుర్వాసన మొదలై పిప్పిపళ్లకు దారి తియ్యటం, ఆ పిప్పిపళ్లకు చికిత్స తీసుకోకపోతే పంటి నొప్పి, లోపల ఉండే పంటి నరం, దంతాల మూలాలు దెబ్బతినటం, చివరికి దంతం ఊడిపోవటం.... ఇదో విషవలయం! ఇదంతా కూడా మనం నోటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటున్నామన్న దాని మీద ఆధారపడి ఉంటుంది. అయితే నోటి శుభ్రత అన్నది చిగుళ్ల, దంతాల సమస్యలు రాకుండా చూడటమే కాదు.. ఇతరత్రా ఆరోగ్య సమస్యలను అడ్డుకోవటానికి కూడా కీలకమేనని పరిశోధనలు ఇప్పుడు స్పష్టంగా చెబుతున్నాయి. ఎందుకంటే నోటిలో ఏ సమయంలో చూసినా దాదాపు 500 రకాల బ్యాక్టీరియా ఉంటుంది, ఇక చిగుళ్ల దగ్గర, దంతాల మీద పేరుకునే గారలోనే 300 రకాలుంటాయి. మనం బ్రషింగ్ వంటి నోటి శుభ్రత చర్యలు సరిగా పాటించకపోతే ఈ బ్యాక్టీరియా రక్తప్రసారంలో కలిసి.. ఒంట్లో ప్రవేశిస్తుంది. అక్కడి నుంచీ ఇది.. గుండె, ఊపిరితిత్తులు, మెదడు, క్లోమం వంటి రకరకాల కీలక అవయవాల మీద ప్రభావం చూపిస్తూ.. తీవ్ర సమస్యలు తెచ్చిపెడుతుంది. ఇవేమిటో చూద్దాం:

- **గుండె జబ్బులు:** దంతాల మీద గార పేరుకుని, చిగుళ్ల వ్యాధి ఆరంభమైన తర్వాత.. ఆ సమస్య అక్కడితో ఆగిపోతుందనుకోకూడదు. అరుదుగానే అయినా ఈ గారలోని బ్యాక్టీరియా చిగుళ్ల నుంచి రక్తప్రసారంలో కలిసి.. కీలక రక్తనాళాల్లో వాపు తెచ్చిపెడుతుంది. ఈ వాపు... రక్తనాళాల్లో పూడికలు వచ్చేలా చేసి.. చివరికి గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్ర సమస్యలకు దారి తీస్తుంది. చిగుళ్ల వ్యాధి ఎంత తీవ్రంగా ఉంటే ఈ ముప్పు కూడా అంత ఎక్కువ. చిగుళ్ల వ్యాధులున్న వారిలో ధమనులు పూడుకుని పక్షవాతం, గుండెపోటు ముప్పు పెరుగుతున్నట్టు వైద్యరంగం స్పష్టంగా గుర్తించింది. రెండోది- నోటిలోని స్ట్రెప్టోకాకస్ వంటి బ్యాక్టీరియా రక్తప్రవాహంలో కలిసి గుండె మధ్య ఉండే కవాటాల మీద చేరి.. కవాటాలను దెబ్బతీస్తున్నట్టు (దీన్నే ఇన్ఫెక్టివ్ ఎండోకార్డైటిస్ అంటారు) కూడా స్పష్టంగా గుర్తించారు. ఇది చాలా ప్రమాదకరమైన సమస్య.
- **శ్వాస సమస్యలు:** నోటి శుభ్రత కొరవడినప్పుడు నోటిలో పెరిగిపోయే బ్యాక్టీరియా లాలాజలంలో కలిసి మన ఊపిరితిత్తులను చేరే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఊపిరితిత్తుల్లో న్యుమోనియా వంటి తీవ్ర సమస్యలు తలెత్తుతున్నట్టు (బ్యాక్టీరియల్ న్యుమోనియా) గుర్తించటం మనం విస్మరించరాని విషయం.
- **మధుమేహం:** చిగుళ్ల వ్యాధి, దంత సమస్యలున్న వారిలో రక్తంలో గ్లూకోజు స్థాయులు పెరిగిపోతూ.. మధుమేహం అదుపు తప్పుతుంది. మధుమేహం వల్ల కూడా చిగుళ్ల వ్యాధులు ముదిరిపోతుంటాయి. చాలాసార్లు మొదటిసారిగా మధుమేహాన్ని.. చిగుళ్ల వ్యాధుల రూపంలోనే గుర్తిస్తుంటారు కూడా. కాబట్టి మధుమేహులకు నోటి శుభ్రత మరింత కీలకం.
- **గర్భిణి సమస్యలు:** గర్భిణుల్లో హార్మోన్లలోనూ, ఆహారపుటలవాట్లలోనూ వచ్చే మార్పుల కారణంగా నోటి శుభ్రత కొరవడి.. దంత ఇన్ఫెక్షన్లు, చిగుళ్ల వ్యాధులు వచ్చే అవకాశం చాలా ఎక్కువ. ఈ సమస్యలున్న వారికి నెలలు నిండకముందే కాన్పు కావటం, బరువు తక్కువ బిడ్డలు పుట్టటం వంటి ముప్పులూ ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు.
- **ఇంకా...** నోటి శుభ్రత కొరవడిన కారణంగా ఆల్జీమర్స్ వంటి వ్యాధుల ముప్పు పెరుగుతోందనీ, క్లోమ గ్రంథికి క్యాన్సర్ వచ్చే ముప్పు, కిడ్నీ సమస్యల ముప్పూ, కీళ్లవాతం సమస్యా పెరుగుతోందని.. ఇలా తరచూ పరిశోధనా ఫలితాలు వెలువడుతూనే ఉన్నాయి.

వీటన్నింటి సారాంశం ఒక్కటే. మనం నోరు వేరు, శరీరం వేరు అనుకోవటానికి లేదు. నోటిని శుభ్రంగా ఉంచుకోవటం.. నోటికే కాదు.. మొత్తం ఒంటికి కీలకం!!

మందులతోనూ నోటి సమస్యలు!

కొన్ని రకాల మందులు కూడా నోటి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి, ముఖ్యంగా చాలామంది రోజూ వాడుకునే ఈ మందుల వల్ల నోరు పొడిబారి, రకరకాల నోటి సమస్యలు బయల్దేరతాయి. కాబట్టి వీటిని వైద్యుల సిఫార్సు లేకుండా విచ్చలవిడిగా వాడకూడదు.

- అలర్జీలకు వాడే యాంటీ హిస్టమిన్ మాత్రలు
- నొప్పిని తగ్గించే పెయిన్ కిల్లర్స్
- మూత్రం ఎక్కువయ్యేలా చేసే డైయూరిటిక్స్
- హైబీపీ తగ్గేందుకు వాడే మాత్రలు
- కుంగుబాటు వంటి మానసిక సమస్యలకు వాడే మందులు.

మరి నోటి శుభ్రత అంటే?


ఎలాంటి పాచి, గార లేకుండా దంతాలు శుభ్రంగా ఉండాలి. చిగుళ్లు చక్కటి గులాబి రంగులో ఉండాలి, వాటి నుంచి రక్తం వస్తుండకూడదు, బ్రషింగ్ చేసేప్పుడు కూడా రక్తం చిమర్చకూడదు. నోటి నుంచి దుర్వాసన రాకుండా ఉండాలి. ఈ మూడూ కీలకం. దీనికి నిత్యం మనం నోటి విషయంలో శ్రద్ధ తీసుకోవటం ఒక్కటే మార్గం.

ఇవి ముఖ్యం!

- రెండు పూట్లా బ్రషింగ్ చేసుకోవటం
- బ్రషింగ్ చెయ్యగానే చిగుళ్లకు మర్దన చేయటం
- ఆహారం తీసుకున్న ప్రతిసారీ నీటితో పుక్కిలించి నోటిని శుభ్రం చేసుకోవటం.
- మధ్యమధ్యలో మౌత్‌వాష్‌లు బాగా పల్చన చేసి పుక్కిలించాలి.
- దంతాల మధ్య పుల్లతో కుట్టటం మంచి అలవాటు కాదు. అనవసరంగా కుట్టొద్దు.
- సిగరెట్లు, ఆల్కహాల్‌కు దూరంగా ఉండటం
- కూల్‌డ్రింకులను తగ్గించటం, తాగిన ప్రతిసారీ నోరు శుభ్రం చేసుకోవటం
- ఆర్నెల్లకోసారి దంతవైద్యులను సంప్రదించి పరీక్ష చేయించుకోవటం
- కట్టుడు పళ్లు పెట్టుకుంటున్నా కూడా రోజూ వాటినీ, చిగుళ్లనూ శుభ్రం చేసుకోవాలి.

పానీయాల్లో వేస్తే.. పళ్లు మాయం!

సోడాలు, కూల్‌డ్రింకులు మన నోటి తీరును, ముఖ్యంగా దంతాలను బాగా దెబ్బతీస్తాయి. ఈ కర్బన పానీయాలు దంతాల మీద ఉండే పింగాణీ పొరను తినేస్తాయి. నిజానికి మన శరీరంలో ఎముకల కంటే కూడా గట్టి పదార్థం ఈ దంతాల మీది పింగాణీ. మనం నోటిలోని ఒక పన్నును తీసి ఒక కూల్‌డ్రింకు సీసాలో వేస్తే నెల రోజుల తర్వాత దాంట్లో దంతం కనబడదు. వంద సంవత్సరాలు ఉండాల్సిన పన్ను.. నెలరోజుల్లో కరిగిపోతోందంటే మన దంతాల మీద కూల్‌డ్రింకులు ప్రభావం ఎంత బలంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.



పసి వయసు నుంచి మలివయసు వరకూ..

పసిపిల్లల్లో..

నోటి శుభ్రత అన్నది పసితనం నుంచే ప్రారంభం కావాలి. ఆర్నెల్ల వయసు నుంచి 6 ఏళ్ల మధ్య పిల్లల నోటి శుభ్రత, పాలపళ్ల సంరక్షణ చర్యలు తీసుకోవాల్సింది తల్లిదండ్రులే! పిల్లలకు పాలు ఇచ్చిన తర్వాత ప్రతిసారీ నీటితోగానీ, దూదితోగానీ చిగుళ్లను సున్నితంగా తుడుస్తూ పసినోటిని శుభ్రం చెయ్యాలి. చాలాసార్లు రాత్రిపూట నిద్రలో పసిపిల్లలు ఏడిస్తే పాలసీసా నోట్లో పెట్టేస్తుంటారు. తర్వాత నోరు శుభ్రం చెయ్యరు. దీంతో దంతాలు దెబ్బతిని శాశ్వత దంతాలు వచ్చేనాటికే ఒంట్లో దంతాలన్నీ పుచ్చిపోయి ఉంటాయి. వీరికి కూడా నీటితో నోరు శుభ్రం చెయ్యాలి. పిల్లలకు ఏం తినిపించినా వెంటనే నీటితో పుక్కిలిపట్టించి నోరు శుభ్రం చేసుకోవటం నేర్పాలి. తీపి పదార్థాలు, స్వీట్లు తగ్గించటం, పండ్లు కూరగాయలు ఎక్కువగా తినిపించటం వంటి చర్యలు అవసరం. కొందరు పిల్లలు నోట్లో బొటనవేలు చీకుతుంటారు, దానివల్ల చిగుళ్ల మీద ఒత్తిడి పెరిగి, పళ్లు వంకరగా వస్తాయి. దీంతో నోటిని శుభ్రం చేసుకోవటం కష్టం కావటమే కాదు.. వీళ్లు దేన్నీ సరిగా కొరకలేరు, కొన్ని శబ్దాలు-పదాలు సరిగా పలకలేకపోవటం వంటి సమస్యలూ బయల్దేరతాయి. కాబట్టి నోట్లో వేలు అలవాటు మాన్పించాలి. రెండు పూట్లా బ్రషింగ్ చేసుకోవటం వంటి నోటి శుభ్రత పద్ధతులన్నీ 2 ఏళ్ల లోపే నేర్పించెయ్యాలి.

యుక్తవయసులో...

6-13 సంవత్సరాల వయసు పిల్లల నోరు చూస్తే కొన్ని పాలపళ్లు, కొన్ని శాశ్వత దంతాలూ.. రెండూ కనబడతాయి. అందుకే దీన్ని 'మిక్స్‌డ్ డెంటిషన్' దశ అంటారు. కొందరిలో పళ్లు రెండు వరసల్లో ఉంటాయి. దానివల్ల వాటి మధ్య ఆహార పదార్థాలు ఇరుక్కుని, దుర్వాసన, రంధ్రాలు పడటం వంటి సమస్యలన్నీ మొదలవుతుంటాయి. కాబట్టి ఈ దశలో దంతాల శుభ్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. యుక్తవయసులో ఒంట్లో వచ్చే హార్మోన్ల తేడాల వల్ల చిగుళ్ల నుంచి రక్తం రావటం, చిగుళ్ల వాపు వంటి వ్యాధులు చాలా ఎక్కువగా కనబడుతుంటాయి. దీన్ని 'ప్యూబర్టల్ జింజివైటిస్' అంటారు. దీనికి జాగ్రత్తగా బ్రషింగ్ చేసుకోవటం, అవసరమైతే వైద్యులతో క్లీన్ చేయించుకోవటం, మౌత్‌వాష్ వాడటం వంటివన్నీ నేర్పించాలి. నోటి శుభ్రత ఈ వయసులో మరింత కీలకం.

శాశ్వత దంతాలు వచ్చాక..

13 ఏళ్లు పైబడే సరికి సాధారణంగా శాశ్వత దంతాలు వస్తాయి కాబట్టి ఇక్కడి నుంచీ దంతాల ఆరోగ్యమన్నది మన అలవాట్ల మీదే ఆధారపడి ఉంటుంది. రోజంతా ఎన్ని పనులున్నా... అనివార్యంగా ఉదయం, సాయంత్రం ఓ 10 నిమిషాలను దంతాల కోసం వెచ్చించటం అవసరమని గుర్తించాలి. మలివయసులో కూడా మనకు దంత సమస్యలేమీ లేకుండా హాయిగా ఉండాలంటే నోటి శుభ్రత, దంతాల ఆరోగ్యం పట్ల పూర్తి శ్రద్ధ అవసరం.

నోటి శుభ్రతకు బ్రషింగ్ అత్యంత కీలకం!


పండ్లు తోముకోవటమే కదా... చాలా తేలిక అనుకుంటుంటాం! కానీ ఎంత మంది పద్ధతి ప్రకారం పండ్లు తోముతున్నారన్నది కీలకం. మార్కెట్ నిండా సాధారణ, వంకర, 32 డిగ్రీ, ఎలక్ట్రిక్.. ఇలా ఎన్నో రకాల బ్రష్షులు ఉన్నాయి. ఫ్యాషన్ కోసమని కాకుండా.. వీటిలో మనకు సరిపోయేది ఏదో ఎంచుకోవటం ముఖ్యం. ముందు పళ్లే కాదు.. దంతాల వెనక భాగంలో కూడా తోమాలి. మన బ్రష్షు దంతాల వరసలో చివరి పంటి వరకూ కూడా చేరేలా ఉండాలి. వంకర లేని బ్రష్షుల్లో అయితే మనం పెట్టే ఒత్తిడి మొత్తం బ్రష్షుకు చేరుతుంది, వంకర బ్రష్షులతో వెనకపళ్లు చేరుకోవచ్చుగానీ ముందరి పళ్లకు అంత సౌకర్యం ఉండకపోవచ్చు. కాబట్టి మనకు ఏది సౌకర్యంగా, అన్ని పళ్లనూ చేరుతోందో, దాన్నే ఎంచుకోవాలి. ఏది వాడినా లోపలా, బయటా అన్ని వైపులా పళ్లను చేరుకోవటం ముఖ్యం. గంటల తరబడి రుద్దకూడదు. దంతాలను 3-5 నిమిషాలు మాత్రమే తోమాలి. అదీ మరీ నొక్కిపెట్టి రుద్దకూడదు. బ్రషింగ్ తర్వాత చిగుళ్లను తప్పనిసరిగా మర్దన చెయ్యాలి. దానివల్ల రక్తప్రసరణ పెరిగి చిగుళ్లు ఆరోగ్యంగా, గట్టిగా పళ్లను కరుచుకుని ఉంటాయి. దంతాలకూ, చిగుళ్లకూ మధ్య ఖాళీ రాకుండా ఉంటుంది. హార్డ్ బ్రష్‌తో బలంగా తోమితే పళ్ల మీద ఉండే పింగాణీ పొర అరిగిపోయి.. చాలా సమస్యలు మొదలవుతాయి. గుట్కా, పొగ వంటి అలవాట్లు ఉన్నవాళ్లు పళ్ల మీద మరకలు పోవాలని బలంగా రుద్దుతుంటారుగానీ దానివల్ల అవి పోకపోగా దంతాలకు నష్టం ఎక్కువ. బ్రష్షు నోట్లో పెట్టి అడ్డంగా రుద్దకూడదు. పైపళ్లను పైనుంచి కిందికి, కింది పళ్లను కింది నుంచి పైకి.. చిగుళ్ల నుంచి పంటి చివరి వరకూ తోమాలి. దీనివల్ల చిగుళ్లు పళ్లను గట్టిగా పట్టుకుని ఉంటాయి.

మలివయసు..

పడిపోనివ్వొద్దు!

పెద్దవయసు వారిలో 'పడిపోవటం' పెద్ద సమస్య! మెట్ల మీద, స్నానాల గదుల్లో, నునుపుగా ఉండే బండల మీద.. ఇలా ఎక్కడో చోట వృద్ధులు జారి పడిపోవటం.. ఎముకలు విరగటం, ముఖ్యంగా తుంటి కీలు విరిగి వారి జీవితం ఉన్నట్టుండి సమస్యల వలయంగా మారిపోవటం.. తరచూ చూస్తుండేదే! పైగా ఈ వయసుకు వచ్చేసరికి చాలామందికి ఎముకలు బోలుగా తయారై (ఆస్టియోపొరోసిస్) అవి తేలికగా కొద్దిపాటి దెబ్బలకే విరిగిపోతుంటాయి. ఆ తర్వాత- త్వరగా అతకవు కూడా! దీనివల్ల కొన్నిసార్లు మంచానికే పరిమితమవ్వాల్సిన పరిస్థితులు కూడా తలెత్తుతుంటాయి. వీటన్నింటి వల్లా మలివయసులో జారిపడటం, తుంటిఎముక విరగటమన్నది అతి పెద్ద వృద్ధాప్య సమస్యగా తయారవుతోంది. కాబట్టి అసలీ విపత్తు తలెత్తకుండా చూసుకోవటమే చాలా అవసరం. కాబట్టి ఇంట్లో వృద్ధులు ఉన్నప్పుడు కొన్ని రకాల జాగ్రత్తలు అనివార్యంగా తీసుకోవాలి.

- ఇంట్లో ఎక్కడకపడితే అక్కడ వైర్లు, తాళ్లు, బట్టల వంటివి పడేసి ఉంటే.. అవి కాళ్లకు అడ్డుపడి వృద్ధులు పడిపోయే అవకాశాలు ఎక్కువ. కాబట్టి వైర్లు, తాళ్ల వంటివాటన్నింటినీ నిర్లక్ష్యంగా నేల మీద వదిలెయ్యకుండా జాగ్రత్తగా ఒక చోట చుట్టి పెట్టడం ముఖ్యం.



- చాలా ఇళ్లలో మెట్ల ప్రాంతం చీకటిగా ఉంటుంది. గదుల్లో ఉంటాయిగానీ.. మెట్ల దగ్గర ప్రత్యేకించి లైట్లేమీ ఉండవు. ఇలాంటి పరిస్థితుల్లో చాలామంది పెద్దవాళ్లు రాత్రిపూట నిద్రమత్తులో పొరపాటున ఒక చోట అడుగువేయబోయి మరోచోట వేస్తుంటారు. దీంతో జారిపడి గాయాల పాలవుతుంటారు. కాబట్టి మెట్ల దగ్గర మంచి వెలుతురు ఉండేలా చూసుకోవాలి, బద్ధకించకుండా లైటు వేసుకునే మెట్ల మీద నడవాలి.
- ఒక వేళ పొరపాటున నీళ్ల లాంటివి ఇంట్లో నేల మీద ఒలికిపోతే అవే ఆరిపోతాయిలే అనే నిర్లక్ష్యం పనికిరాదు. మార్బుల్ నేలపై జారిపడిపోతే గాయాలు తీవ్రంగా తగిలే ప్రమాదం ఉంది.
- వృద్ధులు తరచూ ఉపయోగించే మందుల వంటివాటిని ఎక్కడో అందనంత ఎత్తులో పెట్టొద్దు. స్టూల్ వేసుకుని వాటిని అందుకునే క్రమంలో వాళ్లు పైనుంచి పడిపోయే ప్రమాదం చాలా ఎక్కువ.
- చాలామంది ఇంట్లో సాక్సులు ధరించి నడుస్తుంటారు. కానీ అది మంచి పద్ధతి కాదు, అవి నునుపైన నేల మీద తేలికగా జారిపోతుంటాయి. రబ్బరు సోల్ ఉన్న పాదరక్షలు ధరించడం మంచిది. అవయితే జారడానికి అవకాశం ఉండదు.
- స్నానాల గదిలో 'నాన్‌స్కిడ్ టైల్స్'ని వాడాలి. దీనివల్ల అక్కడ పాకుడు పట్టటం, జారిపోవటం వంటి సమస్యలుండవు.
- ఇంట్లో పెంపుడు కుక్కలు, పిల్లులు కూడా చాలాసార్లు దారిలో అడ్డంగా పడుకుంటూ ఉంటాయి. పెద్దవాళ్లు వీటిని చూడక, కాలు తగిలి పడిపోతుంటారు. కాబట్టి పెంపుడు జంతువులకు ఇంట్లో ఏదో ఒక పక్కగా పడుకోవటం అలవాటు చెయ్యాలి.
- కొన్నిసార్లు మనం వాడే మందులు కూడా మగతకు కారణం అవుతాయి. అవి కూడా ఈ ప్రమాదాలకు కారణమే కనుక.. వైద్యుల్ని మగతగా ఉండని మందులు సిఫార్సు చెయ్యమని కోరాలి. వీలైతే ఎప్పటికప్పుడు కంటిపరీక్షలు చేయించుకోవడం కూడా చాలా అవసరం. చాలాసార్లు పక్క మీద నుంచి లేచేటప్పుడు దుప్పట్లని చుట్టుకుని పడిపోతుంటారు. కాబట్టి హడావుడిగా లేవకుండా.. దుప్పట్లను జాగ్రత్తగా తీసి, పక్కనబెట్టి అప్పుడు నిదానంగా లేవటం అలవరచుకోవాలి.

ఇంట్లోనే బీపీ చూసుకోవడం మేలట!

ఒక సినిమా చూస్తూ అందులో ఒక సీన్‌ని మాత్రం మనం స్క్రీన్‌షాట్ తీసామనుకోండి... అదే మొత్తం కథ అవుతుందా?


అలాగే రోజంతా మన శరీరంలో రక్తపోటు వివిధ రకాలుగా మారుతూ ఉంటుంది. కానీ మనం డాక్టర్ దగ్గరకు వెళ్లి చూపించుకున్నప్పుడు ఏ బీపీ ఎంత ఉందో.. అదే సరైన విలువ అనుకుంటాం. నెలకో, ఆరునెలలకో ఒకసారి బీపీ చూపించుకుని మన రక్తపోటు ఎప్పుడూ అలానే స్థిరంగా ఉంటుందని అనుకోటానికి లేదు. మనం ఎంతో దూరం ప్రయాణం చేసి ఆదరాబాదరా.. ఎంతో ఒత్తిడితో డాక్టర్ దగ్గరకు వెళ్తే ఆ ప్రభావం కూడా మన బీపీపై పడుతుంది. బీపీ గంటగంటకు ఆమాటకొస్తే నిమిషనిమిషానికి మార్పులకు లోనవుతూ ఉంటుంది. అలాగే మనం బీపీ నమోదు చేసుకునే సమయంలో ఉండే పరిస్థితులు కూడా బీపీ స్థాయుల్లో తేడా చూపిస్తాయి. మనం కూర్చుని బీపీ చూపించుకుంటున్నామా.. నిల్చునా, టీవీలో ఏదైనా ఉత్కంఠ, భయాందోళనలకు గురయ్యే సంఘటనలు చూసినప్పుడు బీపీ చూపించుకున్నా ఆ బీపీ విలువల్లో చాలా మార్పులు ఉంటాయి.

కొందరికి వైద్యుల వద్దకు వెళ్లినప్పుడు కొంత మానసిక ఆందోళన ఉంటుంది. దీనివల్లా బీపీ పెరిగినట్లు కనబడుతుంది. దీనివల్ల వాస్తవంగా బీపీ లేకపోయినా ఉందని ఆందోళన చెందేవారు 20% వరకూ ఉంటున్నారని గుర్తించారు.

అందుకని ఎవరికి వారు బీపీ చూడటం నేర్చుకుంటే.. రోజులో పలుమార్లు, వివిధ సందర్భాల్లో ఇంటివద్దనే ప్రశాంతంగా బీపీ చూసుకుని దాని స్థాయులను కచ్చితంగా నిర్ధారించుకునే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

ఈనాడు సినిమా

ఓ కథలో కథానాయకుడు, నాయిక, ప్రతినాయకుడు, హాస్య నటుడు, సహాయ నటులు... ఇలా చాలామంది ఉంటారు. కథని ముందుకు నడిపించేది వీళ్లే. అయితే తెరపై కనిపించీ కనిపించని పాత్రలు కొన్ని ఉంటాయి. అవే... కళ, సంగీతం. కొన్నిసార్లు కళా దర్శకుడు వేసిన సెట్ కూడా, కథలో కీలకంగా మారుతుంటుంది. 'భాగమతి'లో కళా దర్శకుడు రవీందర్ వేసిన 'భాగమతి బంగ్లా'కి ఆ స్థానం ఉంది. ఈ కథలో.. ఆ భవనం కూడా ఓ కీలక పాత్ర పోషించింది. 'ఛత్రపతి', 'మగధీర', 'ఈగ', 'మర్యాద రామన్న', 'అత్తారింటికి దారేది', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'దువ్వాడ జగన్నాథమ్' ఇలా చాలా చిత్రాలకు తనదైన కళాత్మక హంగులు అద్దారు రవీందర్. 'మర్యాద రామన్న'లో రవీందర్ వేసిన ఇంటి సెట్‌కి పేటెంట్ హక్కులు కూడా దక్కాయి. అదే స్థాయిలో 'భాగమతి' బంగ్లానీ తీర్చిదిద్దారు. ఈనెల 26న 'భాగమతి' విడుదల కాబోతోంది. ఈసందర్భంగా ప్రొడక్షన్ డిజైనర్ రవీందర్ 'ఈనాడు సినిమా'తో పంచుకున్న అనుభవాలు.



29 రోజులు... రూ.3 కోట్లు!

'భాగమతి' బంగ్లా విశేషాలు



రవీందర్

"దర్శకుడు అశోక్ చెప్పిన కథ ప్రకారం... అయిదు వందల సంవత్సరాల క్రితంనాటి ఓ పురాతన భవనం కావల్సివచ్చింది. ఓ రాజు.. తన భార్యకు కానుకగా ఇచ్చిన భవంతి అది. అలాంటి భవంతి కోసం దేశం నలుమూలలా గాలించాం. మాకు కావల్సిన హంగులతో ఉన్న బంగ్లా ఎక్కడా కనిపించలేదు. దాంతో సెట్ వేయడం తప్ప మరో మార్గం లేదనిపించింది. అయిదువందల సంవత్సరాల క్రితం భవంతులు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి కొంత పరిశోధన అవసరమైంది. అప్పటి మన కట్టడాలపై పాశ్చాత్య దేశాల ప్రభావం ఉండేది. అందుకే భారతీయత, విదేశీయత కలగలిపిన డిజైన్లు రూపొందించాం. కొన్ని స్కెచ్చులు వేశాం. చివరికి 28 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఓ సెట్‌ని నిర్మించాం. అదే.. 'భాగమతి బంగ్లా'. ఇందులో 189 రాతి స్తంభాలు కనిపిస్తాయి. కొన్ని పది అడుగుల ఎత్తుంటే, మరికొన్ని నలభై అడుగుల వరకూ ఉంటాయి. 12 గదులున్న రెండు అంతస్థుల భవనం ఇది. ఆ రోజుల్లోనే లిఫ్ట్ సౌకర్యం ఉండేది. అయితే లిఫ్ట్‌ని మనుషులు తాళ్లతో లాగేవారు. వాటికి తగ్గట్టుగా ఓ లిఫ్ట్‌నీ రూపొందించాం. ఫైబర్‌ని ఎక్కువగా వాడాం. రంగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ఇప్పటి వరకూ ఎవరూ వాడని రంగులు సెట్లో కనిపిస్తాయి. రాజుల నాటి ఫొటోల్ని పెద్ద పెద్ద ఫ్రేముల్లో చూపించాం. ఒకొక్క ఫ్రేమూ పది అడుగుల వరకూ ఉంటుంది. మూడు కేజీల బరువు ఉంటుంది. ఇంత పెద్ద సెట్‌ని కేవలం 29 రోజుల్లో పూర్తి చేశాం. 200మంది కార్మికులు రాత్రి, పగలు పని చేశారు. బడ్జెట్ ఎక్కువ అవుతుందని ముందే తెలుసు. దానికి యూవీ క్రియేషన్స్ కూడా సిద్ధమయ్యింది. 'సెట్ బాగుండాలి.. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు' అని ప్రోత్సహించారు. దాదాపుగా రూ.3 కోట్ల వ్యయంతో ఈ సెట్‌ని నిర్మించాం. సగం కథ ఈ సెట్లోనే సాగుతుంది. సాధారణంగా ఒకే చోట ఓ ఇరవై రోజులు షూటింగ్ జరిపితే బోర్ కొట్టేస్తుంది. కొత్త బ్లాకులు పెట్టుకోవడానికి కెమెరామెన్‌కి అవకాశం దక్కదు. కానీ.. మేం ఉపయోగించిన కొత్త టెక్నాలజీ వల్ల.. సరికొత్త ఫ్రేమింగులకు అవకాశం దక్కింది. 'మర్యాద రామన్న'లో వేసిన ఇంటి సెట్‌కి పేటెంట్ దక్కింది. ఈ 'భాగమతి' బంగ్లాకీ పేటెంట్ హక్కుల కోసం ప్రయత్నిస్తాం. తోట తరణి, గౌతమ్ మేనన్, వినాయక్, రామ్ చరణ్, అల్లు అర్జున్, సుకుమార్, సాయిధరమ్ తేజ్ ఇలా చాలామంది సినీ ప్రముఖులు ఈ సెట్ చూడ్డానికి వచ్చారు. ఓ సెట్ ఇంతలా ఆకర్షించడం బహుశా ఇదే తొలిసారేమో. ఛాయా గ్రాహకుడు, కళా దర్శకుడు, సంగీత దర్శకుడు... ఇలా కీలకమైన విభాగాల నిపుణులు కలసికట్టుగా పనిచేయడం బాలీవుడ్ ఆనవాయితీ. అందరూ ఓ టీమ్‌గా ఉండడం వల్ల బాలీవుడ్‌లో మంచి ఫలితాలు వస్తున్నాయి. 'భాగమతి' విషయంలోనూ మేం అదే చేశాం. నేను సెట్ వేస్తుంటే... సంగీత దర్శకుడు తమన్ కూడా వచ్చి చూశారు. నేపథ్య సంగీతంలో ఈ సెట్‌ని ఎలా వాడుకోవాలో తన సౌండ్ ఎఫెక్ట్స్ నిపుణులతో మాట్లాడారు. ఇలాంటి సమన్వయం ఉంటే.. కచ్చితంగా మంచి ఫలితాలొస్తాయి. ప్రస్తుతం నాగచైతన్య, శర్వానంద్, సుధీర్ వర్మ, ఇంద్రగంటి మోహన్ కృష్ణ చిత్రాలకు పని చేస్తున్నా. ఓ తమిళ చిత్రం కూడా చర్చల దశలో ఉంది"



'భాగమతి' బంగ్లా సెట్ లోపలి దృశ్యాలు



అదే పెద్ద విషయం

"నేనేం చేయగలననే విషయంపై నాకు స్పష్టత ఉన్నా... నా ప్రతిభ గురించి నాకంటే ప్రేక్షకులే మాట్లాడుకోవాలి, అదే నిజమైన విజయంగా భావిస్తా" అంటోంది రాశీ ఖన్నా. వరుసగా అవకాశాలు అందుకొంటూ దూసుకెళుతున్న కథానాయిక ఈమె. త్వరలోనే 'టచ్ చేసి చూడు', 'తొలి ప్రేమ' చిత్రాలతో సందడి చేయబోతోంది. కెరీర్ పరంగా సంతృప్తికరమైన ప్రయాణాన్ని సాగిస్తున్న దశలో ఉన్నానని, అదే సమయంలో నటిగానూ నా బాధ్యత రెట్టింపు స్థాయిలో పెరిగిందని చెబుతోంది. "వాణిజ్య ప్రధానమైన చిత్రాల్లో కథానాయికల కోసం ఓ మంచి పాత్ర సిద్ధం కావడమన్నదే ఓ పెద్ద విషయం. ఈమధ్య దాదాపు చిత్రాల్లో కథానాయికలకి బలమైన పాత్రలు లభిస్తున్నాయి. ఆ తరహా అవకాశాలు లభిస్తున్నప్పుడు వాటికి పరిపూర్ణంగా న్యాయం చేయాల్సిన బాధ్యత మాపైన ఉంటుంది. అందుకే నేను మరింత శ్రద్ధతో పనిచేస్తున్నా. స్వేచ్ఛగా నటిస్తూ ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నా" అని చెప్పింది రాశి. ప్రస్తుతం ఆమె తమిళ, మలయాళ చిత్రాలపై కూడా దృష్టిపెట్టింది.

అచ్చం సావిత్రిలానే...



కీర్తి సురేష్

అలనాటి మహానటి సావిత్రి గురించి ఎన్నెన్నో కథలు. సెట్లో ఆమె నడుచుకునే పద్ధతి, పాత్రల విషయంలో చూపించే అంకితభావం, సహాయకులపై కురిపించే అభిమానం ఇవన్నీ ఆసక్తి కలిగించేవే. సరిగ్గా ఆ లక్షణాలన్నీ పాటిస్తోంది కీర్తి సురేష్. 'మహానటి'గా సావిత్రి కథ వెండి తెరపైకి వస్తున్న సంగతి తెలిసిందే. ఆ పాత్రలో కీర్తి సురేష్ కనిపించబోతోంది. సెట్లో సావిత్రిలా నటించాలి, సావిత్రిలా మాట్లాడాలి... అనే కాదు, సావిత్రిలా ప్రవర్తించాలి అని భావిస్తోంది కీర్తి. అందుకే ఆమె లక్షణాల్నీ కీర్తి పుణికి పుచ్చుకొంది. సావిత్రికి అప్పుడప్పుడు సెట్లో ఉన్న వాళ్లందరికీ చిన్న చిన్న బహుమానాలు ఇవ్వడం అలవాటు. ఒక్కోసారి బంగారు నాణాలను కూడా ఇచ్చి ఆశ్చర్యపరిచేవారట. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా అదే పని చేసింది. 'మహానటి' సెట్లో ఉన్నవాళ్లందరికీ బంగారు నాణాలను పంచి పెట్టింది కీర్తి. అచ్చం సావిత్రిలానే కీర్తి కూడా ఇలా బహుమానాలతో షాక్ ఇవ్వడం చూసి చిత్రబృందం ఆశ్చర్యపోతోందట. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు, దుల్కర్ సల్మాన్, సమంత కీలక పాత్రలు పోషిస్తున్నారు. హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ దాదాపుగా పూర్తికావొచ్చింది.

దివ్యవాణి వస్తోంది

బాపు చిత్రం 'పెళ్లి పుస్తకం' గుర్తుంది కదా? అందులో దివ్యవాణిని కూడా ఎవ్వరూ మర్చిపోలేరు. చారెడంత కళ్లు, మూతి విరుపులతో తెలుగువారిని ఆకట్టుకుంది దివ్యవాణి. ఆ తరవాత తెలుగు, తమిళ భాషల్లో దాదాపు యాభై చిత్రాలు చేసింది. సుదీర్ఘ విరామం తరవాత ఇప్పుడు మళ్లీ మేకప్ వేసుకుంది. సావిత్రి జీవిత కథ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న 'మహానటి'లో ఆమె ఓ పాత్ర పోషిస్తోంది. ఈ సందర్భంగా దివ్యవాణి మాట్లాడుతూ "'పెళ్లి పుస్తకం' నా జీవితాన్ని మలుపు తిప్పింది. బాపులాంటి మహా దర్శకుడితో కలసి పనిచేయడం నా అదృష్టం. ఇప్పుడు మళ్లీ సినిమాల్లో నటించాలని ఉంది. కొన్ని ధారావాహికలు చేస్తున్నా. ఈలోగా 'మహానటి'లో కీర్తి సురేష్ తల్లి పాత్ర పోషించే అవకాశం దక్కింది. నటిగా కొనసాగాలన్న ఉద్దేశంతోనే చెన్నై నుంచి హైదరాబాద్‌కి మకాం మార్చాం" అంది.

కథలున్నాయి.. దర్శకులున్నారు.. హీరోలే లేరు!



హాస్యానికి పెద్ద పీట వేస్తూ సినిమాలు తీసే దర్శకుల్లో జి.నాగేశ్వరరెడ్డి ఒకరు. ఆయన సినిమాల్లో కామెడీ పంచులు 'సీమ టపాకాయ్'లా పేలిపోతూ నవ్వులు పంచుతుంటాయి. అందుకే కామెడీపై పట్టున్న దర్శకుడిగా ఆయన గుర్తింపు తెచ్చుకొన్నారు. మంచు విష్ణుతో 'దేనికైనా రెడీ', 'ఈడో రకం ఆడోరకం' చిత్రాల్ని తెరకెక్కించి విజయాల్ని సొంతం చేసుకొన్న ఆయన మూడోసారి 'ఆచారి అమెరికా యాత్ర' తెరకెక్కించారు. ఆ చిత్రం త్వరలోనే విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా జి.నాగేశ్వరరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

ఆచారి అమెరికా యాత్రకి ఎందుకు వెళ్లాడు?

ఒక తాత, మనవరాలి చుట్టూ ఉన్న ప్రమాదాన్ని పసిగట్టి దాన్ని ఆపేందుకు వెళతారు ఆచారి, ఆయన శిష్యబృందం. ఆ ప్రమాదమేంటి? ఎలా ఆపారన్నది మాత్రం తెరపైనే చూడాలి. ఒక మంచి కథని హాస్య ప్రధానంగా చెప్పే ప్రయత్నమే ఈ చిత్రం. థియేటర్‌కి వెళ్లిన ప్రేక్షకులకు ఒక నవ్వుల యాత్రలాగా ఉంటుంది. తాతగా కోట శ్రీనివాసరావు, మనవరాలిగా ప్రగ్యా జైస్వాల్ నటించారు.

ఇది నవల ఆధారంగా తెరకెక్కించిన చిత్రమా?

మల్లాది వెంకటకృష్ణమూర్తి సినిమా కోసమే ఈ కథని రాశారు. దాసరి నారాయణరావు పాతికేళ్ల కిందట వాళ్ల ఊళ్లో చూసిన ఒక పాత్రని తీసుకొని ఒక నవలలో రాశారు. ఆ పాత్ర ఆధారంగానే మల్లాది ఈ కథ రాశారు. అది నచ్చి నిర్మాత ఎమ్.ఎల్.కుమార్ చౌదరి నాకు చెప్పారు. మొదట ఈ కథ నేపథ్యం గురించి తెలిశాక చేయకూడదనుకొన్నా. 'దేనికైనా రెడీ' సమయంలో చాలా వివాదాలొచ్చాయి. అందుకే మళ్లీ బ్రాహ్మణుల నేపథ్యంలో సినిమా చేయడం ఎందుకను కొన్నా. కానీ ఇది అలా ఉండదని చెప్పాకే సినిమా చేయాలని నిర్ణయించుకొన్నా. చాలా జాగ్రత్తలు తీసుకొని ఈ సినిమా చేశాం.

విష్ణుతో మీరు చేసిన సినిమాలు బాగా నవ్వించాయి. మీ ఇద్దరి కలయిక బాగా కుదిరినట్టుంది?

నాకూ, కామెడీకి మధ్య కెమిస్ట్రీ బాగుంటుంది. అలాగే విష్ణుకి, కామెడీకి మధ్య కూడా మంచి కెమిస్ట్రీ ఉంటుంది. ఈ కథ వినగానే విష్ణు, బ్రహ్మానందం అయితేనే బాగుంటుందనుకొన్నా. నిర్మాతలు కూడా అదే అనుకొన్నారు. ప్రతి పాత్రకీ తగిన నటులు దొరికారు. విష్ణు, బ్రహ్మానందం మొదలుకొని... చివరి సన్నివేశాల్లో కనిపించే పృథ్వీ, భరత్‌ల వరకు అన్ని పాత్రలూ చాలా బాగా పండాయి. రచయిత మల్లాదితో కలిసి పనిచేయడం నా అదృష్టం.

ఈ మధ్య మీరు చేసిన సినిమాలు అనుకొన్నంతగా ఫలితాన్ని సాధించలేకపోయాయి. కారణమేమిటి?

ఏ సినిమా చేసినా ఎంచుకొన్న కథ బాగుందా లేదా? నేను బాగా చెప్పానా లేదా? అనేదే ముఖ్యం. దర్శకుడిగా నేను ఏ సినిమా విషయంలోనూ నిరాశపడలేదు. 'ఆటాడుకుందాం రా' ఒక్కటే అనుకొన్నట్టుగా రాలేదు కానీ.. 'ఇంట్లో దెయ్యం నాకేం భయం' విషయంలో మాత్రం పంపిణీదారులు కూడా సంతృప్తిని వ్యక్తం చేశారు.

కామెడీపై పట్టున్న దర్శకుల సంఖ్య తగ్గిపోతోందనే అభిప్రాయం పరిశ్రమలో వినిపిస్తోంది. దీనిపై మీ అభిప్రాయం?

కథలు కుటుంబ నేపథ్యంలో సాగినా లేక యాక్షన్ అయినా, హారర్ అయినా, థ్రిల్లర్ అయినా... కామెడీ లేకుండా మాత్రం సినిమా ఉండదు. కాకపోతే పూర్తిస్థాయి కామెడీ సినిమాల సంఖ్యే తగ్గిపోతోంది. అందుకు దర్శకులు లేకపోవడమే కారణం అనుకోను. కథలు, దర్శకులు ఉన్నా, కామెడీ హీరోల సంఖ్యే తగ్గిపోతోంది. యువ కథానాయకులంతా ప్రేమ కథలు, యాక్షన్ వైపు దృష్టిపెడుతున్నారు. దర్శకులు కూడా వాళ్ల శైలికి తగ్గట్టుగానే కథలు రాసుకొంటూ, వాటిలోనే కామెడీని చొప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

కామెడీ ముద్ర నుంచి బయటికొచ్చి సినిమాలు చేసే ఆలోచనేమైనా ఉందా?

కామెడీపైన పట్టున్న దర్శకుడనే గుర్తింపుని ఒక అదృష్టంగా భావిస్తా. కామెడీ లేకుండా నేను సినిమా చేయను. అగ్ర కథానాయకుడు చిరంజీవి మొదలుకొని అందరూ కామెడీ ప్రధానమైన సినిమాలు చేసినవాళ్లే. స్టార్ హీరోలతో సినిమా చేసే అవకాశమొచ్చినా కామెడీకి పెద్ద పీట వేస్తూ సినిమా చేస్తా.

మీరు చేయబోయే తదుపరి సినిమాలు?

విష్ణుతోనే ఓ సినిమా ఉంటుంది. అనుకోకుండా ఆయనకి ఒక కథ చెప్పా. 'చాలా బాగుంది, మనం చేద్దాం' అన్నారు. ఆ తర్వాత చేయబోయే సినిమా ఏంటన్నది మాత్రం ఇంకా నిర్ణయించుకోలేదు.

సోనమ్ జోడీ దుల్కర్?



సోనమ్ కపూర్



'ఓకే కన్మణి', 'బెంగళూరు డేస్' లాంటి చిత్రాలతో దక్షిణాదిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు ప్రముఖ కథానాయకుడు మమ్ముట్టి తనయుడు దుల్కర్ సల్మాన్. తెలుగులో వస్తోన్న 'మహానటి'లో జెమిని గణేషన్‌గా కనిపించబోతున్నాడు. 'కార్వాన్' చిత్రంతో బాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇచ్చేశాడు. ఇప్పుడు మరో బాలీవుడ్ చిత్రంలో నటించబోతున్నాడు. ఇందులో విశేషం ఏంటంటే సోనమ్‌కపూర్‌తో కలిసి దుల్కర్ నటించనున్నట్టు సమాచారం. అనూజ చౌహాన్ నవల 'ది జోయా ఫాక్టర్' ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ కథ బాగా నచ్చడంతో ఆ నవల హక్కులు దక్కించుకొంది సోనమ్. ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని మార్చిలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.

గీతోపదేశం

అల్లరి చెయ్యాలి
చిల్లర పనులే చేయొద్దు
నవ్వుతూ ఉండాలి
నవ్వులపాలే కావొద్దు
కలలే చూడాలి
నిజముగ మలచక వదలొద్దు
ఎత్తుకు ఎదగాలి
నిలిచిన నేలను మరవొద్దు
భారతభూమిని మరవొద్దు
భారతమాతను మరవొద్దు

గీతం: నా పేరు చక్రం...
చిత్రం: చక్రం
రచన: చంద్రబోస్

- పంపినవారు: ఎస్. మాధవనాయుడు, అనంతపురం

'సుల్తాన్'కు 3... 'టైగర్..'కు 333!

సల్మాన్ ఖాన్, అనుష్క శర్మ నాయకానాయికలుగా నటించిన 'సుల్తాన్' 2016లో వచ్చి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మల్లయుద్ధం నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం తాజాగా ఓ అంతర్జాతీయ చిత్రోత్సవంలో పురస్కారాలతో సత్తా చాటింది. క్రీడల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రాల కోసమే ముంబయిలో ప్రత్యేకంగా నిర్వహించిన టెహ్రాన్ చిత్రోత్సంలో 'సుల్తాన్'కు మూడు విభాగాల్లో పురస్కారాలు దక్కాయి. మల్లయోధుడి పాత్రలో మెప్పించిన సల్మాన్ ఉత్తమ నటుడిగా, కథానాయికగా నటించిన అనుష్క శర్మ ఉత్తమ నటిగా, చిత్రాన్ని తెరకెక్కించిన అలీ అబ్బాస్ జాఫర్ ఉత్తమ దర్శకుడిగా పురస్కారాలు గెలుచుకోవడం విశేషం. కాగా గత డిసెంబరులో విడుదలైన సల్మాన్ చిత్రం 'టైగర్ జిందా హై' కొద్దిరోజుల కిందట రూ.300 కోట్ల క్లబ్‌లో చేరిన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం రూ.333 కోట్ల మార్కు అందుకుంది.



'సుల్తాన్'లో సల్మాన్ ఖాన్, అనుష్క శర్మ



సంప్రదాయ దుస్తులయితే దిద్దులూ, జుంకాలు... పార్టీలకయితే ఫంకీ నగలు.... రోజువారీ అయితే చాలా సింపుల్ అండ్ ట్రెండీ.... ఇదీ అమ్మాయిలు చెవులకు ఆభరణాలు ఎంచుకునే పద్ధతి.. ఏదయినా సరే.. అదిరిపోవాలంటే మన ముఖానికి నప్పేదానికే ఓటెయ్యాలి. అదెలాగో చూద్దామా..

లోలాకుల నయగారం!

కోల ముఖానికి బుట్టలు అందం...

నుదురు ఎక్కువగా ఉండే కోల ముఖాకృతికి పెద్ద పెద్ద రింగులు అందాన్నిస్తాయి. వీటిని ఎంపిక చేసుకొనేటప్పుడు పైన చిన్న స్టడ్స్ ఉండి, కిందకు పెద్ద సైజులో గుండ్రటి రింగులు ఉండేలా చూసుకోవాలి. అలాగే చిన్న సైజు నుంచి పెద్ద సైజు వరకు ఒకదాంట్లో ఒకటి రింగులు ఉండేవీ వీరికి బాగుంటాయి. ఇవి ఫ్యాన్సీ దుస్తులకు నప్పుతాయి. జీన్స్, స్కర్టు, పొడవాటి గౌన్లపై ఈ తరహా రింగులు అదిరిపోతాయి. అలాగే పొట్టి గౌను లేదా క్రాప్‌టాప్‌పై సింపుల్‌గా ఉండే దిద్దులూ అందంగా అమరిపోతాయి. కోల ముఖాకృతికి కళ తెస్తాయి బుట్టలు. పైన చిన్న దిద్దులుండీ, అడుగున అందంగా, గుండ్రంగా వేలాడే బుట్టలు సాంప్రదాయపు దుస్తులకు సరిపోతాయి. వీటిలో ముత్యాలూ, రాళ్లూ, కుందన్లతో ఆకర్షణీయ రంగుల్లో ఉండి, పరికిణీ ఓణీ, గాగ్రా ఛోళీ, లెహెంగాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పార్టీవేర్‌కు చిన్నగా ఉండే జుమ్కీలు లేదా బుట్టలకు తోడుగా ఇయిర్‌కఫ్స్ కూడా పెట్టుకోవచ్చు.

చందమామకు చాంద్‌బాలీ..



గుండ్రటి ముఖం ఉన్న అమ్మాయిని చందమామలా అందంగా ఉందని అంటాం. ఆ ఆకృతికి తగ్గట్టే చెవులకూ నగల్ని ఎంచుకోవాలి. చెవి దగ్గర స్టడ్‌లా ఉండి, అడుగున పెద్దగా ఉంటే హ్యాంగింగ్స్ ఈ తరహా ముఖాకృతికి నప్పుతాయి. జామెట్రికల్ డిజైన్లు కూడా బాగుంటాయి. పైన చిన్న స్టడ్‌లా ఉండి అడుగున డైమండ్, త్రికోణాకారం, చతురస్రాకారం, అర్ధచంద్రాకారంలో వేలాడుతూ ఉండే సింపుల్ డిజైన్లు అదిరిపోయేలా ఉంటాయి. వీటిని పాశ్చాత్య వస్త్రశ్రేణికి జతగా ఎంచుకోవచ్చు. అలాగే ఈ ముఖాకృతి ఉన్నవారు చాంద్‌బాలీలనూ ప్రయత్నించొచ్చు. అర్ధచంద్రాకారంలో ఉండి, రాళ్లూ, ముత్యాలు పొదిగి, ఫ్యాన్సీ డిజైన్లలో ఉండేవీ ఎంచుకోవచ్చు. ఇవి కూడా సైజులవారీగా ఉంటాయి. ఫ్లోర్‌లెంగ్త్ అనార్కలీకి చక్కగా ఉంటాయి. అలాగే ఆయా వర్ణాల్లో షాండ్లియర్, జుంకాలతో వస్తున్న చాంద్‌బాలీలు కూడా అదిరిపోయేలా ఉంటాయి.

చతురస్రాకారానికి జుంకాలు...



ఇలాంటివారు పై భాగాన పెద్దగా ఉండి, అడుగున చిన్నగా ఉండేవి బాగుంటాయి. షాండ్లియర్ తరహాలో పొడవాటి తీగల్లా లేదా పలురకాల ఆకారాలు, పూల డిజైన్లతో పొడవుగా వేలాడేవి, జుంకాలు నప్పుతాయి. సింపుల్‌గా కూడా ఉంటాయి. అలాగే పై నుంచి పెద్ద రింగులుగా ఉండి, కింద చిన్నగా తీగలా వేలాడినట్లున్నా నప్పుతాయి. ఇవి ఆధునిక దుస్తులకు బాగుంటాయి. పార్టీవేర్‌కు మాత్రం మెడలో వేసుకునే ఆభరణానికి మ్యాచింగ్‌గా రాళ్లు పొదిగిన పెద్ద పెద్ద దిద్దులు సరిపోతాయి.

త్రికోణానికి మెరుపులు..



మధ్యలో చిన్న ముత్యం లేదా రాయి పొదిగి ఉన్న పెద్ద సైజు దిద్దులు వీరి ముఖానికి నిండుదనం తెస్తాయి. అలాగే చిన్నచిన్న రాళ్లు పొదిగి ఉండి, నక్షత్రం వంటి ఆకృతులు బాగుంటాయి. ప్రత్యేక సందర్భాలకు గుండ్రంగా ఉండే చాంద్‌బాలీలు వీరికి మరింత కళ తెచ్చిపెడతాయి.

హృదయానికి షాండ్లియర్లు...



నీటి చుక్కలు జారుతున్నట్లుండే డిజైన్లు ఈ తరహా ముఖాకృతికి సరిగ్గా నప్పుతాయి. అలాగే పైన వెడల్పు తక్కువగా, ఖాళీగా ఉండి, కిందకు వచ్చేకొద్దీ త్రికోణాకారంలో డిజైను గల చెవిపోగులు వీరికి బాగుంటాయి. సింపుల్‌గా ఉండే ఈ మోడల్ ఆధునిక దుస్తులకూ, పార్టీవేర్‌కు కూడా చక్కగా నప్పుతాయి. అలాగే ప్రత్యేక సందర్భాలకు కిందకు వేలాడుతున్నట్లుండే షాండ్లియర్లు, వజ్రాకారంలో ఉండే డిజైన్లు బాగుంటాయి. ముత్యాలూ, రాళ్లూ పొదిగిన డ్రాప్ ఇయర్ రింగ్స్ కూడా వీరికి అందాన్ని తెచ్చిపెడతాయి.

వజ్రానికి వేలాడేలా...



తేలికగా, రెండూ లేదా మూడు డిజైన్లు ఒకదానిపై ఒకటి ఉండేలా, పొడవాటి డిజైన్లు వజ్రాకృతి ముఖం ఉన్నవారికి బాగుంటాయి. అలాగే ఇవి రకరకాల రంగుల్లో ఉంటే మరింత నప్పుతాయి. రెక్కల తరహాలో ఉన్నవీ ఆకట్టుకుంటాయి. వీటిని సింపుల్‌గా ఉండే దుస్తులపై మాత్రమే పెట్టుకోవచ్చు. దుస్తులు కాస్త ఆడంబరంగా ఉన్నట్లయితే పొడవాటి హ్యాంగింగ్స్ ఎంచుకోవచ్చు. అయితే సన్నటి. పొడవైన తీగల్లాంటి డిజైన్లు ఈ తరహా వారికి అంతగా నప్పవు.

మహిళా కూలీ నెం.1

రాజస్థాన్ రాజధాని జైపూర్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపైకి రైలు రాబోతున్నట్లు అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. కూలీలంతా ఒక్కొక్క బోగీ ఆగే చోట ప్రయాణికుల కోసం మోకాళ్లపై కూర్చున్నారు. వారందరి మధ్యలో చేతికి 15వ నెంబరు బ్యాడ్జ్‌తో, ఎరుపురంగు యూనిఫాం వేసుకున్న ఓ మహిళ కూడా ఉంది. దేశంలోనే మొదటి మహిళా కూలీ గుర్తింపు తెచ్చుకోవడమే కాదు.. తాజాగా రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న ఆమె నిరక్షరాస్యురాలు. వయసు 38 ఏళ్లు. ముగ్గురు పిల్లల తల్లి. భర్త చనిపోయాక రైల్వే కూలీగా మారింది. దేశంలో తొలి మహిళా రైల్వేకూలీగా ఆమెను తాజాగా రాష్ట్రపతి అవార్డు వరించింది. ఆమే మంజూదేవి.

మాది రాజస్థాన్, సుందర్‌పురా దగ్గర పల్లెటూరు. నాన్న చనిపోతే, నన్నూ, తమ్ముడిని పెంచడానికి అమ్మ చాలా కష్టపడింది. నాకు పెళ్లైంది. మా వారు కూలీ. ముగ్గురు పిల్లలు. ఐదేళ్ల క్రితం మా వారు అనారోగ్యంతో చనిపోయారు. అప్పటికి పెద్దపాపకు పది, రెండో పాపకు ఎనిమిది, చిన్నోడికి నాలుగేళ్లు. అమ్మా, తమ్ముడే కష్టాల్లో ఉన్నారు. అందుకే వాళ్ల సాయం అడగలేదు. మా వారు చేసిన కూలీ పనే నాకు ఇస్తారనే తమ్ముడి సలహాతో నేను జైపూరు వెళ్లా. వాయవ్య రైల్వే విభాగంలో రైల్వేకూలీ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నా. అధికారులు సందేహించారు. 'స్త్రీ కాబట్టి చేయలేవు' అన్నారు. పట్టుదలగా సాధించి, ప్లాట్‌ఫాంపై అడుగు పెట్టా.



బరువంటే...

చదువు రాదు కదా.. మొదట్లో రైళ్ల వివరాలు, కంపార్టుమెంట్ల నెంబర్లు కూడా తెలియక చాలా ఇబ్బందిపడ్డా. అప్పుడు నేను 30 కేజీల బరువుంటే మరో 30 కేజీల బరువు మోయాల్సివచ్చేది. మోయలేక, ఊపిరి అందక ఏడ్చేదాన్ని. నెల రోజులకే జబ్బు పడ్డాను. ఈ పని చేయలేనేమో అనుకున్నా. పిల్లలను ఎలా పెంచాలనే ఆలోచన వచ్చేది. అమ్మ వచ్చింది. జీవితమంటే ఇలాంటి కష్టాలెన్నో వస్తాయి, దాటుకుని వెళ్లాలని చెప్పింది.

శిక్షణ తీసుకున్నా...

పిల్లల కోసం చేరిన ఈ పనిని ప్రేమించడం ప్రారంభించా. అధికారులు నాకు శిక్షణనందించారు. జైపూరు రైల్వేస్టేషన్‌లో 117 మంది కూలీల్లో నేనొక్కదాన్నే మహిళను. మొదటి రోజు 20 రూపాయల కూలీ. ఇప్పుడు పెరిగింది. ఎప్పుడయినా వెయ్యిరూపాయలు కూడా వస్తాయి. అప్పుడు మాత్రం పండగే. కొందరైతే నన్ను గుర్తు పెట్టుకుని పని ఇస్తారు. ఇప్పుడు 30 నుంచి 50 కేజీల వరకు లగేజీ మోస్తున్నా. ఎక్కువైతే, ట్రాలీలో వేస్తా. పిల్లల్నీ చదివించుకోగలుగుతున్నా. పెద్దపాప ఇంటర్మీడియట్ , రెండో పాప తొమ్మిది, ఆఖరోడు ఆరో తరగతి.

రాష్ట్రపతి అవార్డు..

గత శనివారం రాష్ట్రపతిభవన్‌లో దేశంలో మొదటి మహిళా రైల్వే కూలీగా రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ సర్ చేతులమీదుగా అవార్డును అందుకున్నాను. నాతోపాటు మరో 90 మందివరకు మహిళలున్నారు. వీరిలో ఐశ్వర్యరాయ్‌బచ్చన్‌తో సహా ఎంతోమంది ఉన్నారు. అందరూ నన్ను అభినందిస్తే.. రామ్‌నాథ్‌జీ మాత్రం నా కథను విని చాలా ఉద్వేగానికి గురయ్యానని తన ప్రసంగంలో చెప్పారు. నా లక్ష్యం నా పిల్లల భవిష్యత్తు. డాక్టరు, కలెక్టరు, పైలట్ అవుతామంటున్న వారి కలలను సాకారం చేయాలి.



ఆ చొరవ మీ నుంచే...

పెళ్లి కుదిరిన ప్రతి అమ్మాయి తన అత్తింటి గురించి ఒక ఊహాలోకం రూపొందించుకుంటుంది. కానీ అవి కొన్ని సార్లు అనుకున్నట్లుగా ఉండక పోవచ్చు. అసలు పెళ్లికి ముందు మన ఆలోచనలు ఎలా ఉండాలంటే..

- మనం అడుగుపెట్టబోయే ఇంటి గురించి ఊహించుకోవడంలో తప్పు లేదు. అయితే అవన్నీ మీకు ఇప్పుడున్న పద్ధతుల గురించి, అలవాట్ల గురించి వాటిలో చేసుకోవల్సిన మార్పుల గురించి ఉండాలి. అంతే గానీ.. అక్కడి వ్యక్తులు ఇలా ఉండాలి, వారు నాతో ఇలా మాట్లాడాలి.. అనే ధోరణి వద్దు. అతిగా ఆశలు పెట్టుకుంటే నిరాశ తప్పదు.
- కొత్తలో కుటుంబసభ్యులతో మాట్లాడటానికి తప్పకుండా కాస్త ఇబ్బంది పడతాం. వాళ్లకి కూడా అంతే. అది మొహమాటం వరకూ పర్లేదు కానీ.. వారు పలకరిస్తేనే నేను మాట్లాడాలి అని మౌనంగా ఉండకూడదు. వీలైతే ముందు మీరే చొరవగా మాటాడటానికి ప్రయత్నించాలి.
- మీ పుట్టింట్లో మీకున్న ప్రాధాన్యమే అక్కడా ఉండాలని కోరుకోవడంలో తప్పులేదు. లేకపోతే మాత్రం బాధపడాల్సిన అవసరం లేదు. మీకన్నా ముందు ఆ ఇంట్లో ఉన్న వ్యక్తులు ఇక్కడ మీరనుకున్న స్థానంలో ఉండొచ్చు. మీఇంట్లో మీరెలాగో ఇక్కడ కూడా వారలాగే అని గుర్తించాలి.
- అన్ని విషయాలను మీ పుట్టింట్లోలా పోల్చుకుంటే ఆనందంగా ఉండటం అసాధ్యం. ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా మిమ్మల్ని మీరు మార్చుకోగలగాలి. అలవాట్లూ, పద్ధతులు..ఏవైనా సరే పరిస్థితులను బట్టి వచ్చేవే. 'నేను సర్దుకుపోవాలి...' అనే ధోరణిని మీనుంచే మొదలుకావాలి. అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుంది.

వాళ్లని తీసేసి... నన్ను ఉంచారు!

డియర్ వసుంధర



డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

? నేను పనిచేస్తున్న సంస్థ రెండు రోజుల క్రితం మా డిపార్ట్‌మెంట్ నుంచి ఇద్దరు ఉద్యోగులని తొలగించింది. ఆ ఇద్దరు నాకు చాలా మంచి స్నేహితులు. అలా ఒక్కసారిగా వాళ్లని తీసేయడం చాలా బాధనిపిస్తోంది. ఊరడిద్దామని ఫోన్ చేస్తుంటే వాళ్లు నాతో మాట్లాడ్డం లేదు. కట్ చేస్తున్నారు. అది సంస్థ తీసుకున్న నిర్ణయం. దానికి నేను కారణం కాదుకదా... కానీ నాపై అలగడం మంచి పద్ధతి అవుతుందా? నిజానికి నాక్కూడా ఇబ్బందిగానే అనిపిస్తోంది. ఈ సమస్య నుంచి నేనెలా బయటపడాలి.. **- ఓ సోదరి**

✔ మీకే కాదు... ఎవరికైనా ఇది ఇబ్బందికరమైన పరిస్థితే. ఇలానే రోజులు గడిచిపోతే మీకూ మనసులో ఒక ఇబ్బందికరమైన పరిస్థితి ఉంటుంది. అదే ఆ తర్వాత కూడా కొనసాగుతుంది. అలా కాకూడదంటే.. ఒకసారి మీ స్నేహితులతో కలిసి మాట్లాడండి. మీరనుకుంటున్నట్టుగా... వాళ్లని తీసేయడం గురించి మీపట్ల వాళ్లకేమయినా వ్యతిరేక ఆలోచనలు ఉన్నాయేమో తెలుసుకోండి. ఒకవేళ అలాంటిదేమీ లేదు అన్నారనుకోండి దాని గురించి మీరు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఏదో బాధలో వాళ్లు అలా తాత్కాలికంగా ప్రవర్తించారని అనుకోవచ్చు. మీరింతగా బాధపడాల్సిన అవసరం లేదు. ఒక సంస్థ తీసేసినంత మాత్రాన వాళ్లకు ఇక కెరీర్‌లో భవిష్యత్తే లేదని కాదు కదా. వాళ్లకు మీరేమయినా కెరీర్ పరంగా సాయం చేయగలరేమో ఆలోచించండి. వాళ్లు చెప్పేది పూర్తిగా వినండి. వాళ్లకు కాస్త ఊరటగా ఉంటుంది. అలా కాకుండా ఒక వేళ వాళ్లలో ఎవరైనా మీమీద కోపం, అక్కసు వెళ్లగక్కుతూ.. 'మీరంతా ఇంతే'... 'మీకేం చేత కాదు..' వంటి మాటలతో తిడుతున్నారనుకోండి.. మీరు దాన్ని వ్యక్తిగతంగా తీసుకోవద్దు. అక్కడ మీరు అంటే మీ సంస్థ అనే అర్థం. దాన్ని కూడా తాత్కాలిక ఆవేశంగానే పరిగణించండి. అంతేకాని వారితో కలిసి వంత పాడాల్సిన అవసరం లేదు. ఒకటి మాత్రం నిజం. మీరెంత చర్చించుకున్నా ఒక్కసారి సంస్థ వాళ్లని తీసేశాక వాళ్ల చేతుల్లో కానీ, మీ చేతుల్లో కానీ ఏం లేదని అర్థం. కానీ సానుకూల దృక్పథంతో ఆలోచించాలంటే మాత్రం ఒక చోట తలుపులు మూసుకుంటే మరో చోట తెరుచుకుంటాయి. అదే విషయాన్ని వారితోనూ చెప్పండి.

నజరానా

సగం కోసిన నిమ్మచెక్కను చక్కెరలో ముంచి పెదవులపై రుద్దుకోవాలి. ఇలా రెండురోజులకోసారి చేయడం పెదవులపై పేరుకొన్న మృతకణాలు పోవడమే కాదు, పొడిబారే సమస్య కూడా తగ్గుతుంది.

బంగారం వెండి

22న ముగింపు-క్రితం



	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,120	31,100	30,700	30,740
ఆర్నమెంట్	29,130	29,040	28,500	28,500
వెండి (కిలో)	39,980	39,900	40,200	40,200
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,680	30,650	30,780	30,840
ఆర్నమెంట్	28,410	28,410	28,780	28,840
వెండి (కిలో)	39,900	39,900	39,300	39,400
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	30,950	31,010	-------	-------
ఆర్నమెంట్	28,780	28,840	2,878	2,884 గ్రా
వెండి (కిలో)	40,500	40,500	42.00	42.00 గ్రా

ఒంటరితనం దూరం చేస్తుందీ మంత్రి!



'మినిస్టర్ ఆఫ్ లోన్లీనెస్'... ఈ మంత్రిత్వశాఖ వినడానికి ఏదో కాస్త తేడాగా ఉందే అని నవ్వుకుంటున్నారా? ఒంటరితనం అలా నవ్వుకోవాల్సిన విషయం కాదని చెప్పడానికే తొలిసారిగా బ్రిటన్ ప్రభుత్వం దీనికోసం ఒక మంత్రిత్వశాఖని ఏర్పాటు చేసి.. దానికి ఒక మహిళనే మంత్రిని చేసింది. ఈ విజయానికి కారణం ఒంటరితనంపై చైతన్యం తెచ్చిన రాజకీయనాయకురాలు జోకాక్స్.. ఆమె స్ఫూర్తిపథంలో నడిచిన నలుగురు మహిళలు...



జోకాక్స్... పుట్టుకతో ధనికురాలు కాదు. మంచి చదువు చదువుకోవడానికి కూడా స్తోమతలేని అమ్మాయి. ఓ టూత్‌పేస్టు తయారుచేసే ఫ్యాక్టరీలో పనిచేస్తూ... ఆంత్రోపాలజీ, ఆర్కియాలజీ, పొలిటికల్ సైన్స్ చదువుకుంది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి పట్టా అందుకుంది. తన చుట్టూ కనిపించే సమాజం నుంచి సమస్యలని మాత్రమే గుర్తించలేదు... పరిష్కారాల కోసం వెతికింది. చాలా తక్కువకాలంలో చురుగ్గా వ్యవహరించే రాజకీయ సలహాదారుగా గుర్తింపు పొందింది. ఓ పక్క ఆక్స్‌ఫామ్‌లో ప్రజాచైతన్య ఉద్యమాలని నడుపుతూ..మరో పక్క రాజకీయాల్లోనూ ఎదిగింది. మహిళల ప్రసవ మరణాలపై పెద్దఎత్తున ఉద్యమించింది. లేబర్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించి... బ్రిటన్ యువతని ఒంటరితనం ఎంతగా నిర్వీర్యం చేస్తుందో ప్రపంచానికి తెలియచేయాలనుకుంది.

కోటిమంది బాధితులు...

'బ్రిటన్‌లో సుమారు రెండుకోట్లమంది పెద్దవాళ్లకు కనీసం నెలరోజులకోసారైనా తమ బాధని పంచుకోవడానికి ఓ స్నేహితుడు కానీ, కన్నబిడ్డలు కానీ తోడుండటం లేదు. అంటే.. ఒంటరితనం ఎంత కష్టమో తెలుస్తుందా? ఆ మాట కొస్తే ఒంటరితనానికి వయసు భేదం లేదు.. అది ఎవరినైనా చుట్టేస్తుంది. ప్రస్తుతం కోటిమందిని వేధిస్తోంది' అంటూ చైతన్యం తీసుకురావడం మొదలుపెట్టింది. ఈ చైతన్యం ఆమె రాజకీయ వ్యతిరేకులకు నచ్చలేదు. నడిరోడ్డుమీద ఆమెను పాశవికంగా చంపేశారు. కానీ చైతన్యం ఒకరు చంపేస్తే చనిపోతుందా? దాన్నే నిరూపించింది జోకాక్స్. ఆమె చనిపోయిన తర్వాత బ్రిటన్ ప్రధాని థెరిస్సా మే.. జో పోరాటాన్ని గుర్తించింది. ఒంటరితనంపై పోరాడి ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు జోకాక్స్ కమిషన్ ఏర్పాటు చేసింది.

ఈ బాధ్యతలని రేచల్‌రీవ్, సీమాకెనడీలు తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఒంటరితనంపై పోరాటానికి రంగం సిద్ధమైంది. స్కూళ్లూ, కాలేజీలతో మొదలుపెట్టి... ఉద్యోగుల్లో పెద్దవాళ్లలో ఏ రకంగా ఈ ఒంటరితనాన్ని దూరం చేయొచ్చో ఆలోచించారు. వీటిని అమలు చేసే బాధ్యతని అప్పటికే క్రీడా, సివిల్‌సొసైటీల మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న క్రౌచ్‌కి ప్రభుత్వం అప్పగించింది. ఇలాంటి పదవి మొదటిదేమో కదా...అంటే క్రౌచ్ భలే తెలివైన సమాధానం చెప్పింది. 'కార్యకర్తలూ, తోటి నాయకుల సహకారంతో ఈ బాధ్యతని విజయవంతం చేయాలనుకుంటున్నా... నాకంటే ముందు నైజీరియాకు చెందిన ఓగేచి ఒలోలో 'హ్యాపీనెస్ అండ్ కపుల్స్ ఫుల్‌ఫిల్‌మెంట్' అనే శాఖకి కమిషనర్‌గా వ్యహరించింది కదా' అంటోంది. సందర్భం వచ్చింది కాబట్టి.... ఒలోలో గురించి కూడా చెప్పుకోవాలి. నైజీరియాలో పెరుగుతున్న విడాకుల సమస్యకు పరిష్కారం అందించేందుకు ఆమెకు ఈ బాధ్యత అప్పగించారట.

సందర్భాలను పోల్చుకోవద్దు

కష్టాలు వచ్చినప్పుడు ఎక్కువగా ఆలోచిస్తే ప్రతిదీ మనకు ప్రతికూల అంశంగానే అనిపిస్తుంటుంది. అన్నింటిలో తప్పులు వెతకడానికి ప్రయత్నిస్తుంటాం. అలాంటి సమయాల్లో మన ఆలోచనాధోరణి ఎలా ఉండాలంటే..

- ఒక్కసారి మనసులోకి ప్రతికూల ఆలోచన వచ్చిందంటే దాన్నుంచి తప్పించుకోవడం కష్టమే. ఏది చూసినా అంతా తప్పుగానే కనబడుతుంది. అలాంటి సమయాల్లోనే సానుకూలంగా ఆలోచించాలి. సాధించలేనిది ఏదీ ఉండదని అర్థం చేసుకోవాలి. మీలో కూడా ఇలాంటి సానుకూల ఆలోచనే ఉండొచ్చు. కానీ పదే పదే ప్రతికూలంగా ఆలోచించడం వల్ల ఇదే ధోరణికి అలవాటుపడతారు. కాబట్టి మార్చుకోవడం మంచిది.
- ప్రతికూల ఆలోచనలతో ఉన్నప్పుడు ఆఫీసులోనో, ఇంట్లోనో ఎవరైనా మనమీద కోప్పడితే మన కోపం కూడా తారస్థాయికి చేరుకుంటుంది. అలాంటప్పుడు తొందరపడకుండా నిదానంగా ఉండటమే మంచిది.
- మీలో మీకు నచ్చే విషయాలేంటో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. ఇతరులకు మీలో నచ్చే విషయాల గురించి గర్వపడండి. మీ కుటుంబం, స్నేహితులూ, సాధించిన విజయాలూ, అధిగమించిన కష్టాలు..ఇవన్నీ ఆలోచిస్తే మీలో ధైర్యం తప్పకుండా పెరుగుతుంది.
- అవకాశాలకు కొదవలేదు. వాటిని మనం అందిపుచ్చుకోవాలంతే. మీరు ఇంతకు ముందు ఓటమిపాలైతే ఇంకో మార్గంలో దాన్ని సాధించడానికి ప్రయత్నించండి. అంతేగానీ అనవసరంగా ఆలోచిస్తే ఏమాత్రం మేలు జరగదు.



- మీరున్న పరిస్థితి నుంచి తేరుకోడానికి మీకు ఇష్టమైన పనేదైనా చేయండి. పెయింటింగ్, పుస్తకాలు చదవడం, పాటలు వినడం..ఏదైనా కావొచ్చు. దీనివల్ల మీలో కాస్తయినా మార్పు కనిపిస్తుంది.

ఉపాధ్యాయ ఉద్యోగ ఎంపికలో టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) ఇప్పుడు కీలకంగా మారింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగే ఈ పరీక్ష వెయిటేజీ డీఎస్సీలో అభ్యర్థుల తలరాతను నిర్ణయిస్తుంది. అందుకే ప్రతి ఒక్క మార్కు విలువైనదనే కోణంలోనే అధ్యయనం సాగించాలి. అనవసరమైన ఆందోళనలను విస్మరించాలి.



● ఏపీ టెట్-2018

అర్హతే కాదు అదనపు మార్కులూ అవసరమే!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరి 5 నుంచి 15 వరకు మొదటిసారిగా ఆన్‌లైన్‌లో టెట్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా అభ్యర్థులు ఈ కింది అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.



డాక్టర్ వి. బ్రహ్మం

- ఏపీ టెట్‌కు ప్రిపేర్ కావడానికి సమయం తక్కువగా ఉంది. అందరికీ అదే సమయం ఉంటుందనే సానుకూల దృక్పథంతో ప్రిపరేషన్ సాగించాలి. ఉన్న సమయాన్ని ఎంత సద్వినియోగం చేసుకోవచ్చో ఆలోచించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. ఆత్మవిశ్వాసం సన్నగిల్లకుండా నిరంతర శ్రమ చేయాలి.
- సిలబస్ ఎక్కువ అనే అభిప్రాయం చాలామందిలో వ్యక్తం అవుతోంది. దీంతో ఆందోళన, ఒత్తిడి పెరుగుతోంది. సిలబస్‌ను గత ప్రశ్నపత్రాల విశ్లేషణ ఆధారంగా విభజించుకోవాలి. ప్రధానమైన భావనలను, అంశాలను అధ్యయనం చేసి ప్రశ్నలు సాధన చేయాలి. రివిజన్‌తోపాటు కొంత సమయాన్ని కొత్త అంశాలను చదవడానికి కేటాయించాలి.

అన్నీ అభ్యర్థి స్థాయికి తగినట్లే!

- సిలబస్ ఎక్కువగా ఉందని అనవసర ఆందోళన చెందుతుంటే ప్రిపరేషన్‌పై ఏకాగ్రత తగ్గుతుందని గ్రహించాలి.
- డిగ్రీ స్థాయిలో మ్యాథ్స్ చదివినవారు బయోలాజికల్ సైన్సెస్ కఠినంగా ఉన్నాయనే ధోరణిలోనే ఉంటారు. అందరినీ దృష్టిలో ఉంచుకొనే పేపర్ ఇస్తారని గుర్తించాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల విద్య పూర్తిచేసిన వారు, తెలుగు మాధ్యమంలో డిగ్రీ చేసినవారు ఇంగ్లిష్ భాషా విభాగం (30 మార్కులకు) గురించి భయపడుతుంటారు. కానీ ఈ పేపర్ హైస్కూల్ స్థాయిలోనే ఉంటుంది.
- ఇంగ్లిష్ మాధ్యమంలో చదివిన వారు తెలుగుభాషకు సంబంధించి ఇబ్బంది పడకుండా వ్యాకరణాంశాలపై ప్రత్యేక శ్రద్ధతో ప్రిపేర్ కావాలి. ఇది కూడా పదోతరగతి స్థాయిలోనే ఉంటుంది.
- మ్యాథ్స్, బయలాజికల్ సైన్స్‌లతో ఇంటర్మీడియట్, డిగ్రీ చేసిన వారు సోషల్ స్టడీస్, చరిత్ర తదితరాల గురించి ఇబ్బంది పడుతుంటారు. కానీ పరీక్షలో విద్యార్థి స్థాయిని దాటి ప్రశ్నలు రావని గమనించాలి.
- ప్రధానంగా శిశువికాసం, పెడగోజీ విభాగంలో వచ్చే ప్రశ్నలు అవగాహన, అనుప్రయుక్తం/వినియోగం లక్ష్యానికి చెందినవిగా ఉండటాన్ని కొందరు క్లిష్టంగా భావిస్తున్నారు. కానీ అధ్యయన సమయంలోనే ప్రతి అంశాన్ని తరగతి వాతావరణానికి అన్వయించుకొని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తే కష్టం అనిపించదు.
- అందుబాటులో ఉన్న సమయం, సిలబస్ తదితర పరిస్థితులకు అనుగుణంగా సన్నద్ధతలో తగు మార్పులు చేసుకొని నిరంతరం అభ్యసిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. వీలైనన్ని ఎక్కువ మాదిరి ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి.
- సమయం తక్కువ కాబట్టి ప్రధాన అంశాలపైనే ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- సగటు స్థాయిలో సాధన చేసిన అభ్యర్థులు టెట్‌లో ఉత్తీర్ణత సాధించవచ్చు. కానీ డీఎస్సీలో ప్రతి మార్కు విలువైనదని గుర్తించి వీలైనన్ని ఎక్కువ మార్కులు ఇందులో తెచ్చుకోవడానికి ప్రయత్నించాలి.
- రివిజన్ చాలా ముఖ్యమైనది. చదివింది ఎప్పటికప్పుడు నిర్దిష్ట సమయాల్లో రివిజన్ చేయడంతోపాటు పరీక్షకు కనీసం వారం ముందు నుంచి అభ్యసించిన అంశాలన్నింటినీ పునశ్చరణ చేయాలి.
- పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుందని ఆందోళన చెందకుండా వెబ్‌సైట్స్, ఇతర మార్గాల్లో అందుబాటులో ఉన్న అవకాశాలను తెలుసుకొని ప్రాక్టీస్ చేయాలి.
- వేర్వేరు రోజుల్లో (పది రోజులు) పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించడం వల్ల ప్రశ్నపత్రం కఠినత్వ స్థాయిలో భేదాలు ఉండవచ్చు. కానీ అదంతా ప్రమాణాలకు అనుగుణంగానే జరుగుతుందని గ్రహించి ఆందోళన విడిచిపెట్టాలి.
- ప్రశ్నల కఠినత్వ స్థాయుల్లో చాలా తేడాలుంటే స్కేలింగ్ పద్ధతిని అనుసరించే అవకాశం ఉంది.
- పరీక్ష పూర్తయ్యే వరకు సబ్జెక్టుపై ఆసక్తి, అభిరుచి, ప్రేరణ కొనసాగే విధంగా చూసుకోవాలి. సానుకూల వైఖరి అవసరం.
- పరీక్షలపై వచ్చే వదంతులు నమ్మకుండా నిర్ణీత సమయంలో అధ్యయనం పూర్తిచేసుకొని ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి.

రెమిడియల్ లెర్నింగ్

మాదిరి పరీక్షలు రాసిన తర్వాత స్వీయ మదింపు/మూల్యాంకనం చేసుకొని జరిగిన పొరపాట్లను/తప్పులను గుర్తించాలి. కేవలం ప్రశ్న-జవాబు తరహాలో కాకుండా, ఆ ప్రశ్నకు సంబంధించిన భావనలను అర్థవంతంగా అభ్యసించాలి. ఇలా చేయడాన్ని లోపనివారణ అభ్యసన (రెమిడియల్ లెర్నింగ్) అంటారు. తద్వారా ఆ భావనలకు, అంశాలకు సంబంధించి ఏ విధమైన ప్రశ్నలు వచ్చినా సులభంగా కచ్చితమైన సమాధానాలను గుర్తించగలుగుతారు. కాబట్టి అభ్యర్థులు రివిజన్‌కు, రెమిడియల్ లెర్నింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రిపరేషన్ సాగిస్తే మంచి ఫలితాలను అందుకోవచ్చు.

మరిన్ని వివరాలు, స్టడీమెటీరియల్, ఆన్‌లైన్ పరీక్షలు, ప్రీవియస్, మోడల్ పేపర్ల కోసం

www.eenadupratibha.net చూడవచ్చు.

కొత్త అంశాలు కష్టంగా!

శిశు వికాసం-బోధనా పద్ధతులకు (చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగోజీ) సంబంధించి పరీక్ష సమయంలో సరైన సమాధానాలు గుర్తించడంలో కొందరు తడబడుతుంటారు. కష్టంగా భావిస్తుంటారు. ఈ ఎడ్యుకేషనల్ సైకాలజీ, మెథడాలజీలను మొదట డీఈడీ లేదా బీఈడీ కోర్సుల్లో అధ్యయనం చేస్తారు. టెట్ కోసం అదనంగా పలు అంశాలను తెలుగు అకాడమీ పుస్తకాల నుంచి చదవాల్సి ఉంటుంది. పాఠశాల లేదా కళాశాల స్థాయిలో ఈ సిలబస్ లేకపోవడంతో కొత్తగా అనిపిస్తుంది. బహుళైచ్ఛిక ప్రశ్నలకు సమాధానాలను స్పష్టంగా గుర్తించడంలో ఇబ్బందులు పడుతుంటారు. శిశువికాసం-బోధనా పద్ధతులపై ప్రశ్నలు చాలావరకు అవగాహన, అనుప్రయుక్త లక్ష్యాలను పరీక్షించే విధంగా ఉంటాయి. అభ్యర్థులు, ప్రాథమిక భావనలను నిజజీవిత సంఘటనలతో అన్వయించుకొని అర్థం చేసుకోవాలి. మాదిరి ప్రశ్నపత్రాలను వీలైనంత ఎక్కువగా సాధన చేయాలి.



రక్షణ దళాల్లో చేరాలంటే..?



■ నేవీ, ఏర్‌ఫోర్స్, ఆర్మీల్లో ఉన్నత క్యాడర్‌లో చేరాలంటే ఎలా ముందడుగు వేయాలి? ఎన్‌డీఏ, డిఫెన్స్ పరీక్షల గురించి తెలుపగలరు.

- స్వరూప్, మిర్యాలగూడ

జ: సాధారణంగా ఒక వ్యక్తి ఉన్నత క్యాడర్ (నేవీ/ ఏర్‌ఫోర్స్/ ఆర్మీ)లో చేరాలంటే అకుంఠిత దీక్ష, శ్రమ, గురి కలిసి ఉండాలి. ఆర్మీలో ముఖ్యంగా మూడు రకాల ఆఫీసర్ ర్యాంకులు ఉంటాయి. నాన్ కమిషన్ ఆఫీసర్ (సిపాయి నుంచి హవిల్దార్)లో నాలుగు స్థాయులు ఉంటాయి. తరువాతది జూనియర్ కమిషన్ ఆఫీసర్ ర్యాంకులు (నాయిబ్ సుబేదార్, సుబేదార్, సుబేదార్ మేజర్). ఇక మూడోది, ఉన్నతమైనది కమీషన్డ్ ఆఫీసర్ ర్యాంకులు (లెఫ్టినెంట్, కెప్టెన్, మేజర్, లెఫ్టినెంట్ కల్నల్, కల్నల్, బ్రిగేడియర్, మేజర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్, జనరల్, ఫీల్డ్ మార్షల్). వీటిలో అన్నింటి కంటే ఉన్నతమైన క్యాడర్/ ర్యాంకు ఫీల్డ్ మార్షల్. ఇప్పటివరకూ ఈ ర్యాంకును ఇద్దరు మాత్రమే అందుకున్నారు. ప్రమోషన్ ద్వారా పై ర్యాంకులను చేరుకోవచ్చు.



ఎన్‌డీఏ (నేషనల్ డిఫెన్స్ అకాడమీ) వారు నిర్వహించే పరీక్ష ద్వారా అభ్యర్థులు నేవీ, ఏర్‌ఫోర్స్, ఆర్మీల్లోకి ప్రవేశాన్ని పొందవచ్చు. ఈ పరీక్షలకు ప్రధాన (నేవీ, ఏర్) అర్హత 10+2లో మేథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఆర్మీలో ప్రవేశానికి 10+2లో ఏ సబ్జెక్టు చదివినవారైనా అర్హులే. ప్రవేశపరీక్ష ఉత్తీర్ణులైన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షను నిర్వహించి ఫిట్ అని తేలాక సర్వీస్ సెలక్షన్ బోర్డువారు ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా 10+2 కేడెట్ ఎంట్రీని ఆర్మీ/ నేవీ/ ఏర్‌ఫోర్స్‌లో కల్పిస్తారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌కి ఏ అర్హతలు?

■ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదవాలంటే.. ఏ అర్హతలుండాలి? ఏ ప్రవేశపరీక్ష రాయాలి?

- కిరణ్, తిరుపతి



జ: ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో ప్రవేశాన్ని పొందాలనుకునేవారు 10+2 మేథమెటిక్స్, ఫిజిక్స్‌లతో పూర్తిచేసినవారై ఉండాలి. మన రాష్ట్రంలో ఎంసెట్ ద్వారా స్టేట్ యూనివర్సిటీలు, ఏరోనాటికల్ ఇంజినీరింగ్ అందిస్తున్న అనుబంధ కళాశాలల్లో తమ ర్యాంకు ఆధారంగా సీటు పొందవచ్చు. మన తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్నం; జేఎన్‌టీయూ- కాకినాడ; లకిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్- మైలవరం, విజయవాడ పీవీపీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్- హైదరాబాద్; విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ ఏరోనాటికల్ ఇంజినీరింగ్- నల్గొండ ముఖ్యమైనవి.

ఐఐటీవారు నిర్వహించే జేఈఈ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్) ద్వారా ఐఐటీ- ఖరగ్‌పూర్, ఐఐటీ-మద్రాసు, ఐఐటీ-బాంబే వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ ప్రవేశాన్ని పొందవచ్చు. రానున్న కాలంలో ఏవియేషన్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందనడంలో, మంచి ఉపాధి కలిపిస్తుంది అనడంలో సందేహం లేదు.

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ అవ్వాలంటే?

■ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ అవ్వాలని నాకు ఆసక్తి. దీనికి ఏం చదవాలి?

- మనీష, తిరువూరు



జ: ఉపాధ్యాయ వృత్తిమీద మీకున్న మక్కువకు అభినందనలు. సాధారణంగా ఈ వృత్తిలో ప్రిన్సిపల్ (ప్రభుత్వ కళాశాలకు) అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, పీజీ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాలంటే సంబంధిత పీజీ సబ్జెక్టులో యూజీసీ/ సీఎస్ఐఆర్ వారు నిర్వహించే నెట్ (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్) ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. ఇంటర్ కళాశాలలో చేరడానికి నెట్ రాయాల్సిన అవసరం లేదు. సాధారణంగా ఈ వృత్తిలో కళాశాల ప్రిన్సిపల్ కావడానికి ముఖ్య నియమం సీనియారిటీ అని చెప్పుకోవాలి. పీహెచ్‌డీ పట్టా పొందినవారికి త్వరగా ఇతరులతో పోలిస్తే ప్రిన్సిపల్ అయ్యే శాతం ఎక్కువ. ప్రమోషన్ ద్వారా వివిధ హోదాలను దాటుకుంటూ ప్రిన్సిపల్ హోదాను సాధించుకోవచ్చు.

● ***ప్రొ. బి. రాజశేఖర్,*** కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఇండియన్ నేవీలో ఆఫీసర్లు

1. షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) - ఎడ్యుకేషన్: 18 పోస్టులు 2. పర్మినెంట్ కమిషన్ (పీసీ) - లాజిస్టిక్స్: 20 పోస్టులు **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్, బీఎస్సీ ఎంఏ, ఎంఎస్సీ **దరఖాస్తు:** ఆన్‌లైన్ **చివరితేది:** 10.02.2018. http://www.joinindiannavy.gov.in/

ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్, కాన్పూర్

పోస్టులు: సీనియర్ మేనేజర్, మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, మార్కెటింగ్ ఆఫీసర్, స్టెనోగ్రాఫర్, క్లర్క్, ఫిట్టర్, కార్పెంటర్ తదితర పోస్టులు **పోస్టుల సంఖ్య:** 64

అర్హతలు: సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిగ్రీ, డిప్లొమా, సీఏ, మెట్రిక్యులేషన్, ఐటీఐ ఉత్తీర్ణతతోపాటు తగిన పని అనుభవం. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరితేది:** 28.02.2018. http://www.alimco.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ, బాపట్ల

1) టీచింగ్ అసోసియేట్స్ (ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, బయోకెమిస్ట్రీ/ఫుడ్ కెమిస్ట్రీ): 02 పోస్టులు **2)** ఫిజికల్ డైరెక్టర్: 01 పోస్టు **3)** పార్ట్‌టైం టీచర్ (ఇంగ్లిష్ లాంగ్వేజ్/కంప్యూటర్ ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్/ ఇంజినీరింగ్ మ్యాథ్స్): 03 పోస్టులు **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంఎస్సీ/ఎంటెక్, ఎంపీఈడీ. **ఇంటర్వ్యూ తేది:** 29.01.2018. **వేదిక:** కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బాపట్ల. **వెబ్‌సైట్:** http://www.angrau.ac.in/

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, హైదరాబాద్

పోస్టు వివరాలు: జూనియర్ రిసెర్చ్ ఫెలో: 01 పోస్టు **అర్హత:** బేసిక్ సైన్స్‌లో పీజీతోపాటు నెట్ అర్హత ఉండాలి. **వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేది:** 07.02.2018. **వేదిక:** అసెంబ్లీహాల్, నిన్, తార్నాక, హైదరాబాద్. **వెబ్‌సైట్:** http://ninindia.org/

ప్రవేశాలు

ఎస్వీయూ దూరవిద్యలో వివిధ కోర్సులు

పీజీ: ఎంఏ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, ఎంఎల్ఐఎస్సీ, ఎంఎస్సీ (మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, సైకాలజీ), ఎంకాం, ఎంబీఏ. **యూజీ:** బీఏ, బీఎస్సీ, బీకాం, బీఎల్ఐఎస్సీ. **పీజీ డిప్లొమా:** ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ పర్సనల్ మేనేజ్‌మెంట్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ **అర్హతలు:** ఇంటర్మీడియట్, డిగ్రీ. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **చివరితేది:** 28.02.2018.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ఉత్తమ విద్య.. ఉన్నతస్థాయి ఉద్యోగం!

రక్షణ దళాల్లో ఉద్యోగం అంటే అందరిలో ఒక రకమైన గౌరవం, చిన్నపాటి ఆరాధన కనిపిస్తాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఈ పేర్లు వినగానే ఎవరికైనా గుండెల్లో దేశభక్తి పొంగి ఛాతీలు కొద్దిగా పెద్దవవుతాయి. ఈ మూడు దళాల్లో చేరడం చాలామందికి ఒక కల. వీరి కోసమే యూపీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. ఉత్తమమైన ఉచిత చదువుతోపాటు ఉన్నతస్థాయి ఉద్యోగాన్ని కూడా అందుకోవడానికి వీలున్న చక్కటి అవకాశం ఇది.

ఇంటర్ విద్యార్హతతో ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని అందించే ఎన్‌డీఏ& ఎన్ఏ పరీక్షకు 415 ఖాళీలతో యూపీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. ఈ పరీక్షల్లో ఎంపికైనవాళ్లని ఉచితంగా డిగ్రీ చదివిస్తారు. తర్వాత రక్షణ దళాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగంలో చేర్చుకుంటారు. భవిష్యత్తులో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో కీలక హోదాలకు చేరుకోవచ్చు. ఆబ్జెక్టివ్ పరీక్ష, ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ టెస్టు, ఫిజికల్, మెడికల్ టెస్టుల ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.

నేషనల్ డిఫెన్స్ అకాడెమీ & నేవల్ అకాడెమీ (ఎన్‌డీఏ & ఎన్ఏ) పరీక్షను ఏడాదికి రెండుసార్లు యూపీఎస్సీ నిర్వహిస్తుంది. జనవరి, మే నెలల్లో ప్రకటనలు విడుదలవుతాయి. జనవరిలో వచ్చే నోటిఫికేషన్‌కు ఏప్రిల్‌లో, మేలో విడుదలయ్యే ప్రకటనకు ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారు. ఎన్‌డీఏకు ఎంపికైనవారు మూడేళ్లపాటు పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో బీఏ, బీఎస్సీ కోర్సులు చదువుతారు. నేవల్ అకాడమీకి ఎంపికైనవారు నాలుగేళ్లపాటు కేరళలోని ఎజిమాలలో బీటెక్ విద్యను అభ్యసిస్తారు. రెండు చోట్లా విద్యార్థులకు అన్నీ ఉచితంగా సమకూరుస్తారు. డిగ్రీలను న్యూదిల్లీలోని ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రదానం చేస్తుంది.

➤➤ ఇంటర్ చివరి సంవత్సరంవారు అర్హులే!

ఆర్మీ వింగ్ (ఎన్‌డీఏ)కు బాలురు మాత్రమే దరఖాస్తు చేయాలి. వీరు ఏదైనా గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవల్ వింగ్స్ (ఎన్‌డీఏ), 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (ఇండియన్ నేవల్ అకాడమీ)కు దరఖాస్తు చేయాలనుకుంటే ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. అన్ని విభాగాలకు ఇంటర్ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: పరీక్ష రాసే సమయానికి 16 నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండాలి. జులై 2, 1999 తర్వాత; జులై 1, 2002 కంటే ముందు జన్మించినవాళ్లు అర్హులు.



శారీరక ప్రమాణాలు: అభ్యర్థుల కనీస ఎత్తు 157 సెం.మీ. ఉండాలి. ఎయిర్‌ఫోర్స్‌కు 162.5 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగిన బరువు అవసరం.

➤➤ రెండు దశల్లో ఎంపిక

అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. అవి: రాత పరీక్ష (ఆబ్జెక్టివ్ తరహా), ఇంటెలిజెన్స్ - పర్సనాలిటీ టెస్ట్. రాత పరీక్షలో మొత్తం 900 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో మ్యాథ్స్ నుంచి 300 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. పేపర్-2లో 600 మార్కులకు జనరల్ ఎబిలిటీ విభాగం నుంచి ప్రశ్నలు ఉంటాయి. దీనికి వ్యవధి రెండున్నర గంటలు. ఇందులో ఇంగ్లిష్‌కు 200, జనరల్ నాలెడ్జ్‌కి 400 మార్కులు కేటాయించారు. జనరల్ నాలెడ్జ్ విభాగానికి సంబంధించి సెక్షన్-ఎలో ఫిజిక్స్, సెక్షన్-బిలో కెమిస్ట్రీ, సెక్షన్-సిలో జనరల్ సైన్స్, సెక్షన్-డిలో చరిత్ర, సెక్షన్-ఇలో భూగోళశాస్త్రం, సెక్షన్-ఎఫ్ లో వర్తమానాంశాలపై ప్రశ్నలుంటాయి. ఫిజిక్స్ నుంచి వంద, కెమిస్ట్రీ నుంచి అరవై, జనరల్ సైన్స్ నుంచి నలభై, చరిత్ర, స్వాతంత్ర్యోద్యమాలు తదితరాల నుంచి ఎనభై, భూగోళశాస్త్రం నుంచి ఎనభై, వర్తమానాంశాల నుంచి నలభై మార్కులకు ప్రశ్నలడుగుతారు. ఇంటర్ పాఠ్యాంశాల నుంచే ప్రశ్నలు వస్తాయి. ఆబ్జెక్టివ్ పరీక్షలో రుణాత్మక మార్కులు ఉన్నాయి.

రాత పరీక్షలో అర్హత పొందిన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో యూపీఎస్సీ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టులు నిర్వహిస్తుంది. ఈ విభాగానికి 900 మార్కులు కేటాయించారు. ఇందులో భాగంగా గ్రూప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్, అవుట్‌డోర్ గ్రూప్ టాస్కులు ఉంటాయి. స్టేజ్-1లో అర్హత సాధించినవారినే స్టేజ్-2కి అనుమతిస్తారు.

➤➤ తుది ఎంపిక

రాత పరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. వైద్య పరీక్షలు, అభ్యర్థి ప్రాధాన్యాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిభ ఆధారంగా సంబంధిత విభాగాలకు ఎంపిక చేస్తారు.

➤➤ శిక్షణ విధానం

మొదటి రెండున్నర సంవత్సరాల శిక్షణ అందరికీ ఒకేవిధంగా ఉంటుంది. ఆర్మీని ఎంచుకున్న వారికి బీఎస్సీ/ బీఎస్సీ (కంప్యూటర్)/ బీఏ డిగ్రీ సర్టిఫికెట్లను న్యూదిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) అందజేస్తుంది. నేవీ, ఎయిర్‌ఫోర్స్, నావెల్ అకాడమీ అభ్యర్థులకు బీటెక్ డిగ్రీని ప్రదానం చేస్తారు.

ఎన్‌డీఏలో మూడేళ్ల శిక్షణ, చదువు అనంతరం ఆర్మీ క్యాడెట్లను డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీకి; నేవల్ క్యాడెట్లను ఎజిమాలలోని ఇండియన్ నేవల్ అకాడమీకి; ఎయిర్‌ఫోర్స్ క్యాడెట్లను హైదరాబాద్‌లోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి శిక్షణ కోసం పంపుతారు. అభ్యర్థి ఎంపికైన విభాగాన్ని బట్టి ఈ శిక్షణ ఏడాది నుంచి 18 నెలల వరకు ఉంటుంది. ఈ సమయంలో స్టైపెండ్ (మూల వేతనం రూ.56,100) చెల్లిస్తారు.

శిక్షణ అనంతరం ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఈ సమయంలో రూ. లక్ష వరకు వేతనం ఉంటుంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వీటిలో ఏ సర్వీస్‌కి ఎంపికైనప్పటికీ వేతనం, హోదాలు సమానంగానే ఉంటాయి. ప్రోత్సాహకాలపరంగా కొద్దిపాటి వ్యత్యాసాలు ఉంటాయి.

ఖాళీల వివరాలు: మొత్తం ఖాళీలు 415. వీటిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీకి 360 ఉన్నాయి. వాటిలో ఆర్మీ 208, నేవీ 60, ఎయిర్‌ఫోర్స్ 92 ఖాళీలు ఉన్నాయి. నేవల్ అకాడమీలో 55 ఖాళీలు ఉన్నాయి.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో చేసుకోవాలి.

చివరి తేదీ: ఫిబ్రవరి 5 సాయంత్రం 6 గంటల వరకు.

పరీక్ష తేదీ: ఏప్రిల్ 22 **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి

వెబ్‌సైట్: www.upsc.gov.in